www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 5-12-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 230 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం; తిథి: చవితి మ. 12.50 తదుపరి పంచమి; నక్షత్రం: ఉత్తరాషాఢ సా. 5.26 తదుపరి శ్రవణం; వర్జ్యం: రా. 9.24-11.00; దుర్ముహూర్తం: ఉ. 10.15-10.59, మ. 2.39-3.24; అమృతఘడియలు: ఉ. 10.59-12.35; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.35; సూర్యాస్తమయం: 5.36 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



సెమీస్‌లో భారత్

● మెరిసిన వైభవ్, ఆయుష్

● 10 వికెట్లతో యూఏఈ ఓటమి

అండర్-19 ఆసియా కప్


వైభవ్ (76 నాటౌట్)

షార్జా: 13 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ (76 నాటౌట్) చెలరేగడంతో.. అండర్-19 ఆసియా కప్‌లో యువ భారత్ సెమీస్‌కు దూసుకెళ్లింది. గ్రూప్-ఎలో బుధవారం జరిగిన ఆఖరి మ్యాచ్‌లో భారత్ 10 వికెట్ల తేడాతో యూఏఈని చిత్తు చేసింది. తొలుత యూఏఈ 44 ఓవర్లలో 137 పరుగులకు ఆలౌటైంది. రయాన్ (35), అక్షత్ రాయ్ (26) టాప్ స్కోరర్లు. యుధాజిత్ గుహ 3 వికెట్లు పడగొట్టగా.. చేతన్ శర్మ, హార్దిక్ రాజ్ చెరో 2 వికెట్లు దక్కించుకొన్నారు. ఛేదనలో భారత్ 16.1 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 143 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్ ఆయుష్ మాత్రే (67 నాటౌట్) కూడా హాఫ్ సెంచరీ చేశాడు. కాగా, శుక్రవారం జరిగే సెమీస్‌లో గ్రూప్-బి టాపర్ శ్రీలంకతో భారత్, బంగ్లాదేశ్‌తో తలపడనున్నాయి.

నాలుగు గంటలు సాగినా..

ఫలితం తేలలేదు

● ఎనిమిదో గేమూ డ్రా ● ప్రపంచ చెస్



సింగపూర్: ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ ఫైనల్లో డ్రా పరంపర కొనసాగుతోంది. బుధవారం జరిగిన ఎనిమిదో రౌండ్‌లోనూ ఫలితం తేలలేదు. దాంతో వరుసగా ఐదో గేమూ డ్రాగా ముగిసినట్టయ్యింది. ఈ రౌండ్ అనంతరం లిరెన్, గుకేష్ చెరి నాలుగేసి పాయింట్లతో సమఉజ్జీలుగా నిలిచారు. 14 రౌండ్ల తుది పోరులో మొత్తంగా ఇది ఆరో డ్రా. 32 ఏళ్ల లిరెన్ తొలి గేమ్‌లో గెలుపొందగా, 18 ఏళ్ల గుకేష్ మూడో రౌండ్‌లో విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఇక 2,4,5,6,7,8 గేములు డ్రా అయ్యాయి. మరో నాలుగు రౌండ్‌లే మిగిలున్న నేపథ్యంలో రాబోయే రెండు గేములు కీలకం కానున్నాయి. ఇక..ఎనిమిదో రౌండ్ 4 గంటలపాటు హోరాహోరీగా సాగింది. తెల్ల పావులతో బరిలోకి దిగిన లిరెన్‌కు పరిస్థితి అనుకూలంగా లేకపోవడంతో 41వ ఎత్తులోనే డ్రాకు ప్రతిపాదించాడు. కానీ గుకేష్ ఆ ప్రతిపాదనకు అంగీకరించకుండా గేమును కొనసాగించాడు. అయితే గేమ్ సాగే కొద్దీ తనకూ విజయావకాశాలు లేకపోవడంతో 51వ ఎత్తువద్ద గుకేష్ డ్రా చేసేందుకు అంగీకరించాడు.

మనమ్మాయిలకు

కఠిన పరీక్ష

ఆస్ట్రేలియాతో తొలి వన్డే నేడు


హర్మన్‌ప్రీత్

తహిలా మెక్‌గ్రాత్

ఉ. 9.50 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

బ్రిస్బేన్: వచ్చే ఏడాది భారత్‌లో వన్డే ప్రపంచ కప్ జరగనుంది. ఈనేపథ్యంలో నిలకడలేని బ్యాటింగ్ విభాగాన్ని పటిష్ఠ పరుచుకోవాలని భారత మహిళల జట్టు భావిస్తోంది. తద్వారా వన్డే వరల్డ్ కప్‌నకు సరైన బ్యాటింగ్ కూర్పును నిర్ణయించుకోవాలనుకుంటోంది. ఇందుకు బలీయమైన ఆస్ట్రేలియా జట్టుతో జరిగే మూడు వన్డేల సిరీస్‌ను వేదికగా చేసుకోనుంది. ఈక్రమంలో కంగారూలతో గురువారం జరిగే మొదటి వన్డేకు సిద్ధమైంది. న్యూజిలాండ్‌తో స్వదేశంలో జరిగిన వన్డే సిరీస్‌ను 2-1తో సొంతం చేసుకున్న ఆత్మవిశ్వాసంతో హర్మన్‌సేన ఆసీస్‌గడ్డపై అడుగుపెట్టింది. కివీస్‌పై సిరీస్ గెలుపొందినా.. బ్యాటింగ్ విభాగం మాత్రం ఆశించిన స్థాయిలో రాణించలేదు. దాంతో ఫామ్ కోల్పోయిన షఫాలీ వర్మను జట్టు నుంచి తొలగించడం ద్వారా బ్యాటింగ్ లైనప్‌లో ప్రయోగాలకు దిగుతోంది. ఇక ఆసీస్ గడ్డపై మన మహిళల రికార్డు పేలవంగా ఉంది. ఇక్కడ ఆడిన 16 వన్డేల్లో భారత్ కేవలం నాలుగు మ్యాచ్‌ల్లోనే నెగ్గింది. గత..2021 సిరీస్‌లో 1-2తో మనోళ్లు ఓడిపోయారు. మరోవైపు ఆస్ట్రేలియా జట్టు రెగ్యులర్ కెప్టెన్ అలీసా హీలీ లేకుండానే బరిలో దిగుతోంది. మోకాలి గాయంతో ఆమె బాధపడుతుండడంతో తహిలా మెక్‌గ్రాత్ జట్టుకు సారథ్యం వహిస్తోంది.



కుర్రాళ్లు కొల్లగొట్టారు

● భారత్‌దే ఆసియా కప్

● ఫైనల్లో పాక్ చిత్తు

● నాలుగు గోల్స్‌తో అరిజీత్ విజృంభణ

మస్కట్: చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను చిత్తు చేసిన డిఫెండింగ్ చాంప్ భారత్.. ఐదోసారి జూనియర్ హాకీ ఆసియాకప్‌ను సొంతం చేసుకొంది. డ్రాగ్‌ఫ్లికర్ అరిజీత్ హుండల్ 4 గోల్స్‌తో చెలరేగడంతో.. బుధవారం జరిగిన ఫైనల్లో భారత్ 5-3తో పాకిస్థాన్‌ను మట్టికరిపించింది. 2004, 2008, 2015, 2023ల్లో టైటిళ్లు నెగ్గిన భారత జట్టు ఒక్క మ్యాచ్ కూడా ఓడకుండా టైటిల్‌ను అందుకొంది. అరిజీత్ (4వ, 18వ, 47వ, 54వ నిమిషం) 4 గోల్స్ చేయగా.. దిల్‌రాజ్ సింగ్ (19వ) ఒక గోల్ సాధించాడు. పాక్ తరఫున సూఫియాన్ ఖాన్ (30వ, 39వ), హుసన్ షాహిద్ (3వ) గోల్స్ చేశారు. ఆట మొదలైన మూడో నిమిషంలోనే షాహిద్ ఫీల్డ్ గోల్‌తో భారత్‌కు షాకిచ్చాడు. అయితే, నిమిషం కూడా గడవకుండానే పెనాల్టీ కార్నర్‌ను అరిజీత్ గోల్‌లోకి పంపి 1-1తో సమం చేశాడు. రెండో క్వార్టర్‌లో భారత్ మరింత దూకుడుగా ఆడుతూ పాక్‌ను పూర్తిగా ఆత్మరక్షణలోకి నెట్టింది. అరిజీత్ మరో గోల్ చేయడంతో భారత్ 2-1తో పైచేయి సాధించింది. ఆ వెంటనే దిల్‌రాజ్ సింగ్ అద్భుత నైపుణ్యంతో ఫీల్డ్ గోల్‌ను అందించాడు. అయితే, క్వార్టర్ మరో 11 సెకన్లలో ముగుస్తుందనగా సూఫియాన్ పీసీని గోల్‌గా మలచడంతో పాక్ 2-3తో పోటీలో నిలిచింది. ఇక, మూడో క్వార్టర్ ఆరంభమైన తొలి నిమిషంలోనే సూఫియాన్ మరో పెనాల్టీ కార్నర్‌ను గోల్‌లోకి పంపి 3-3తో సమం చేశాడు. కానీ, చివరి క్వార్టర్‌లో అరిజీత్ డబుల్ ధమాకాతో భారత్‌ను విజేతగా నిలిపాడు. క్రాస్‌ను అందుకొన్న అరిజీత్ లాఘవంగా గోల్‌లోకి పంపడంతో భారత్ 4-3తో మరోసారి పైచేయి సాధించింది. ఆ తర్వాత లభించిన మరో పెనాల్టీ కార్నర్‌ను కూడా అరిజీత్ గోల్‌గా మలచి భారత్‌కు టైటిల్ అందించాడు.

టైటాన్స్‌కు పరాజయం

పుణె: సులువుగా గెలిచే మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ స్వీయ తప్పిదాలతో ఓటమి పాలైంది. ప్రొ కబడ్డీలో భాగంగా బుధవారం జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 33-36తో యూపీ యోధాస్ చేతిలో ఓటమి పాలైంది. గగన్ గౌడ 15 పాయింట్లు సాధించి యోధాస్ విజయంలో కీలకపాత్ర పోషించాడు. మరో మ్యాచ్‌లో బెంగాల్ వారియర్స్ 39-32తో హరియాణా స్టీలర్స్‌పై గెలిచింది.

శతక్కొట్టిన సంధ్య

నాగాలాండ్‌పై హైదరాబాద్ విజయం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): బీసీసీఐ సీనియర్ మహిళల వన్డే ట్రోఫీలో నాగాలాండ్‌పై హైదరాబాద్ 145 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. బుధవారం అహ్మదాబాద్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ 50 ఓవర్లలో 7 వికెట్లకు 248 పరుగులు చేసింది. సంధ్య (107) శతకంతో కదం తొక్కగా.. అనూరాధ నాయక్ (51) అర్ధ సెంచరీ సాధించింది. మమత (33 నాటౌట్) రాణించింది. ఛేదనలో గౌహర్ సుల్తానా (4/13) ధాటికి నాగాలాండ్ జట్టు 47.1 ఓవర్లలో 104 పరుగులకే కుప్పకూలింది.

గులాబీ టెస్ట్‌కు

స్పోర్టింగ్ వికెట్


ప్రాక్టీస్‌లో రాహుల్, కోహ్లీ

సంధ్యా సమయంలో బ్యాటింగ్ కష్టమే



అడిలైడ్: పింక్ బాల్ టెస్ట్‌లో భారత్‌ను దెబ్బకొట్టడానికి ఆతిథ్య జట్టు పేస్ వ్యూహాన్ని రచిస్తోంది. ఇందుకోసం వికెట్‌పై 6 మిల్లీమీటర్ల మందాన పచ్చికను ఉంచనుంది. శుక్రవారం నుంచి ఈ డే/నైట్ టెస్ట్ జరగనుంది. ఈ నేపథ్యంలో వికెట్ గురించి క్యూరేటర్ డామియన్ హో బుధవారం మీడియాకు కొన్ని వివరాలు వెల్లడించాడు. బంతి వేగంగా పాతబడకుండా ఉండేందుకు కొంతమేర గడ్డిని ఉంచుతున్నట్టు తెలిపాడు. 'బ్యాట్‌కు బంతికి మధ్య సమ పోరాటం సాగేలా పిచ్‌ను రూపొందించే ప్రయత్నం చేశాం. వికెట్‌పై గడ్డి కారణంగా ఆరంభంలో పేసర్లకు అదనపు ప్రయోజనం లభించినా.. మ్యాచ్ సాగే కొద్దీ స్పిన్‌కు అనుకూలించనుంది. సంధ్యా సమయంలో బ్యాటింగ్ చేయడం సవాలుతో కూడుకున్నది. ఇక, ఫ్లడ్‌లైట్ల కింద గులాబీ బంతి మరింతగా స్వింగ్ కావచ్చు. అయితే, క్రీజులో పాతుకుపోయిన బ్యాటర్లుండి, కొత్త బంతికి దొరక్కపోతే మాత్రం బౌలర్లకు కష్టకాలమేన'ని హో చెప్పాడు. తొలి రోజు భారీవర్షానికి అవకాశముందన్నాడు. కాగా, 2020 టూర్‌లో ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో భారత్ 36 పరుగులకే కుప్పకూలింది.

ఫ్యాన్స్‌కు నో ఎంట్రీ

భారత జట్టు ప్రాక్టీస్ సెషన్స్ వీక్షణ కోసం ఇకముందు ఫ్యాన్స్‌ను అనుమతించకూడదనే నిర్ణయం తీసుకొన్నారు. మంగళవారం టీమిండియా ఆటగాళ్లను చూడడానికి 3 వేల మందికిపైగా అభిమానులు రావడంతో గందరగోళం నెలకొంది. భారత స్టార్లను చూసి ఫ్యాన్స్ అరుపులు, కేకలతో సందడి చేశారు. రోహిత్, పంత్‌లను సిక్స్‌లు కొట్టాలని గొడవ చేశారు. దీంతో ఆటగాళ్ల ఏకాగ్రత చెదిరి ఇబ్బందులు పడ్డారని బీసీసీఐ అధికారి తెలిపారు. ఇక, గుజరాతీలో 'హాయ్' చెప్పాలని కొందరు గిల్‌ను అడగగా..ఓ ఆటగాడిని బాడీ షేమింగ్ కూడా చేశారు. దీంతో ఫ్యాన్స్‌ను ప్రాక్టీస్ సెషన్లకు అనుమతించొద్దని నిర్ణయించారు.

బంగ్లా సంచలనం

● రెండో టెస్ట్‌లో విండీస్‌పై గెలుపు

● 1-1తో సిరీస్ సమం

కింగ్‌స్టన్ (జమైకా): కరీబియన్ దీవుల్లో బంగ్లాదేశ్ 15ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఓ టెస్ట్ మ్యాచ్‌లో విజయం సాధించింది. రెండో టెస్ట్‌లో బంగ్లా 101 పరుగుల తేడాతో వెస్టిండీస్‌ను ఓడించి, రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను 1-1తో సమం చేసింది. బంగ్లా నిర్దేశించిన 287 పరుగుల ఛేదనలో విండీస్ రెండో ఇన్నింగ్స్‌లో 185 పరుగులకే ఆలౌటైంది. తైజుల్ ఇస్లాం 5 వికెట్లు తీశాడు. ఆటకు నాలుగో రోజు ఓవర్‌నైట్ స్కోరు 193/5తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లా 268 రన్స్‌కు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లా 164 పరుగులు చేయగా.. విండీస్ 146 రన్స్‌కు ఆలౌటైంది. విండీస్‌లో వరుసగా 7 టెస్టులు ఓడిన బంగ్లా.. 8వ మ్యాచ్‌లో సంచలనం నమోదు చేసింది. విండీస్ గడ్డపై 2009లో రెండు టెస్టుల్లో నెగ్గిన బంగ్లాకు మళ్లీ ఆ దేశంలో ఇదే తొలి గెలుపు. ఓవరాల్‌గా ఇరుజట్ల చరిత్రలో 21 టెస్టులు జరగ్గా..విండీస్ 14, బంగ్లా 5 మ్యాచ్‌లు నెగ్గగా, 2 డ్రా అయ్యాయి.

మార్చికల్లా రూ.10 లక్షల కోట్ల నిధులు

జీడీపీ మందగమనం తాత్కాలికమే.. ఎస్‌బీఐ చైర్మన్ శ్రీనివాసులు శెట్టి



ముంబై : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) కూడా జీడీపీ వృద్ధి రేటుకు ఢోకా లేదని ఎస్‌బీఐ చైర్మన్ శ్రీనివాసులు శెట్టి అన్నారు. రెండో త్రైమాసికం (క్యూ2)లో జీడీపీ వృద్ధి రేటు రెండేళ్ల కనిష్ఠ స్థాయి 5.4 శాతానికి పడిపోవడం తాత్కాలికమన్నారు. మూడు, నాలుగు త్రైమాసికాల్లో జీడీపీ వృద్ధి రేటు పుంజుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఒక్క వ్యక్తిగత రుణాలు తప్ప వ్యవసాయ, ఎస్ఎంఈ, కార్పొరేట్ రుణాలకు పెరుగుతున్న డిమాండ్‌ను ఆయన గుర్తు చేశారు. కాగా ఈ ఆర్థిక సంవత్సరం లక్ష్యంగా పెట్టుకున్న రూ.6 లక్షల కోట్ల కార్పొరేట్ రుణాలకు సరిపడా నిధులు తమ వద్ద ఉన్నట్టు తెలిపారు. బ్యాంకు లాభాలను కూడా కలుపుకుంటే వచ్చే ఏడాది మార్చి నాటికి ఎస్‌బీఐకి రూ.10 లక్షల కోట్ల నిధులు అందుబాటులో ఉంటాయన్నారు.

వ్యక్తిగత రుణాలదే హవా: ఈ ఆర్థిక సంవత్సరం సెప్టెంబరు నాటికి ఎస్‌బీఐ వివిధ రంగాలకు రూ.33,32,533 కోట్ల రుణాలు మంజూరు చేసినట్టు శెట్టి తెలిపారు. అందులో 41.90 శాతం వ్యక్తిగత రుణాలన్నారు. కార్పొరేట్ (34.72 శాతం), ఎస్ఎంఈ (13.7 శాతం), వ్యవసాయం (9.68 శాతం) వరుసగా తర్వాతి స్థానాల్లో ఉన్నట్టు చెప్పారు. మొత్తం మీద ఈ ఆర్థిక సంవత్సరం ఎస్‌బీఐ రుణాల వృద్ధి రేటు 14 నుంచి 16 శాతం మధ్య ఉంటుందని ఆశిస్తున్నట్టు తెలిపారు.

ఈసారీ నిరాశే: శుక్రవారం ప్రకటించే ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన సమీక్షలో రెపో రేటు తగ్గించే అవకాశాలు లేవని శెట్టి అన్నారు. ద్రవ్యోల్బణ కట్టడే ఇప్పటికీ ఆర్‌బీఐ ప్రాధాన్యతగా కనిపిస్తోందన్నారు. రెపో రేటు తగ్గింపునకు బదులు, నిధుల లభ్యత పెంచేందుకు ఆర్‌బీఐ చర్యలు తీసుకునే అవకాశం ఉందన్నారు.

నిబంధనలు మార్చాలి: ఒక బ్యాంకు ఖాతా నిద్రాణంగా ఉందా? క్రియాశీలంగా ఉందా? అనే దానికి సంబంధించిన నిబంధనలను ఆర్‌బీఐ మార్చాలని కూడా ఎస్‌బీఐ చైర్మన్ శెట్టి కోరారు. ఆర్థికేతర లావాదేవీలను కూడా ఇందుకోసం పరిగణనలోకి తీసుకోవాలని కోరుతూ ఆర్‌బీఐకి లేఖ రాసినట్టు తెలిపారు.

యూపీఐ లైట్ వ్యాలెట్ పరిమితి

ఇక రూ.5,000



ముంబై: యూపీఐ లైట్ వ్యాలెట్ పరిమితిని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) రూ.5,000కి పెంచింది. అలాగే లావాదేవీ గరిష్ఠ పరిమితిని కూడా రూ.1,000కి పెంచింది. ప్రస్తుతం ఈ రెండింటి గరిష్ఠ పరిమితులు రూ.2,000, రూ.500గా ఉన్నాయి. ఆఫ్‌లైన్‌లో మొబైల్ ఫోన్ల ద్వారా నిర్వహించే ఈ తక్షణ చెల్లింపు విధానాన్ని వినియోగించుకునేలా మరింత ఎక్కువ మందిని ప్రోత్సహించడం లక్ష్యంగా ఆర్‌బీఐ ఈ చర్య తీసుకుంది. యూపీఐ లైట్ లావాదేవీలకు అదనపు ధ్రువీకరణ అవసరం ఉండదు. తక్కువ విలువ గల డిజిటల్ చెల్లింపులు ఆఫ్‌లైన్‌లో చేసుకునేందుకు అవకాశం కల్పిస్తూ 2022లో ఈ విధానాన్ని ప్రవేశపెట్టారు.

ఎంపీసీ సమావేశం షురూ: దేశంలో ద్రవ్యోల్బణం ఆర్‌బీఐకి ప్రభుత్వం నిర్దేశించిన గరిష్ఠ పరిమితి దాటిపోయిన నేపథ్యంలో ఈసారి కూడా రెపోరేటు యథాతథంగానే కొనసాగించవచ్చన్న ఊహాగానాల నడుమ గవర్నర్ శక్తికాంత దాస్ నాయకత్వంలో ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) ద్వైమాసిక సమావేశం బుధవారం ప్రారంభమైంది. దాస్ శుక్రవారం రెపో రేట్లపై ఎంపీసీ నిర్ణయాలను ప్రకటిస్తారు.

బిజినెస్

భారత విదేశీ రుణ భారం

రూ.54.83 లక్షల కోట్లు


ఏడాదిలోనే రూ.2.62 లక్షల కోట్లు జంప్

ప్రపంచ బ్యాంక్ వెల్లడి

న్యూఢిల్లీ : భారత విదేశీ రుణ భారం పెరిగిపోతోంది. గత ఏడాది (2023) చివరికి ఇది 64,700 కోట్ల డాలర్లకు (సుమారు రూ.54.83 లక్షల కోట్లు) చేరింది. అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే ఇది 3,100 కోట్ల డాలర్లు (సుమారు రూ.2.62 లక్షల కోట్లు) ఎక్కువని ప్రపంచ బ్యాంక్ ఒక నివేదికలో తెలిపింది. ఇదే సమయంలో ఈ రుణాలపై వడ్డీ చెల్లింపుల భారమూ 1,508 కోట్ల డాలర్ల నుంచి 2,254 కోట్ల డాలర్లకు చేరింది. 2023 డిసెంబరు నాటికి భారత్‌కు ఉన్న 64,700 కోట్ల డాలర్ల విదేశీ అప్పుల్లో 49,800 కోట్ల డాలర్లు దీర్ఘకాలిక, 12,632 కోట్ల డాలర్లు స్వల్ప కాలిక రుణాలని నివేదిక తెలిపింది. ఎగుమతుల పరంగా చూస్తే విదేశీ రుణాలు 80 శాతం వరకు ఉన్నాయి. గత ఏడాది భారత్ ఎగుమతుల ద్వారా సంపాదించిన ఆదాయంలో 10 శాతం ఈ రుణాల అసలు, వడ్డీల చెల్లింపులకే సరిపోయింది. గత ఏడాది భారత్ 3,342 కోట్ల డాలర్లు విదేశీ రుణాల రూపంలో, 4,694 కోట్ల డాలర్లు ఈక్విటీ పెట్టుబడుల రూపంలో ఆకర్షించినట్టు ప్రపంచ బ్యాంక్ తెలిపింది.

'ఐఎఫ్‌డీసీ'తో కోరమాండల్ జట్టు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అమెరికా కేంద్రంగా పని చేసే ఇంటర్నేషనల్ ఫెర్టిలైజర్ డెవలప్‌మెంట్ సెంటర్ (ఐఎఫ్‌డీసీ)తో ఎరువుల తయారీ కంపెనీ కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ (సీఐఎల్) వ్యూహాత్మక పరిశోధనా ఒప్పందం (ఎంఆర్‌పి) కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వారా రెండు కంపెనీలు భూసారాన్ని పరిరక్షిస్తూనే పంటల సుస్థిర పద్ధతిలో పంటల దిగుబడులు పెంచే అత్యాధునిక కొత్త రకం ఎరువులను అభివృద్ధి చేస్తాయి.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,820 ▲	71,350 ▲	99,500 ▼
ముంబై	76,392 ▲	69,975 ▲	90,025 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



5వ తేదీ			
హైదరాబాద్	620	విజయవాడ	620
వరంగల్	622	గోదావరి	620
చిత్తూరు	633	విశాఖపట్నం	610
		డజను గుడ్లు రూ. 84	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	90	విజయవాడ	104
వరంగల్	90	గుంటూరు	99
కరీంనగర్	90	ఒంగోలు	99
మహబూబ్‌నగర్	90	చిత్తూరు	92
కర్నూలు	90	నెల్లూరు	92
విశాఖపట్నం	100	అనంతపురం	92
గోదావరి	104		

హోండా అమేజ్ కొత్త వెర్షన్



న్యూఢిల్లీ: జపాన్‌కు చెందిన కార్ల దిగ్గజం హోండా దేశీయ మార్కెట్లో అమేజ్ కొత్త వెర్షన్‌ను మార్కెట్లో విడుదల చేసింది. మూడో తరానికి చెందిన ఈ అమేజ్ కారు ఎక్స్‌షోరూమ్ ధర రూ.7.99 లక్షల నుంచి రూ.10.89 లక్షల మధ్యన ఉంటుంది. మాన్యువల్, ఆటోమేటిక్ వెర్షన్లు రెండింటిలోనూ అందుబాటులో ఉండే ఈ కాంపాక్ట్ సెడాన్ కారు మార్కెట్లో మారుతి డిజైర్, హ్యుండయ్ ఆరాతో పోటీ పడుతుంది. 2026-27 ఆర్థిక సంవత్సరం నాటికి భారత మార్కెట్లో మూడు కొత్త మోడల్స్‌ను ప్రవేశపెట్టాలనుకుంటున్నట్టు ఈ సందర్భంగా హోండా కార్స్ ఇండియా సీఈఓ టకుయా సుమురా చెప్పారు. ఈ కొత్త మోడల్స్ హైబ్రిడ్, బ్యాటరీ ఎలక్ట్రిక్ విభాగాల్లో వస్తాయని ఆయన తెలిపారు.

మార్కెట్లో హీరో విడా వీ2 కొత్త స్కూటర్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): టూవీలర్ల తయారీలో అగ్రగామి హీరో మోటోకార్ప్ మరింత శక్తివంతమైన విద్యుత్ స్కూటర్ విడా వీ2ను మార్కెట్లోకి తెచ్చింది. ఒకసారి చార్జి చేస్తే ఇది 165 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. చూపరులను ఆకట్టుకునే డిజైన్‌తో స్టైలిష్‌గా ఇది కనబడుతుందని తెలిపింది. ఈ స్కూటర్ ధర రూ.96,000 నుంచి రూ.1.35 లక్షల మధ్యన ఉంటుంది.

2030 నాటికి ఇన్విట్స్ ఏయూఎం

రూ.21 లక్షల కోట్లకు..

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దేశంలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (ఇన్విట్స్), రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్స్ ట్రస్ట్ (రీట్స్)కు రోజురోజుకు ఆదరణ పెరుగుతోందని ఇండియన్ ఇన్విట్స్ అసోసియేషన్, భారత్ ఇన్విట్స్ అసోసియేషన్ వెల్లడించాయి. బుధవారం నాడిక్కడ ఈ సంస్థలు రీట్స్, ఇన్విట్స్‌పై రిటైల్ మదుపరులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ సందర్భంగా మైండ్‌స్పేస్ బిజినెస్ పార్క్స్ రీట్ సీఎఫ్ఓ ప్రీతి చద్దా, హైవే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రీట్స్ సీఎఫ్ఓ అభిషేక్ చాజర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఇన్విట్స్ నిర్వహణలో ఉన్న ఆస్తుల విలువ (ఏయూఎం) రూ.5 లక్షల కోట్లుగా ఉండగా మార్కెట్ క్యాప్ రూ.1.6 లక్షల కోట్లుగా ఉందన్నారు. భారత ప్రభుత్వం చేపడుతున్న నేషనల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పైప్‌లైన్, జాతీయ మానిటైజేషన్ ప్రణాళికతో ఇన్విట్స్‌కు మరింతగా డిమాండ్ పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. దీంతో 2030 నాటికల్లా ఇన్విట్స్ ఏయూఎం 21 లక్షల కోట్లకు చేరవచ్చని భావిస్తున్నట్లు తెలిపారు. కాగా రీట్స్ నిర్వహణలో ఉన్న ఆస్తుల విలువ రూ.1.5 లక్షల కోట్లుగా ఉండగా మార్కెట్ క్యాప్ రూ.95,000 కోట్లుగా ఉంది. ప్రస్తుతం వీటి చేతిలో 100 మిలియన్ చదరపు అడుగుల (ఎంఎస్ఎఫ్) ఉండగా రానున్న కొన్నేళ్లలో ఇది 400 ఎంఎస్ఎఫ్ చేరుకోనుందని తెలిపారు.

రూ.400 కోట్లతో ప్యూర్ ఈవీ కొత్త ప్లాంట్

» 30 నెలల్లో కొత్తగా 250 డీలర్‌షిప్స్

» సంస్థ వ్యవస్థాపకుడు నిశాంత్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఐఐటీ హైదరాబాద్ ఇంక్యుబేటెడ్ సంస్థ.. ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ప్యూర్ ఈవీ తన కార్యకలాపాలను మరింతగా విస్తరించేందుకు రెడీ అవుతోంది. ఇందులో భాగంగా రూ.400 కోట్ల పెట్టుబడితో కొత్త ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు కంపెనీ వ్యవస్థాపకుడు, ఎండీ నిశాంత్ దొంగరి తెలిపారు. ప్రస్తుతం ప్యూర్ ఈవీ.. ఐఐటీ హైదరాబాద్ సమీపంలో 50 వేల యూనిట్ల సామర్థ్యంతో ప్లాంట్‌ను నిర్వహిస్తోందని, ఎలక్ట్రిక్ వాహనాలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని 40 ఎకరాల విస్తీర్ణంలో కొత్త ప్లాంట్‌ను నెలకొల్పనున్నట్లు ఆయన చెప్పారు. ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వంతో ఇప్పటికే ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు. సంగారెడ్డి లేదా జహీరాబాద్ నిమ్జ్‌లో ఈ ప్లాంట్‌ను నెలకొల్పే వీలుందని తెలిపారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో అందుబాటులోకి రానున్న ఈ ప్లాంట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 1.8 లక్షల యూనిట్లుగా ఉండనుందని పేర్కొన్నారు.

మూడేళ్లలో రూ.500 కోట్ల సమీకరణ

2018లో కార్యకలాపాలు ప్రారంభించిన ప్యూర్ ఈవీ ప్రస్తుతం ఈ-ప్లూటో, ఈ-ట్రాన్స్ పేరుతో రెండు స్కూటర్లు, 110 సీసీ ఎకో డ్రిఫ్ట్, 125 సీసీ ఈ-ట్రిస్ట్ పేరుతో రెండు మోటార్‌సైకిళ్లను విక్రయిస్తోందని నిశాంత్ తెలిపారు. కాగా కంపెనీ ఇప్పటికే వెంచర్ క్యాపిటలిస్ట్స్ (వీసీ), అల్ట్రా హైనెట్‌వర్త్ నుంచి రూ.220 కోట్ల నిధులను సమీకరించిందన్నారు. కాగా భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని వచ్చే మూడేళ్లలో ప్రైవేట్ ఈక్విటీ, వీసీల నుంచి రూ.500 కోట్లు సమీకరించాలని చూస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రస్తుతం ప్యూర్ ఈవీ దేశవ్యాప్తంగా 70 డీలర్‌షిప్స్‌ను నిర్వహిస్తోందని, వచ్చే 30 నెలల కాలంలో కొత్తగా 250 కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కంపెనీ ఇప్పటి వరకు 75,000 యూనిట్లను విక్రయించగా వచ్చే ఏడాదిన్నర కాలంలో 2 లక్షల యూనిట్లను అమ్మాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు నిశాంత్ తెలిపారు. కంపెనీ ఇప్పటికే నేపాల్, భూటాన్ దేశాలకు ఎగుమతి చేస్తుండగా జనవరి-మార్చి త్రైమాసికంలో పశ్చిమాసియా, ఆఫ్రికా దేశాలకు ఎగుమతులను ప్రారంభించనున్నట్లు నిశాంత్ చెప్పారు.

తీవ్ర ఊగిసలాటల్లోనూ

స్వల్ప లాభాలు

ముంబై: భారత స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా నాలుగో రోజు పాజిటివ్‌గా ముగిశాయి. బుధవారం ట్రేడింగ్‌లో సూచీలు ఆద్యంతం తీవ్ర ఊగిసలాటలకు లోనైనప్పటికీ, చివరికి స్వల్ప లాభాలను నమోదు చేయగలిగాయి. బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగ షేర్లలో కొనుగోళ్లు, విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు ఇందుకు దోహదపడ్డాయి. సెన్సెక్స్ 110.58 పాయింట్ల వృద్ధితో 80,956.33 వద్ద స్థిరపడగా.. నిఫ్టీ 10.30 పాయింట్ల పెరుగుదలతో 24,467.45 వద్ద క్లోజైంది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో సగమే రాణించాయి.

ఏకరీతి నామినేషన్ నిబంధనలు: సెబీ

అశక్తులైన పెట్టుబడిదారులకు ఊరట కల్పించేందుకు క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ కీలక నిర్ణయం తీసుకుంది. ఇన్వెస్టర్ తరఫున నియమిత వ్యక్తి సెక్యూరిటీ లావాదేవీలు నిర్వహించేందుకు వీలుగా సెక్యూరిటీ మార్కెట్లోని అన్ని వసతులకు వర్తించేలా ఏకరీతి నామినేషన్ ప్రమాణాలను సెబీ బుధవారం నోటిఫై చేసింది. అదనంగా, అశక్తుడైన ఇన్వెస్టర్ ఒకవేళ చనిపోతే తన సెక్యూరిటీలను బదిలీ చేయాల్సిన వ్యక్తి పేరునూ నామినేట్ చేసేందుకూ తప్పనిసరిగా వీలు కల్పించాలన్న నిబంధననూ ప్రకటించింది. మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులు, డీమ్యాట్ అకౌంట్లకూ ఈ ఏకరీతి నామినేషన్ నిబంధనలు వర్తించనున్నాయి.

అర్సెడో సిస్టమ్స్‌తో సైయెంట్ డీఎల్ఎం ఒప్పందం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మైసూర్ ప్లాంట్‌లో 500 కేడబ్ల్యూపీ సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు కోసం పునరుత్పాదక ఇంధన విభాగంలో కార్యకలాపాలు సాగిస్తున్న అర్సెడో సిస్టమ్స్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్టు సైయెంట్ డీఎల్ఎం ప్రకటించింది. ఈ ఒప్పందం కింద అర్సెడో సిస్టమ్స్ సోలార్ ప్లాంట్ డిజైనింగ్, ఇంజనీరింగ్, ఇన్‌స్టలేషన్ సేవలతో పాటు ప్లాంట్ నిర్వహణ కూడా చేపడుతుంది.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 5-12-2024

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**



రాష్ట్రంలో భూ ప్రకంపనలు

ఆరు జిల్లాల్లో స్వల్పంగా కంపించిన భూమి

కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు, అల్లూరి, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో కలకలం

వంటగదుల్లో కిందపడిన పాత్రలు.. కొన్ని చోట్ల గోడలకు పగుళ్లు

తెలంగాణలోని ములుగులో భూకంప కేంద్రం.. తీవ్రత 5.3

ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో నెర్రెలిచ్చిన గోడ

12

'చదును'లో చక్కబెట్టింది..

460 కోట్లు

జగనన్న కాలనీల్లో అడ్డగోలు దోపిడీ



- ఇంటి స్థలాలు చదును చేయకుండానే స్వాహా
- ఎంబుక్‌లు మార్చేసి నాడు అధిక బిల్లులు
- ఉపాధిలో చదునుకు అనుమతించని కేంద్రం
- కానీ, ఈ పథకంలో రూ.1,125 కోట్ల పనులు
- రూ.1585 కోట్ల పనులు చేసినట్టు బిల్లులు
- ఎంబుక్‌లు ట్యాంపరింగ్ చేసి భారీగా లబ్ధి
- సమగ్ర దర్యాప్తు జరిగితేనే వాస్తవాలు వెలుగులోకి

(అమరావతి- ఆంధ్రజ్యోతి)

కేంద్ర ప్రభుత్వం అనుమతించకపోయినా 'చదును' పేరిట రూ.కోట్లు చక్కబెట్టేశారు. చేయని పనులకు కూడా అప్పనంగా బిల్లులు చేసుకున్నారు. జగనన్న కాలనీ పనుల్లో ఆదీ అంతమూ అరాచకమే! ఈ అరాచకపర్వంలో మరో అంకం ఇప్పుడు వెలుగులోకి వచ్చింది. ఉపాధి నిధులతో ఆనాడు జగనన్న కాలనీల్లో చేపట్టిన లెవెలింగ్ పనుల్లో అడ్డగోలు దోపిడీకి తెరదీశారు. వైసీపీ కార్యకర్తలు చేపట్టిన ఈ పనుల్లో ఏకంగా ఎంబుక్‌లు మార్చేసి దొంగ బిల్లులు చేసుకుని వందల కోట్లు స్వాహా చేశారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉపాధి హామీ పథకంలో ఈ తరహా పనులకు కేంద్రం అనుమతి లేదు. అయినా, చదును పనులను

మిగతా 10వ పేజీలో...

బియ్యం దొంగలకు జగన్ అండ

- 2017లోనే కాకినాడ పోర్టులో తనిఖీలు.. అక్రమాలను గుర్తించిన ఆహార కమిషన్
- 40 మందిపై టీడీపీ సర్కారు సుమోటోగా కేసు.. అప్పటి కేసులోనూ ద్వారంపూడి గ్యాంగ్
- జగన్ ప్రభుత్వం వచ్చాక కేసుకు సమాధి.. అక్రమాల్లేవంటూ నిందితులకు క్లీన్‌చిట్
- నిర్వీర్యమైన రాష్ట్ర ఆహార కమిషన్.. గత ఐదేళ్లూ రేషన్ మాఫియాకు అండ

11



విశాఖలో చేతులు మారిన బేపార్క్

టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఎప్పుడూ గనుల లీజుదారులు, పారిశ్రామికవేత్తల జోలికి వెళ్లలేదు. వైసీపీ పెద్దలు మాత్రం ఒక పద్ధతి ప్రకారం పారిశ్రామిక వేత్తలను బెదిరించి మరీ వాటాలను, కంపెనీలను కబ్జా చేశారు. గనులను సొంతం చేసేసుకున్నారు. నిబంధనలు ఉల్లంఘించారని, భూములు ఆక్రమించారని, ఫైన్లు వేస్తామని... ఇలా పలురకాలుగా వేధించి వాటాలు కొట్టేశారు.

వైవీ సుబ్బారెడ్డి తనయుడు విక్రాంత్ రెడ్డి, విజయసాయిరెడ్డిలను రంగంలోకి దించి కాకినాడ డీప్‌వాటర్ పోర్టు, కాకినాడ సెజ్‌ను సొంతం చేసుకున్న వైనంపై అసలు వాటాదారుడు కేవీ రావు తాజాగా సీఐడీకి ఫిర్యాదు చేశారు. అదే విధంగా... ఇతర బాధితులూ భయం వీడి, ఫిర్యాదులు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

మాఫియా మోడల్!

వైసీపీ పాలనలో లూటీయే డ్యూటీ

- భయపెట్టి, బెదిరించి ఆస్తులు కైవసం
- కాకినాడ పోర్టు, సెజ్‌లాంటివి ఎన్నో!
- విశాఖ, కాకినాడపై ప్రత్యేక దృష్టి
- వంతాడ గనుల్లో 89శాతం సొంతం
- ఏటా రూ.180 కోట్ల సంపాదన
- విశాఖ బేపార్కులో పెద్దల పాగా
- రాడిసన్ బ్లూలో సగం స్వాహా
- రామానాయుడు స్టూడియోలో ప్లాట్ల బేరం



(కాకినాడ/విశాఖపట్నం - ఆంధ్రజ్యోతి)

అధికారాన్ని ఉపయోగించుకుని ఇన్ని అరాచకాలు చేయొచ్చా? భయమూ బెరుకూ లేకుండా చెలరేగిపోవచ్చా? ప్రభుత్వంలో ఉన్నవారే 'మాఫియా' తరహాలో బెదిరింపులకు దిగవచ్చా? ఐదేళ్ల వైసీపీ పాలనలో ఇవన్నీ జరిగాయి! ఒకటి కాదు.. రెండు కాదు.. లెక్కలేనన్ని అరాచకాలు సాగాయి. ప్రధానంగా అయిదేళ్ల పాలనలో కాకినాడను కొల్లగొట్టారు. విశాఖపై

మిగతా 12వ పేజీలో...

సీఐడీ దూకుడు

- కాకినాడ పోర్టు కేసులో కేవీ రావు వాంగ్మూలం!
- సాక్షుల విచారణ, ఆధారాల సేకరణపై దృష్టి
- ఏ1 విక్రాంత్ రెడ్డిని అరెస్టు చేసి విచారించే వీలు
- ఆధారాలు లభిస్తే జగన్ పేరూ నిందితుల జాబితాలోకి!

11

గన్ పాయింట్లో వేల కోట్ల ఆస్తులు

కొట్టేయడమా!

- ఇంత అరాచకం ఎప్పుడూ చూడలేదు
- రాజకీయ అధికారాన్ని అడ్డుపెట్టుకుని దుర్మార్గంగా రాయించుకోవడం ఘోరం
- బాధితులకు న్యాయం చేసే బాధ్యత మాది
- ఇది భూ ఆక్రమణల నిరోధక చట్టం పరిధిలోకి వస్తుందేమో చూడాలి
- విద్యుత్ ఒప్పందాలు రద్దుచేస్తే ఫైన్ కట్టాలి
- భూ ఫిర్యాదులకు పూర్తి పరిష్కారం చూపాలన్నదే మా ప్రయత్నం: చంద్రబాబు

ఫడణవీసే సీఎం!



- మహారాష్ట్ర బీజేపీ శాసనసభా పక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నిక
- నేడు ప్రమాణ స్వీకారం
- ముగ్గురం కలిసి పని చేస్తాం: ఫడణవీస్

4

సుఖ్‌బీర్‌పై హత్యాయత్నం

తుపాకీతో మాజీ ఉగ్రవాది కాల్పులు

- పంజాబ్ మాజీ డిప్యూటీ సీఎంకు తృటిలో తప్పిన పెను ప్రమాదం
- స్వర్ణ దేవాలయం వద్ద సిక్కు పెద్దలు విధించిన శిక్ష అనుభవిస్తుండగా కాల్పులు.. సీఎం రాజీనామాకు విపక్షాల పట్టు
- పంజాబ్‌పై కుట్ర: సీఎం మాన్

4



కాల్పులు జరుపుతున్న వ్యక్తిని అడ్డుకుంటున్న అకాలీదళ్ శ్రేణులు

పీఎస్ఎల్వీ-సీ59 ప్రయోగం

నేటికి వాయిదా

- ప్రయోగానికి గంట ముందు ప్రోబా-3లో సాంకేతిక లోపం
- నేటి సాయంత్రం 4:12 గంటలకు రీ షెడ్యూల్ చేసిన ఇస్రో

4



4

జగన్‌పై ఏసీబీకి ఫిర్యాదు చేస్తాం

- అదానీ నుంచి రూ.1,750 కోట్లు ముడుపులు తీసుకున్నారు
- విద్యుత్తు ఒప్పందాన్ని రద్దు చేయాలి
- పర్సనల్ విషయాలు మాట్లాడితే జగన్ బయటకు రాలేడు: షర్మిల

సంజయ్ అరెస్ట్ తప్పదా?

- సీఐడీ, ఫైర్‌లో అవినీతి కేసు ఏసీబీకి
- పీసీ యాక్ట్ కింద ఎఫ్ఐఆర్ నమోదు

4

విద్యార్థులకు రూ.3,500 కోట్లు

బకాయిపెట్టి పోయి!



- ఫీజులపై ఆందోళనకు జగన్ పిలుపు
- జనవరి 4లోగా చెల్లించాలని గడువు
- ధాన్యం కొనుగోళ్లపై ఈ నెల 27న ధర్నా
- ఆ తర్వాత విద్యుత్ చార్జీలపై నిరసన
- సంక్రాంతి తర్వాత జనంలోకి మాజీ సీఎం
- అప్పటిలోగా ప్రభుత్వ వ్యతిరేకత పెంచాలని వైసీపీ నేతలకు ఆ పార్టీ అధినేత ఆదేశం



అమరావతి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉండగా ప్రజలకు.. గద్దెదిగాక సొంత పార్టీ నేతలకు అబద్ధాలు చెప్పడం వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌కు అలవాటుగా మారింది. అధికారం కోల్పోయేనాటికి విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ.2,100 కోట్లు, వసతి దీవెన కింద మరో 1,400 కోట్లు.. మొత్తం రూ.3,500 కోట్లు బకాయి పెట్టి పోయిన ఆయన.. తాను ఫీజు బకాయిలన్నీ చెల్లించేశానంటూ పార్టీ నేతల ముందు బొంకేశారు. ఇక ఐదేళ్లలో 9 సార్లు కరెంటు చార్జీలు పెంచిన ఆయన.. తాను పైసా పెంచలేదని.. చంద్రబాబు సీఎం అయ్యాక మళ్లీ బాదుడే బాదుడు మొదలుపెట్టారని అమాంతం అబద్ధం ఆడేశారు. బుధవారమిక్కడ తాడేపల్లి ప్యాలెస్‌లో వైసీపీ ముఖ్య నేతలు, రాష్ట్ర కార్యదర్శులు, జిల్లా నాయకులతో ఆయన సమావేశమయ్యారు. సంక్రాంతి తర్వాత తాను ప్రజల్లోకి వస్తానని.. ఆలోపు ఆందోళనలతో

మిగతా 12వ పేజీలో...

రూప్ మాయలు!

నెల్లూరు క్వార్ట్జ్ గనుల్లో ఘనుడు.. తెరవెనుక ఒక రిటైర్డ్ అధికారి



రూప్ కుమార్

- నెల్లూరు జిల్లాలోని అన్ని గనుల్లో తనిఖీలు
- రూప్ కుమార్ గనులకు మాత్రం మినహాయింపు
- అనుమతుల పునరుద్ధరణకు భారీ వ్యూహం
- తనిఖీలకు పట్టుబట్టిన డీడీ ఆథరైజేషన్ తొలగింపు
- కింది స్థాయి అధికారి ద్వారా ఫైల్ అప్‌లోడ్
- తొలుత అనుమతులు.. వెంటనే అప్రమత్తమై రద్దు



నెల్లూరు జిల్లాలో క్వార్ట్జ్ గనులు (ఫైల్)

(నెల్లూరు - ఆంధ్రజ్యోతి)

గనులయందు రూప్ కుమార్ గనులు వేరయా! గనులన్నీ తనిఖీ చేసినా రూప్ గనుల జోలికి మాత్రం పోరయా! ఇదీ అక్కడి లెక్క! ఆయన కోసం... డిప్యూటీ డైరెక్టర్ డిజిటల్ సిగ్నేచర్‌నే గప్‌చుప్‌గా తొలగించేశారు. కింది స్థాయి అధికారితో ఫైల్ అప్‌లోడ్ చేయించారు. ఎక్కడో తేడా కొట్టిందనే అనుమానంతో తెల్లారేసరికి అనుమతులు రద్దు చేశారుగానీ... లేకపోతే ఈ పాటికి రూప్ కుమార్ గనుల్లో 'అధికారికం'గా తవ్వకాలు

మిగతా 10వ పేజీలో...



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కాల్పులు – ప్రశ్నలు

స్వర్ణదేవాలయ ప్రాంగణంలో పంజాబ్ మాజీ ఉపముఖ్యమంత్రి సుఖ్‌బీర్‌సింగ్ బాదల్ పైన తుపాకీ కాల్పులు జరిగిన ఘటన దేశాన్ని నివ్వెరపరిచింది. ఘటనతో పాటు కాల్పులు జరిపిన వ్యక్తి పుట్టుపూర్వోత్తరాలు కూడా నిర్ఘాంతపరుస్తున్నాయి. 2007–17 మధ్య కాలంలో శిరోమణీ అకాలీదళ్ నేతలు చేసిన పాపాలకు సిక్కుల అత్యున్నత మతపీఠం అకాల్‌తఖ్త్ సాహెబ్ శిక్షలు విధించిన సంగతి తెలిసిందే. అప్పట్లో అధికారాలు వెలగబెట్టినవారంతా ఇప్పుడు శిక్షలో భాగంగా స్వర్ణదేవాలయ ప్రాంగణంలో గిన్నెలు తోమడం, కంచాలు కడగడం, మూత్రశాలలు శుభ్రపరచడం వంటి సేవలు అందించి పాపప్రక్షాళన చేసుకుంటున్నారు. మతద్రోహానికీ, దుష్ప్రవర్తనకు పాల్పడిన దోషి (తంఖయ)గా ఆగస్టులోనే ఆకాల్‌తఖ్త్ ముద్రను పొంది, ఇప్పుడు శిక్షలు ఖరారైన సుఖ్‌బీర్‌సైతం ఇదేవిధమైన సేవలు అందించాల్సి ఉండగా, వార్ధక్యం, వైకల్యం దృష్ట్యా ఆయనకు కొన్ని మినహాయింపులు దక్కాయి. నేను పాపిని, క్షమించండి అన్న బోర్డు ఒకటి మెడలో వేసుకొని, కట్టుకట్టిన కాలుని చాపుకొని, సేవాదార్‌గా స్వర్ణదేవాలయం ముందు వీల్‌ఛైర్లో వాలుగా కూచున్న ఈ ఆరుపదుల వృద్ధుడిని చూసి ఎంతమంది పంజాబీలు జాలిపడ్డారో తెలియదుకానీ, ఈ హత్యాయత్నం ఘటన మాత్రం ఆయనకూ, ఆయన పార్టీకీ రాజకీయంగా మేలుచేస్తుందని విశ్లేషకుల నమ్మకం.

పంజాబ్‌మీద దాదాపు నాలుగుదశాబ్దాలు సంపూర్ణ ఆధిపత్యం చెలాయించిన బాదల్ కుటుంబాన్ని మీడియా ఒకదశలో ఫస్ట్ ఫ్యామిలీ ఆఫ్ పంజాబ్ అని ప్రస్తావించిన విషయం, పంజాబ్‌ను ఖలిస్తాన్ ఉద్యమం ఊపేస్తున్న కాలంలో ప్రకాశ్‌సింగ్ బాదల్ విశేష భూమిక తెలియనివేమీ కావు. పార్టీని, రాష్ట్రాన్ని కుమారుడికి తదనంతరం అందించేందుకు సీనియర్ బాదల్ చాలామంది సీనియర్లను తెలివిగా బయటకు నెట్టేశారు. కెప్టెన్ అమరీందర్‌సింగ్ కాంగ్రెస్‌లో చేరి ఆ తరువాత బదులు తీర్చుకున్నారు కూడా. బీజేపీతో పొత్తు పెట్టుకొని, 2007, 2012 ఎన్నికలను వరుసగా నెగ్గుకొచ్చి, కేంద్రంలోనూ రాష్ట్రంలోనూ కీలకపదవులు అందుకున్న పార్టీ ఆ తరువాత క్రమంగా తన ప్రాభవాన్ని కోల్పోయింది. కుటుంబం మీద వచ్చిన అవినీతి ఆరోపణలు, వ్యవసాయ సంక్షోభాలు, యువతను ముంచేసిన మాదకద్రవ్యాల వినియోగం ఇత్యాదివి ఆ పార్టీని, కుటుంబాన్ని ప్రజలకు దూరం చేశాయి. మరీముఖ్యంగా, ఇప్పుడు వీరంతా శిక్షలు అనుభవిస్తున్న మతవిద్రోహం ఘటనలన్నీ ఒక్కటొక్కటిగా మెడకు చుట్టుకున్నాయి. 2012లో సుఖ్‌బీర్ నేతృత్వంలో రెండోసారి కూడా అధికారంలోకి రాగలిగిన శిరోమణీ అకాలీదళ్ మరుసటి ఎన్నికల్లో కాంగ్రెస్ దెబ్బకు కుప్పకూలిపోయింది. పార్టీ బలహీనంగా ఉన్న ఆ తరుణంలో, మూడువ్యవసాయ చట్టాలు తెచ్చి బీజేపీ తన మిత్రపక్షం మీద మరింతగా కోలుకోలేనంత దెబ్బకొట్టింది. కాంగ్రెస్‌నుంచి అధికారం కొత్తగా ఎన్నికలక్షేత్రంలోకి ప్రవేశించిన ఆమ్ ఆద్మీ పార్టీ చేతుల్లోకి వెళ్ళిపోవడంతో సుఖ్‌బీర్ సింగ్ పార్టీ గతనెలలో జరిగిన ఉపఎన్నికల్లో నాలుగు అసెంబ్లీ స్థానాల్లోనూ అభ్యర్థులను నిలబెట్టలేనిస్థితికి జారుకుంది. మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో సుఖ్‌బీర్ భార్య తప్ప మరెవ్వరూ ఆ పార్టీనుంచి గెలవలేదు. ఈ నేపథ్యంలోనే, జూలైలో అసమ్మతివర్గం సుఖ్‌బీర్ పాపాల చిట్టాను అకాల్‌తఖ్త్‌కు అందించి, పార్టీ ప్రక్షాళనకు ఆదేశించాల్సిందిగా కోరినట్టు వార్తలు వచ్చాయి. శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీ (ఎస్జీపీసీ)లో అకాలీదళ్ ఆధిపత్యం ఉన్నందున, బాదల్‌కు వ్యతిరేకంగా వ్యవహరించడానికి అకాల్‌తఖ్త్ వెనకడుగువేస్తున్నదన్న విమర్శ ఎప్పటినుంచో ఉన్నది. ఇప్పుడు సుఖ్‌బీర్ సహా మరికొందరికి శిక్షలు వేయడం, పార్టీని ప్రక్షాళించమంటూ కొన్ని చర్యలు నిర్దేశించడం పార్టీకే కాక, ఆయనకు కూడా మేలు చేస్తుందని విశ్లేషకుల అభిప్రాయం. పంజాబ్, పంజాబీలు, పంజాబియత్ కోసం నిలబడిన పార్టీగా అకాలీదళ్‌ను పునరుద్ధరించుకోవడానికి సుఖ్‌బీర్‌కు ఇది అవకాశం ఇస్తుందని, ఎంతచీలినా, ఎందరు పోయినా ఆయన స్థాయి వారెవ్వరూ లేరని అంటారు. అకాల్‌తఖ్త్‌ముందు శిరస్సు వంచి, అన్ని తప్పులనూ అంగీకరించి, వేసిన శిక్షలన్నీ అనుభవించి, గురుద్వారా ద్వారాల ముందు కావలికాస్తున్న ఆ దృశ్యం ప్రజల ఆగ్రహాన్ని ఉపశమింపచేయవచ్చు. బబ్బర్‌ఖల్సాకు చెందిన ఒక మాజీ మిలిటెంట్ ఏకంగా ఆయనపై హత్యాయత్నానికి ఒడిగట్టడం దీనికి అదనంగా పనిచేయవచ్చు. రాష్ట్ర ప్రజలు పార్టీని తిరిగి ఆదరిస్తారా లేదా అన్నది అటుంచితే, సుఖ్‌బీర్ నాయకత్వాన్ని పార్టీలో ఎందరు కోరుతున్నారో ముందుగానే సంస్థాగత ఎన్నికల్లో తేలిపోతుంది.

రాజ్యాంగ విలువలకు పట్టంగట్టిన తీర్పు!

దేశంలో 75వ రాజ్యాంగ దినోత్సవ సందర్భాన భారత రాజ్యాంగ పీఠికలో సోషలిజం (సామ్యవాదం), సెక్యులరిజం (లౌకికవాదం) అంతర్భాగమని పునరుద్ఘాటిస్తూ సుప్రీంకోర్టు కీలక మైలురాయి లాంటి తీర్పు వెలువరించింది. రాజ్యాంగ పీఠికలో ఈ సూత్రాలు ఉండటాన్ని సవాల్ చేస్తూ డాక్టర్ బల్‌రాం సింగ్‌తో పాటు ఇతరులు దాఖలు చేసిన పిటిషన్లను దేశ సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం కొట్టివేయడం విశేషం. ఈ పిటిషన్‌దారుల్లో బీజేపీ సీనియర్ నేత సుబ్రమణ్యస్వామి కూడా ఒకరు కావడం గమనార్హం. సుప్రీంకోర్టు వెలువరించిన ఈ తీర్పు రాజ్యాంగ మౌలిక సూత్రాలు, విలువలను తెలియజేస్తున్నది. అంతేకాదు, భారతదేశపు ప్రజాస్వామ్య, భిన్నత్వంలో ఏకత్వం, సమ్మిళితత్వాన్ని రూపొందించడంలో వాటి ప్రాధాన్యాన్ని ఈ తీర్పు నొక్కిచెప్తున్నది.



akbar

లౌకికవాదం, సామ్యవాద సూత్రాలను పలుచన చేసే ప్రయత్నాలు ఆమోదయోగ్యం కావంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు శక్తిమంతమైన సందేశాన్ని ఇస్తున్నది. ఈ సూత్రాలు ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారతదేశ ప్రయాణాన్ని రూపొందించాయి. సామాజిక సంక్షేమం, మత సామరస్యానికి ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా అవి సమగ్రతను, పురోగతిని ప్రోత్సహించే ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించడంలో కీలకపాత్ర పోషించాయి. అందువల్ల ఈ తీర్పు చట్టపరమైన మైలురాయి మాత్రమే కాదు, రాజ్యాంగ విలువలకు భారతదేశ నిబద్ధతను కూడా తెలియజేస్తున్నది.

42వ రాజ్యాంగ సవరణ ద్వారా భారత రాజ్యాంగ పీఠికలో సామ్యవాదం, లౌకికవాదం అనే సూత్రాలను చేర్చారు. ఇది భారత రాజ్యాంగ చరిత్రలో చరిత్రాత్మక ఘటన. మన దేశం రాజకీయ, ఆర్థిక సవాళ్లు ఎదుర్కొంటున్న సమయంలో ప్రవేశపెట్టిన ఈ సూత్రాలు దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి కట్టుబడి ఉన్న ఆదర్శాలకు, నిబద్ధతలకు ప్రతీకలు. ఈ సూత్రాలు రాజ్యాంగ పీఠికలో చేర్పులు మాత్రమే కాదు, భారతీయ నైతిక విలువలు, రాజకీయపరమైన చర్చల్లో లోతుగా పాతుకుపోయిన విలువలకు అధికారిక ఆమోద ముద్ర అని ఘంటాపథంగా చెప్పవచ్చు.

ఆర్టికల్ 368 ప్రకారం రాజ్యాంగ పీఠికతో సహా రాజ్యాంగాన్ని సవరించే హక్కు నిస్సందేహంగా పార్లమెంట్‌కు ఉన్నదని సుప్రీంకోర్టు ఈ కేసు విచారణ సందర్భంగా పేర్కొన్నది. అయితే, ఈ సూత్రాలు రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణాన్ని ఉల్లంఘించాయని లేదా అసలు ఉద్దేశాన్ని అవి వక్రీకరించాయనే వాదనను ఉన్నత న్యాయస్థానం కొట్టిపారేసింది. అంతేకాదు, ఆర్టికల్స్ 14, 15, 16, 2530 సమానత్వం, వివక్ష లేకపోవడాన్ని, మత స్వేచ్ఛను కల్పిస్తున్నట్టే లౌకికవాదం అనేది అన్ని మతాలను సమానంగా గౌరవిస్తుందని న్యాయస్థానం నొక్కిచెప్పింది. అలాగే దేశంలో ప్రైవేట్, ప్రభుత్వ సంస్థల పెట్టుబడులను అనుమతించడం ద్వారా మిశ్రమ ఆర్థిక నమూనాతో సామాజిక, ఆర్థిక న్యాయం పట్ల దేశం నిబద్ధతను సామ్యవాదం ప్రతిబింబిస్తుంది. ఎమర్జెన్సీ సమయంలో తీసుకొచ్చిన 42వ రాజ్యాంగ సవరణ చట్టబద్ధతపై తలెత్తుతున్న ఆందోళనలను కూడా సుప్రీంకోర్టు కొట్టిపారేసింది. ఆ తర్వాత 44వ రాజ్యాంగ సవరణ సందర్భంగా పార్లమెంట్‌లో జరిగిన చర్చలో ఈ సూత్రాలను పునరుద్ఘాటించినట్టు న్యాయస్థానం గుర్తుచేసింది. సామ్యవాదం, లౌకికవాదం అనే సూత్రాలు భారత రాజ్యాంగ నైతిక విలువల్లో లోతుగా పాతుకుపోయాయనీ, అవి భారత రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణంలో అంతర్భాగమని కోర్టు చెప్పింది. 'మనమంతా భారతీయ ప్రజలం' అనే ఆకాంక్షలను ప్రతిబింబించేలా పీఠికను సజీవ సాక్ష్యంగా న్యాయవ్యవస్థ గుర్తించిందని చెప్పడానికి ఈ తీర్పు తార్కాణం.



భారత రాజకీయ, ఆర్థిక, విధానపరమైన నిర్ణయాలు, చర్చల్లో సామ్యవాదం కీలక పాత్ర పోషిస్తున్నది. ఈ సూత్రాన్ని మన దేశం అవలంబించిన నాటి నుంచి సమకాలీన సంక్షేమ విధానాల అమలులో సామ్యవాదం మార్గనిర్దేశక శక్తిగా ఉన్నది. ముఖ్యంగా 1980లో బొంబాయి వేదికగా బీజేపీని స్థాపించినప్పుడు ఆ పార్టీ గాంధేయ సోషలిజాన్ని తమ వ్యవస్థాపక సూత్రాల్లో ఒకటిగా స్వీకరించింది. గాంధేయ సోషలిజం బీజేపీ సైద్ధాంతిక మూలస్తంభమని ఆ పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరైన అటల్ బిహారీ వాజపేయి విస్పష్టంగా ప్రకటించారు. సోషలిజం రాజకీయాలకతీతమని, భారత పాలనలో ఏకీకృత ఆదర్శంగా ఇది మిగిలిపోతుందని చెప్పడానికి ఇది నిదర్శనం. 1990వ దశకంలో ఆర్థిక సరళీకరణలు, సంస్కరణలు వచ్చినప్పటికీ, దేశంలోని అనేక రాజకీయ పార్టీలు సోషలిస్టు ఆదర్శాలకు కట్టుబడి ఉన్నాయి. సమాజ్‌వాదీ, ఆర్జేడీ, జేడీయూ, జేడీఎస్ వంటి ప్రాంతీయ అస్తిత్వ శక్తులు సోషలిజం పట్ల తమ నిబద్ధతను చాటుకున్నాయి. అంతేకాదు, సోషలిస్టు సూత్రాల ప్రకారం.. ఆయా పార్టీల నేతృత్వంలోని ప్రభుత్వాలు తమ సంక్షేమ విధానాలను రూపొందించి, అమలు చేశాయి కూడా.

టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ గతంలో నక్సలైట్లను దేశభక్తులుగా అభివర్ణించారు. సోషలిజం ప్రభావానికి ఇది ఒక చక్కని ఉదాహరణ. సంప్రదాయేతర నెరేటివ్స్‌లోనూ సోషలిజం సూక్ష్మ, విస్తృత ప్రభావానికి ఇది నిదర్శనం. ఈ సైద్ధాంతిక నిబద్ధత మన దేశంలో సంక్షేమ నమూనాకు కూడా విస్తరించింది. వనరులు, అవకాశాల సమాన పంపిణీకి ఇది ప్రాధాన్యమిస్తుంది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, ఆహార భద్రత, పీఎం కిసాన్ యోజన, మహారాష్ట్రలో అమలవుతున్న లడ్కీ బహిన్ యోజన వంటి పథకాలు సోషలిజానికి ఆధునిక మేనిఫెస్టోలాంటివి. అసమానత్వాన్ని రూపుమాపేందుకు, సామాజిక న్యాయం చేసేందుకు సామ్యవాదమే పరిష్కార మార్గం.

ఎవరూ ఔనన్నా, కాదన్నా భిన్నత్వంలో ఏకత్వం, వైవిధ్యతలతో కూడిన భారత్‌కు లౌకికవాద దేశమనే గుర్తింపు అనివార్యం. 2011 జనాభా లెక్కలే అందుకు నిదర్శనం. 2011 జనగణన ప్రకారం– దేశంలో 79.8 శాతం హిందువులు, 12 శాతం ముస్లింలు, 2.3 శాతం క్రైస్తవులు, 1.7 శాతం సిక్కులు, 0.7 శాతం బౌద్ధులు, 0.4 శాతం జైనులు, మిగిలిన శాతం ఇతరుల మతాలను ఆచరించేవారున్నారు. ఈ మతపరమైన బహుళత్వం 22 అధికారిక భాషలు, వందలాది మాండలికాలతో కలిపి దేశంలో సంపూర్ణంగా విస్తరించి ఉన్నది. ఇలాంటి వైవిధ్య సమాజంలో లౌకికవాదం అందరినీ ఏకం చేసే సూత్రంగా పనిచేస్తుంది. తమ విశ్వాసాన్ని స్వేచ్ఛగా ఆచరించే వ్యక్తుల హక్కులను కాపాడుతూ, దేశం అన్ని మతాలను గౌరవిస్తుందని ఇది తెలియజేస్తుంది. సామరస్యాన్ని, సమానత్వాన్ని పెంపొందించే ప్రత్యక్ష వాస్తవికతే లౌకికవాదం. విభిన్న పండుగలను కలిపి జరుపుకోవడం నుంచి పాలనలో వివిధ వర్గాల ప్రాతినిధ్యం వరకు లౌకికవాదం భారతదేశ నైతికతలో లోతుగా పాతుకుపోయింది. అయితే, మన దేశంలో లౌకికవాదం భవిష్యత్తులోనూ పరిఢవిల్లాలంటే అప్రమత్తత అవసరం. దేశంలో అక్కడక్కడ జరిగే మత విభేదాల ఘటనలు ఈ ఆదర్శ సూత్రాన్ని సవాలు చేస్తాయి. లౌకికవాదం మరింత కాలం మనుగడ సాగేందుకు పౌరసంస్థలు, రాజకీయ నాయకులు ప్రయత్నించాలి. సుప్రీంకోర్టు లౌకికవాదాన్ని పునరుద్ఘాటించడం, భిన్నత్వం మధ్య భారతదేశం ఏకత్వాన్ని కాపాడటంలో దాని పాత్రను గుర్తు చేస్తుంది.

సామ్యవాదం, లౌకికవాదం అనేవి కేవలం సాధారణ పదాలు కావని, అవి భారత రాజ్యాంగానికి ఆధారమైన ప్రాథమిక సూత్రాలని సుప్రీంకోర్టు తీర్పు తెలియజేస్తున్నది. బీజేపీ నాయకుడు సుబ్రమణ్యస్వామితో పాటు ఇతరులు దాఖలు చేసిన పిటిషన్లను కొట్టివేస్తూ– ఈ విలువలు రాజ్యాంగ మౌలిక సూత్రాలైన న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వానికి నకళ్ల వంటివని, అవి వాటితో సరిగ్గా సరిపోతాయని న్యాయస్థానం నొక్కిచెప్పింది. ఈ తీర్పు రాజ్యాంగ అనుకూలతను కూడా తెలియజేస్తున్నది. ఆర్టికల్ 368 ప్రకారం రాజ్యాంగాన్ని సవరించే అధికారం పార్లమెంటుకు ఉందని చెప్తూనే, 42వ రాజ్యాంగ సవరణను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను కొట్టివేస్తూ, లౌకికవాదం, సామ్యవాద సూత్రాలను పలుచన చేసే ప్రయత్నాలు ఆమోదయోగ్యం కాదని న్యాయస్థానం కుండబద్దలు కొట్టి మరీ చెప్పింది. ఆర్థిక న్యాయం, సామాజిక సమానత్వం, మత సామరస్యాన్ని పెంపొందించేందుకు సామ్యవాదం, లౌకికవాదం అవసరమనే శక్తిమంతమైన సందేశాన్ని ఈ తీర్పు ఇస్తున్నది. ఈ సూత్రాలు గతానికి సంబంధించినవి మాత్రమే కావు. శక్తివంతమైన, సమ్మిళిత ప్రజాస్వామ్యంలో కీలకమైన భాగాలు కూడా. ఈ సూత్రాలు ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారత దేశ ప్రయాణాన్ని రూపొందించాయి. సామాజిక సంక్షేమం, మత సామరస్యానికి ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా అవి సమగ్రతను, పురోగతిని ప్రోత్సహించే ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించడంలో కీలకపాత్ర పోషించాయి. అందువల్ల ఈ తీర్పు చట్టపరమైన మైలురాయి మాత్రమే కాదు, రాజ్యాంగ విలువలకు భారతదేశ నిబద్ధతను కూడా తెలియజేస్తున్నది.

■ బోయినపల్లి వినోద్‌కుమార్
న్యాయవాది, పార్లమెంట్ మాజీ సభ్యులు

గాయక సార్వభౌముడు పారుపల్లి

తమ జీవితకాలంలో తెలుగుదేశాన్నేగాక, యావద్భారతావనినీ ఆకర్షించి తెలుగువెలుగును నలుదిక్కుల వెదజల్లినవారిలో 'గాయక సార్వభౌమ' కీర్తిశేషులు పారుపల్లి రామకృష్ణయ్య పంతులుగారు ఒకరు. 1882 డిసెంబర్ 5న ఆంధ్రసామ్రాజ్య ముఖ్యనగరమై విలసిల్లిన కృష్ణా జిల్లా శ్రీకాకుళమున శేషాచలం, మంగమాంబ దంపతులకు జన్మించిన ఈ పుణ్యమూర్తి త్యాగరాజస్వామివారి శిష్యపరంపరలో మూడవ తరానికి చెందినవారు. సాక్షాత్తు త్యాగరాజస్వామి శిష్యుడు, తంజావూరులోని మానాంబుచావడి గ్రామనివాసి, ఆంధ్రుడైన ఆకుమడుల వెంకటసుబ్బయ్యకు శిష్యుడైన సుసర్ల దక్షిణామూర్తిశాస్త్రి గారి శిష్యులే పారుపల్లివారు.

ఆంధ్రరాష్ట్రంలో శాస్త్రీయ సంగీత పునరుజ్జీవనానికి మూలపురుషులైన పారుపల్లివారు జంత్ర గాత్రాలలో బహుముఖ ప్రజ్ఞావంతులైన సంగీత విద్వాంసులు. విజయవాడను కేంద్రబిందువుగా చేసుకొని ఆంధ్రదేశాన శాస్త్రీయ సంగీత ప్రాచుర్యానికి పునాదులు వేశారు. ఆ రోజులలో విజయవాడ పరిసర ప్రాంతాలలో సంగీత కళాశాలలు లేని కారణంగా ఆయన గురుకులమే ఒక విశ్వవిద్యాలయం. శాస్త్రములో చెప్పబడిన గాయక లక్షణాలన్నీ మూర్తీభవించేటట్లు ఉండేది పంతులు గారి విగ్రహం.



దక్షిణ భారతదేశంలో కన్నడిగులు, తమిళుల సంగీత ప్రతిభే ప్రామాణికంగా చలామణి అవుతున్న ఆ రోజులలో తెలుగువాడి స్వరాన్ని విశ్వవ్యాప్తం చేసిన విశిష్టమూర్తి పారుపల్లి రామకృష్ణయ్య పంతులు.

శిష్యులు, అంతేవాసులు ఎవరి సాధనలో వారుంటే అయ్యవారు క్షణక్షణం పర్యవేక్షణ చేస్తూ చెప్పవలసినవి చెప్పి, పాడించి, ప్రతి శిష్యునకు తన బోధనా భాగ్యాన్ని కలుగచేసేవారు. ప్రతీ విద్యార్థికి గాత్ర సంగీతంతో పాటు వయోలిన్ కూడా నేర్పేవారు. ఒకవేళ ఏ కారణం చేతనైనా గాత్రం మూగపోతే వయోలిన్‌తో జీవనోపాధి కొనసాగించవచ్చు అనే దూర దృష్టి ఆయనది. పారుపల్లివారి సంప్రదాయశుద్ధి, గాత్ర మాధుర్యం చూసి ఎంతోమంది దాక్షిణాత్యులు ఆయనను ఆదరించి ప్రోత్సహించడమే కాకుండా, వారిని మద్రాసులో స్థిరనివాసం ఏర్పరచుకోవలసిందిగా ఒత్తిడి చేశారు. ఆలా చేయడంవల్ల వారికి కలిగే ఆర్థిక యశోలాభాలను గూర్చికూడా ఆశపెట్టారు. దానికి పారుపల్లివారు 'నా ఆంధ్రదేశములో కూడా తమిళనాడు వలె సంగీతం బహుజన వ్యాప్తంగా వృద్ధిపొందేటట్లు చేయడమే నా జీవిత ధ్యేయం' అని అన్నారు. ఆ లక్ష్యంతోనే తమ స్వగ్రామమైన కృష్ణా జిల్లా దివిసీమ తాలూకా, శ్రీకాకుళం వదిలిపెట్టి విశాలాంధ్ర వసుంధరా కేంద్రబిందువైన విజయవాడలో స్థిరనివాసం ఏర్పరచుకొని జీవితాంతం వరకు తమ ఆదర్శాన్ని అమలుపరచడంలోనే గడిపారు.

గురువుగారైన సుసర్ల దక్షిణామూర్తి వర్యుల ఆరాధన ఉత్సవాలు ప్రతి ఏటా పారుపల్లివారు ఘనంగా జరిపేవారు. 1940 జూలైలో పారుపల్లివారు ముఖ్యమైన పని మీద తన స్వగ్రామానికి వెళ్ళవలసి వచ్చి, వార్షికోత్సవ కార్యక్రమ ఏర్పాట్లు సీనియర్ విద్యార్థి అయిన నేతి లక్ష్మీనారాయణ భాగవతులుకు అప్పగించారు. ఈయన, ఇతర సహాధ్యాయుల సూచనలతో మంగళంపల్లి బాలమురళీకృష్ణ పేరుకూడా ఆహ్వానపత్రంలో చేర్చారు. గ్రామం నుండి తిరిగి వచ్చిన తరువాత పారుపల్లివారు కార్యక్రమ పత్రికలో మురళి పేరు చూసి నివ్వెరపోయి, 'బాలమురళి కొద్దిరోజుల నుండి మాత్రమే నా దగ్గర సంగీతాన్ని నేర్చుకుంటున్నాడు, దీనివల్ల ఉత్సవముల స్థాయి తగ్గుతుంది కదా' అని మందలించారు. కానీ, జూలై 18, 1940 రోజున బాలమురళి కచేరీ ప్రకటిత 30 నిమిషాలకు బదులు సుమారు రెండుగంటలకు పైగా కొనసాగి శ్రోతల ప్రశంసలందుకోవటంతో పారుపల్లివారు ఉప్పొంగిపోయారట. అయన దగ్గర శిష్యరికం చేసిన ప్రతి వ్యక్తీ ఒక విద్వాంసుడుగా పేరుపొంది, అన్న వస్త్రాలకు లోటు లేకుండా ఉండేవారు. ఆ రోజుల్లో దాక్షిణాత్యులు గుర్తించి ఆదరించిన కొద్దిమంది ఆంధ్ర సంగీత విద్వాంసులలో పారుపల్లివారు ఒకరు. మద్రాసు సంగీత అకాడమీ నిపుణుల సంఘంలో సభ్యుడుగా చాలాకాలం పనిచేయడంతోపాటు తిరువాయూరులోని త్యాగబ్రహ్మ ఆరాధన ఉత్సవ కార్యక్రమ నిర్వాహక సభ్యునిగా కూడా ఉన్నారు. కొలంబియా గ్రామఫోన్ కంపెనీ ఆయన కార్యక్రమాలను రికార్డు చేసింది. దేశంలోని వివిధ ప్రాంతాలలో కచేరీలు చేసి అనేక బిరుదులూ, పురస్కారాలు అందుకొన్నారు. పూనాలోని తెలుగు, తమిళ, మహారాష్ట్ర సంఘాలు ఘనంగా సత్కరించాయి. 1915 ప్రాంతములో మద్రాసు గవర్నర్ లార్డ్ పెంట్లాండ్ తెనాలి వచ్చి సువర్ణపతకం బహూకరించారు. 1923లో కాకినాడలో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ మహాసభలో, 1927లో చెన్నపట్నంలో జరిగిన అఖిల భారత సంగీత సభలో కచేరీలు చేసి ప్రముఖుల, విద్వాంసుల, శ్రోతల మన్ననలను ఆకట్టుకున్నారు.

అక్షరాలకందని ప్రతిభ పారుపల్లివారిది. శిష్యుల పేర్లు కూడా తెలుగు రాష్ట్రాల్లో ఇంటింటా మార్మోగటం పారుపల్లివారు చేసుకున్న అదృష్టం. విజయవాడలో వారి గురుకుల శిక్షణలో తయారైన ఉద్దండులలో మంగళంపల్లి బాలమురళీకృష్ణ, నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులు, అన్నవరపు రామస్వామి, నేతి శ్రీరామశర్మ, ముసునూరి వెంకటరమణమూర్తి, తిరుపతి పొన్నారావు, దాలిపర్తి పిచ్చహరి సోదరులు, టి.కె. యశోదదేవి, జి.వి.రామకుమారి ఇత్యాదులున్నారు. పంతులుగారి శిష్యులు కొల్లలయితే, ప్రశిష్యులు కోకొల్లలు.


'పారుపల్లియనెడి పావన నామంబు, విజయవాడలోన వెలయకున్న, ఏ స్థితిని గనెదమో? ఏ గతి నుందుమో? మాదృశులగు మందమతులు నేడు' అనేవారు కీర్తిశేషులు నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులు. పంతులుగారి కృషి, ప్రోద్బలంతో ఆంధ్ర రాష్ట్రంలో విజయవాడ పట్టణంలో ప్రప్రథమముగా ఆకాశవాణి కేంద్రం, తదుపరి సంగీత కళాశాల ప్రారంభమైనవి. వీటిలో పని చేసిన నిలయ విద్వాంసులు, అధ్యాపకులలో పలువురు వారి శిష్య, ప్రశిష్యులే. దక్షిణ భారత దేశంలో కన్నడిగులు, తమిళుల సంగీత ప్రతిభే ప్రామాణికంగా చలామణి అవుతున్న ఆ రోజులలో తెలుగువాడి స్వరాన్ని విశ్వవ్యాప్తం చేసిన విశిష్టమూర్తి పారుపల్లివారు. ఆయన జయంతి, గురుపూజ ఉత్సవాలు ఇప్పటికీ వారి శిష్య ప్రశిష్యులు విజయవాడలో ఘనంగా నిర్వహిస్తున్నారు. నేతి శ్రీరామశర్మ హైదరాబాదులో సుమారు రెండు దశాబ్దాలపాటు గురువుగారి ఉత్సవాలు ఘనంగా జరిపించి వర్ధమాన గాయకులందరిచేత పాడించి ప్రోత్సహించేవారు. ఖండాంతర ఖ్యాతి నార్జించిన 'సంగీత కళానిధి' మంగళంపల్లి బాలమురళీకృష్ణ, 'నాదసుధార్ణవ' అన్నవరపు రామస్వామి వంటివారినెందరినో బహుముఖ సంగీత విద్వాంసులుగా తయారుచేసి ఆంధ్ర దేశానికి సమర్పించిన గాయక సార్వభౌములు పారుపల్లివారు. సంగీతజ్ఞానంలో ఆంధ్రదేశాన్ని చైతన్యవంతం చేసిన మహామనీషిగా, యుగకర్తగా ప్రాతఃస్మరణీయులైన పారుపల్లి రామకృష్ణయ్య పంతులు 1951వ సంవత్సరం జూలై 7వ తేదీ తమ గురువులు దక్షిణామూర్తిశాస్త్రి గారి ఆరాధనోత్సవములు జరుపుతున్నవేళ సంగీత సరస్వతి ఒడికి చేరుకున్న ధన్యజీవి.

• యనమండ్ర వెంకటకృష్ణయ్య

(నేడు పారుపల్లి రామకృష్ణయ్య పంతులు జయంతి)

జీవబలం కోల్పోతున్న పుడమితల్లి

సృష్టిలోని సమస్త జీవరాశి మనుగడకు కావాల్సిన ఆహారాన్ని, ఆవాసాన్ని అందించేది నేల తల్లి. జీవన ధాతువుగా నిలవాల్సిన ఆ నేలతల్లే మానవుని స్వార్థపూరిత చర్యల వల్ల వెదజల్లబడుతున్న కాలుష్యం వల్ల తల్లడిల్లుతోంది. అభివృద్ధి పేరుతో మానవుడు చేపడుతున్న అనేక స్వార్థపూరిత చర్యల వల్ల పర్యావరణం గతంలో ఎన్నడూ లేనంత సంక్షోభాన్ని ఎదుర్కొంటుంది. వాతావరణంలోకి నిత్యం పెద్ద ఎత్తున విడుదలవుతున్న కలుషితాల వల్ల ఋతువులు గతి తప్పాయి. సహజవనరులు తమ సహజత్వాన్ని కోల్పోతున్నాయి. కోట్లాది ఎకరాల సాగు భూములు తమ సారాన్ని కోల్పోయి బీడు భూములుగా మారిపోతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా వేలాది ఎకరాల్లో పచ్చిక బయళ్ళ ధ్వంసం కావటం వల్ల కూడా మేత లేక ఏటా లక్షలాది పశువులు మృత్యువాత పడుతున్నాయని, ఆ మూగ జీవాలను రక్షించుకోవాలంటే నేల క్షీణతను అరికట్టి, తిరిగి ఆ హరిత భూములను పునరుద్ధరించటం ఒకటే మార్గమని పర్యావరణవేత్తలు హితవు పలుకుతున్నారు. దానిలో భాగంగా ఈ సంవత్సరం ప్రపంచ నేల దినోత్సవాన్ని 'నేలల సంరక్షణ : మెజర్, మానిటర్ అండ్ మేనేజ్' అనే థీమ్‌తో జరుపుకోవాలని ప్రపంచ ఆరోగ్య, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఎఒ) ప్రపంచ దేశాలను కోరింది.



భూమిని పుడమితల్లిగా పూజించే భారత్ వంటి దేశాలలో కూడా నేల క్షీణత, ఎడారీకరణ అత్యంత వేగవంతంగా సాగుతున్నాయి. వాతావరణ మార్పులు, మానవ ప్రేరిత చర్యల వల్ల భారతదేశంలో 32 శాతం నేల క్షీణతకు గురవుతుండగా, 25 శాతం భూమి ఎడారిగా మారిపోతుందని భారత కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. భారతదేశంలో 2015 నుండి 2019 వరకూ అంటే నాలుగు సంవత్సరాల కాలంలో సుమారు 30.51 మిలియన్ హెక్టార్ల భూమి క్షీణతకు గురై బీడుబారిపోయిందని యునైటెడ్ నేషన్స్ కన్వెన్షన్ టు కంబాట్ డిసర్టిఫికేషన్ (యుఎన్‌సిసిడి) అనే సంస్థ తన నివేదికలో అంచనా వేసింది. ఈ నివేదిక ప్రకారం 2019 నాటికే దేశ భూభాగంలో సుమారు 9.45శాతం భూమి క్షీణతకు గురయ్యింది. 2023లో యుఎన్‌సిసిడి విడుదల చేసిన తాజా నివేదికలో భారతదేశ జనాభాలో దాదాపు 18.39 శాతం మంది ప్రజలు భూక్షీణత, ఎడారీకరణ వల్ల అనేక తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంది. అహ్మదాబాద్‌లోని ఇస్రో స్పేస్ అప్లికేషన్ సెంటర్ 2021లో విడుదల చేసిన డిసర్టిఫికేషన్ అండ్ ల్యాండ్ డిగ్రెడేషన్ అట్లాస్ ఆఫ్ ఇండియా ప్రకారం దేశంలో సుమారు 96.40 మిలియన్ హెక్టార్లు భూమి అంటే దేశ భౌగోళిక విస్తీర్ణంలో 29.32 శాతం భూమి క్షీణతకు గురయ్యిందని స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా 9రాష్ట్రాలలో భూమి క్షీణత అధికంగా కనిపిస్తుందని, రాజస్థాన్, మహారాష్ట్ర, గుజరాత్, జమ్మూ అండ్ కాశ్మీర్, కర్ణాటక, జార్ఖండ్, ఒడిశా, మధ్యప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో 23.95 శాతం భూమి క్షీణతకు గురవుతుందని ఈ నివేదిక స్పష్టం చేసింది. జార్ఖండ్, రాజస్థాన్, ఢిల్లీ, గుజరాత్, గోవా వంటి రాష్ట్రాలలో విస్తీర్ణంలో 50శాతం కన్నా ఎక్కువ భూమి ఎడారీకరణకు గురవుతుంటే, కేరళ, అస్సాం, మిజోరం, హర్యానా, బీహార్, ఉత్తరప్రదేశ్, పంజాబ్, అరుణాచల్ ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో కేవలం 10 శాతం కన్నా తక్కువ విస్తీర్ణంలో భూములు ఎడారీకరణకు గురవుతున్నాయని ఈ నివేదిక తెలియచేసింది.

భారతదేశంలో ఎడారీకరణకు, నేల క్షీణతకు హరిత విప్లవం పేరుతో అనుసరించిన విధానాలు కూడా ఒక ప్రధాన కారణమే. తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ దిగుబడి సాధించాలన్న లక్ష్యంతో ప్రారంభమైన హరిత విప్లవం నేడు నేలను నిర్జీవంగా మార్చే ప్రక్రియకు ప్రధాన కారణమవుతుంది. విచ్చలవిడిగా రసాయినిక ఎరువుల వినియోగం, యాంత్రిక వ్యవసాయీకరణ, ఏకరూపక వ్యవసాయ సంస్కృతి మన దేశానికి హరిత విప్లవం అందించిన విధానాలు. ఇవే ఇప్పుడు నేలతల్లి పాలిట శాపాలుగా మారుతున్నాయి. దేశవ్యాప్తంగా హరిత విప్లవ కాలంలో అనుసరించిన వ్యవసాయిక విధానాల వల్ల నేల నిర్మాణం పూర్తిగా మారిపోయింది. దీంతో పాటు అభివృద్ధి పేరుతో పెద్దయెత్తున సాగుతున్న అటవీ విధ్వంసం, అడ్డు అదుపూ లేకుండా సాగుతున్న పట్టణీకరణ వంటి అంశాలు పరిస్థితిని మరింత విషమం చేస్తున్నాయి. ఎనర్జీ అండ్ రిసోర్సెస్ ఇనిస్టిట్యూట్ (టెరీ) అంచనా ప్రకారం నేల క్షీణత వల్ల భారతదేశం ఏటా 48.8 బిలియన్ డాలర్ల మేరకు ఆర్థికంగా నష్టపోతుందని స్పష్టం చేసింది. భారతదేశం కూడా భూమి క్షీణతను తగ్గించడానికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తుందని 2015లో పారీస్‌లో జరిగిన ఐక్యరాజ్యసమితి ఫ్రేమ్ వర్క్ కన్వెన్షన్ ఆన్ క్లైమెట్ ఛేంజ్ కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్ సదస్సులో ప్రకటించింది. 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా 26 మిలియన్ హెక్టార్ల నేలని తిరిగి పునరుద్ధరించే లక్ష్యంతో కాప్ పార్టీస్ చేపట్టిన బాన్ ఛాలెంజ్‌లో భారతదేశం భాగస్వామిగా చేరింది. అయితే దేశంలో వేగంగా విస్తరిస్తున్న ఎడారీకరణ, భూక్షీణతను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి ఒక స్పష్టమైన విధానం ఇప్పటికీ లేకపోవటం విచారకరం.

○ కె. శశిధర్

(నేడు ప్రపంచ మృత్తికా దినోత్సవం)

కులగణనతో దేశానికి హాని ఏమిటి?

'ఈ విభజనలతో దేశం ఏమయ్యేట్టు?' శీర్షికన కె.అరవిందరావు 23 నవంబర్ 2024న రాసిన వ్యాసానికి ప్రతిస్పందన ఇది. అరవిందరావు పదవీ విరమణ తర్వాత దైవకార్యంలో భాగంగా సామాజిక పరిణామాల మీద వార్తా పత్రికల్లో స్పందిస్తూ ఉంటారు. ఈ వ్యాసంలో ఆయన దళిత బహుజన, మత మైనార్టీ వర్గాల్లో వస్తూన్న చైతన్యం మీద తన అక్కసును వెళ్ళకక్కే ప్రయత్నం చేశారు. ఈ వర్గాల్లో వస్తూన్న చైతన్యాన్ని ఇలానే సాగనిస్తే దేశ విభజన, హిందూమత విధ్వంసానికి దారితీస్తుందని హెచ్చరించారు.

అరవిందరావు ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలోను, దేశంలోను జరుగుతున్న కులగణనను, మత మైనార్టీల పట్ల పార్టీల, ప్రభుత్వాల సాఫ్ట్ కార్నర్‌ను వ్యతిరేకిస్తూ ఆ వ్యాసాన్ని వ్రాసారు. ఆయన అభిప్రాయాల ప్రకారం కులగణన సమాజంలో కుల తత్వాన్ని ప్రేరేపిస్తుంది. కులగణనతో కులతత్వం వికృత రూపం తీసుకుంటుందని చెప్పారు. ఇది ఒక అగ్రకుల తత్వంతో కూడిన వాదన. భారతీయ సమాజం కుల పునాదుల మీద నిర్మించబడి ఉంది. ఇందులో కొత్తగా చెప్పేది ఏమిలేదు. కులగణన వల్లనో, కులం గురించి మాట్లాడటం వల్లనో కులతత్వం పెరగదు. నా కులానికి అన్యాయం జరిగిందనటం కులతత్వం ఎట్లా ఐతది? అసలు కులతత్వం అంటే ఏమిటి? క్రింది కులాలను అవమానించి, అణగదొక్కి, దోపిడీ చేసే అగ్రకుల మనస్తత్వాన్ని కులతత్వంగా చెప్పుకోవచ్చు. ఈ దేశంలో దోపిడీ కులసంబంధాల ద్వారానే జరుగుతున్నది. ఆర్థిక సంబంధాల ద్వారా కాదు అనే విషయాన్ని అర్థం చేసుకోవాలి.

ఈ దేశ ప్రజాస్వామ్యం, ఆర్థిక అభివృద్ధి అగ్రకుల ఆధిపత్యం భూమికగా నిర్మించబడ్డాయి. ఈ రోజు దళిత బహుజన వర్గాలు అగ్రకుల ఆధిపత్యాన్ని ప్రశ్నిస్తున్నాయి. దీన్నే అగ్రకులాలు కులతత్వంగా చిత్రిస్తున్నాయి. మరి అగ్రకులాలు కులాల వారి మ్యారేజీ బ్యూరోలు పెట్టుకోవటాన్ని, కులాలవారి జాబ్ మేళాలు నిర్వహించటాన్ని, చెప్పుకుంటూ పోతే ఇలా చాలానే ఉన్నాయి. మరి వీటిని ఏమనాలి? దీన్ని కులతత్వం అనరా? ఇది కదా దేశ ఐక్యతకు భంగం.

అరవిందరావు తన వ్యాసంలో కులం, హిందూ మతానికి సంబంధించి కొన్ని చారిత్రక, పురాణ విషయాల్ని ప్రస్తావించారు. అవి చాల అవగాహనారాహిత్యంగా ఉన్నాయి. మొదటిది– హిందూ మతానికి కులంకు సంబంధం లేదనటం. హిందు శాస్త్రాల్లో కేవలం నాలుగు వర్ణాలే చెప్పబడ్డాయి, తరువాత వృత్తుల ఆధారంగా అనేక కులాలు పుట్టుకువచ్చాయి, యూరోపియన్ సమాజంలోను ఈ తరహా పరిణామాలు చూడవచ్చని చెప్పారు. ఈ వాదనను అగ్రకులాలు జాతీయ ఉద్యమ కాలం నుండి చెప్పుకుంటూ వస్తున్నాయి. వారికి అర్థం అయ్యి అర్థం కాని విషయం ఏమంటే వర్ణవ్యవస్థ అనేది ఒక భావజాలం (Ideology) ఈ భావజాలం కులవ్యవస్థ మొత్తానికి పునాది.

వాస్తవానికి వేదకాలంలో మూడు వర్ణాలే ఉండేవి. తరువాత ఈ వర్ణాలు కూడ కులాలుగా మారిపోయినాయి. యూరప్‌లో ఏర్పడిన వృత్తి ఆధారిత సమూహాలకు ఇండియా కులవ్యవస్థకు జమీన్ అస్మన్‌కు ఉన్నంత ఫరక్ వుంది. అక్కడి వృత్తి సమూహాల మధ్య నిచ్చనమెట్ల వ్యవస్థ లేదు, వైషమ్యాలు లేవు, అవమానాల్లేవు, అన్నింటికీ మించి అంటరానితనం లేదు. మన కుల వ్యవస్థ ప్రత్యేక లక్షణం ఏమంటే అగ్రకులాలవారు దోపిడిదారులుగా గర్వపడుతారు. ఈ భావజాలం ఏ సమాజంలో లేదు. ఒక్క మన దేశంలోనే వుంది.

వైదిక మతస్థులు గొప్పగా చెప్పుకునే మరో విషయం ఏమంటే తమ మతం ఇతర మతాల్లా విదేశాల మీద దండెత్తలేదని, ఇతర మతస్థులను తమ మతంలోకి మార్చలేదని. ఇది వాస్తవమే. అయితే వైదిక మతం ఇతర దేశాలకు ఎందుకు విస్తరించలేదన్న ప్రశ్న ఎప్పుడైనా వేసుకున్నారా? ఈ దేశంలో పుట్టిన జైన, బౌద్ధ మతాలు ఇతర దేశాలకు ఎలా విస్తరించాయి? అంటే ఈ మతాలు సార్వజనీన మానవ విలువల మీద ఏర్పడ్డాయి కాబట్టి. వైదిక మతం సహజ ప్రకృతి ధర్మంకు వ్యతిరేకం. వైదిక మతానికి కులం మూలం. పరదేశీయులు ఈ మతంలోకి మారాలంటే (Convert) అతనికి కులం ఉండాలి. సప్తమునుల్లో ఎవరో ఒకరితో జన్మ వంశం / గోత్రం సంబంధం కలిగి ఉండాలి. ఈ కారణంగానే వైదిక మతం ఇతర దేశాలకు విస్తరించలేదు.



భారత్‌ను ముస్లింలు 550 సంవత్సరాలు పాలించారు. అయినా ఈ దేశాన్ని ఇస్లామిక్ దేశంగా మార్చలేకపోయారు. ఇప్పుడు రోజువారి జీవితమే కష్టంగా గడుపుతున్న ఆ మైనార్టీ వర్గం ఎలా ఈ దేశాన్ని ఇస్లామిక్ రాజ్యంగా మార్చగలదు?

అరవిందరావు చేసే మరో ఆరోపణ ఏమంటే బ్రిటిష్ వారి వల్లనే ఈ దేశంలో ప్రజలు కులాలుగా, మతాలుగా, విడిపోయారని. అసలు విషయం ఏమంటే ఈ రోజు మాట్లాడుకుంటున్న హిందూ మతం బ్రిటిష్‌వారు చేపట్టిన జనగణన (Census) నుండి పుట్టింది. అరబిక్ రచయిత అల్ బైరుని మొదటగ 'హిందూ' పదాన్ని భౌగోళిక అర్థం స్ఫురించేట్లు వాడినారు. తరువాత కాలంలో ఈ దేశ భాష సంస్కృతులను పరంగా వాడుకలో వచ్చింది. బ్రిటిష్ పాలకులు జనాభా గణన చేసినపుడు ముస్లిం, క్రిస్టియనేతరులను హిందువులుగా గుర్తించటం జరిగింది. దానితో దేశంలోని అనేక స్థానిక మత ఆచారాలు, దేవుళ్ళు హిందూ మతం క్రిందికి తీసుకురావటం జరిగింది. 19వ శతాబ్ది వైదిక సాంస్కృతిక ఉద్యమం దానికి తోడైంది. అయితే వైదిక మతం భావజాలం హిందూమత భావజాలంగా చలామణీలోకి వచ్చింది.

వాస్తవానికి వైదికమతంకు ప్రాంతీయ దేవుళ్ళు, దేవతలకు ఎటువంటి సంబంధం లేదు. ఇక్కడి కొమురవెల్లి మల్లన్నకు, వీరభద్రుడికి, ఎల్లమ్మ, మైసమ్మలకు, గోండుల నాగోబాకు, లంబాడీల మెరామ్మకు, చెంచు మల్లయ్య (శ్రీశైలం)కు వైదిక మతంకు ఏ సంబంధం లేదు. వీరంతా దళిత బహుజనుల పక్షాన పోరాటం చేసి వీరమరణం చెందినవారు. ప్రజలు వారిని అనాదిగా పూజించుకుంటూ వస్తున్నారు.

ముస్లింల సాధికారత గురించి ప్రభుత్వాలు, పార్టీలు మాట్లాడటం పట్ల అరవిందరావు అసహనం ప్రకటించారు. ప్రధానంగా రెండు ఆరోపణలు చేశారు. ఒకటి ముస్లింల వల్లనే ఇండియా రెండుగా విడిపోయిందని; రెండవది ముస్లింల పట్లా ఉదారవాదం చూయిస్తే ఈ దేశం ఏదో ఒక రోజున ఇస్లామిక్ దేశంగా మారిపోతుందని. ఈ రెండు ఆరోపణలు అవగాహనా రాహిత్యంతో చేసినవే. జాతీయ ఉద్యమంలో భాగంగా వచ్చిన హిందూ ఫాసిజమె దేశ విభజనకు కారణమని ఈ మధ్య కాలంలో వచ్చిన పరిశోధనలు వివరిస్తున్నాయి. హిందూ ఫాసిజం బెంగాల్ విభజనతో మొదలై 1920 నాటికి వికృత రూపం తీసుకుంది. ఈ పరిస్థితిలో ముస్లింలోని ఒక వర్గం హిందూ ఆధిపత్య ఇండియాలో మనుగడ సాగించలేమన్న భావానికి వచ్చింది. చివరి వరకు వారు ముస్లింలు అధిక సంఖ్యలో ఉన్న ప్రాంతాలకు ప్రత్యేక ప్రతిపత్తిని కోరుకున్నారు. కానీ, హిందూ నాయకులు ముస్లింలకు స్వయంప్రతిపత్తి ఇవ్వటం కంటే దేశ విభజనే మంచిదని భావించారు. మరి దేశ విభజనకు ఎవరు కారణం? హిందువులా? ముస్లింలా?

ముస్లింలను ఒక బూచిగ చూయించి, హిందువుల్లో ఒక భయాన్ని సృష్టించి వారిని ఓటు బ్యాంకుగా మార్చుకునే విధానాన్ని బీజేపీ, దాని మాతృసంస్థలు మొదటి నుండి చేస్తున్నాయి. వాస్తవంగా ముస్లింల భయం సృష్టితోనే హిందూయిజం నిర్మాణం జరుగుతుంది. అదే ప్రయత్నాన్ని అరవిందరావు తన వ్యాసంలో చేశారు. ఒక్క విషయం ఏమంటే ఈ దేశాన్ని ముస్లింలు 550 సంవత్సరాలు పాలించారు. అయినా ఈ దేశాన్ని ఇస్లామిక్ దేశంగా మార్చలేకపోయారు. ఇప్పుడు రోజువారి జీవితమే కష్టంగా గడుపుతున్న ఆ మైనార్టీ వర్గం ఎలా ఈ దేశాన్ని ఇస్లామిక్ దేశంగా మార్చగలదు? అసలు ముస్లింలు ఎవరు? ఈ దేశ దళిత, బహుజన బిడ్డలు కాదా? బైటినుండి వచ్చినవారు మహా అయితే ఓ 10శాతం ఉండవచ్చు. కాని 90శాతం ఇక్కడి బిడ్డలేకదా. మరి వారి సాధికారత గురించి పట్టించుకోవాల్సిన బాధ్యత అన్ని పార్టీలకు, ప్రభుత్వాలకు ఉండకూడదా!?

◆ ప్రొ. భంగ్యా భూక్యా
యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్

ఎల్లుండి మెగా పీటీఎం

- 1.2కోట్ల మందితో 44,303 పాఠశాలల్లో నిర్వహణ
- పిల్లల చదువుల్లో తల్లిదండ్రులకూ భాగస్వామ్యం
- బాపట్ల మున్సిపల్ పాఠశాలలో సమావేశానికి హాజరుకానున్న సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్
- పాఠశాల విద్య కార్యదర్శి కోన శశిధర్ వెల్లడి



పేరెంట్స్ మీటింగ్ వివరాలు వెల్లడిస్తున్న పాఠశాల విద్యా కార్యదర్శి కోన శశిధర్, ఆ శాఖ ఉన్నతాధికారులు విజయ రామరాజు, శ్రీనివాసరావు

అమరావతి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): దేశంలో ఎక్కడా జరగని విధంగా రాష్ట్రంలో మెగా పేరెంట్, టీచర్స్ సమావేశాలు(పీటీఎం) ఒకేరోజున పండుగ వాతావరణంలో నిర్వహిస్తున్నట్లు పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ తెలిపారు. ఈ నెల 7న రాష్ట్రవ్యాప్తంగా 44,303 ప్రభుత్వ పాఠశాలల్లో జరిగే ఈ సమావేశాల్లో విద్యార్థులు, తల్లిదండ్రులు, టీచర్లు కలిపి 12 కోట్ల మంది పాల్గొంటున్నారని వివరించారు. బుధవారం సచివాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా ఈ సమావేశాలు నిర్వహిస్తున్నామని, పాఠశాలల్లో ఎలాంటి రాజకీయ బ్యానర్లు కట్టొద్దని ఆదేశించామని చెప్పారు. ఆహ్వానాలు కూడా వినూత్నంగా ఉండాలనే ఉద్దేశంతో విద్యార్థులతోనే డిజైన్లు చేయించి తల్లిదండ్రులను ఆహ్వానించినట్లు తెలిపారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, పూర్వ విద్యార్థులు కూడా పాల్గొంటారని చెప్పారు. బాపట్ల మున్సిపల్ పాఠశాలలో జరిగే పీటీఎంలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ పాల్గొంటారని, రాష్ట్రవ్యాప్తంగా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు ఎవరి ప్రాంతంలో వారు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. చదువు, ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థుల ఆసక్తి, వారి సామర్థ్యాలపై హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు రూపొందించామని, ప్రతి విద్యార్థి తల్లిదండ్రులతో టీచర్లు వ్యక్తిగతంగా వాటిపై చర్చిస్తారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలకు తొలిసారిగా స్టార్ రేటింగ్ ఇవ్వబోతున్నట్లు శశిధర్ తెలిపారు. మౌలిక సదుపాయాలకు 5, అకడమిక్ ఫలితాలకు 5 చొప్పున స్టార్లు నిర్దేశించామని, పాఠశాలల్లో పరిస్థితుల ఆధారంగా స్టార్లు కేటాయిస్తారని వివరించారు. రాబోయే ఐదేళ్లలో అన్ని పాఠశాలలు ఫైవ్ స్టార్ రేటింగ్ సాధించాలనేది లక్ష్యమని చెప్పారు. మధ్యాహ్న భోజనంలో ప్రస్తుతం రాష్ట్రమంతా ఒకే మెనూ ఉందని, సంక్రాంతి నుంచి జోన్‌కొక కొత్త మెనూ అమల్లోకి వస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను ఉత్తమంగా తీర్చిదిద్దడమే ఈ సమావేశాల ఉద్దేశమన్నారు. ఈ సమావేశంలో పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు, సమగ్రశిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



బొట్టుపెట్టి.. ఆహ్వానం అందించి..!

రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల ఏడో తేదీన ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్, టీచర్ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా తల్లిదండ్రులను ఉపాధ్యాయులు స్వయంగా ఆహ్వానిస్తున్నారు. అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం వెలంకాయలపాలెంలో ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయులు బుధవారం విద్యార్థులతో కలిసి ఇళ్లకువెళ్లి బొట్టు పెట్టి మరీ తల్లిదండ్రులకు ఆహ్వాన లేఖలు అందించారు. రాజకీయాలకు అతీతంగా అందరూ తప్పక హాజరు కావాలని కోరారు.

- రోలుగుంట, ఆంధ్రజ్యోతి

నిద్ర నుంచి మృత్యు ఒడికి..

- అనంతలో మట్టి మిద్దె కూలి ముగ్గురి మృతి
- మృతుల్లో దంపతులు, కూతురు
- శ్రీసత్యసాయిలో షెడ్ కూలి మరో ఇద్దరు దుర్మరణం



గంగన్న



శ్రీదేవి



సంధ్య



కూలిపోయిన మట్టి మిద్దె ముందు భాగం

కుందుర్పి/చిలమత్తూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లాలో పాత మిద్దె, నిర్మాణ దశలో ఉన్న షెడ్ కూలడంతో ఐదుగురు మృతిచెందారు. అనంతపురం జిల్లా కుందుర్పి మండలంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు, శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలంలో ఓ రైతు, కూలీ ప్రాణాలు కోల్పోయారు. కుందుర్పి మండలం రుద్రంపల్లి గ్రామంలో మట్టిమిద్దె వరండా కూలిపోవడంతో గ్రామానికి చెందిన కురుబ గంగన్న(48), ఆయన భార్య శ్రీదేవి (40), కూతురు సంధ్య(15) మృతి చెందారు. కుటుంబ సభ్యులు మంగళవారం రాత్రి భోజనం చేసి, కబుర్లు చెప్పుకున్నారు. పది గంటల తరువాత వరండాలో తమ కూతురితో కలిసి దంపతులిద్దరూ నిద్రకు ఉపక్రమించారు. లోపలి గదిలో (వంట గది) గంగన్న తల్లి ముత్యాలమ్మ నిద్రించారు. ఆమె బుధవారం ఉదయం నిద్రలేచి, తలుపులు తీసేసరికి వరండా మొత్తం కూలిపోయి కనిపించింది. ఆమె కేకలు వేయడంతో ఇరుగుపొరుగువారు వచ్చి శిథిలాలను తొలగించారు. అయితే, అప్పటికే ముగ్గురూ మృతిచెందారు. తుఫానుతో నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో మట్టిమిద్దె తడిసి కూలిపోయింది. శిథిలాల కింద కూరుకుపోయి ఊపిరాడక ముగ్గురూ మృతిచెందారు.

కొత్త ఇంటికి దరఖాస్తు చేసి..

మట్టి మిద్దె పాతబడటంతో పక్కా ఇంటికోసం గంగన్న దరఖాస్తు చేయాలని భావించాడు. గ్రామంలోని టీడీపీ నాయకులకు మంగళవారం రాత్రి తమ కుటుంబ సభ్యుల ఆధార్ కార్డు, ఫొటోలు ఇచ్చి వచ్చాడు. తనకు కొత్త ఇల్లు మంజూరు చేయించాలని వారికి విన్నవించాడు. కానీ తెల్లవారేలోగా ఘోరం జరిగిందని టీడీపీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్న కాస్త పొలంలో వ్యవసాయం చేసుకుంటూ, కూలి పనులకు వెళుతూ కష్టపడి బతికేవారని అన్నారు.

మిగిలింది అవ్వ.. మనవడు..

గంగన్న, శ్రీదేవి దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు. పెద్ద కూతురు మల్లీశ్వరికి ఇటీవలే వివాహం జరిపించారు. చిన్నకూతురు సంధ్య ఎనుములదొడ్డి ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయింది. కుమారుడు ఈశ్వర్ పదో తరగతి తరువాత చదువు మానేసి తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉంటూ కూలి పనులకు వెళ్తున్నాడు. టమాటా బాక్సులను మోసే పనిపై మంగళవారం రాత్రి అనంతపురం మార్కెట్‌కు వెళ్లాడు. ప్రమాదం గురించి తెలుసుకుని గ్రామానికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యాడు. ఆ ఇంట్లో అవ్వ, మనవడు మాత్రమే మిగిలారు.

నారా లోకేశ్ దిగ్భ్రాంతి

మిద్దె కూలి ముగ్గురు మృతి చెందిన విషయాన్ని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మంత్రి నారా లోకేశ్‌కు ఫోన్లో వివరించగా ఆయన దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తక్షణ సాయం కింద బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే రూ.50 వేలు అందజేశారు. ఈశ్వర్‌కు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని టీడీపీ నాయకులు తెలిపారు.

శ్రీసత్యసాయి జిల్లాలో ఇద్దరు..

శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలం శెట్టిపల్లిలో బుధవారం వ్యవసాయ పనిముట్లను భద్రపరిచేందుకు నిర్మిస్తున్న షెడ్ కూలడంతో రైతు శివారెడ్డి (65), కూలీ లక్ష్మీనారాయణరెడ్డి(50) మృతి చెందారు. తీవ్రంగా గాయపడ్డ శివారెడ్డి కుమారుడు రాజశేఖర్ రెడ్డిని హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

- జనవరి 8 వరకు నిర్వహణ.. భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం
- రెవెన్యూ శాఖ స్పెషల్ సీఎస్ సిసోడియా వెల్లడి
- జిల్లా కలెక్టర్లతో మంత్రి అనగాని వీడియో కాన్ఫరెన్స్

అమరావతి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో భూ సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం నుంచి జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియా తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి ఈ సదస్సులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. ప్రజలు భూ సమస్యలతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని, వారికి న్యాయం చేసేందుకే రాష్ట్రంలోని అన్ని రెవెన్యూ గ్రామాల్లో ఈ సదస్సులు నిర్వహిస్తామని ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. అధికారుల బృందం ప్రతీ రెవెన్యూ గ్రామాన్ని సందర్శించి ఫ్రీహోల్డ్, 22(ఏ)సంబంధిత సమస్యలున్న వారి నుంచి ముందస్తుగా వినతులు స్వీకరిస్తారు. ప్రతి ఫిర్యాదుని ఆర్టీజీఎస్‌లో పొందుపరుస్తారు. రెవెన్యూ సదస్సులకు జిల్లా స్థాయిలో జాయింట్ కలెక్టర్ సమన్వయకర్తగా వ్యవహరిస్తారు. సదస్సులపై జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు విస్తృత ప్రచారం కల్పిస్తారు.

యంత్రాంగం సిద్ధంగా ఉండాలి: మంత్రి అనగాని

రెవెన్యూ సదస్సుల నిర్వహణపై కలెక్టర్లను సన్నద్ధం చేసేందుకు బుధవారం జిల్లాల కలెక్టర్లతో రెవెన్యూశాఖ మంగళగిరిలోని సీసీఎల్ఏ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించింది. ఈ కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, స్పెషల్ సీఎస్ ఆర్.పి.సిసోడియా, సీసీఎల్ఏ జి.జయలక్ష్మి, అదనపు సీసీఎల్ఏ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. రెవెన్యూ సదస్సుల నిర్వహణ షెడ్యూల్‌ను నేటి కల్లా సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. భూ సమస్యల పరిష్కారం కోసం అధికార యంత్రాంగం అంతా సిద్ధంగా ఉండాలని కోరాం. జగన్ హయాంలో ఇచ్చిన ఇంటి స్థలాలపై అనేక ఫిర్యాదులున్నాయని, వాటి లెక్క పక్కాగా తేలుస్తామన్నారు. 'ఏ గ్రామంలో ఎంత మందికి ఇంటి పట్టాలు మంజూరు చేశారు? వారిలో అర్హులు, అనర్హుల లెక్కతీయాలి. రెవెన్యూ సదస్సుల్లో ఈవివరాలను ప్రకటిస్తున్నాం. గత ప్రభుత్వం అనర్హులైన వైసీపీ కార్యకర్తలకు ఇంటి పట్టాలను కట్టబెట్టినట్లు తెలుస్తోంది. ఈ కుంభకోణంపై సమగ్ర వివరాలు గ్రామ సదస్సుల్లో వెల్లడించేలా నివేదికలు సిద్ధం చేయాలి" అని కలెక్టర్లకు మంత్రి దిశానిర్దేశం చేశారు.

వర్రా రవీంద్రా రెడ్డికి రిమాండ్

- పీటీ వారెంట్‌పై పొన్నూరు కోర్టుకు

పొన్నూరుటౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రముఖులపై సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టి, దూషణలకు పాల్పడిన కేసులో వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త వర్రా రవీంద్రారెడ్డికి గుంటూరు జిల్లా పొన్నూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బుధవారం రిమాండ్ విధించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత తదితరులను కించపరుస్తూ ఫేస్‌బుక్‌లో రవీంద్రారెడ్డి పోస్టులు పెట్టారంటూ పొన్నూరుకు చెందిన టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు తోటకూర నరేష్‌బాబు నవంబరు 5న అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే మంత్రి నారా లోకేశ్, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ, చంద్రబాబు సతీమణి భువనేశ్వరిలపై కూడా అసభ్యకర పదజాలంతో పోస్టులు పెట్టారని, తమ మనోభావాలు దెబ్బతిన్నాయంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు రవీంద్రారెడ్డిని పీటీ వారెంట్‌పై గుంటూరు జిల్లా జైలు నుంచి పొన్నూరు కోర్టుకు తీసుకువచ్చారు. మేజిస్ట్రేట్ అంజని ప్రియదర్శిని కేసును విచారించి రవీంద్రారెడ్డికి 14 రోజులు రిమాండ్ విధించారు. పోలీసులు ఆయన్ను జిల్లా జైలుకు తరలించారు. సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టిన మరో కేసులో ప్రస్తుతం రవీంద్రారెడ్డి జైలులో ఉన్నాడు.

కుటుంబ బంధాల్లో స్మార్ట్‌ఫోన్ల చిచ్చు

- ఫోన్ల వల్ల వ్యక్తిగత సంబంధాల్లో ప్రతికూల ప్రభావాలు..అయినా ఫోన్లను వదల్లేని దుస్థితి
- మొబైల్ కంపెనీ 'వివో' చేయించిన అధ్యయనంలో వెల్లడి




న్యూఢిల్లీ, డిసెంబరు 4: అన్నం తినేటప్పుడు.. బండి మీద వెళ్లేటప్పుడు.. శుభాకార్యాలకు హాజరైనప్పుడు.. ఆఖరికి ఎవరైనా చనిపోతే చూడడానికి వెళ్లినప్పుడు కూడా.. అరచేత ఫోన్ ఉండాల్సిందే! ఆ ఫోన్ చూడాల్సిందే!! బండి మీద వెళ్లేటప్పుడైతే.. కర్ణాభరణాల్లాగా చెవిలో ఇయర్‌ఫోన్స్ పెట్టుకుని పాటలో, యూట్యూబ్ ఆడియోలో వినడం! మాటలు రాని పసిపిల్లలు సైతం.. అన్నం తినాలంటే వారి చేతిలో స్మార్ట్‌ఫోన్ అనే లంచం పడాల్సిందే!! ఇలా స్మార్ట్ ఫోన్లకు పూర్తిగా బానిసలైపోవడంతో.. తల్లిదండ్రులు, పిల్లల మధ్య బంధాలపై తీవ్ర దుష్ప్రభావం పడుతోందని తాజా అధ్యయనంలో వెల్లడైంది. ఫోన్లే తమ మధ్య సంబంధాల్లో ప్రతికూల మార్పులకు కారణమవుతున్న విషయాన్ని అటు తల్లిదండ్రులు (66 శాతం మంది), ఇటు పిల్లలు (56 శాతం మంది) గుర్తిస్తున్నా.. ఎవ్వరూ ఫోన్ వినియోగాన్ని నియంత్రించుకోవడానికి ఇష్టపడట్లేదని తేలింది. చైనీస్ మొబైల్ కంపెనీ వివో.. 'సైబర్ మీడియా రిసెర్చ్' అనే సంస్థతో 'వివో స్విచాఫ్ 2024' పేరిట ఈ అధ్యయనం చేయించింది. తల్లిదండ్రులు రోజుకు సగటున 5 గంటలపాటు.. పిల్లలు నాలుగు గంటలసేపు స్మార్ట్ ఫోన్లలో సామాజిక మాధ్యమాల వినియోగానికి, వినోద వీడియోల వీక్షణకు అంకితమవుతున్నట్టు అందులో వెల్లడైంది. ఇలా ఎక్కువసేపు స్మార్ట్‌ఫోన్లను వినియోగించడం వల్ల వ్యక్తిగత సంబంధాలు దెబ్బతింటున్నాయని అధ్యయన నివేదికలో పేర్కొన్నారు. ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, అహ్మదాబాద్, పుణె నగరాల్లో 1543 మందితో నిర్వహించిన ఈ అధ్యయన నివేదిక ప్రకారం..

- ఫోన్ల అధిక వినియోగం తమ మధ్య ఘర్షణలకు కారణమవుతోందని ఈ సర్వేలో పాల్గొన్నవారిలో 73% తల్లిదండ్రులు, 69 శాతం మంది పిల్లలు అంగీకరించారు.
- ఫోన్ లేకుండా బతకలేమని 76% మంది తల్లిదండ్రులు, 71 శాతం మంది పిల్లలు స్పష్టం చేశారు.
- ఫోన్‌లో అత్యధిక సమయం సోషల్ మీడియా పోస్టులు, వినోదాన్ని కలిగించే కార్యకలాపాలకే వెచ్చిస్తున్నామని.. స్మార్ట్‌ఫోన్లకు తాము బానిసలయ్యామని.. 64 శాతం మంది పిల్లలు చెప్పారు.
- తమ స్నేహితులు గనక సోషల్ మీడియా యాప్స్‌లో లేకపోతే.. వాటిని తాము ఉపయోగించబోమని మూడింట రెండొంతుల మంది పిల్లలు చెప్పారు. 90% మందికి పైగా పిల్లలు అసలు ఈ సోషల్ మీడియా యాప్స్ లేకపోతే బాగుండని అభిప్రాయపడ్డారు.

లోకం తీరు



ఏఐ రాగాల రోబో వయొలినిస్ట్!



'అందుగలదిందు లేదని సందేహము వలదు.. కృత్రిమ మేధ ఎందెందు వెదకి చూచిన అందందే కలదు' ..అనడానికి అక్షరాలా నిదర్శనమీ రోబోటిక్ వయొలెనిస్ట్! ఈ చిత్రంలో చేతిలో వయొలిన్‌తో కనిపిస్తున్న వ్యక్తి.. రాఘవసింహన్ శంకర్‌నారాయణన్. ఆయన పక్కన కనిపిస్తున్నది.. ఏఐ సాయంతో సంప్రదాయ కర్ణాటక సంగీతాన్ని అద్భుతంగా పలికించే రోబోటిక్ వయొలినిస్ట్. దాని పేరు హతానీ. తమిళనాడుకు చెందిన రాఘవ సింహన్ నాలుగో ఏట నుంచే చదువుతోపాటు వయొలిన్ వాయించడంలోనూ శిక్షణ పొందారు. చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఆయన.. వాయులీన విద్వాంసుడిగానూ పేరొందారు. 200కు పైగా మ్యూజిక్ ఆల్బమ్‌లకు వయొలిన్ సహకారం అందించారు. ప్రపంచవ్యాప్తంగా 2000కు పైగా కచేరీలు ఇచ్చారు! అమెరికాలోని జార్జియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (జార్జియా టెక్)లో మెషీన్ లెర్నింగ్ అండ్ రోబోటిక్స్‌లో పీహెచ్‌డీ చేసిన రాఘవ సింహన్.. అక్కడే ఆరేళ్లపాటు శ్రమించి ఈ రోబోటిక్ వయొలినిస్ట్‌ను, సింథసైజర్‌ను అభివృద్ధి చేశారు.

అధికార పంపిణీ ఒప్పందం వాస్తవమే: డీకే

- అలాంటిదేమీ లేదన్న సిద్ధరామయ్య..కర్ణాటకలో కలకలం

బెంగళూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కర్ణాటక కాంగ్రెస్‌లో అధికార పంపిణీ ఒప్పందం బహిర్గతమైంది. శాసన సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం అనంతరం సిద్దరామయ్య, డీకే శివకుమార్ మధ్య సీఎం కుర్చీ కోసం పోటీ ఏర్పడటం, సిద్దరామయ్యకు అవకాశం దక్కిన విషయం తెలిసిందే. ఆ సమయంలో అధికార పంపిణీ ఒప్పందం జరిగిన విషయం వాస్తవమేనని, ఆ వివరాలను బహిర్గతం చేయలేనని చెప్పారు. అయితే అధిష్ఠానం పెద్దలను బ్లాక్‌మెయిల్ చేయనని శివకుమార్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు.ఈ వ్యాఖ్యలను సిద్దరామయ్య తిప్పికొట్టారు. ఒప్పందాలు జరగలేదని బుధవారం చెప్పారు.

మగవారికి నెలసరి వస్తే తెలిసేది

- మహిళా జడ్జిల తొలగింపుపై సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ, డిసెంబరు 4: ఓ మహిళా న్యాయమూర్తికి గర్భస్రావం అయిన పరిస్థితిని కనీసం పరిగణనలోకి తీసుకోకుండా మధ్యప్రదేశ్ హైకోర్టు ఆమెను విధుల నుంచి తొలగించడాన్ని సుప్రీంకోర్టు తప్పుబట్టింది. మహిళా జడ్జి అనుభవించిన మానసిక క్షోభను సదరు కోర్టు విస్మరించిందని పేర్కొంది. ఆరోగ్య పరిస్థితులను పరిగణలోకి తీసుకోకుండా పనితీరు ఆధారంగా తీర్పు ఇవ్వడాన్ని తప్పుపట్టింది. 2023 జూన్‌లో మధ్యప్రదేశ్ హైకోర్టు ఆరుగురు మహిళా న్యాయమూర్తులను విధుల నుంచి తొలగిస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. కేసుల పరిష్కారంలో ఆశించిన స్థాయిలో వారి పని తీరు లేదని చర్యలకు పూనుకుంది. అనంతరం నలుగురిని తిరిగి విధుల్లోకి తీసుకుంది. ఇద్దర్ని మాత్రం నిరాకరించింది. ఈ వ్యవహారాన్ని సుప్రీం కోర్టు సుమోటోగా స్వీకరించి విచారణ చేపట్టింది. బుధవారం వాదనల సందర్భంగా.. "సదరు మహిళా జడ్జికి గర్భవిచ్ఛిత్తి జరిగింది. అలాగే ఆమె సోదరుడు కాన్సర్‌తో మృతిచెందాడు. అయినా మధ్యప్రదేశ్ హైకోర్టు వినిపించుకోలేదు. పురుషులకూ నెలసరి వస్తే వారి బాధ తెలుస్తుంది" అని జస్టిస్ బీవీ నాగరత్న, ఎన్‌కే సింగ్‌తో కూడిన బెంచ్ ఆగ్రహం వ్యక్తం చేసింది.

నిర్లక్ష్య వైద్యానికి 61 లక్షల జరిమానా వేసిన 'ఫోరం'

నెల్లూరు (హరనాథపురం)/తడ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యంగా శస్త్ర చికిత్స చేసి బాధితుడి కంటిచూపు కోల్పోవడానికి కారణమైన నెల్లూరులోని ఒక ప్రముఖ వైద్యశాల యాజమాన్యానికి రూ.61.62 లక్షల జరిమానా విధిస్తూ ఉమ్మడి నెల్లూరు జిల్లా వినియోగదారుల కోర్టు న్యాయమూర్తి జింకా రెడ్డి శేఖర్ బుధవారం తీర్పు ఇచ్చారు. తిరుపతి జిల్లా సూళ్లూరుపేటకు చెందిన చేవూరు సురేశ్‌బాబు పంచాయతీ కార్యదర్శి. 2017, మే నెలలో కంటి వైద్యం కోసం నెల్లూరులోని ఓ ప్రముఖ ఆస్పత్రికి వచ్చారు. సైనసైటిస్ శస్త్ర చికిత్స చేసుకోవాలని డాక్టర్ సూచించగా.. అదే నెల 11న సెప్టో, మినీ ఫంక్షనల్ ఎండోస్కోపిక్ సైనస్ సర్జరీ (ఎఫ్ఈఎస్ఎస్) శస్త్ర చికిత్స చేయించుకున్నారు. అయితే.. 12న ఎడమ కంటి చూపు కోల్పోయాడు. తలకు సంబంధించిన పలు సమస్యలు తలెత్తాయి. తర్వాత చెన్నైలోని అపోలో, బ్రెయిన్ అండ్ స్పైన్ ఆస్పత్రుల్లో శస్త్రచికిత్స చేసుకున్నాడు. తనకు జరిగిన అన్యాయంపై బాధితుడు వినియోగదారుల కోర్టును ఆశ్రయించారు. ఆధారాలను పరిశీలించిన న్యాయాధికారి రెడ్డి శేఖర్ ఆ వైద్యశాల వైద్యుల నిర్లక్ష్యం వల్లే బాధితుడు పూర్తిగా కంటి చూపు కోల్పోయారని నిర్ధారించారు. బాధితుడు శస్త్రచికిత్సలు, మందులు, ఇతర ఖర్చులకు రూ.21,62,752 చెల్లించినట్లు బిల్లులు సమర్పించారు. దీంతో ఖర్చుతోపాటు శారీరక, మానసిక వేదనకు గాను బాధితుడికి రూ.40 లక్షలు, మొత్తం రూ.61,62,752 పరిహారం చెల్లించాలని ఆ వైద్యశాల యాజమాన్యాన్ని ఆదేశిస్తూ తీర్పు ఇచ్చారు.

పీఎస్‌ఎల్వీ-సీ59 ప్రయోగం నేటికి వాయిదా

సూళ్లూరుపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని షార్ నుంచి నిర్వహించాల్సిన పీఎస్ఎల్వీ-సీ59 రాకెట్ ప్రయోగం వాయిదా పడింది. ప్రయోగానికి గంట ముందు ప్రోబా-3 ఉపగ్రహంలో సాంకేతిక సమస్య తలెత్తినట్లు విదేశీ శాస్త్రవేత్తలు గుర్తించారు. దీంతో దీన్ని గురువారం సాయంత్రం 4:12 గంటలకు రీ షెడ్యూల్ చేసినట్టు ఇస్రో ప్రకటించింది.

రఘురామ వైద్య నివేదికపై విచారణ

- గుంటూరు జీజీహెచ్ సిబ్బందిని ప్రశ్నించిన ప్రకాశం ఎస్పీ దామోదర్

ఒంగోలు క్రైం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): నర్సాపురం మాజీ ఎంపీ, ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు సీఐడీ కస్టోడియల్ హింస కేసు విచారణ ముమ్మరంగా సాగుతోంది. గుంటూరు జీజీహెచ్‌లో వైద్య నివేదికకు సంబంధించి అసలు ఏమి జరిగిందనే కోణంలో బుధవారం కేసు విచారణాధికారి, ప్రకాశం ఎస్పీ ఏఆర్‌దామోదర్ విచారణ చేపట్టారు. తనపై సీఐడీ పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించారని, అందుకు సంబంధించి జీజీహెచ్‌లో ఇచ్చిన నివేదిక మార్పు చేశారని తన ఫిర్యాదులో రఘురామ పేర్కొన్నారు. దీంతో అప్పట్లో సీఐడీలో పని చేసిన ముగ్గురు సిబ్బందిని మంగళవారం విచారించారు. బుధవారం జీజీహెచ్‌లో పనిచేస్తున్న ఆర్ఎంవో సతీశ్ కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ రాజేంద్ర, ఈసీజీ టెక్నీషియన్ నాగరాజులను ప్రకాశం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ విచారించారు. సాయంత్రం 6 గంటల వరకు విచారణ చేసిన అనంతరం స్టేట్‌మెంట్ రికార్డు చేసుకుని పంపించారు.

నాటక అకాడమీ చైర్మన్‌గా గుమ్మడి గోపాలకృష్ణ



బాధ్యతలు స్వీకరిస్తున్న గుమ్మడి గోపాలకృష్ణ, చిత్రంలో మంత్రి కందుల దుర్గేశ్

విజయవాడ కల్చరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ చైర్మన్‌గా గుమ్మడి గోపాలకృష్ణ పదవీ బాధ్యతలు స్వీకరించారు. బుధవారం విజయవాడ ఘంటసాల ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో నిర్వహించిన ఘంటసాల జయంతి కార్యక్రమానికి పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ ముఖ్య అతిథిగా హాజరై ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు.

ఫడణవీసే సీఎం!

మహారాష్ట్ర బీజేపీ శాసనసభాపక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నిక

- నేడు ప్రమాణ స్వీకారం
- ముగ్గురం కలిసి పని చేస్తాం: ఫడణవీస్

ముంబై, డిసెంబరు 4: అందరూ ఊహించినట్లుగానే దేవేంద్ర ఫడణవీస్ మహారాష్ట్ర బీజేపీ శాసనసభాపక్ష నేతగా బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటూ గవర్నర్ నుంచి ఆయనకు పిలుపు వచ్చింది. ఏక్‌నాథ్‌షిండే, అజిత్‌పవార్‌తో కలిసి ఫడణవీస్ గవర్నర్‌ను కలిశారు. అనంతరం, ముగ్గురు నేతలు మీడియాతో మాట్లాడారు. గురువారం సాయంత్రం ముంబైలోని ఆజాద్ మైదాన్‌లో తనతోపాటు ఇద్దరు డిప్యూటీ సీఎంలు ప్రమాణం చేస్తారని ఫడణవీస్ తెలిపారు. మంత్రులు ఎంతమంది ప్రమాణం చేస్తారన్నదానిపై ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. 'ముఖ్యమంత్రి పదవి అనేది ఒక సాంకేతిక ఏర్పాటు మాత్రమే. మేం ముగ్గురం కలిసికట్టుగా పని చేస్తాం. మా బాధ్యత మరింత పెరిగింది. ప్రజల అంచనాలను అందుకోవటానికి కష్టపడతాం' అని స్పష్టం చేశారు. ఒక సాధారణ పార్టీ కార్యకర్తగా పని చేసిన తనకు మూడుసార్లు సీఎంగా అవకాశం ఇచ్చిన ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలుపుతున్నానని ఫడణవీస్ పేర్కొన్నారు. 'ఏక్ హై తో సేఫ్ హై.. మోదీ హై తో ముంకిన్ హై' (కలిసి ఉంటేనే సురక్షితంగా ఉంటాం.. మోదీతో ఏదైనా సాధ్యమే) అని చెప్పారు. షిండేను మంగళవారం కలిశానని, ప్రభుత్వంలో చేరాల్సిందిగా ఆహ్వానించానని ఫడణవీస్ వెల్లడించారు. దీనిపై మీ స్పందన ఏమిటని షిండేను విలేకర్లు ప్రశ్నించగా.. సాయంత్రం వరకు వేచి చూడండి అంటూ ఆయన బదులివ్వటం గమనార్హం. షిండే అలా చెబుతుండగానే.. పక్కనే ఉన్న అజిత్ పవార్ జోక్యం చేసుకుంటూ.. ఆయన కూడా డిప్యూటీ సీఎంగా ప్రమాణం చేస్తారని చెప్పారు. దీంతో అక్కడున్న అందరూ గొల్లుమని నవ్వారు. అజిత్ మాటకు షిండే ప్రతిస్పందిస్తూ.. 'దాదాకు (అజిత్ పవార్‌కు) ఉదయం మేగాక సాయంత్రం కూడా ప్రమాణం చేసిన అనుభవం ఉంది' అని వ్యాఖ్యానించటంతో మరోసారి నవ్వులు విరిశాయి. 2019లో ఎన్సీపీ చీలికవర్గంతో బీజేపీ ప్రభుత్వంలో కలిసిన అజిత్ పవార్.. వేకువజామునే డిప్యూటీ సీఎంగా ప్రమాణం చేశారు. షిండే ఆ సంగతినే పరోక్షంగా ప్రస్తావించారు. తన రెండున్నరేళ్ల పాలనతో సంతృప్తిగా ఉన్నానని, ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన భారీ గెలుపుతో తమ బాధ్యత మరింత పెరిగిందని, ఒక బృందంగా కలిసి పని చేస్తామని షిండే పేర్కొన్నారు. రెండున్నరేళ్ల క్రితం సీఎంగా తన పేరును ఫడణవీస్ ప్రతిపాదించారని, ఈసారి ఆయన పేరును తాము ప్రతిపాదించామన్నారు. కాగా, డిప్యూటీ సీఎం పదవిని చేపట్టటానికి ఏక్‌నాథ్ షిండే అంగీకరించినట్లుగా సంబంధితవర్గాలు బుధవారం రాత్రి వెల్లడించాయి. అంతకు ముందు, ముంబైలోని విధాన్ భవన్‌లో బీజేపీ శాసనసభాపక్ష సమావేశం జరిగింది. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపానీ కేంద్ర పరిశీలకులుగా హాజరయ్యారు. ఫడణవీస్‌ను శాసనసభాపక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీఎంగా ఫడణవీస్ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఆజాద్ మైదాన్‌లో జరపటానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రధాని మోదీ, కేంద్రమంత్రులు, బీజేపీ, ఎన్డీఏ పాలిత రాష్ట్రాల సీఎంలు హాజరుకానున్నట్లు సమాచారం.



ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని గవర్నర్ రాధాకృష్ణనన్‌కు వినతి పత్రాన్ని సమర్పిస్తున్న అజిత్ పవార్, దేవేంద్ర ఫడణవీస్, ఏక్‌నాథ్ శిందే

'సరిత పుత్ర దేవేంద్ర ఫడణవీస్'

మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయబోతున్న ఫడణవీస్ తన తల్లి సరితా ఫడణవీస్‌కు ప్రత్యేక కానుక ఇచ్చారు. ఆయన పేరులో తన తల్లి సరిత పేరును జోడిస్తూ 'దేవేంద్ర సరిత గంగాధర్ రావు ఫడణవీస్'గా మార్చుకున్నారు. మహారాష్ట్రీయులు సాధారణంగా వారి పేర్లకు మధ్యలో తండ్రి పేరును జోడిస్తుంటారు. ఇప్పటి వరకు దేవేంద్ర ఫడణవీస్ పేరు మధ్యలో ఆయన తండ్రి గంగాధర్ రావు పేరు మాత్రమే ఉండేది. తాజాగా ఆయన తల్లి పేరును కూడా జోడించుకున్నారు. ప్రమాణ స్వీకారోత్సవ అధికారిక ఆహ్వాన పత్రికలోనూ 'దేవేంద్ర సరిత గంగాధర్ రావు ఫడణవీస్'గా ముద్రించారు. కాగా, తన కుమారుడి పట్ల ఎంతో గర్వంగా ఉందని సరితా ఫడణవీస్ అన్నారు. మోదీ కూడా తన కొడుకే సీఎం కావాలని కోరుకున్నారని చెప్పారు. శాతవాహన రాజు గౌతమి పుత్ర శాతకర్ణి తన పేరుకు ముందు తల్లి గౌతమి పేరును జోడించుకుని ఈ సంప్రదాయానికి నాంది పలికారు.

'పుష్ప 2' షో.. తొక్కిసలాట.. హైదరాబాద్‌లో మహిళ మృతి

చిక్కడపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): హీరో అల్లు అర్జున్ నటించిన 'పుష్ప 2' సినిమా ప్రీమియర్ షో సందర్భంగా ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో రేవతి అనే మహిళ (39) మృతి చెందింది. తీవ్రంగా గాయపడ్డ ఆమె కుమారుడి పరిస్థితి విషమంగా ఉంది. గురువారం రాత్రి 9.30 గంటల ప్రీమియర్ షో చూసేందుకు హీరో అల్లు అర్జున్ సంధ్య థియటర్ వద్దకు వచ్చారు. అప్పటికే అక్కడ పెద్ద సంఖ్యలో ఉన్న అభిమానులు ఆయన్ను చూసేందుకు ఎగబడ్డారు. అల్లు అర్జున్ థియేటర్‌లోకి వెళ్లాక.. అభిమానులను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీచార్జ్ చేశారు. అప్పుడు జరిగిన తోపులాటలో మహిళ, బాలుడు సహా ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఆస్పత్రిలో మహిళ మృతి చెందింది.

దక్షిణ కొరియాలో సైనిక పాలన.. ఉపసంహరణ

సియోల్, డిసెంబరు 4: దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ దేశంలో సైనిక పాలనను ప్రకటించి.. తీవ్ర ప్రతిఘటన ఎదురవడంతో ఆరు గంటల్లోనే ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నారు. ప్రతిపక్షాల ఆధిపత్యం కొనసాగుతున్న పార్లమెంటులో తన అజెండా అమలుకు అడ్డంకులు ఎదురవుతుండటంతో దేశంలో అత్యవసర పరిస్థితిని విధిస్తున్నట్టు మంగళవారం రాత్రి యూన్ ప్రకటించారు. అధ్యక్షుడి నిర్ణయాన్ని ప్రతిపక్షాలతోపాటు, హక్కుల సంఘాలు, కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. అధ్యక్షుడికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు బుధవారం అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టాయి. యూన్ తక్షణమే గద్దె దిగాలని ప్రతిపక్ష డెమొక్రటిక్ పార్టీ డిమాండ్ చేసింది. అభిశంసన తీర్మానంపై శుక్రవారం ఓటింగ్ జరిపే అవకాశం ఉందని తెలిపింది. ఈ నేపథ్యంలో సైనిక పాలనను ఉపసంహరిస్తూ బుధవారం తెల్లవారుజామున కేబినెట్ నిర్ణయం తీసుకుంది.



నన్నెలా అడ్డుకుంటారు?

సంభాల్ వెళ్లనీయకపోవంపై రాహుల్ ఆగ్రహం

లఖ్‌నవూ, డిసెంబరు 4: ప్రతిపక్ష నాయకుడిగా తన హక్కులను మోదీ సర్కారు కాలరాసిందని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ ఆక్షేపించారు. మత ఉద్రిక్తతలు నెలకొన్న ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్ జిల్లాకు వెళ్లేందుకు తన సోదరి ప్రియాంకతో కలిసి ఆయన చేసిన ప్రయత్నాన్ని పోలీసులు వమ్ముచేశారు. ఢిల్లీ - యూపీ సరిహద్దుల్లోని ఘజియాబాద్ వద్ద వారిని అడ్డుకుని వెనక్కి పంపించివేశారు. బుధవారం ఉదయం 11 గంటలకు రాహుల్ తన కాన్వాయ్‌తో ఘజియాబాద్ వరకు చేరుకున్నారు. అప్పటికే అక్కడ పెద్దఎత్తున మోహరించిన పోలీసులు జాతీయ రహదారిని బారికేడ్‌లతో మూసివేశారు. రాహుల్ తన వాహనంలోంచి దిగి సీనియర్ పోలీసు అధికారులతో మాట్లాడినా.. ప్రయోజనం లేకపోయింది. దీంతో తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. తన పర్యటనను పోలీసులు అడ్డుకోవడం తన రాజ్యాంగ హక్కులను హరించడమేనని రాహుల్ ఆక్షేపించారు. "సంభాల్‌కు వెళ్లకుండా పోలీసులు నన్ను అడ్డుకున్నారు. కార్యకర్తలు వెంట లేకుండా ఒక్కడినే అక్కడకు వెళ్లడానికి కూడా సిద్ధంగా ఉన్నానని చెప్పాను. అయినా, పోలీసులు అంగీకరించలేదు. ఒక విపక్ష నేతగా సంభాల్‌లో పర్యటించడం నా విధి.. రాజ్యాంగ హక్కు. ఆ హక్కును పోలీసులు హరించారు. నా పర్యటనను చూసి ఎందుకు బీజేపీ భయపడుతోంది" అని రాహుల్ విమర్శించారు.

సుఖ్‌బీర్‌పై హత్యాయత్నం

- మాజీ ఉగ్రవాది తుపాకీ కాల్పులు
- పంజాబ్ మాజీ డిప్యూటీ సీఎంకు త్రుటిలో తప్పిన పెను ప్రమాదం
- స్వర్ణ దేవాలయం వద్ద ఘటన



అమృత్‌సర్, డిసెంబరు 4: సిక్కు మత పెద్దలు విధించిన 'కాపలాదారు' శిక్షను అనుభవిస్తున్న పంజాబ్ మాజీ ఉప ముఖ్యమంత్రి, శిరోమణి అకాలీదళ్ నేత సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌పై హత్యాయత్నం జరిగింది. మాజీ ఉగ్రవాది ఒకరు అత్యంత సమీపం నుంచి సుఖ్‌బీర్‌ను తుపాకీతో కాల్చి చంపేందుకు ప్రయత్నించారు. అయితే, బాదల్ అనుచరులు సహా సాధారణ దుస్తుల్లో ఉన్న పోలీసులు అతనిని అడ్డుకుని పక్కకు తోసేయడంతో సుఖ్‌బీర్ ప్రాణాలతో బయటపడ్డారు. బుధవారం ఉదయం 9.30 గంటల సమయంలో జరిగిన ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. అధికారంలో ఉన్న సమయంలో సుఖ్‌బీర్ చేసిన తప్పులకుగాను మత పెద్దలు ఆయనకు శిక్ష విధించిన విషయం తెలిసిందే. మంగళవారం నుంచి ఆయన అమృత్‌సర్‌లోని ప్రఖ్యాత స్వర్ణదేవాలయం వద్ద వీల్ చైర్‌లో కూర్చుని కాపలాదారుగా శిక్షను అనుభవిస్తున్నారు. బుధవారం యధావిధిగా కాపలాదారుగా కూర్చున్న సుఖ్‌బీర్ వద్దకు ఓ వ్యక్తి నెమ్మదిగా నడుచుకుంటూ వచ్చే ప్రయత్నం చేశారు. అయితే.. ఆయనను దగ్గరకు రావద్దంటూ సుఖ్‌బీర్ అనుచరులు చెప్పారు. కానీ, అప్పటికే సమీపానికి చేరుకున్న ఆ వ్యక్తి ఒక్క ఉదుటన తన జేబులో నుంచి తుపాకీని బయటకు తీశారు. ఈ విషయాన్ని గమనించిన మఫ్టీ పోలీసులు ఒక్క ఉదుటన ఆ వ్యక్తిని పక్కకు నెట్టేశారు. ఈ క్రమంలోనే ఆ వ్యక్తి తుపాకీని పేల్చారు. అయితే.. తుపాకీ గుండు బాదల్‌కు వెనుకగా దూసుకుపోయి.. స్వర్ణ దేవాలయం గోడను తాకింది. దీంతో సుఖ్‌బీర్‌కు ప్రాణాపాయం తప్పింది. ఆ వెంటనే మరింత మంది భద్రతా దళాలతో పాటు శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీ టాస్క్ ఫోర్స్ సభ్యులు హుటాహుటిన అక్కడకు చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కాల్పులకు తెగబడిన వ్యక్తిని నారాయణ్ సింగ్ చౌరాగా పోలీసులు గుర్తించారు. ఇతను మాజీ ఉగ్రవాది అని పేర్కొన్నారు. ఈ ఘటనపై అమృత్‌సర్ పోలీసు కమిషనర్ గురుప్రీత్ సింగ్ భుల్లార్ మాట్లాడుతూ.. పోలీసు అధికారి రాష్పాల్ సింగ్.. చౌరాను ముందుగానే గుర్తించారని తెలిపారు. చౌరా తన జేబులో నుంచి తుపాకీ తీస్తున్న విషయాన్ని గ్రహించిన అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ జస్బీర్ సింగ్.. ఒక్క ఉదుటన చౌరా రెండు చేతులను బలంగా పైకి మడిచి తుపాకీ గుండు గాలిలోకి ఎగిసేలా చేశారని.. జస్బీర్ సమయస్ఫూర్తిగా వ్యవహరించారని కమిషనర్ తెలిపారు. మాజీ ఉగ్రవాది నారాయణ్ సింగ్‌ను అరెస్టు చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్టు చెప్పారు. తుపాకీని కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు. స్వర్ణదేవాలయం భద్రతకు వచ్చిన ముప్పులేదని, భారీ భద్రత ఉందని చెప్పారు. అయితే, మతపరమైన విశ్వాసాల నేపథ్యంలో భక్తులను తనిఖీ చేసే అవకాశం లేదన్నారు. అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ జస్బీర్ సింగ్.. చూపిన ధైర్య సాహసాలకు సర్వత్రా ప్రశంసలు కురుస్తున్నాయని తెలిపారు. హత్యాయత్నం ఘటనపై సీఎం భగవంత్ మాన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

గుట్కా మాఫియాపై విజిలెన్స్ దాడులు

అమరావతి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వానికి రూ.వందల కోట్ల పన్నుల ఎగవేత, అంతకుమించి సెస్ ఎగ్గొట్టేందుకు బిల్లులు రీ సైక్లింగ్ చేస్తున్న వైనంపై ఫిర్యాదులు అందాయి. దీంతో గుట్టు చప్పుడు కాకుండా ప్రభుత్వం విజిలెన్స్‌ను రంగంలోకి దింపింది. జగన్ హయాంలో చెలరేగిపోయిన గుట్కా మాఫియా రాయలసీమ నుంచి విజయవాడ వరకు గుట్కా ఉత్పత్తులను కర్ణాటక నుంచి తెచ్చుకుని విక్రయిస్తోంది. ఎక్కువగా ఒక ట్రిప్పులో వాహనానికి 60 బ్యాగులు లోడు చేయించి తీసుకొస్తారు. దాని విలువ రూ.5,19,312 కాగా జీఎస్టీ రూ.1,45,407 చెల్లించాలి. దీంతోపాటు సెస్ రూ.10,48,320 కలిపి మొత్తం రూ.17,14,752 అవుతుంది. దీనికి తగినట్టు గుట్కా డీలర్లు, రిటైలర్లు, సరఫరా చేసేవారు, కిరాణా వ్యాపారులు వారి వారి స్థాయిలో లాభాన్ని వేసుకుని గుట్కా విక్రయాలు చేస్తారు. వైసీపీ ప్రభుత్వంలో గుట్కా మాఫియా మరో కొత్త మార్గాన్ని అన్వేషించింది. అసలు సరుకు రూ.5.19 లక్షలు కాగా జీఎస్టీ, సెస్ అన్నీ కలిపి రూ.17.15 లక్షల వరకు చెల్లించడం సరికాదని భావించింది. ఎస్టీ ఎగ్గొట్టేందుకు నకిలీ వే బిల్లులు, నకిలీ జీఎస్టీ నెంబర్లు తీసుకుని ఎక్కడికక్కడ వ్యవస్థల్ని మేనేజ్ చేసింది. రాష్ట్రంలో ప్రతి జిల్లాకు ఐదారుగురు ప్రధాన డీలర్లు మాఫియాగా ఏర్పడి ప్రభుత్వానికి రావాల్సిన సెస్ ఎగ్గొడుతున్నారు. గుట్కా మాఫియాపై ప్రభుత్వానికి ఫిర్యాదులు అందడంతో విజిలెన్స్ రంగంలోకి దిగింది. నెల్లూరు, చిత్తూరు, గుంటూరు జిల్లాలపై అధికారులు నిఘా పెట్టారు. నెల్లూరులో కీలక డీలరు గోడౌన్‌లో బుధవారం సోదాలు నిర్వహించి పలు అక్రమాలు గుర్తించారు. వెంటనే వ్యాపారులు.. అధికారులపై ఒత్తిళ్లు తెచ్చే యత్నం చేశారు. పలు జిల్లాల్లో గుట్కా గోడౌన్లు మూసేశారు. వ్యాపారాలు బంద్ చేశారు. కీలక అధికారులకు ఫోన్లు చేయించారు. అయినప్పటికీ అధికారులు వెనక్కి తగ్గకుండా మాఫియా పని పడతామని తేల్చి చెప్పారు. దీంతో హవాలా రూపంలో రూ.వందల కోట్లు తీసుకుంటున్న మహారాష్ట్ర బడా వ్యాపారిని మాఫియా రంగంలోకి దింపే ప్రయత్నాలు చేస్తోంది.


జగన్‌పై ఏసీబీకి ఫిర్యాదు చేస్తాం

- విద్యుత్తు ఒప్పందాన్ని రద్దు చేయాలి: షర్మిల

అమరావతి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అవినీతి వ్యవహారాలపై పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మరోసారి ధ్వజమెత్తారు. అదానీ నుంచి ఆయన తీసుకున్న ముడుపుల వ్యవహారంపై అవినీతి నిరోధక శాఖకు ఫిర్యాదు చేస్తామని వెల్లడించారు. అదానీతో డీల్ రద్దు చేయడానికి సీఎం చంద్రబాబు ఎందుకు వెనకడుగు వేస్తున్నారని ప్రశ్నించారు. 'అదానీ'తో జగన్ సర్కారు చేసుకున్న విద్యుత్ ఒప్పందాన్ని వెంటనే రద్దు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదానీతో ఒప్పందాన్ని రద్దు చేయాలని సీఈఆర్‌సీకి లేఖ రాశారు. విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో బుధవారం షర్మిల విలేకరులతో మాట్లాడారు. "జగన్ రూ.1,750 కోట్లు ముడుపులు తీసుకున్నారు. ఈ అంశంపై అమెరికా కోర్టులో కేసు నమోదైంది. ఇంత జరిగినా కూటమి ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? అదానీ పేరును చంద్రబాబు ఎత్తడమే లేదు. తన పేరెక్కడుందని ప్రశ్నిస్తున్న జగన్‌కు.. అప్పటి సీఎం తానేనని తెలియదా? రాష్ట్రానికి 25 ఏళ్ల పాటు అదానీ పవర్ భారమే. పక్క రాష్ట్రాల్లో యూనిట్ రూ. 1.99కు అమ్ముతుంటే.. ఏపీలో 50 పైసలు ఎక్కువగా రూ. 2.49కు ఎందుకు కొన్నారు? జగన్ అధికారంలోనికి వచ్చిన వెంటనే చంద్రబాబు చేసిన ఒప్పందాలను రద్దు చేశారు. లాంగ్ టర్మ్ ఒప్పందాలు ఉండకూడదని ప్రతిపక్షంలో ఉండగా చెప్పిన జగన్.. అధికారంలోనికి వచ్చాక సెకీతో 25 ఏళ్లకు ఒప్పందాలు ఎలా చేసుకున్నారు? మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ నన్ను గుర్తించాల్సిన అవసరం లేదు. పచ్చ కామెర్లు వచ్చిన వాడిలా బొత్స తీరు ఉంది. నేను వ్యక్తిగత అంశాలు మాట్లాడితే జగన్ ఇంట్లో నుంచి అడుగు బయటకు పెట్టలేడు. జగన్ నిర్లక్ష్యాన్ని, అవినీతిని మాత్రమే నేను ప్రశ్నించాను. అదానీ నుంచి ముడుపుల సంగతి అడిగితే, వివేకా హత్య గురించి మాట్లాడితే, గంగవరం పోర్టును ఎందుకమ్మేశారని ప్రశ్నిస్తే పర్సనల్ అవుతుందా? జగన్ ప్రజల్లో విశ్వసనీయత కోల్పోయారు. తప్పు చేశారు కాబట్టే భయపడుతున్నారు. కూటమి అధికారం చేపట్టి ఆరు నెలలు అయింది. సూపర్ సిక్స్ ఎక్కడ" అని షర్మిల ప్రశ్నించారు.

సంజయ్ అరెస్ట్ తప్పదా?

అమరావతి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సీఐడీ మాజీ ఏడీజీ సంజయ్‌పై ఏసీబీ కేసు నమోదు చేయబోతోంది. అవినీతి నిరోధక చట్టం(పీసీ యాక్టు) కింద ఎఫ్ఐఆర్ నమోదుకు రంగం సిద్ధమైనట్లు తెలిసింది. దీంతో సంజయ్ అరెస్ట్ తప్పదా అనే వ్యాఖ్యలు ఉన్నత స్థాయి పోలీసు వర్గాల్లో వినిపిస్తున్నాయి. సీఐడీ చీఫ్‌గా ఆయన పనిచేసిన సమయంలో దళిత, గిరిజనులకు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టంపై అవగాహన కల్పించేందుకు రాష్ట్రవ్యాప్తంగా సదస్సులు నిర్వహించారు. పారదర్శకంగా ఉన్నట్లు చూపించడానికి టెండర్లు పిలిచి సౌత్రికా, క్రిత్వ్యాప్ టెక్నాలజీస్ బిడ్లను పరిశీలించి ఎల్-1గా వచ్చిన క్రిత్వ్యాప్‌కు టెండరు దక్కినట్లు చూపించారు. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా సదస్సులు నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో సమావేశాలు ఈ సదస్సులు పెట్టారు. కానీ, కల్యాణ మంటపాలు ఇతరత్రా ఫంక్షన్ హాళ్లు తీసుకుని లక్షల్లో అద్దె చెల్లించినట్లు చూపించి ఎస్సీల పేరుతో రూ.59.52లక్షలు, ఎస్టీల పేరుతో రూ.59.51లక్షలు....మొత్తం 1.19కోట్లు ఖర్చు చేసినట్లు బిల్లులు చెల్లించారు. అయితే, క్రిత్వ్యాప్ సంస్థ ఎక్కడా సదస్సులు నిర్వహించలేదని, ఆ ముసుగులో అడ్డగోలుగా దోచుకున్నారంటూ ఈ ఏడాది ఫిబ్రవరిలోనే ఫిర్యాదులు వచ్చినా అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదు. జూన్‌లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణకు ఆదేశించడంతో ఎస్సీ, ఎస్టీల పేరుతో సంజయ్ భారీగా నిధులు మింగేసిన వైనం వెలుగులోకి వచ్చింది. సీఐడీ అధిపతిగా బదిలీ కాకముందు అగ్నిమాపక బాధ్యతలు సంజయ్ చూశారు. ఆ సమయంలో ఎన్‌వోసీల జారీకి సమకూర్చిన టెక్నాలజీలో అవినీతి చేసినట్లు ఆయనపై ఫిర్యాదులు అందాయి. వాటిపైనా విజిలెన్స్ ఆరా తీసింది. ఈ వ్యవహారంలో 59.93లక్షలకు గానూ సగానికి పైగా దుర్వినియోగం అయినట్లు విజిలెన్స్ పసిగట్టింది. ఈ రెండింట్లో సంజయ్ ఎలాంటి అక్రమాలకు పాల్పడ్డారో ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. దీంతో సీనియర్ ఐపీఎస్‌ను సస్పెండ్ చేస్తూ మంగళవారం ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ ఏసీబీకి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది.




భూకంప ప్రభావానికి తిరువూరులో పగుళ్లిచ్చిన ఓ ఇంటి గోడ

భయకంపం

ఉమ్మడి కృష్ణాజిల్లాలో భూ ప్రకంపనలు

- రిక్టర్ స్కేల్‌పై 5.3గా నమోదు
- తిరువూరులో ఇంటి గోడలకు బీటలు
- హనుమాన్ జంక్షన్‌లోనూ కంపించిన భూమి
- సీసీ కెమెరాల్లో స్పష్టంగా తెలిసిన ఆనవాళ్లు
- నగరంలోనూ స్వల్పంగా..
- భయంతో పరుగులు తీసిన ప్రజలు
- సాధారణమేనంటున్న శాస్త్రవేత్తలు
- రెండు, మూడు నెలలో మళ్లీ వచ్చే అవకాశం

విజయవాడ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణాజిల్లాలో బుధవారం ఉదయం కొద్దిసేపు భూప్రకంపనలు సంభవించాయి. ఉదయం 7.20 గంటల సమయంలో కొద్ది సెకన్ల పాటు ఈ పరిస్థితి తలెత్తింది. తెలంగాణలోని ములుగు జిల్లా కేంద్రంగా భూమి కంపించడంతో దాన్ని భూకంప కేంద్రంగా శాస్త్రవేత్తలు వ్యవహరిసున్నారు. భూమి అడుగు భాగం నుంచి 200-300 కిలోమీటర్ల దూరంలో ఈ ప్రకంపనలను గుర్తించారు. ఇది రిక్టర్ స్కేల్‌పై 5.3గా నమోదైంది.

భయాందోళనలో ప్రజలు

జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా దేశాన్ని ఐదు జోన్లుగా విభజించింది. రెండు తెలుగు రాష్ట్రాలు జోన్-2లో ఉన్నాయి. ములుగులో భూమి కంపించిన ప్రభావం ఉమ్మడి కృష్ణాజిల్లాపై పడింది. నందిగామ, జగ్గయ్యపేట, మైలవరంతో పాటు విజయవాడ నగరం, హనుమాన్ జంక్షన్, మచిలీపట్నం, గుడివాడ, జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, నందిగామ, కంచికచర్ల, వీరులపాడు మండలాల్లో ప్రకంపనలు వచ్చాయి. తిరువూరు మండలం రాజుపేటలో ఈ ప్రకంపనలకు ఇంటి గోడకు బీటలు వచ్చాయి. సీసీ కెమెరాల్లో భూప్రకంపనలు స్పష్టంగా కనిపించాయి. కొన్నిచోట్ల ప్రజలు భయంతో పరుగులు తీశారు. గంపలగూడెంలో గోడలపై ఉన్న పాత్రలు కిందపడ్డాయి.

మిగతా 6లో..

అంతా ప్రమాదం కాదు : శాస్త్రవేత్తలు

ఈ ప్రకంపనలతో జిల్లాలోని తీరప్రాంతంలో ప్రజలు భయాందోళన చెందారు. అయితే, కాసేపటికే పరిస్థితి మామూలుగా మారడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రకంపనలకు భయపడాల్సిన అవసరం లేదని కొంతమంది శాస్త్రవేత్తలు చెబుతుండగా, భూకంపాలు వచ్చే రోజులు దగ్గరలో ఉన్నాయని మరికొంతమంది విశ్లేషిస్తున్నారు. జోన్-2లో ఉన్న ప్రాంతాలకు ఎలాంటి ప్రమాదం లేదని భౌతిక శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. రాబోయే రెండు, మూడు నెలల్లో ఇలాంటి పరిస్థితి వస్తుందని వెల్లడిస్తున్నారు. జోన్-2లో భూమి ఎప్పుడూ రిక్టర్ స్కేల్‌పై 6-6.05 దాటి కంపించదని వారు పేర్కొంటున్నారు.

అజిత్‌సింగ్‌నగర్‌లోని పాకిస్థాన్ కాలనీ



పాకిస్థాన్

పేరు మార్చండి బాబోయ్

- నగరంలో పొరుగుదేశం పేరుతో కాలనీ
- ఆధార్, రేషన్, పాన్‌కార్డుల్లోనూ అదే పేరు
- లోన్లు, పాస్‌పోర్ట్ విషయంలో ఇబ్బందులు
- దశాబ్దాలుగా కాలనీవాసుల వెతలు 8లో
- భగీరథ కాలనీగా మార్చాలని వేడుకోలు

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

జనవరి 8 వరకు నిరాటంకంగా..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం నుంచి జిల్లావ్యాప్తంగా సదస్సులు నిర్వహించనున్నారు. జనవరి 8వ తేదీ వరకూ నిరాటంకంగా కొనసాగుతాయి. భూ సంబంధిత సమస్యలకు పరిష్కార వేదికలుగా ఈ సదస్సులు ఉపయోగపడతాయి. భూములను 22ఏ నుంచి తొలగించడానికి, అన్ని అర్హతలున్నా అడంగల్‌లోకి పేర్లు ఎక్కకపోతే సరిచేయడానికి, భూ రికార్డుల్లో తప్పులు ఉంటే సరిచేయించుకోవటానికి, భూములను ఎవరైనా ఆక్రమిస్తే ఫిర్యాదు చేయడానికి, సదరు ఫిర్యాదులపై బాధితులకు ప్రభుత్వం చట్టపరమైన రక్షణ కల్పించడానికి, కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిపిన రీ సర్వే వల్ల నష్టపోయిన వారికి పరిష్కారం చూపడానికి ఈ సదస్సులు దోహదపడతాయి. ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా 320 గ్రామాలు, కృష్ణా జిల్లావ్యాప్తంగా 290 గ్రామాల్లో ఈ సదస్సులు జరుగుతాయి. రెవెన్యూ గ్రామాల ప్రాతిపదికన ఎక్కడెక్కడ, ఎప్పుడెప్పుడు రెవెన్యూ సదస్సులు నిర్వహించాలన్న దానిపై షెడ్యూల్‌ను రూపొందించి గ్రామ సచివాలయాలకు తెలియపరుస్తారు. ఎన్టీఆర్ జిల్లాలో విజయవాడ నగరంతో పాటు నందిగామ, జగ్గయ్యపేట, ఇబ్రహీంపట్నం, తిరువూరులో సదస్సులు జరుగుతాయి. కాగా, శుక్రవారం జగ్గయ్యపేట మండలం తక్కెళ్లపాడులో నిర్వహించే సదస్సులో సీసీఎల్ఏ పాల్గొంటారు. అలాగే, జిల్లాలో జరిగే కొన్ని రెవెన్యూ సదస్సుల్లో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ కూడా పాల్గొంటారు. స్థానిక ఎమ్మెల్యే, ఇతర ప్రజాప్రతినిధులు కూడా పాల్గొంటారు.

కొండపల్లి బొమ్మకు పునర్వైభవం

- కళా సుస్థిరతకు ప్రభుత్వపరంగా పూర్తి మద్దతు
- తెల్ల పొణికి కొరత లేకుండా జాయింట్ కమిటీ : కలెక్టర్

6

ఖాతారాక్

కరెంట్ ఖాతాలే టార్గెట్‌గా నేరాలు

సైబర్ నేరగాళ్ల నయా మోసం

● అతడు ఓ సాధారణ వ్యక్తి. రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబం అతనిది. అటువంటి వ్యక్తికి ప్రైవేట్ బ్యాంకులో కరెంట్ ఖాతా ఉంది. దాని పరిమితి రూ.కోటి. ఈ ఖాతా అతని పేరు మీద ఉన్నప్పటికీ లావాదేవీలు మాత్రం ఆయనకు తెలియకుండా జరుగుతున్నాయి. ఓ సైబర్ క్రైం కేసులో సైబర్ కాప్స్ ఒక్కో డొంకను కదుపుతుండగా తేలిన విషయమిది.

సైబర్ నేరగాళ్లు ఎంచుకున్న కొత్త మార్గం ఇది. పరిచయం లేని ఓ వ్యక్తికి డబ్బు ఆశ చూపించి, బ్యాంకుల్లో కరెంట్ ఖాతాలు ఓపెన్ చేయించి, కాజేసిన సొమ్మును ఆ ఖాతాలకు మళ్లిస్తున్నారు. పోలీసుల వరకు వెళ్లాక సదరు ఖాతాను ఖాళీ చేస్తున్నారు. కరెంట్ అకౌంట్ల ముసుగులో జరుగుతున్న ఈ సైబర్ నేరాల గుట్టును పోలీసులు తెలుసుకున్నారు.

- కమీషన్లు ఇచ్చి బయటి వ్యక్తుల పేరిట కొత్త ఖాతాలు
- నేరాల్లో దోచిన సొమ్మంతా ఆ ఖాతాలకే మళ్లింపు
- వివిధ కేసుల దర్యాప్తుల్లో గుర్తించిన పోలీసులు
- కేవైసీ లేకుండా ఖాతాలు ఇచ్చేస్తున్న బ్యాంకర్లు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : సైబర్ నేరగాళ్లు బ్యాంకుల కరెంటు ఖాతాలను విచ్చలవిడిగా ఉపయోగిస్తున్నారు. వివిధ కేసుల్లో దర్యాప్తు చేస్తున్న క్రమంలో బాధితులు జమ చేసిన డబ్బులన్నీ కరెంటు ఖాతాలోనే జమ అవుతున్నట్టు సైబర్ క్రైం పోలీసులు గుర్తించారు. ఈ తరహా కరెంట్ ఖాతాలు ప్రైవేట్ బ్యాంకుల్లో అధికంగా ఉండటంతో పోలీసులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

కరెంట్ ఖాతాలే టార్గెట్

బ్యాంకు నిబంధనల ప్రకారం కరెంట్ ఖాతాలు తెరవడానికి కొన్ని నియమాలు ఉంటాయి. ఈ తరహా ఖాతాలను ఎక్కువగా వ్యాపార లావాదేవీలకు వినియోగిస్తారు. ఎవరైనా ఒక వ్యక్తి బ్యాంకుకు వెళ్లి కరెంట్ ఖాతా కావాలని అడిగినప్పుడు అధికారులు పూర్తి వివరాలు తెలుసుకోవాలి. ఏ అవసరాల కోసం ఖాతా తెరవాలనుకుంటున్నారో తెలుసుకోవాలి. నిజంగా ఆ వ్యక్తికి వ్యాపార సంస్థ ఉందో లేదో పరిశీలించాలి. కానీ, ఇవేమీ లేకుండానే ప్రైవేట్ బ్యాంకులు కరెంట్ ఖాతాలు ఇచ్చేస్తున్నాయి. ఇదే సైబర్ నేరగాళ్లకు పెద్ద అవకాశంగా మారింది. ఎలాంటి కేవైసీ లేకుండా ఈ ఖాతాలు తెరుస్తుండటంతో సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు.

అన్ని మ్యూల్ ఖాతాలే

బ్యాంకుల్లో ఖాతాలు రెండు విధాలుగా ఉంటాయి. అందులో ఒకటి సేవింగ్స్. రెండోది కరెంట్ అకౌంట్. బ్యాంకులు భౌతిక పరిశీలన లేకుండా ఈ ఖాతాను తెరుస్తుండటంతో సైబర్ నేరగాళ్లు వాటిని తమకు అనుకూలంగా ఉపయోగిస్తున్నారు. ఈ తరహా ఖాతాలను మ్యూల్ అకౌంట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ మ్యూల్ అకౌంట్లు ప్రతి ప్రైవేట్ బ్యాంకుల్లో ఎక్కువగా ఉన్నట్టు సైబర్ క్రైం పోలీసులు గుర్తించారు. సైబర్ నేరాల నుంచి తప్పించుకునే విషయంలో అవగాహన పెంచడానికి పోలీసులు వరుసగా సదస్సులు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఖాతాదారులు భారీ మొత్తంలో వేరే ఖాతాల్లో డబ్బు జమచేస్తే వివరాలు తెలుసుకోవాలని పలుమార్లు పోలీసులు బ్యాంకర్లకు విజ్ఞప్తి చేశారు. అయినా బ్యాంకర్లలో ఎలాంటి మార్పు రాలేదు. దీంతో కరెంట్ అకౌంట్‌లోనే కాకుండా ఇతర అకౌంట్‌లో భారీ మొత్తంలో డబ్బు లావాదేవీలు జరిగి బాధితులు మోసపోతే బ్యాంకర్లపై కేసు నమోదు చేయాలన్న నిర్ణయానికి పోలీసులు వచ్చారు.

పక్కా ప్లాన్‌తో..

సైబర్ నేరగాళ్లు డాన్లు మాదిరిగా వ్యవహరిస్తున్నారు. వారి ముక్కు, ముఖం ఎవరికీ తెలియదు. అజ్ఞాతంలో ఉంటూనే నాలుగు గోడల మధ్యలో మొబైల్ ద్వారా మొత్తం వ్యవహారాన్ని నడిపిస్తారు. ఇందుకోసం అంచెలంచెలుగా వ్యవస్థలను ఏర్పాటు చేసుకుంటారు. తమ ట్రాప్‌లో పడిన వ్యక్తులు డబ్బు జమ చేయాలంటే ఖాతా తప్పనిసరి. ఇలా కొంతమంది నుంచి బ్యాంకుల్లో కరెంట్ ఖాతాలు తెరిపించే బాధ్యతను నిర్వర్తించడానికి ఏజెంట్లను నియమించుకుంటున్నారు. ఈ ఏజెంట్లు పట్టణాలు, నగరాలు, గ్రామాల్లో ఉంటారు.

మిగతా 6లో..

వసూళ్ల వ్యాపారం

వస్త్రలత కమిటీ పేరుతో అనధికార వసూళ్లు

కార్పొరేషన్‌కు చెల్లించాల్సిన అదనపు అద్దె, పెనాల్టీ, జీఎస్టీ బకాయిలు తగ్గిస్తామంటూ మాటలు

- కమిషనర్ స్టాంపు ఉన్న తెల్లకాగితంపై లెక్కలు
- వీఎంసీ అధికారులను నిలదీసిన వ్యాపారులు
- సరిచేస్తామన్న అధికారులు.. ఈలోగా వసూళ్లు

వన్‌టౌన్‌లోని వస్త్రలత వ్యాపారులతో అటు వీఎంసీ అధికారులు, ఇటు వస్త్రలత వ్యాపారుల కమిటీ నోటీసుల పేరుతో చెడుగుడు ఆడుకుంటోంది. వన్‌టౌన్‌లోని వస్త్రలత వ్యాపారులు 2017-20 మధ్య పాత అద్దె కాకుండా పెంచిన అద్దె, పెనాల్టీతో పాటు జీఎస్టీ కలిపి రూ.7 కోట్లు చెల్లించాలంటూ వీఎంసీ ఎస్టేట్ విభాగం అధికారులు ఇటీవల నోటీసులు ఇచ్చారు. ఈ మొత్తం కట్టనవసరం లేదని, తగ్గించేలా చూస్తామంటూ వస్త్రలత కమిటీ పేరుతో అనధికార వసూళ్లు మొదలుపెట్టడం వివాదాస్పదమవుతోంది. ఎంత మొత్తం తగ్గుతుందన్న విషయాన్ని తెల్లకాగితంపై వేసి, దానికి వీఎంసీ కమిషనర్ స్టాంప్ కూడా జతచేసి వసూళ్లకు పాల్పడుతుండటం గమనార్హం.



వన్‌టౌన్‌లోని వస్త్రలత (ఇన్‌సెట్‌లో) కమిషనర్ స్టాంప్‌తో తెల్లకాగితంపై లెక్కలు

(విజయవాడ-ఆంధ్రజ్యోతి/వన్‌టౌన్) : వస్త్రలతలో అధికారికంగా 300 షాపులు ఉన్నాయి. అదనంగా మరో 60 షాపుల్లో వ్యాపారులు వస్త్ర వ్యాపారం నిర్వహిస్తున్నారు. వీఎంసీ అధికారులు నిర్ణయించిన అద్దె ఒక్కో షాపునకు నెలకు రూ.3,100. అయితే, 2020 వరకు వ్యాపారులు ఈ అద్దెను కార్పొరేషన్‌కు ప్రతినెలా చెల్లించేశారు. 2017లో ఈ అద్దెను కార్పొరేషన్ అధికారులు రూ.3,100 నుంచి రూ.6,100కు పెంచారు. కానీ, వ్యాపారులు 2020 వరకు పాత అద్దె మాత్రమే చెల్లించారు. దీంతో పెంచిన బకాయి అలాగే ఉండిపోయింది.

కమిటీ పేరుతో వసూళ్లు

ఈ ఏడాది అక్టోబరులో కార్పొరేషన్ అధికారులు బకాయిలపై దృష్టిపెట్టారు. ఒక్కో షాపు నుంచి రూ.20 వేల నుంచి రూ.లక్ష అదనంగా బకాయిలు చెల్లించాల్సి ఉందని, దీనికి జీఎస్టీతో పాటు పెనాల్టీ కూడా చెల్లించాలంటూ నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందుకున్న పలువురు వ్యాపారులు వస్త్రలత కమిటీ వద్దకు వెళ్లి వివరాలు అడగ్గా, వారు కూడా కార్పొరేషన్ అధికారులు ఇచ్చిన నోటీసుల ప్రకారమే చెల్లించాలని

మిగతా 6లో..

మాజీమంత్రి కొడాలి నానీతో గడ్డంగ్యాంగ్ (ఫైల్) నిందితులను వైద్య పరీక్షల నిమిత్తం గుడివాడ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్తున్న పోలీసులు




గడ్డంగ్యాంగ్ అరెస్టు

- 2022, డిసెంబరులో మాజీ ఎమ్మెల్యే రావిపై హత్యాయత్నం
- కర్రలు, పెట్రోలు సంచులతో మాజీమంత్రి అనుచరుల దాడి
- గడ్డంగ్యాంగ్‌లో పదిమంది అరెస్టు .. న్యాయమూర్తి ఎదుట హాజరు
- 14 రోజుల రిమాండ్.. నెల్లూరు జైలుకు తరలింపు
- పరారీలో ప్రధాన నిందితుడు కాళీ

ఎట్టకేలకు గుడివాడ గడ్డంగ్యాంగ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావుపై హత్యాయత్నం కేసులో పదిమందిని న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా, 14 రోజుల రిమాండ్ విధించారు. నిందితులను నెల్లూరు జిల్లా జైలుకు తరలించారు. ప్రధాన నిందితుడు కాళీ పరారీలు ఉన్నాడు. అతని కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి-గుడివాడ: అప్పటి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావుకు 2022 డిసెంబరు 25వ తేదీన మాజీ మంత్రి కొడాలి నాని ముఖ్య అనుచరుడు, గడ్డం గ్యాంగ్ లీడర్, వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మెరుగుమాల కాళీ ఫోన్ చేసి అసభ్య పదజాలంతో దూషిస్తూ.. చంపుతానంటూ బెదిరింపులకు దిగాడు. సదరు విషయాన్ని రావి వెంకటేశ్వరరావు వెంటనే గుడివాడ డీఎస్పీ ఎన్.సత్యానందం, వన్‌టౌన్ సీఐ గోవిందరాజుకు తెలియజేసి రక్షణ కోరారు. పోలీసులు ఈ విషయాన్ని లైట్‌గా తీసుకున్నారు. నామ మాత్రంగా టీడీపీ కార్యాలయం వద్ద పోలీసులను పెట్టారు. అన్నట్టుగానే కాళీ తన గడ్డం గ్యాంగ్‌తో టీడీపీ కార్యాలయం వద్దకు పెట్రోలు సంచులు, కర్రలు, కత్తులతో వచ్చి టీడీపీ శ్రేణులపై దాడికి దిగాడు. ముఖ్యంగా మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావును అంతమొందించడమే లక్ష్యంగా గడ్డం గ్యాంగ్ దారుణానికి ఒడిగట్టింది.

మిగతా 6లో..

ఏపీలో 23 గతిశక్తి మల్టీ మోడల్ కార్గో టెర్మినళ్లు 8 పీడీఎస్ బియ్యం స్వాధీనం

రెవెన్యూ సదస్సుల నిర్వహణకు సమగ్ర ప్రణాళికలు

» మంత్రి అనగాని వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ లక్ష్మీశ



కృష్ణలంక, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యల పరిష్కార దిశగా ఈనెల 6నుంచి జిల్లాలో రెవెన్యూ సదస్సుల నిర్వహణకు అవసరమైన అన్నిచర్యలు తీసుకోవడం జరిగిందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించినట్టు రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్, ప్రత్యేక కార్యదర్శి ఆర్పీ సిసోడియాలకు కలెక్టర్ వివరించారు. ఈనెల 6వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న రెవెన్యూ సదస్సుల నిర్వహణపై మంత్రి అనగాని సత్యప్రసాద్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా, సీసీఎల్ఏ కమిషనర్ జి.జయలక్ష్మిలు జిల్లా కలెక్టర్లతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో 320 రెవెన్యూ గ్రామ పంచాయతీల పరిధితో పాటు విజయవాడ, నందిగామ, జగ్గయ్యపేట, ఇబ్రహీంపట్నం, తిరువూరు పట్టణ వార్డు సచివాలయ పరిధిలో ఈనెల 6న రెవెన్యూ సదస్సులు నిర్వహించేలా చర్యలు తీసుకొంటామన్నారు. ఇందుకు సంబంధించిన తేదీలు ప్రజలకు ముందుగానే తెలియపరిచేలా సదస్సుల షెడ్యూల్‌ను కరపత్రాల రూపంలో ముద్రించి అన్ని గ్రామాలలో పంపిణీ చేసేలా చర్యలు తీసుకొన్నామన్నారు. ప్రజల ఫిర్యాదులు, వినతులపై తక్షణ చర్యలు తీసుకొంటామన్నారు. ముఖ్యంగా సదస్సులో అన్ని రకాల భూ సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకొంటున్నామన్నారు. సదస్సుల నిర్వహణ పర్యవేక్షణకు అధికారులను నియమించడం జరిగిందని ఒక్కొక్క మండలానికి జిల్లాస్థాయి అధికారిని పర్యవేక్షకులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేయడం జరిగిందన్నారు. రెవెన్యూ సదస్సులపై 5వ తేదీ గురువారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఇతర ప్రజాప్రతినిధులు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, సిబ్బందితో సమావేశం నిర్వహించి సదస్సుల నిర్వహణపై అవగాహన కల్పిస్తున్నట్టు కలెక్టర్ వివరించారు. సమావేశంలో జేసీ నిధి మీనా, డీఆర్వో లక్ష్మీ నరసింహం, కలెక్టరేట్ సమన్వయ పర్యవేక్షకులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సహకారంతో సమర్ధ విపత్తు నిర్వహణ

» ఈ దిశగా అవగాహన కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి

కృష్ణలంక, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సరైన సన్నద్ధతతోనే సమర్థవంత విపత్తు నిర్వహణకు వీలుపడుతుందని, రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం జిల్లాస్థాయిలో విపత్తులను ఎదుర్కొనేందుకు సన్నద్ధత చర్యలు తీసుకొంటున్నట్టు కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. భవిష్యత్తులో విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు మరింత మెరుగైన కార్యాచరణ ప్రణాళిక రూపకల్పనపై హోంశాఖా మంత్రి వంగలపూడి అనిత అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విపత్తు సంభవించిన పరిస్థితిలో సత్వరం అధికార యంత్రాంగం తీసుకొంటున్న సహాయక చర్యలకు ప్రజా సహకారం అవసరమని, ఈ దిశగా ప్రజలకు ర్యాలీలు, స్థానిక సమావేశాలు, కరపత్రాలు తదితరాల ద్వారా అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకొంటున్నట్టు తెలిపారు. అధికారులకు ఎప్పటికప్పుడు శిక్షణ కార్యక్రమాలతో పాటు మాక్‌డ్రిల్స్ నిర్వహణ కూడా ముఖ్యమని వివరించారు. ఎన్‌డీఎంఏ, ఎస్‌డీఎంఏ మార్గదర్శకాలకు అనుగుణంగా కలెక్టర్ చైర్మన్‌గా ఉన్న జిల్లా విపత్తు నిర్వహణ అధీకృత సంస్థ (డీడీఎంఏ) ఆధ్వర్యంలో ఇందుకు చర్యలు తీసుకొంటున్నట్టు తెలిపారు.

వసూళ్ల వ్యాపారం

(5వ పేజీ తరువాయి)

సూచించారు. అయితే, నోటీసులు హేతుబద్ధంగా లేవంటూ కొందరు వ్యాపారులు వీఎంసీ అధికారులను ప్రశ్నించారు. రూ.60 వేలు చెల్లించాల్సిన వ్యాపారికి రూ.1.70 లక్షలు చెల్లించాలని నోటీసులు ఇవ్వటం ఏమిటని పలువురు వ్యాపారులు వీఎంసీ అధికారులను నిలదీశారు. దీంతో అధికారులు ఎక్కడో పొరపాటు జరిగిందని, మళ్లీ నోటీసులు పంపుతామని వ్యాపారులకు సర్దిచెప్పి పంపేశారు. అదే సమయంలో వస్త్రలత కమిటీ పేరుతో కొందరు వ్యక్తులు రంగప్రవేశం చేశారు. నోటీసుల్లో పేర్కొన్న మొత్తాన్ని వీఎంసీ అధికారులతో మాట్లాడి తగ్గిస్తామని పేర్కొంటూ.. అందుకు కొంత ఖర్చవుతుందని వ్యాపారుల నుంచి రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేయడం ప్రారంభించారు. అందుకు కమిటీలోని కొందరు వ్యక్తులు కార్పొరేషన్ ఇచ్చిన నోటీసుల్లో పేర్కొన్న మొత్తంలో ఎంత తగ్గుతుందో వివరిస్తూ తెల్ల కాగితంపై లెక్కలు వేసి మరీ వ్యాపారులకు వివరించారు. ఆ తెల్లకాగితం అధికారికమే అని చెప్పేందుకు నగరపాలక సంస్థ కమిషనర్ పేరుతో తయారు చేయించిన స్టాంప్‌ను వేసి మరీ వ్యాపారులకు ఇస్తున్నారు.

న్యాయం చేయండి : వస్త్రలత వ్యాపారులు

ఈ వ్యవహారంపై అనుమానం వచ్చిన పలువురు వ్యాపారులు వీఎంసీ అధికారులను సంప్రదించారు. తెల్లకాగితంపై వీఎంసీ కమిషనర్ స్టాంప్‌తో ఉన్న పేపర్‌ను తీసుకెళ్లి అధికారులకు చూపించగా, ఆ పేపర్‌తో తమకు ఎలాంటి సంబంధం లేదని, స్టాంప్ కార్పొరేషన్‌కు చెందినదే అని చెప్పుకొచ్చారు. అధికారుల అనుమతి లేకుండా కార్పొరేషన్‌కు చెందిన స్టాంప్ కమిటీ వారి వద్ద ఎందుకు ఉంటుందని వ్యాపారులు అధికారులను నిలదీశారు. వీఎంసీ అధికారులు, వస్త్రలత కమిటీలోని కొందరు వ్యక్తులు కుమ్మక్కై వ్యాపారులను దోచుకునేందుకు ప్రణాళికలు రూపొందించారని వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ బకాయిలపై వీఎంసీ కమిషనర్ సమగ్ర విచారణ జరిపి వ్యాపారులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

ఖాతర్నాక్

(5వ పేజీ తరువాయి)

వీరంతా ఆయా ప్రాంతాల్లో ఒక వర్గాన్ని టార్గెట్ చేసుకుని వల వేస్తుంటారు. వారితో కరెంట్ అకౌంట్లు తెరిపిస్తారు. వారికి నమ్మకం కలగడానికి ఒక్కొక్కరికీ ఒక్కో కథ చెబుతుంటారు. కొంతమంది ప్రముఖులు ఆన్‌లైన్‌లో గేమింగ్ ఆడుతున్నారని, దానికి సంబంధించిన డబ్బు ఈ అకౌంట్‌లో జమ చేస్తారని చెప్తారు. ఇలా అకౌంటును ఉపయోగించుకున్నందుకు రూ.కోటికి రూ.లక్ష చొప్పున కమీషన్ ఇస్తామని నమ్మిస్తారు. ఇలా చేసినందుకు ఆ టీం లీడర్‌కు రూ.లక్షకు రూ.30 వేల చొప్పున కమీషన్ ముట్టజెబుతారు. కరెంట్ అకౌంట్ ఓపెన్ చేసే వ్యక్తితో ముందుగా కొత్త సిమ్ నెంబర్ కొనిపిస్తారు. ఆ నెంబర్‌ను కరెంట్ అకౌంట్‌కు లింక్ చేయిస్తారు. తర్వాత ఎస్ఎంఎస్ పేరుతో ఉండే ఏపీకే ఫైల్‌ను అకౌంట్ ఓపెన్ చేసిన వ్యక్తి సెల్‌ఫోన్‌కు పంపుతారు. ఈ ఫైల్ ఓపెన్ చేసి అతని ఫోన్లో ఇన్‌స్టాల్ చేస్తారు. తర్వాత నుంచి ఈ అకౌంట్‌లో జరిగే లావాదేవీలన్నీ రహస్య ప్రదేశంలో ఉండే సైబర్ నేరగాళ్లకు తెలిసిపోతాయి. ఫోన్.. అకౌంట్ ఓపెన్ చేసిన వ్యక్తి చేతిలో ఉన్నప్పటికీ లావాదేవీలన్నీ క్షణాల్లో సైబర్ నేరగాళ్లకు తెలుస్తాయి. ఆ అకౌంట్ మనుగడలో ఉందో లేదో పరిశీలించుకోవడానికి తొలుత రూపాయి, రెండు రూపాయలు జమ చేస్తారు. ఓకే అనుకున్నాక.. వ్యవహారాలను నడిపిస్తారు. అకౌంట్‌లో పడిన మొత్తాన్ని పడినట్టుగా లాగేసుకుంటారు. బాధితులెవరైనా ఫిర్యాదు చేస్తే పోలీసులు ఆ అకౌంట్‌ను స్తంభింపజేస్తారు. ఈలోపు అందులో రూపాయి నిల్వ లేకుండా మొత్తం ఊడ్చేస్తారు. అకౌంట్ ఓపెన్ చేసిన వ్యక్తి నెంబరు అనుసంధానం చేయిస్తే తర్వాత సైబర్ నేరగాళ్లు దాన్ని మార్చేస్తారు. సదరు వ్యక్తి పోలీసులకు చిక్కినా దొరక్కుండా తప్పించుకుంటారు.

కొండపల్లి బొమ్మకు

పునర్వైభవం!

» కళా సుస్థిరతకు ప్రభుత్వ పరంగా పూర్తి మద్దతు

» తెల్ల పొణికి కొరత సమస్య పరిష్కారానికి జాయింట్ కమిటీ

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ వెల్లడి

కృష్ణలంక, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తెలుగు నేల సంప్రదాయ కళా ఔన్నత్యానికి కొండపల్లి బొమ్మలు చిహ్నమని, సమష్టి కృషితో కొండపల్లి బొమ్మ కళకు పునర్వైభవం తెద్దామని, కళా సుస్థిరతకు ప్రభుత్వపరంగా పూర్తి మద్దతు వుంటుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. బుధవారం కలెక్టర్ లక్ష్మీశ, డీఆర్డీఏ, డ్వామా, అటవీ, రెవెన్యూ శాఖల అధికారులతో కలిసి కొండపల్లి బొమ్మల కళాకారుల సహకార సంఘం సభ్యులతో సమావేశమయ్యారు. బొమ్మల తయారీకి ముడిసరుకు అయిన తెల్ల పొణికిని పరిశీలించడంతో పాటు కళాకారులు అద్భుత నైపుణ్యాన్ని పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, దేశ విదేశాల్లో ప్రత్యేక గుర్తింపు ఉన్న కొండపల్లి బొమ్మలకు డిమాండ్‌తో పాటు మార్కెటింగ్ అవకాశాలు బాగున్నప్పటికీ బొమ్మ తయారీకి అవసరమైన తెల్ల పొణికి లభ్యత సమస్యగా వుందన్నారు.



కొండపల్లి బొమ్మ తయారీని తిలకిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ



తెల్ల పొణికి చెక్కను పరిశీలిస్తున్న కలెక్టర్

తెల్ల పొణికి నర్సరీల అభివృద్ధి

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అనుసంధానంతో తెల్లపొణికి నర్సరీ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి ఆదేశాలున్నాయని కలెక్టర్ అన్నారు. తెల్లపొణికి లభ్యతను పెంచేలా శాఖల సమన్వయంతో ప్రత్యేక జాయింట్ కమిటీ వేయనున్నట్టు చెప్పారు. ఒకవైపు అటవీ నిబంధనలను పాటిస్తూనే మరోవైపు తెల్ల పొణికి కళాకారులకు అందుబాటులో వుండేలా పటిష్ట ప్రణాళికతో చర్యలు తీసుకోనున్నట్టు వివరించారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, డ్వామా పీడీ ఎ.రాము, డీఎఫ్‌వో జి.సతీష్, కొండపల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కంపించిన భూమి.. ఉలిక్కిపడిన జనం!

ఉమ్మడి కృష్ణా జిల్లాలోని పలు మండలాల్లో బుధవారం ఉదయం 7 గంటల సమయంలో భూమి స్వల్పంగా కంపించింది. ప్రకంపనలు రెండు సెకన్లలోపే ఉండటంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. కొన్ని చోట్ల ఇంటి గోడలు స్వల్పంగా బీటలు వారాయి. ఏం విపత్తు వస్తుందోనని ప్రజలు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఎలాంటి ప్రమాదం లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

గన్నవరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) :

- గన్నవరం మండలంలో పలుచోట్ల బుధవారం ఉదయం భూమి కంపించింది. దీంతో ఇళ్లలో ఉన్న వారు భయాందోళన చెందారు. ఉదయం 7.26గంటల సమయంలో కొన్ని సెకన్ల పాటు భూమి కంపించడంతో ఎం జరిగిందో తెలియక ఇళ్లలో ఉన్న వారు బయటకు పరుగులు తీశారు. కేసరపల్లి, గన్నవరం, పురుషోత్తపట్నం గ్రామాల్లో భూమి కంపించిందని గ్రామస్తులు తెలిపారు. కేసరపల్లిలో ఇంటి గోడ కాస్త నెర్రలిచ్చింది.
- గంపలగూడెం తదితర ప్రాంతాల్లో ఉదయం 7.20లకు భూమి స్వల్పంగా కంపించింది. తోటమూల, గంపలగూడెంలలో గోడలపై పెట్టిన సామగ్రి కింద పడ్డాయని స్థానిక ప్రజలు చెప్పారు. ఇళ్ల నుంచి బయటకు పరుగులు పెట్టారు.
- తిరువూరు మండలంలో.. సాయిబాబా గుడి వెనుక, పాతతిరువూరు, ఎస్ఎస్సీ కాలనీ, మండలంలోని లక్ష్మీపురంతో పాటు పలుగ్రామాల్లో భూమి కంపించడంతో ప్రజలు భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. రాజుపేటలో చామర్తి కోటేశ్వరరావుకు చెందిన ఇంటి గోడకు నెర్రలు ఏర్పడ్డాయి.
- నందిగామ డివిజన్‌లో ఉదయం 7.28 సమయంలో ప్రకంపణలు వచ్చాయి. జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, నందిగామ, కంచికచర్ల, వీరులపాడు మండలాల్లో ప్రకంపనలు వచ్చినట్టు స్థానికులు తెలిపారు. కుర్చీలు, వంట సామగ్రి కదిలాయని గనితుక్కూరుకు చెందిన ఉపసర్పంచ్ మూరకొండ ఏడుకొండలు, మోగులూరుకు చెందిన వెలగా నరసింహారావు చెప్పారు. పెద్దగా శబ్దాలూ రాకపోవటంతో చాలా మంది గమనించలేదు.



- జగ్గయ్యపేట పట్టణంలో తొర్రగుంటపాలెం, విద్యానగర్ రైల్వే కట్టతో పాటు కృష్ణానది పరివాహక ప్రాంతం ముక్త్యాల గ్రామంలో స్వల్పంగా భూమి కంపించింది. రెండు సెకన్లు ప్రకంపనలు ఉన్నట్టు స్థానికులు చెప్పారు. ఆందోళనతో రోడ్డు మీదకు పరుగులు తీశారు. ఇళ్లల్లో కొన్ని చోట్ల వస్తువులు కింద పడ్డాయి.
- జగ్గయ్యపేట రూరల్ మండలంలోని అన్ని గ్రామాలలో భూమి కంపించింది. నదీ తీర ప్రాంతాల్లో ప్రభావం ఎక్కువ ఉందని ఆయా గ్రామాల నుంచి సమాచారం అందింది. భూమి కంపించటంతో ఇళ్లలోని వారు పరుగులు పెట్టారు. ఎలాంటి ప్రమాదం లేకపోవటంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.
- పెనుగంచిప్రోలులో బుధవారం ఉదయం కొద్దిసేపు భూమి కంపించింది. ఇళ్లలో సామాగ్రి పక్కకు జరిగాయి. అక్కడక్కడ రేకులు శబ్దాలు వచ్చినట్టు పలువురు తెలిపారు.

భయకంపం

(5వ పేజీ తరువాయి)

హనుమాన్ జంక్షన్‌లోని ఓ వీధిలో భూమి ఊగినట్టు సీసీ కెమెరాల్లో స్పష్టంగా తెలిసింది.

సాధారణ ప్రకంపనలే..

- శ్రీకుమార్, ఆంధ్ర లయోలా కళాశాల భౌతికశాస్త్ర విభాగాధిపతి

ఈ భూప్రకంపనలు సాధారణమైన విషయం. భూమి నిత్యం కంపిస్తూ ఉంటుంది. ఇది జోన్-2కు పెను ప్రమాదమేమీ కాదు. భూమి ఏడో పలకపై ఉంది. దీన్ని ఏషియన్ ప్లేట్ అంటారు. ఆసియా ఖండం మొత్తం ఈ పలకపై ఉంది. దీనికి పక్కనే యురేపియన్ పలక ఉంది. ఇది ఐరోపా ఖండానికి సంబంధించినది. ఈ రెండు పలకలు ఒక దాన్ని మరొకటి ఢీ కొనడంతో ఒత్తిడి పెరుగుతోంది. అందుకే భూప్రకంపనలు అటూ ఇటూ ఊగుతున్నట్టుగా వచ్చాయి. పైకి, కిందకు ఎగురుతున్నట్టుగా రాలేదు. తీవ్రమైన భూకంపాలు హిమాలయ పర్వతాలు, సింధు, పాకిస్తాన్, కచ్, కశ్మీర్ నుంచి నేపాల్, టిబెట్, భూటాన్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ ప్రాంతాల్లో వస్తాయి. ఇవన్నీ ఐదో జోన్‌లో ఉన్నాయి. కాబట్టి రాష్ట్రంలో కానీ, జిల్లాలో కానీ భూకంపాలు రావడానికి ఎలాంటి ఆస్కారం లేదు. దీని గురించి ప్రజలు భయపడి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.





ఉయ్యూరులో సత్యా షోరూమ్ ప్రారంభిస్తున్న సంస్థ నిర్వాహకులు సెంతిల్, ఫాదర్ రెవరెండ్ జాకబ్‌జాన్

ఉయ్యూరులో సత్యా షోరూమ్ ప్రారంభం

ఉయ్యూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పలుప్రాంతాల్లో సుదీర్ఘకాలంగా వినియోగదారుల మన్ననలు పొందుతూ ఉయ్యూరు, పరిసర గ్రామాల ప్రజలకు అందుబాటులోకి వచ్చిన సత్యా షోరూమ్ 40వ బ్రాంచ్ ప్రారంభించడం శుభ పరిణామమని సంస్థ ఏపీ హెడ్ సెంతిల్ అన్నారు. స్థానిక కాటూరు రోడ్డులో సత్యాషోరూమ్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రముఖ బ్రాండెడ్ కంపెనీల ఎలాక్ట్రానిక్ వస్తువులు, హోమ్ అప్లయెన్సెస్‌తో పాటు, సెల్‌ఫోన్‌లు అతి తక్కువ ధరకు లభిస్తాయన్నారు. ఉయ్యూరు, పరిసర ప్రజలు ఈఅవకాశం సద్వినియోగంచేసుకోవాలన్నారు. ఉయ్యూరు ప్రజలకు వస్తువులను అతితక్కువ ధరకు అందచేయడం సత్యాఏజెన్సీస్ ప్రత్యేకత అని మేనేజర్ పూర్ణ పేర్కొన్నారు. ఫాదర్ జాకబ్ జాన్, మహ్మద్ ఉమర్, జుల్ఫర్ నీనే తదితరులు పాల్గొన్నారు.

గడ్డం గ్యాంగ్ అరెస్టు

(5వ పేజీ తరువాయి)

పెట్రోలు సంచులను టీడీపీ వర్గీయులపైకి విసిరి బీభత్సం సృష్టించింది. రావికి మద్దతుగా టీడీపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి గడ్డం గ్యాంగ్‌ను ప్రతిఘటించడంతోనే రావి ప్రాణాలతో బయటపడ్డారు.

నాడు టీడీపీ శ్రేణులపైనే లాఠీచార్జి

సంఘటనా స్థలంలోనే ఉన్న సీఐ గోవిందరాజు, సిబ్బంది ఈ దుశ్చర్యను నిలువరించడంలో విఫలమయ్యారు. స్వామిభక్తిలో మునిగితేలుతున్న సీఐ గోవిందరాజు దాడికి పాల్పడిన వారిని వదిలి టీడీపీ శ్రేణులపై లాఠీ ఝళిపించారని అప్పట్లో విమర్శలు వచ్చాయి. పక్కనే నిలబడి ఉన్న ద్విచక్రవాహనదారుడిపై కూడా లాఠీతో విరుచుకుపడటంతో అతను వాహనంపై నుంచి పడి గాయాలపాలైన విషయం తెలిసిందే. గడ్డం గ్యాంగ్‌పై టీడీపీ నాయకులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నామమాత్రంగా కేసు కట్టి చేతులు దులుపుకున్నారు. టీడీపీ నాయకులపై మాత్రం రెండు కేసులు నమోదు చేశారు.

కళ్ల ముందే తిరుగుతున్నా పట్టించుకోలేదు

రాష్ట్రంలో ప్రభుత్వం మారినా గుడివాడ పోలీసుల వ్యవహార శైలిలో మార్పు రాలేదు. మాజీ ఎమ్మెల్యే రావిపై హత్యాయత్నం చేసిన గడ్డం గ్యాంగ్ సభ్యులు గత ఆరు నెలలుగా గుడివాడలో కళ్ల ముందే తిరుగుతున్నా పోలీస్ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రధాన నిందితుడు మెరుగుమాల కాళీ ఏలూరు జిల్లా మీర్జాపురం గ్రామంలో తలదాచుకున్నట్టు సమాచారం. రాత్రి వేళ కాళీ గుడివాడ వచ్చి వెళ్తున్నా పోలీసులు నిర్లక్ష్యం వహించారు. ప్రస్తుతం కాళీ అస్సాంలో ఉన్నట్టు పోలీస్ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా రాష్ట్రం విడిచి పారిపోయాక పోలీసులు అరెస్టులు ప్రారంభించారని టీడీపీ శ్రేణులు విమర్శిస్తున్నాయి. మాజీ ఎమ్మెల్యే హోదాలో రావి వెంకటేశ్వరరావు కేసును పోలీసులు సీరియస్‌గా తీసుకోలేదని టీడీపీ శ్రేణులు ఆరోపిస్తున్నాయి. రావి వెంకటేశ్వరరావు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా నియమితులవ్వడంతో పోలీసుల్లో ఒక్కసారిగా చలనం వచ్చిందని పేర్కొంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించిన ఈ కేసులో ఆనాడు పోలీసులు వ్యవహరించిన తీరు విస్మయానికి గురి చేసింది. నామమాత్రంగా బెయిలబుల్ కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారనే విమర్శలు ఉన్నాయి. వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేసిన వారిలో గడ్డం గ్యాంగ్ సభ్యులు నీరుడు ప్రసాద్, రాపాక పవన్‌కుమార్, మెరుగుమాల ఉదయ్‌కుమార్, కొండ్రు శ్రీకాంత్, నీరుడు భార్గవ్, సుంకర సతీష్, గొంటి అశోక్, రాజ్యబోయిన తాండవ కృష్ణ, గొల్ల వెంకటేశ్వరరావు, పండేటి మోషే ఉన్నారు. వీరిని న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా, 14 రోజుల రిమాండ్ విధించినట్టు సీఐ కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. నిందితులను నెల్లూరు జిల్లా జైలుకు తరలించినట్టు పేర్కొన్నారు.

గడ్డం గ్యాంగ్‌ను సమర్థించిన మాజీ మంత్రి నాని

అధికారంలో ఉండగా మాజీ మంత్రి కొడాలి నాని, ఆయన ముఖ్య అనుచరుడు దుక్కిపాటి శశిభూషణ్ మాటే వేదంగా గడ్డం గ్యాంగ్ పనిచేసింది. ఆ నాడు మాజీ ఎమ్మెల్యే రావిపై హత్యాయత్నానికి ఒడిగట్టిన నాని తన గడ్డం గ్యాంగ్‌ను సమర్థించుకున్నారు. 'రావిని చంపుతా అని బెదిరించిన వాడు నేరుగా కార్యాలయానికే వస్తాడా, జరిగిన దాడికి వైసీపీకి ఎటువంటి సంబంధం లేదని, పార్టీలో యాక్టివ్‌గా ఉన్న వారెవ్వరూ లేరు" అని కొడాలి వ్యాఖ్యానించారు. మరునాడే గడ్డం గ్యాంగ్‌తో నాని దిగిన ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అయింది.

నా తండ్రి మృతికి కారణం తలశిల రఘురాం

» సీఎం చంద్రబాబు ఎదుట బోరుమన్న కారెంపూడి అభిరామ్

» ఆస్తులు లాక్కుని ఆత్మహత్యకు కారణమయ్యారని ఫిర్యాదు

గొల్లపూడి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నా తండ్రి కారెంపూడి రవీంద్ర బలవన్మరణానికి వైసీపీ ఎమ్మెల్సీ తలశిల రఘురాం కారణమని తనకు, తమ కుటుంబానికి న్యాయం చేయాలని రవీంద్ర కుమారుడు కారెంపూడి అభిరామ్ సీఎం చంద్రబాబు ఎదుట బోరున విలపించాడు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం చంద్రబాబు పలువురు బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. గత వైసీపీ ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఎమ్మెల్సీ తలశిల రఘురాం తన తండ్రిపై అక్రమ కేసు పెట్టి వేధించాడని, నాటి సీఐ రవీంద్ర, ఏసీపీ హనుమంతరావులతో బెదిరించి రూ.10 కోట్ల విలువైన ఆస్తులను రాయించుకున్నారని వాపోయాడు. ఎంపీటీసీ ఎన్నికల్లో తన తండ్రి రవీంద్ర నామినేషన్ వేశాడనే అక్కసుతో వేధించి కేసులు పెట్టి జైల్లో పెట్టారని వివరించాడు. తమ దగ్గర అప్పులు తీసుకున్న వారిని తిరిగి ఇవ్వకుండా అడ్డుకొని రూ.3.5 కోట్లు నష్టపోయేలా చేశారని వైసీపీ వేధింపులు తట్టుకోలేకే తన తండ్రి బలవన్మరణానికి పాల్పడ్డాడని కన్నీరు మున్నీరుగా విలపించాడు. రఘురాంపై పూర్తిస్థాయి విచారణ చేయించాలని ఆయనకు సహకరించిన పోలీసులపై విచారణకు ఆదేశించాలని కోరారు.



రేపట్నుంచి సుబ్రహ్మణ్యేశ్వర షష్ఠి కల్యాణ మహోత్సవాలు

మోపిదేవి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 6, 7, 8 తేదీల్లో షష్ఠి కల్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. 6వ తేదీ ఉదయం 11 గంటలకు స్వామివారిని పెండ్లి కుమారుడిని చేయుటంతో కల్యాణ మహోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 7న స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవం, సాయంత్రం 6 గంటలకు మయూర వాహనంపై గ్రామోత్సవం, 8న స్వామివారి గ్రామోత్సవం, పుష్పశయనాలంకృత పర్యాంక సేవతో మహోత్సవాలు ముగుస్తాయన్నారు. స్వామివారి షష్ఠి కల్యాణ మహోత్సవాలు పురస్కరించుకుని నిత్య అర్జిత సేవలన్నీ తాత్కాలికంగా రద్దు చేసినట్టు తెలిపారు.

లక్ష్యం చేరని జల్‌జీవన్ మిషన్!

» పామర్రులో ఇప్పటికీ పూర్తికాని పథకం

» పనుల నిర్వహణలో అధికారుల అలసత్వం

» వైసీపీ హయాంలో రూ. కోటి గోల్‌మాల్ అయినట్టు ఆరోపణలు

(ఆంధ్రజ్యోతి, పామర్రు) : ప్రతి ఇంటికీ తాగునీరు అందేలా.. గ్రామీణ ప్రాంత ప్రజల దాహార్తి తీర్చేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జలజీవన్ మిషన్ పథకం లక్ష్యం నీరుగారుతోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ పథకం నిధులు స్వాహా అయ్యాయన్న విమర్శలు స్థానికంగా వినిపిస్తున్నాయి. ప్రజలకు ఇంటింటి కుళాయిలు ఏర్పాటుచేసి రక్షిత మంచినీటి సౌకర్యం కల్పించాలనే సంకల్పంతో జల్‌జీవన్ మిషన్ పథకం కింద ప్రభుత్వం రూ.4.35 కోట్ల నిధులను వెచ్చించింది. 2022 నవంబరు 3న నాటి వైసీపీ ఎమ్మెల్యే అట్టహాసంగా భూమిపూజ చేశారు. స్థానిక గంగానమ్మ గుడిచెరువు గట్టున స్టోరేజి ట్యాంకుతోపాటు, చెన్నువానిపురంలో మరో ఓవర్ హెడ్‌ట్యాంకు నిర్మాణపనులు హడావిడిగా చేపట్టారు. అయితే వాటికి అనుసంధానంగా ఏర్పాటు చేసిన పైప్‌లైన్లను అసంపూర్తిగానే వదిలేశారు. అధికారుల నిర్లక్ష్యం.. పాలకుల అవినీతి దాహంతో పామర్రు పట్టణంలో పథకం అమలుకు నోచుకోవడంలేదు. రూ.కోటికి పైగా నిధులు గోల్‌మాల్ అయినట్టు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఈ పథకం త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. దాంతో పాటు అవినీతి ఆరోపణలపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



నిరుపయోగంగా ఉన్న ట్యాప్‌లు



పూర్తయినా అందుబాటులోకిరాని వాటర్ ట్యాంకు

దీనిపై డీఈ సత్యనారాయణ వివరణ ఇస్తూ పట్టణంలో పథకానికి సంబంధించి విద్యుత్ శాఖతో కొంత సాంకేతిక ఇబ్బందులున్నాయని, సంబంధిత కాంట్రాక్టర్లకు కొంతమేర బిల్లులు మంజూరు చేయలేదన్నారు.

ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా మాట్లాడుతూ, నియోజకవర్గంలోని అన్ని మండలాలకు కృష్ణా జలాలు నేరుగా అందించే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. అలాగే గత ప్రభుత్వ హయంలో పథకంలో అవినీతి ఆరోపణలపై విచారణ చేయిస్తామన్నారు. త్వరలో రక్షిత నీటిని ప్రజలకందించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఎన్టీఆర్ జిల్లా ఆర్యవైశ్య చైతన్య పోరాట సమితి అధ్యక్షుడిగా అప్పన రామ్‌కుమార్

జగ్గయ్యపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఆర్యవైశ్య చైతన్య పోరాట సమితి ఎన్టీఆర్‌జిల్లా అధ్యక్షుడిగా పట్టణ హెచ్‌పీ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ అప్పన రామ్‌కుమార్‌ను నియమించినట్టు రాష్ట్ర అధ్యక్షుడు చారుగుండ్ల కొండా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరబాద్‌లో మాజీ ముఖ్యమంత్రి రోశయ్య వర్ధంతి కార్యక్రమంలో నియామక పత్రాన్ని ఆయన అందుకున్నారు.

సామర్థ్యాధారిత పరీక్షలకు 2940 మంది హాజరు

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా జిల్లాలో 108 పాఠశాలల్లో 3, 6,9 తరగతుల విద్యార్థులకు నిర్వహించిన సామర్థ్యాధారిత పరీక్షలకు 2940 మంది విద్యార్థులు హాజరయ్యారు. జిల్లా రిసోర్సు పర్సన్ విజయమాధురి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ పరీక్షల్లో సీబీఎస్‌ఈ బోర్డు ఇన్‌చార్జి ఫ్రాంజల్ సెక్సాతో పాటు ఇన్విజిలేటర్లు వివిధ పాఠశాలలను సందర్శించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖాధికారి రామారావు, డివైఈవో సింగ్ తదితరులు పాల్గొన్నారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.ల లో)

బ్రాయిలర్ బర్డ్	105, 113, 124
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడిగుడ్ల ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 620

ఘంటసాల 102వ జయంతి వేడుకలు

విజయవాడ కల్చరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్వరాలయ సాంస్కృతిక సేవా సంస్థ, హంసధ్వని కూచిపూడి నృత్యాలయ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో గంధర్వగానం నృత్య నీరాజనం పేరిట ఘంటసాల 102వ జయంతి వేడుకలు నిర్వహించారు. గాంధీనగర్‌లోని వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో బుధవారం సాయంత్రం సంస్థ నిర్వాహకులు కొత్త ప్రయోగం చేసి ప్రశంసలు అందుకున్నారు. ఘంటసాల పాటలకు నాట్యాచార్య అజయ్‌కుమార్ శిశు బృందం చక్కని నృత్య ప్రదర్శనలు అందించి ప్రేక్షకుల మెప్పు పొందారు. మరోవైపు భగవద్గీత శ్లోకాలతో ప్రేక్షకులు భక్తి తన్మయత్వంలో మునిగారు. కార్యక్రమంలో నాట్యాచార్య అజయ్‌కుమార్, నిర్వాహకులు ఎస్.ఆర్.ప్రభాకర్, సిహెచ్.మోహనరాంప్రసాద్, రమణమూర్తి పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా మెరుగుకు చర్యలు

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



పైపులైన్ మార్పిడి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

భారతీనగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నగర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారని, నగరంలోని రహదారులు, డ్రెయినేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా మెరుగుపరుచుటకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. బుధవారం ఉదయం తూర్పు పరిధి నాల్గవ డివిజన్‌లో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పర్యటించి స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డివిజన్‌లోని హరిజనవాడలో రూ.13లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన తాగునీటి సరఫరా పైప్‌లైన్ మార్పిడి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూర్పు పరిధి కొండ ప్రాంతాల్లో మంచినీటి సమస్య రాకుండా చేసేందుకు నాలుగు వాటర్ ట్యాంక్‌ల నిర్మాణం చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని అన్నారు. స్ట్రామ్ వాటర్ నిధులతో సైడ్‌కాలువలను నిర్మాణం చేసి డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరుస్తున్నామని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ ఈ సమస్యను పరిష్కరించడానికి సీఆర్‌డీఏ నిధుల నుంచి రూ.200 కోట్లు కేటాయించారన్నారు. త్వరలో విడుదలయ్యే రూ.100కోట్లతో గుంటతిప్ప, పుల్లేటికాలువ అభివృద్ధి పనులను చేపడతామన్నారు. కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, డివిజన్ పార్టీ నాయకులు వెంకటేశ్వరరావు, వెలగలేటి విజయకుమార్, గద్దె రమేష్, సత్తెనపల్లి కిషోర్, ఈఈ పాల్గొన్నారు.

కోటి సభ్యత్వాలను చేరుకుంటాం

మొగల్రాజపురం: నెల రోజుల్లో కోటి సభ్యత్వాలను చేరుకుంటామని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. బుధవారం ఎనిమిదో డివిజన్‌లో ఆయన పర్యటించారు. టీడీపీ నాయకులు వై.వెంకటేశ్వరరావు, డి. రమేష్‌బాబు లక్షరూపాయలు చెల్లించి జీవితకాల సభ్యత్వాలను తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ టీడీపీ హయాంలో రాష్ట్రంలో జరిగిన జరుగుతున్న అభివృద్ధి వల్ల తాను టీడీపీ సభ్యుడినని చెప్పుకోవడానికి గర్వపడుతున్నామని సభ్యత్వం తీసుకున్నవారు చెబుతున్నారంటే ఆ పార్టీ పట్ల ప్రజలకు ఉన్న విశ్వాసం తెలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, వై. విజయరాణి, మల్లెల రామకృష్ణ, కడియాల మురళి, గద్దె రమణ, బుచ్చిబాబు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

పాయకాపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పాయకాపురం-నూజివీడు ప్రధాన రహదారిపై నున్న రూరల్ పోలీసులు బుధవారం వాహనాల తనిఖీ చేపట్టారు. నెంబరు ప్లేట్లు, రికార్డులు సక్రమంగా లేని 28 వాహనాలను సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ కృష్ణమోహన్ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలకు అనుగుణంగా వాహనాలను నడపాలన్నారు. తనిఖీల్లో ఎస్సై పండుదొర, సిబ్బంది పాల్గొన్నారు.

తటవర్తి సూర్యనారాయణను ఆదర్శంగా తీసుకోవాలి



తటవర్తి సూర్యనారాయణకు నివాళులర్పిస్తున్న కళాకారులు, యజమానులు తదితరులు

విజయవాడ కల్చరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సేవా కార్యక్రమాల్లో విశేషంగా కృషి చేసిన తటవర్తి సూర్యనారాయణను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పోలవరపు కోటేశ్వరరావు సాంస్కృతిక సమితి అధ్యక్షుడు గోళ్ల నారాయణరావు అన్నారు. విజయశ్రీ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన సంతాప సభలో ఆయన మాట్లాడారు. తన జీవితంలో అన్నార్తుల ఆకలి తీర్చడంలో ముందు వరుసలో వున్న సూర్యనారాయణ, నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందించడంలో తనదైన ముద్ర వేశారని కొనియాడారు. న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ ఆయన లేని లోటు పూరించలేనిదన్నారు. సావిత్రి కళాపీఠం అధ్యక్షురాలు పరుచూరి విజయలక్ష్మి ఆయన కళారంగానికి చేసిన సేవలను ప్రశంసించారు. సంస్థ వ్యవస్థాపకుడు బండారు నరసింహారావు మాట్లాడుతూ, సూర్యనారాయణ సేవా కార్యక్రమాలు అనేకమని గుర్తుచేశారు. సభలో సూర్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చింతా వెంకటేశ్వర్లు, చింతకాయల చిట్టిబాబు, చీదెళ్ల నాగేశ్వరరావు, బి.ఆంజనేయరాజు, డేవిడ్‌రాజు, వీరభద్రరావు, కొల్లూరి ప్రసాద్, మాంతి రమణారావు పాల్గొన్నారు. కౌతా కళావేదికపైన దండు చంద్రశేఖర్, జోసెఫ్ సంతాప సభ నిర్వహించి సూర్యనారాయణకు నివాళులర్పించారు.



ఎన్‌సీసీ, నేవీ డేలో పాల్గొన్న విద్యార్థినులు

స్టెల్లాలో ఇండియన్ నేవీ డే

పటమట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మారిస్ స్టెల్లా కళాశాలలో ఎన్‌సీసీ 8వ ఆంధ్రా నేవీ కమాండింగ్ ఆఫీసర్ కెప్టెన్ ప్రదీప్ ఆధ్వర్యంలో ఇండియన్ నేవీ డే బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ప్రదీప్ మాట్లాడుతూ ఇండియన్ నేవీలో సేవలు అందించాలంటే అగ్నివీర్ పథకం గురించి తెలుసుకోవాలని కోరారు. సబ్ లెఫ్టినెంట్ స్వప్న నావికా రంగం పాత్రను విశదీకరించారు. అనంతరం పోస్టర్ కాంపిటేషన్ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా భారత నావికాదళం శాంతి ర్యాలీని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు వెంకట రమణ, రాజశేఖర్, సిద్ధార్థ కళాశాల ఎన్‌సీసీ అధికారి వెంకటేశ్, 50 మంది కేడెట్లు, సిద్ధార్థ, లయోలా, స్టెల్లా కళాశాలల నుంచి పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఈడీ రవివర్మకు ఎన్‌ఎంయూ నాయకుల వినతి

బస్టేషన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని బుధవారం ఆర్టీసీ ప్రధాన కార్యాలయంలో పరిపాలనా విభాగం ఈడీ రవివర్మకు ప్రజా రవాణా సంస్థ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు వినతి పత్రం అందజేశారు. ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి సమస్యలు పరిష్కరించాలని, గ్యారేజీ సిబ్బంది సమస్యలను ఆపరేషన్ యూనిట్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఆర్టీసీ డిస్పెన్సరీలో పూర్తిస్థాయిలో మందులను అందుబాటులో ఉంచాలన్నారు. క్షేత్రస్థాయిలో ఉద్యోగులు పడుతున్న ఇబ్బందులను ఈడీ దృష్టికి తీసుకువచ్చారు. ఉద్యోగుల సమస్యలను ఈడీ విని సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.రమణారెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు, సంయుక్త కార్యదర్శి రావి సుబ్బారావు, కోశాధికారి పి.వి.వి. మోహన్, విజయవాడ జోనల్ కార్యదర్శి ఎ.రామారావు, తదితరులు పాల్గొన్నారు.



మీ సేవ వద్ద రోడ్డు మీదే నిలిపిన ద్విచక్ర వాహనాలు, సరోజినీదేవి హాస్పిటల్ పక్కన రోడ్డుమీద నిలిపి ఉంచిన కార్లు

వాహనాల అక్రమ పార్కింగ్

- వాహనాల రాకపోకలతో పటమట సెంటర్ రద్దీ
- మీ సేవ వద్ద వాహనాల పార్కింగ్
- ట్రాఫిక్ స్తంభనతో ఇబ్బందులు

(పటమట, ఆంధ్రజ్యోతి)

తూర్పు నియోజకవర్గంలో పటమట సెంటర్ ప్రధానమైన కూడలి ప్రాంతం. ఈ ప్రాంతంలో వాహనాల అక్రమ పార్కింగ్ వల్ల ట్రాఫిక్ స్తంభించిపోతోంది. ఇక్కడ కార్పొరేట్ కళాశాలలు, పాఠశాలలు, సర్కిల్ 3, తహసీల్దార్ కార్యాలయాలు ఉన్నాయి. ఉదయం నుంచి రాత్రి వరకు ఈ ప్రాంతం పాదచారులు, ద్విచక్ర వాహనదారులు, కార్లతో నిత్యం రద్దీగా ఉంటుంది. బెంజిసర్కిల్ వైపు నుంచి పటమట సెంటర్, యనమలకుదురుకు వెళ్లే వాళ్లు, పటమట సెంటర్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్, బెంజిసర్కిల్ మీదుగా కాశేశ్వరరావు మార్కెట్ వైపునకు వెళ్లే వాళ్లు నిత్యం వేల సంఖ్యలో ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. అంతటి ప్రాధాన్యం సంతరించుకున్న పటమట సెంటర్ మీ సేవ బిల్డింగ్ దగ్గర, మీసేవల ఎదురుగా రోడ్డుమీద ద్విచక్ర వాహనాలు నిలపడం వలన రోజూ ట్రాఫిక్ జామ్ అవుతుంది. అదే రోడ్డులో సరోజినీ దేవి హాస్పిటల్ వద్ద రోడ్డు మీద వరుసగా కార్లు నిలిపి ఉంచుతున్నారు. ఈ ప్రాంతంలో ఉన్న ఎన్ఎస్ఎం స్కూల్ వదిలే సమయంలో విద్యార్థులను తీసుకెళ్లటానికి వచ్చే ఆటోలు, తల్లిదండ్రుల వాహనాలతో నిరంతరం ఈ ప్రాంతంలో ట్రాఫిక్ స్తంభించిపోతోంది. మీ సేవ కార్యాలయం వెనుక వైపున అధికారుల కార్లు పార్కింగ్‌చేయడం వలన ట్రాఫిక్ ఇబ్బందులు తప్పటం లేదు.

సంబంధిత అధికారులు స్పందించి వెంటనే వాహనాల అక్రమ పార్కింగ్‌ను కట్టడి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కళాశాలల్లో సీక్రెట్ బాక్సులు ఏర్పాటు చేయాలి

యాంటీడ్రగ్స్,ర్యాగింగ్‌పై అవగాహన సదస్సులో డీసీపీ గౌతమీ శాలి



మాట్లాడుతున్న డీసీపీ గౌతమీ శాలి, పక్కన ఏసీపీ దామోదర్, సీఐ పవన్‌కిషోర్, డిగ్రీ వైస్ ప్రిన్సిపాల్ ఉషాకుమారి

పటమట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రతీ కళాశాలలో సీక్రెట్ బాక్స్‌లు ఏర్పాటు చేయాలని, డ్రగ్స్ గురించి ఏమైనా ఫిర్యాదులుంటే విద్యార్థులు సీక్రెట్ బాక్సులో వేయాలని డీసీపీ గౌతమీ శాలి కోరారు. మారిస్ స్టెల్లా కళాశాలలో బుధవారం డీసీపీ గౌతమీ శాలి ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్, యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రగ్స్ తీసుకోవడం నేరమని, డ్రగ్స్ తీసుకునే వారి సమాచారం విద్యార్థులు కళాశాల యాజమాన్యాలకు గానీ, పోలీస్‌లకు తెలియజేయాలని సూచించారు. తద్వారా కొంతమందినైనా డ్రగ్స్ మహమ్మారి నుంచి రక్షించుకోగలుగుతామన్నారు. విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు ఆదేశాల మేరకు ప్రతీ కళాశాలలో డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూ చైతన్యపరుస్తున్నట్లు గౌతమీశాలి వివరించారు. డ్రగ్స్ సమాచారాన్ని 1972కు గానీ, 100కు తెలియజేయాలన్నారు. ర్యాగింగ్ చేయటం చట్టరీత్యా నేరమన్నారు. ఒక్కసారి ర్యాగింగ్ కేసులో విద్యార్థిపై ఎఫ్ఐఆర్ నమోదైతే ఆరు నెలలు వరకు ఏ కాలేజీలో చేర్చుకోరని, భవిష్యత్తులో ఉద్యోగంలో చేరేటప్పుడు, పాస్‌పోర్టు తీసుకునేటప్పుడు ఇబ్బందులు ఎదురవు తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ దామోదర్, పటమట సీఐ పవన్‌కిషోర్, డిగ్రీ వైస్ ప్రిన్సిపాల్ ఉషాకుమారి, వున్నం స్వప్న, కెప్టెన్ శైలజలు పాల్గొన్నారు.

పీబీ సిద్ధార్థ, నాగార్జున యూనివర్సిటీ మధ్య

పరిశోధనలకు ఒప్పందం



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న పీబీ సిద్ధార్థ ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, ఏఎన్‌యూ రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం తదితరులు

మొగల్రాజపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పీబీ సిద్ధార్థ కళాశాల, నాగార్జున యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ విభాగాలు సంయుక్తగా పరిశోధనలు చేయడం కోసం ఒప్పందం కుదిరింది. బుధవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఇరువురు ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. ఈ సందర్భంగా పీబీ సిద్ధార్థ ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, నాగార్జున యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం మాట్లాడుతూ సాంకేతిక కార్యక్రమాలు నిర్వహించడంలో, పాఠ్యప్రణాళికలు రూపొందించడంలో, పరిశోధనలో, నూతన కంప్యూటర్ పరిజ్ఞానాన్ని విద్యార్థులకు, అధ్యాపకులకు బోధించడంలో తమ వద్ద ఉన్న వనరులను వినియోగించుకోవడంలో వివిధ సంస్థలకు సేవలను అందించి తద్వారా ఆదాయం చేకూర్చడం వంటి అంశాల్లో కలిసి పనిచేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాగార్జున యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య కె.గంగాధర్‌రావు, ప్రతినిధులు, పీబీ సిద్ధార్థ కంప్యూటర్ సైన్సు హెడ్ టీఎస్ రవికిరణ్, ఉప విభాగ అధిపతి కె.సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలను కొనసాగిస్తాం

ఆంధ్రా మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు సతీష్



మొగల్రాజపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఐకమత్యం, ఏకతాటి మీద నడిచే సభ్యులు ఉండటం వల్ల ఆంధ్రామోటార్ మర్చంట్స్ అసోసియేషన్ ఇతర అసోసియేషన్‌లకు ఆదర్శవంతంగా నిలిచిందని హర్ మొహిందర్ సింగ్ సాహ్నీ అన్నారు.

బుధవారం అమ్మ హాలులో సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో వార్షిక నివేదిక సభ్యుల ముందు ఉంచారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షుడిగా గారపాటి సతీష్, ఉపాధ్యక్షులుగా గోనుగుంట వెంకట సుబ్బారావు, దోనేపూడి దుర్గాప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా సుంకర చంద్రశేఖర్, సంయుక్త కార్యదర్శిగా కొమ్మినేని దుర్గా మల్లికార్జునరావు, కోశాధికారిగా అన్నే శ్రీనివాసరావులను నియమించారు. ఎప్పటిలానే ఆంధ్రామోటార్ మర్చంట్స్ అసోసియేషన్ (అమ్మ) ఆధ్వర్యంలో జరుగుతున్న సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని బుధవారం నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు గారపాటి సతీష్ చెప్పారు.



టీసీఎస్‌కు ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు

టీసీఎస్‌కు 343మంది వీఆర్ సిద్ధార్థ విద్యార్థుల ఎంపిక

పెనమలూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఐటీ సేవలు, కన్సల్టింగ్‌లో గ్లోబల్ లీడర్ అయిన టీసీఎస్ తన తాజా రిక్రూట్‌మెంటు డ్రైవ్‌లో 343 మంది వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల(డీమ్డ్ టు బి యూనివర్సిటీ) విద్యార్థులను ఎంపిక చేసినట్లు వీసీ డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు.

రికార్డు స్థాయిలో ఎంపికయిన 343 విద్యార్థుల్లో 54 మంది ఏడు లక్షల నుంచి తొమ్మిది లక్షల వేతనాన్ని సాధించినట్లు తెలిపారు.

ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఈ అద్భుత విజయానికి తమ విద్యార్థులు, అధ్యాపక బృందం కృషి కారణమని తెలిపారు. యువ ఇంజనీర్ల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తున్నందుకు టీసీఎస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పి. లక్ష్మణరావు, ఉపాధ్యక్షుడు రాజయ్యలు విద్యార్థులను అభినందించారు.



విజేతలతో ఏపీ ఆర్చరీ అసోసియేషన్ సెక్రటరీ చెరుకూరి సత్యనారాయణ

ఉత్కంఠగా ఆర్చరీ పోటీలు

విజయవాడ స్పోర్ట్సు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శాతవాహన కళాశాల గ్రౌండ్స్‌లో రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలు రెండోరోజు ఉత్కంఠగా జరిగాయి. బుధవారం నాటి పోటీలను సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ ప్రారంభించారు. రాష్ట్రంలో ఆర్చరీ క్రీడకు వన్నె తెచ్చిన ఏపీ ఆర్చరీ అసోసియేషన్ సెక్రటరీ చెరుకూరి సత్యనారాయణకు ద్రోణాచార్య అవార్డు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. కృష్ణాజిల్లా ఆర్చరీ అసోసియేషన్ కోశాధికారి జి.ప్రేమ్‌కుమార్, టెక్నికల్ కమిటీ చైర్మన్ బి.వెంకటరమణ పాల్గొన్నారు.

పురుషుల్లో బి బుద్దేశ్వరరావు, డి జ్యోతి ప్రకాష్‌రెడ్డి, టి గణేష్ మణిరత్నం, బి రవితేజ, మహిళల్లో ఎం సూర్య హంసిని, బి షణ్ముక నాగసాయి, కె. శరణ్య, కె. సుస్మిత కాంపౌండ్ విజేతలుగా నిలిచారు.

8న ఉమ్మడి కృష్ణా హ్యాండ్‌బాల్ టీమ్ ఎంపిక

నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో ఈ నెల 8న సాయంత్రం 4 గంటలకు ఉమ్మడి కృష్ణా సీనియర్ బాలుర హ్యాండ్‌బాల్ జట్టు ఎంపికను చేపడుతున్నట్టు జిల్లా అసోసియేషన్ కార్యదర్శి ఎస్ వంశీకృష్ణప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారిని ఈ నెల 15, 16న అనంతపురం జిల్లా రాయదుర్గంలో జరిగే 9వ రాష్ట్రస్థాయి సీనియర్ బాలుర హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్‌కు పంపుతామన్నారు.

ప్రతిభ చాటే క్రీడాకారులకు అండగా శాప్: చైర్మన్



కార్తీక్‌ను అభినందిస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు, కోచ్ షేక్ ఖాసీమ్

రాష్ట్రంలో రాణించే పేదింటి క్రీడాకారులకు శాప్ అండగా ఉంటుందని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు భరోసా ఇచ్చారు. విజయవాడకు చెందిన డిజేబుల్ చెస్ ప్లేయర్ కే వెంకట కృష్ణ కార్తీక్ కిర్గిస్థాన్‌లో ఇటీవల జరిగిన ఏషియన్ చెస్ చాంపియన్‌షిప్ సాధించాడు. కాకినాడకు చెందిన పవర్‌లిఫ్టర్ ఎం శ్రీనివాసరావు పంజాబ్ రాష్ట్రంలో జరిగిన 31వ ఆలిండియా నేషనల్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణం వశం చేసుకున్నాడు. వీరిద్దరూ వేర్వేరుగా శాప్ కార్యాలయంలో చైర్మన్ కలవగా, వారిని అభినందించి శాలువాతో సత్కరించారు.

జాతీయ క్రీడలకు తీసుకెళ్లే అనుమతి పురుషోత్తమ్‌కు లేదు!

ఉత్తరాఖండ్‌లో జరిగే జాతీయ క్రీడలకు క్రీడాకారులను తీసుకెళ్లేందుకు ఆర్‌కే పురుషోత్తమ్‌కు అనుమతి లేదని, అతడి గ్రూపులోని సభ్యులు హోదాల్లో పాల్గొనడానికి అర్హులు కారని ఏపీవోఏ సెక్రటరీ కేపీ రావు అభ్యంతరం వ్యక్తం చేశారు. తాము ఏపీలో 47ఏళ్లుగా క్రీడా సేవలందిస్తున్నామని, కబడ్డీని ఆసియా స్థాయి కార్యకలాపాలకు ప్రోత్సహించామన్నారు. ఐవోఏ వెబ్‌సైట్‌లో ఏపీవోఏ ప్రత్యర్థి గ్రూప్ అధ్యక్షుడిగా మాజీ మంత్రి కృష్ణదాస్ పేరు ప్రదర్శించబడిందని రావు తెలిపారు. 2023లో రూ.25లక్షలు ఖర్చులు పెట్టి ఏపీ జట్లను తీసుకెళతానని హైకోర్టులో చెప్పి ఆర్డర్ తీసుకుని, ఇప్పుడు హైకోర్టును మోసం చేస్తూ ఆర్‌కే పురుషోత్తమ్ ఇచ్చిన తప్పుడు ప్రకటన ఎలా ఇస్తారని ప్రశ్నించారు. నాపైన లేదా మా గ్రూప్‌నకు వ్యతిరేకంగా తప్పుడు, నకిలీ ప్రకటనలిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. జాతీయ సమాఖ్యల నుంచి గుర్తింపు లేఖలతో మీడియా ముందు ఈ మెజార్టీని ఎప్పుడైనా, ఎక్కడైనా నిరూపిస్తానని పురుషోత్తమ్‌కు సవాల్ చేశారు.



ఎంపికైన జట్టుతో శ్రీదేవి, రఘురామ్

సౌత్‌జోన్ వర్శిటీ టోర్నీకి కృష్ణా టీమ్

విశాఖపట్నం గీతం వర్శిటీలో ఈ నెల 5 నుంచి 8వ వరకు జరిగే సౌత్‌జోన్ ఇంటర్ వర్శిటీ మహిళా చెస్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే కృష్ణా వర్శిటీ టీమ్ అక్కడకు పయనమైందని సప్తగిరి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, చైర్‌పర్సన్ డాక్టర్ పీడీవీ శ్రీదేవి, ఫిజికల్ డైరెక్టర్ ఆర్ రఘురామ్ ఒక ప్రకటనలో తెలిపారు. కె.హైందవి శర్వాణి (ఎస్‌వీడీ సిద్ధార్థ లా కళాశాల), ఏ ఉషా ప్రవల్లిక, ఎస్ సాధన, (పీబీ సిద్ధార్థ కళాశాల), ఎస్ నవ్య (ఎస్‌డీఎంఎస్) ఏ బిందుమాధవి (కేబీఎన్), ఏ దివ్యరేఖ (ఏజీఎస్‌జీ సిద్ధార్థ) క్రీడాకారిణులు తలపడుతున్నారన్నారు. జట్టుకు మేనేజర్ బీ శ్రావణి వ్యవహరిస్తారన్నారు.



టేబుల్ టెన్నిస్ ప్లేయర్స్‌ను అభినందిస్తున్న డీఎస్‌డీవో

జాతీయ టీటీకి పలువురు ఎంపిక

ఎన్టీఆర్ జిల్లా డీఎస్ఏ టేబుల్ టెన్నిస్ కోచ్ ఎస్‌కే ముంతాజ్ బేగం వద్ద శిక్షణ పొందుతున్న జె.సుభాష్ బాబు, పి.లాస్య, ఎస్‌కే అబ్దుల్ రియాన్, ఎం సునీత ఎస్‌జీఎఫ్ స్కూల్ గేమ్స్ నేషనల్స్ సీబీఎస్‌ఈ, జేఎన్‌టీయూకేల్లో జరిగే పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా డీఎస్‌డీవో ఎస్ఏ అజీజ్ ఈ నలుగురు క్రీడాకారులను, కోచ్‌ను ప్రత్యేకంగా బుధవారం అభినందించారు.

పాకిస్తాన్

పేరు మార్చండి మహాప్రభో..!

- నగరంలో పొరుగు దేశం పేరుతో కాలనీ
- ఆధార్, రేషన్, పాన్ కార్డుల్లోనూ అదే పేరు
- ఉద్యోగాలు, లోన్లు, పాస్‌పోర్ట్ విషయంలో తీవ్ర ఇబ్బందులు
- 3 దశాబ్దాలుగా ఇబ్బందులు పడుతున్న కాలనీవాసులు
- శత్రుదేశం పేరు చెప్పుకోలేకపోతున్నామంటూ ఆవేదన
- భగీరథ కాలనీగా పేరు మార్చాలని వేడుకోలు





ఎవరైనా తాముండే కాలనీ, ప్రాంతం పేరు ఏదైనా తమ కాలనీ పేరు అక్కడి వాసులు గొప్పగా చెప్పుకుంటారు. ఫలానా కాలనీ వాసులమని గర్వంగా ఫీలవుతారు. అయితే నగరంలోని ఓ కాలనీవాసులు తమ కాలనీ పేరు చెప్పుకోవడానికి ఇష్టపడరు. తాముంటున్న కాలనీ పేరు చెప్పకుండా ఫలానా ప్రాంతం పక్కన అనో ఫలానా రోడ్డుకు దగ్గర్లో అనో చెప్పుకుంటారు. అంతే కాదు తమ కాలనీ పేరును మార్చండి మహాప్రభో అంటూ దండాలు పెట్టేస్తారు. ఆఖరికి తమ పిల్లలకు పెళ్లి సంబంధాలు వెళ్లిన సమయంలో అసలు తమ కాలనీ పేరే చెప్పుకోరు. ఇంతకీ అక్కడి వారు చెప్పుకోలేనంతగా ఆ పేరులో ఏముందో తెలుసా మన శత్రుదేశమైన 'పాకిస్తాన్' అవును నిజమే. పాకిస్తాన్ పేరుతో నగరంలో ఓ కాలనీ ఉంది. అది పాయకాపురం ప్రాంతంలోని నున్న రూరల్ పోలీసు స్టేషన్ వెనుకే ఉంది.

\- పాయకాపురం, ఆంధ్రజ్యోతి

ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో భారత్, పాకిస్తాన్ దేశాల మధ్య 1971 యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో భారత్ విజయం సాధించగా అదే సమయంలో పాకిస్తాన్ నుంచి బంగ్లాదేశ్ విభజించబడింది. దీంతో పాక్, బంగ్లాదేశ్ సరిహద్దుల్లోని అనేక కుటుంబాలు నిరాశ్రయులయ్యారు. అప్పటి ప్రభుత్వం ఆయా కుటుంబాలకు భారతదేశంలోని వివిధ ప్రాంతాల్లో ఆశ్రయం కల్పించారు. అందులో భాగంగా నగరంలోని పాయకాపురం ప్రాంతంలో ఓ చిన్నిపాటి కాలనీ నిర్మించారు. 1984లో 40గృహాలు 3 రోడ్లతో నిర్మించిన కాలనీ 1986లో పూర్తయింది. అప్పట్లో కాలనీకి పాకిస్తాన్ కాలనీగా నామకరణం జరిగింది. అయితే పాకిస్తాన్ సరిహద్దుల నుంచి ఏ ఒక్క కుటుంబం ఇక్కడికి వచ్చి నివాసం ఉండలేదు. దీంతో కాలనీ దెబ్బతిని నిర్మానుష్యంగా మిగిలిపోయింది. 3దశాబ్దాల క్రితం పాయకాపురం ప్రాంతాన్ని బుడమేరు వరదలు ముంచెత్తాయి. ఆ సమయంలో అనేక మంది స్థానికులు నిరాశ్రయులయ్యారు. ఇక ఇళ్లు లేక రోడ్ల పక్కన జీవనం సాగించే కుటుంబాలు మనుగడ సాగించడమే కష్టమయిపోయింది. అయితే అప్పట్లో సమీప ప్రాంతాల కన్నా పాకిస్తాన్ కాలనీ కాస్త ఎత్తులో ఉండి వరద ముంపు ప్రభావం తక్కువగా ఉంది. దీంతో అప్పటి అధికారులు పలు కుటుంబాలను కాలనీలోని ఇళ్లకు తరలించారు. అప్పటి నుంచి వారంతా ఆ కాలనీవాసులుగానే ఉండిపోయారు. ప్రస్తుతం పాకిస్తాన్ కాలనీలో 58 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి.

ఉద్యోగాలు, లోన్లు, పాస్‌పోర్టు విషయంలో ఇబ్బందులు

కాలనీలో గతంతో పోలిస్తే ఇప్పుడు ప్రజలు కొంత అభివృద్ధి చెందారు. అయితే ఉద్యోగాలకు, లోన్లకు, పాస్‌పోర్టు వంటి విషయాల్లో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కుంటున్నారు. ఎక్కడికి వెళ్లినా తమ ఆధార్ కార్డులు, పాన్‌కార్డులు, డ్రైవింగ్ లైసెన్స్ తదితర గుర్తింపు కార్డుల్లో పాకిస్తాన్ ఉండటం శాపంగా మారింది. విదేశాలు వెళ్లాలనుకునే వారికి ఎయిర్‌పోర్ట్‌లో అనేక చిక్కులు ఎదురవుతున్నాయి. ఇక ప్రైవేట్ ఉద్యోగాలకు వెళ్లే యువకుల ఆధార్ కార్డుల్లో పాకిస్తాన్ పేరుండటంతో ఉద్యోగాలు రాని పరిస్థితి నెలకొంది.



భగీరథ కాలనీగా నామకరణం చేయాలి

ఏకతాటిపైకి వచ్చిన కాలనీవాసులంతా కొన్నేళ్లుగా తమ కాలనీకి భగీరథ కాలనీగా నామకరణం చేయాలని కోరుతున్నారు. అలాగే తమ ఇంటి పన్నులు, ఆధార్ కార్డులు, కరెంట్ బిల్లులతో పాటుగా సమస్త గుర్తింపు కార్డుల నుంచి పాకిస్తాన్ పేరును తొలగించి భగీరథ కాలనీగా ప్రభుత్వ రికార్డుల్లో నమోదు చేయాలని వేడుకుంటున్నారు.



స్మార్ట్ వాటర్ మేనేజ్‌మెంట్ అవసరం

బీఐఎస్ డైరెక్టర్ ఎం.ఎ.జె వినోద్

ఆటోనగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ వాటర్ యూజ్ మేనేజ్‌మెంట్ స్టాండర్డ్స్‌పై అందరూ అవగాహన పెంచుకోవాలని సైంటిస్ట్, బీఐఎస్ డైరెక్టర్ ఎం.ఎ.జె వినోద్ అన్నారు. బుధవారం నగరంలోని ఓ హోటల్‌లో స్మార్ట్ వాటర్ యూజ్ మేనేజ్‌మెంట్ స్టాండర్డ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహావసరాల కోసం పైపుల ద్వారా తాగునీరు సరఫరా, వ్యవసాయం, పరిశ్రమలు, నీటి వ్యవస్థల స్థిరత్వం కోసం నీటి నిర్వహణ వంటి వాటిలో సాంకేతికతను మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సైంటిస్ట్, జాయింట్ డైరెక్టర్ రమాకాంత్, బీఐఎస్ అధికారులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

కృష్ణలంక, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విజయవాడ - ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అధ్వర్యంలో కానూరులో 'ఫెడరల్ స్కిల్ అకాడమీ' ట్రైనింగ్ సెంటర్‌లో 'టాలీ' కోర్సుపై సర్టిఫికెట్‌తో కూడిన ఉచిత శిక్షణకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీనివాసరావు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణలకు బీకాం, బీఏ, బీబీఏ, ఎంకామ్ పూర్తి చేసిన 18 నుంచి 30 సంవత్సరాల అభ్యర్థులు అర్హులని ఇదే ప్రకటనలో జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.విక్టర్ బాబు తెలిపారు. డిసెంబరు 9న శిక్షణా తరగతులు ప్రారంభమవుతాయని, శిక్షణ అనంతరం ప్రముఖ ప్రైవేట్ రంగ సంస్థలలో ఉద్యోగావకాశాలు కల్పిస్తారని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు నేరుగా కానూరులోని తులసీనగర్‌లో గల 'ఫెడరల్ స్కిల్ అకాడమీ' ట్రైనింగ్ సెంటర్‌కు తమ విద్యార్హతలతో పాటు ఆధార్ కాపీ, పాస్‌పోర్టు ఫొటోతో వచ్చి తమ వివరాలను నమోదు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 8714692747 నెంబరులో సంప్రదించాలని కోరారు.



భవిష్యత్ వ్యాపార విస్తరణకు ఏఐ దోహదం

చాంబర్ విజయవాడ చైర్మన్ రాజయ్య

లబ్బీపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వ్యాపార విస్తరణకు రానున్న రోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ టెక్నాలజీ ఎంతో దోహదపడుతుందని ఆంధ్ర ఛాంబర్ ఆఫ్ కామర్స్ విజయవాడ చైర్మన్ రాజయ్య అన్నారు. బుధవారం హోటల్ వివంతలో ఆంధ్ర చాంబర్ ఆఫ్ కామర్స్ విజయవాడ చాప్టర్ ఆధ్వర్యంలో డిజిటల్ మార్కెటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా వ్యాపార విస్తరణ ఎలా చేయాలి అనే అంశంపై సెమినార్ జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యాపార రంగంలో ఈ డిజిటల్ టెక్నాలజీ చాలా అత్యవసరంగా భావిస్తున్నామని అన్నారు. ఈ సెమినార్‌లో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, ఎమ్ఎస్ఎమ్ఈ పారిశ్రామిక వేత్తలు, 50మంది డిజిటల్ మార్కెటింగ్ ఔత్సాహితులు, నెల్లూరు జిల్లా చాప్టర్ చైర్మన్ రంగయ్య నాయుడు, ఎఫ్ఎస్ఎఫ్ కన్వీనర్ విజయలక్ష్మి, ఎండీ ఇలియాస్, చాంబర్ ఆఫ్ కామర్స్ విజయవాడ అసిస్టెంట్ సెక్రటరీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

4.2 మెట్రిక్ టన్నుల పీడీఎస్ బియ్యం స్వాధీనం



పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుంటున్న పీడీఎస్ డీటీ రామకృష్ణ

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కొండపల్లిలో ఓ వాహనంలో 4.2 మెట్రిక్ టన్నుల పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలించేందుకు సిద్ధం చేసుకుంటున్న వాహనంతో పాటు నిందితుడ్ని బుధవారం పౌరసరఫరాలు, రెవెన్యూశాఖాధికారులు పట్టుకున్నారు. పీడీఎస్ డీటీ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం కొండపల్లికి చెందిన సయ్యద్‌ఖాజా అనే వ్యక్తి పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నట్టు తెలిపారు. బియ్యాన్ని స్టేషన్‌కు తరలించి 6ఏ కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేసినట్టు తెలిపారు.

ఉచిత విద్యుత్తు అందిస్తున్నాం

» అర్హులైన ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు లబ్ధి: మంత్రి గొట్టిపాటి

అమరావతి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఎస్సీ, ఎస్టీ కుటుంబానికి నెలకు 200 యూనిట్లలోపు విద్యుత్తును ఉచితంగా అందిస్తున్నామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడించారు. అల్పాదాయ వర్గాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల దాకా ఇస్తోన్న ఉచిత విద్యుత్తులో ఎలాంటి సడలింపులూ లేవని గొట్టిపాటి రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. 'ఈ పథకానికి అడ్డంకులు సృష్టించేందుకే ప్రతిపక్ష వైసీపీ ఉచిత విద్యుత్తు పథకంలో కోత విధించామంటూ వదంతులు సృష్టిస్తోంది. ఈ పథకం ద్వారా రాష్ట్రంలో 15,17,298 ఎస్సీ, 4,75,557 ఎస్టీ కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయి. ఈ పథకం కోసం కూటమి ప్రభుత్వం రూ.477.30 కోట్లు ఖర్చు చేసింది. రాజకీయ లబ్ధి పొందాలన్న కుట్రతో ఎస్సీ ఎస్టీ కుటుంబాలకు ఉచిత విద్యుత్తు పథకాన్ని ఎత్తేశామంటూ వైసీపీ దుష్ప్రచారం చేస్తోంది. అర్హులు ఎంతమంది ఉన్నా ఉచిత విద్యుత్తు పథకాన్ని అందిస్తాం' అని గొట్టిపాటి స్పష్టం చేశారు.

అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి చర్యలు

» యూనియన్ నేతలతో ఐసీడీఎస్ పీడీ చర్చలు

అమరావతి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి చెప్పారు. బుధవారం గుంటూరు ఐసీడీఎస్ కార్యాలయంలో ఏపీ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్‌కు అనుబంధ సంఘాలైన సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ నేతలతో ఆయన చర్చలు జరిపారు. అంగన్వాడీలకు వేతనాల పెంపు, గ్రాట్యుటీ అమలుపై మంత్రి, సీఎంతో చర్చించి, త్వరలో సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. మినీ సెంటర్ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా మార్చడానికి సుముఖత వ్యక్తం చేశారు. అంగన్‌వాడీలు ఎవరైనా చనిపోయినప్పుడు మట్టి ఖర్చులపై త్వరలో జీవో ఇస్తామన్నారు. హెల్పర్ల పదోన్నతిపై మార్గదర్శకాలు రూపొందించి, అర్హులకు పదోన్నతి ఇస్తామని చెప్పారు. సంక్షేమ పథకాల అమలుకు కృషి చేస్తామని, పెండింగ్ బిల్లులను త్వరలో చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఇంకా పలు అంశాలపై చర్చించినట్లు నేతలు తెలిపారు.

జలవనరుల శాఖ ఎస్‌ఈల బదిలీ

అమరావతి. డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జల వనరుల శాఖలో సూపరింటెండింగ్ ఇంజనీర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ బుధవారం ఉత్తర్వు జారీ చేశారు. ప్రస్తుతం కర్నూలు హెచ్ఎన్ఎస్ఎస్ సర్కిల్-1లో ఉన్న దూలం రామగోపాల్‌ను విశాఖపట్నం ఇరిగేషన్ సర్కిల్‌కు, కడప ఎస్‌కేడీజీఎన్ఎస్ఎస్ సర్కిల్ ఎస్ఈ ఎం.మల్లికార్జున రెడ్డిని తిరుపతి టీజీపీజీఎన్ఎస్ఎస్ సర్కిల్‌కు బదిలీ చేశారు. విశాఖపట్నం ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ ఎస్.సుగుణాకరరావును పోలవరం ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువకు బదిలీ చేశారు. ఆ బాధ్యతలు నిర్వహిస్తున్న బూసం శ్యామ్ ప్రసాద్‌ను గుంటూరు నీరు-ప్రగతి ఎస్ఈగా బదిలీ చేశారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.111.28 కోట్లు

తిరుమల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారికి నవంబరు నెలలో రూ.111.28 కోట్లు హుండీ ఆదాయం లభించిం ది. గత నెలలో హుండీ ఆదాయం 7సార్లు రూ.4 కోట్లకుపైగా ఉండటం గమనార్హం. ఈ ఏడాదిలో గడిచిన పదకొండు నెలల్లో మొత్తం రూ.1250 కోట్లు హుండీ ద్వారా లభించాయి.

పంచాయతీ కార్యదర్శి అనుమానాస్పద మృతి

కళ్యాణదుర్గం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా కంబదూరు ఒకటో సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. రాయదుర్గం పట్టణానికి చెందిన రాఘవేంద్రబాబు(38) కంబదూరు పంచాయతీ కార్యదర్శిగా రెండేళ్ల నుంచి పనిచేస్తున్నారు. విధులు ముగిసిన తర్వాత ఒకటో సచివాలయంలోనే మంగళవారం రాత్రి ఉండిపోయారు. సచివాలయాన్ని శుభ్రం చేసేందుకు బుధవారం ఉదయం వెళ్లిన సిబ్బందికి రాఘవేంద్రబాబు ఉరి వేసుకుని కనిపించారు. సమాచారం అందుకున్న కంబదూరు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కంబదూరుతోపాటు మర్రిమాకులపల్లి, రాళ్ల అనంతపురం పంచాయతీలకు రాఘవేంద్రబాబు కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. ఆయనకు ఆర్థిక సమస్యలున్నట్టు తెలుస్తోంది. కుమారుడి మృతి ఘటనలో ఇద్దరిపై అనుమానం ఉందని రాఘవేంద్రబాబు తండ్రి నాగభూషణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.





ఆర్ట్ డైరెక్టర్, టీటీడీ ట్రస్ట్ బోర్డు సభ్యుడు ఆనందసాయికి చిత్రపటం అందజేస్తున్న డిప్యూటీ ఈవో రత్నరాజు, దుర్గగుడి కళావేదికపై భక్తిసంగీత కార్యక్రమంలో కీర్తనలు పాడుతున్న కళాకారుడు డాక్టర్ ఆకురాతి కోదండరామయ్య

దుర్గమ్మ సన్నిధిలో టీటీడీ బోర్డు సభ్యుడు ఆనందసాయి

వన్‌టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ట్రస్ట్ బోర్డు సభ్యుడు, ప్రముఖ సినీ ఆర్ట్ డైరెక్టర్ ఆనందసాయి బుధవారం కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. అధికారు లు ఆయనకు స్వాగతం పలికి ఆలయ మర్యాదలు అంద జేశారు. అమ్మవారి దర్శనం తరువాత డిప్యూటీ ఈవో రత్నరాజు ఆయనకు చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందజేయగా వేద పండితులు వేద ఆశీస్సులు అందజేశారు.

దుర్గగుడి కళావేదికపై భక్తిసంగీతం

దుర్గగుడి కళావేదికపై బుధవారం భక్తి సంగీతం నిర్వహించారు. విజయవాడకు చెందిన గాయకుడు డాక్టర్ ఆకురాతి కోదండ రామయ్య పలు కీర్తనలను హృద్యంగా ఆలపించారు. అమ్మవారి, స్వామివారి కీర్తనలతో పాటు, వినాయకుడు, విష్ణుమూర్తి కీర్తనలు చక్కగా ఆలపించి, భక్తుల కరతాళధ్వానాలు అందుకున్నారు. వయోలిన్ పాలపర్తి ఆంజనేయ శాస్త్రి, మృదంగంతో జగన్మోహిణిలు సహకరించారు. కళాకారులను డిప్యూటీ ఈవో రత్నరాజు అభినందించి, ప్రశంసా పత్రాలు, చిత్రపటం అందజేశారు.

వెబ్ డెవలపర్ కోర్సులో ఉచిత శిక్షణ

కృష్ణలంక, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నందు అర్హత కలిగిన అభ్యర్థులకు వెబ్ డెవలపర్ కోర్సులో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.విక్టర్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిప్లొమో, ఏదైనా డిగ్రీ, ఆపైన అర్హత కలిగిన అభ్యర్థులకు ప్రత్యేకంగా 3 నెలల పాటు వెబ్ డెవలపర్ కోర్సుకు ఉచిత శిక్షణ డిసెంబరు 10లోగా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. ఈ వెబ్ డెవలపర్ కోర్సుకు ఎంపికైన విద్యార్థులకు ఈ కోర్సులో నూతన సాంకేతికతో కూడిన పరిజ్ఞానంతో ప్రత్యేక శిక్షణ సౌకర్యం కల్పిస్తామని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డా.విజయసారథి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాస్ తెలిపారు. శిక్షణ అనంతరం ప్రముఖ సంస్థలో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి కలిగి, అర్హత ఉన్న నిరుద్యోగ యువత డిసెంబరు 10లోపు నమోదు చేసుకోవాలని, కోర్సు పూర్తిచేసిన అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందచేస్తామన్నారు. ఇందులో భాగంగా అభ్యర్థులు ఇంటర్, డిగ్రీ తరగతి మార్కుల జాబితా, ఆధార్ కార్డు, ఈ మెయిల్ ఐడీ, మొబైల్ నెంబరుతో ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ, విజయవాడ నందు ఉదయం 10 గంటల నుంచి సంప్రదించవచ్చన్నారు. వివరాలకు 9347779032, 9391254464 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

ఉమ్మడి కృష్ణాజిల్లా విశ్రాంత న్యాయమూర్తి సత్యనారాయణరెడ్డి మృతి



మొగల్రాజపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా జిల్లా విశ్రాంత న్యాయమూర్తి దుగ్గిరాల సత్యన్నారాయణరెడ్డి (85) జయప్రకాష్ నగర్‌లో ఆయన స్వగృహంలో బుధవారం మృతి చెందారు. ఆయనకు నగర ప్రాంతంలో ప్రగతి శీల ప్రజాస్వామ్య ఉద్యమాలతో అనుబంధం ఉంది. గుంటూరు జిల్లా గురజాల మండలం అంబాపురంలో జన్మించిన ఆయనకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు. పదవీ విరమణ తరువాత హక్కుల ఉద్యమాలు ఇస్కఫ్, శాంతి స్నేహ ఉద్యమంలో చురుగ్గా పాల్గొనేవారు. పెన్షనర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడిగా, వినియోగదారుల కోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వహించారు. ఆయన న్యాయమూర్తిగా ఉన్నపుడు లోక్ అదాలత్‌లో ఒక్కరోజే 350 కేసులు పరిష్కరించారు. ఆయన మరణవార్త తెలిసిన వామపక్ష న్యాయవాదులు, సాహితీ వేత్తలు సందర్శించి నివాళులర్పించారు. పెన్షనర్స్ అసోసియేషన్ నేతలు దాలినాయుడు, నరసింహారెడ్డి, బ్రహ్మం, సాహితీప్రముఖులు తాటి శ్రీకృష్ణ, గోళ్ల నారాయణరావు, లక్ష్మయ్య, మోతుకూరి వెంకటేశ్వరరావు, అరుణ్‌కుమార్, ఎంఎల్ నేతలు వీరబాబు, రఘు, జగన్, ఎంపీ ఆంజనేయులు నివాళులర్పించారు.

ఏపీలో 23 గతిశక్తి మల్టీ మోడల్ కార్గో టెర్మినళ్లు

వన్‌టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైల్వేశాఖ దేశంలో కార్గో రవాణా సౌకర్యాలను మెరుగుపరచడానికి తీసుకువచ్చిన గతిశక్తి మల్టీ మోడల్ కార్గో టెర్మినళ్ల విధానంలో ఏపీలో 23 ప్రాంతాలున్నాయని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ లోక్‌సభలో బుధవారం లిఖితపూర్వకంగా తెలియజేశారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, మరో ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అడిగిన ప్రశ్నకు ఆయన ఈ మేరకు సమాధానం ఇచ్చారు. పారిశ్రామిక అవసరాలతో పాటు కార్గో రవాణా అవకాశాలను పెంచటానికి టెర్మినళ్లు ఉపయోగపడతాయన్నారు. ఈ ఏడాది అక్టోబరు 31 వరకు 91 టెర్మినళ్లను ప్రారంభించారని, ఇందులో 4 ఏపీలో ఉన్నాయన్నారు. దీని ప్రకారం ఈ టెర్మినళ్లను అనుమతి లభించిన రెండేళ్లలో పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. ప్రైవేటు, ప్రభుత్వ రంగాల నిధులతో ఈ ప్రాజెక్టులు అమలవుతాయన్నారు. పారిశ్రామిక అవసరాలను దృష్టిలో పెట్టుకుని టెర్మినళ్ల ఏర్పాటు జరుగుతుందని తెలిపారు.

దేశంలో 15 వరద వాతావరణ కేంద్రాలు

ఎంపీలు అడిగిన మరో ప్రశ్నకు కేంద్ర శాస్త్ర సాంకేతిక భూవిజ్ఞాన సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ లిఖిత పూర్వక సమాధానం ఇస్తూ దేశంలో 15 వరద వాతావరణ కేంద్రాలున్నాయని, కొత్త కేంద్రాన్ని సిమ్లాలో ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈ కేంద్రాలు వాతావరణ ఉపగ్రహాలు, రాడార్‌ల సహాయంతో వర్షపాతాన్ని అంచనాలు వేస్తాయని, ఈ సమాచారంతో కేంద్ర జల కమిషన్ హెచ్చరికలను ముందుగానే జారీ చేస్తుందన్నారు. ప్రతిరోజూ ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకు క్వాంటిటేటివ్ ప్రిసిపిటేషన్ ఫోర్‌కాస్ట్ బులిటెన్లను విడుదల చేస్తుందన్నారు. తాజాగా హిమాచలప్రదేశ్‌లోని సిమ్లాలో వరద వాతావరణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని వాతావరణ శాఖ నిర్ణయించిందన్నారు. బియాస్ నది, సట్లెజ్‌నది, రంజిత్ సాగర్ డ్యామ్‌కు సంబంధించి కేంద్రం బులిటెన్లు జారీ చేస్తుందన్నారు.





మా కుటుంబంలోకి నిన్ను ఆహ్వానిస్తున్నాం

నాగార్జున

అక్కినేని నాగచైతన్య, శోభితా ధూళిపాళ వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. బుధవారం రాత్రి 8 గంటల 13 నిమిషాలకు, హిందూ సంప్రదాయ పద్ధతిలో అన్నపూర్ణ స్టూడియో్‌లో జరిగిన ఈ వివాహ వేడుకకు ఇరువురి కుటుంబసభ్యులు, కొద్దిమంది అతిథులు హాజరయ్యారు. నూతన జంటను ఆశీర్వదిస్తూ నాగార్జున తన ఆనందాన్ని ఎక్స్ ద్వారా పంచుకున్నారు. "నాగచైతన్య, శోభితా కలసి ప్రారంభిస్తున్న ఈ కొత్త అధ్యాయం నాకెంతో ప్రత్యేకం. ఈ క్షణం నా మనసు భావోద్వేగంతో నిండిపోయింది. మీ ఇద్దరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు. శోభితా.. మా కుటుంబంలోకి నిన్ను మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నాం. మీరు ఇప్పటికే మా జీవితాల్లోకి ఎంతో సంతోషాన్ని తెచ్చారు. ఏఎన్నార్ శతజయంతి సందర్భంగా స్థాపించిన విగ్రహం సమక్షంలో మీ పెళ్లి జరగడం వల్ల ఆయన ఆశీస్సులు మీ జంటకు ఎల్లప్పుడూ ఉంటాయి. ఈ జంటను ఆశీర్వదించిన ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు" అని పేర్కొన్నారు. ఈ వేడుకకు చిరంజీవి దంపతులు, వెంకటేశ్, అల్లుఅర్జున్, టి.సుబ్బిరామిరెడ్డి, ఎన్టీఆర్, రామ్‌చరణ్, రానా, అల్లు అరవింద్, కీరవాణి, సుహాసిని విచ్చేసి వధూవరులని ఆశీర్వదించారు.





షూటింగ్ పూర్తి



నందమూరి బాలకృష్ణ హీరోగా బాబీ కొల్లి దర్శకత్వంలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ నిర్మిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'డాకూ మహారాజ్' చిత్రం షూటింగ్ పార్ట్ పూర్తయింది. తన చిత్రాలలో కథానాయకులను సరికొత్తగా చూపించడంతో దర్శకుడు బాబీ దిట్ట. బాలకృష్ణ కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో రూపొందుతున్న 'డాకూ మహారాజ్' చిత్రంలో కూడా బాలకృష్ణను ఇంతవరకూ చూడని కొత్త అవతారంలో బాబీ చూపిస్తున్నారు. చిత్రం షూటింగ్ పార్ట్ పూర్తయిందనీ, ముందు ప్రకటించిన విధంగానే వచ్చే ఏడాది జనవరి 12న సినిమా విడుదల చేస్తామనీ నిర్మాతలు సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య చెప్పారు.



మోక్షజ్ఞతో ఆదిత్య 999

నందమూరి బాలకృష్ణ హీరోగా సీనియర్ డైరెక్టర్ సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో 1991లో వచ్చిన సైన్స్ ఫిక్షన్ 'ఆదిత్య 369' అప్పట్లో అందరినీ అలరించింది. బాలకృష్ణ కెరీర్‌లో అత్యుత్తమ చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. ఇందులో శ్రీకృష్ణదేవరాయలుగా ఆయన అభినయం ప్రేక్షకులను ఎంతో ఆకట్టుకుంది. ఈ సినిమాకు సీక్వెల్ చేయాలనే ఆలోచన బాలకృష్ణకు ఎప్పటినుంచో ఉంది. ఇప్పుడు తన తనయుడు మోక్షజ్ఞతో 'ఆదిత్య 369'కు సీక్వెల్‌గా 'ఆదిత్య 999 మాక్స్' పేరుతో తీయనున్నట్లు బాలకృష్ణ ప్రకటించారు. 'అన్‌స్టాపబుల్ సీజన్ 4'లో ఆయన ఈ విషయాన్ని వెల్లడిస్తూ ప్రస్తుతం స్క్రిప్ట్ వర్క్ జరుగుతోందనీ, మోడరన్ సినిమాటిక్ ఎలిమెంట్స్‌తో సినిమా ఉంటుందని ఆయన తెలిపారు. డిసెంబర్ 6న ప్రసారం కానున్న ఈ ఎపిసోడ్‌లో బాలకృష్ణ 'ఆదిత్య 369' గెటప్‌లో కనిపించనున్నారు.

బాలకృష్ణతో మళ్లీ సినిమా తీస్తా



'ఆది', 'చెన్నకేశవ రెడ్డి', 'కందిరీగ' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలను నిర్మించిన నిర్మాత బెల్లంకొండ సురేశ్. ఇండస్ట్రీలో ఇటీవలే 25 ఏళ్లను పూర్తిచేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో ముచ్చటించారు.

"ఓ నిర్మాతగా ఇండస్ట్రీలో 25 ఏళ్లను పూర్తి చేసుకున్నందుకు ఆనందంగా ఉంది. ఈ 25 ఏళ్లలో 38 సినిమాలు నిర్మించాను. నిర్మాతగా ఈ ప్రయాణం అద్భుతంగా సాగింది. అగ్రహీరోల నుంచి కొత్తవారి వరకూ చేసిన ప్రతీ సినిమా గొప్ప అనుభూతిని ఇచ్చింది. 2015లో నా చివరి చిత్రం 'గంగ' విడుదలైంది. దాదాపు తొమ్మిదేళ్ల విరామం వచ్చింది. ఈ గ్యాప్‌కు కారణం సాయి శ్రీనివాస్.. గణేశ్ ఇద్దరూ వేరే ప్రొడ్యూసర్స్‌తో సినిమాలు చేయడమే. మళ్లీ వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి సినిమాలను నిర్మించడానికి సిద్ధమవుతున్నా. వాటిలో మొదటి రెండు చిత్రాలు మా ఇద్దరబ్బాయిలతో ఉంటాయి. త్వరలోనే ఆ ప్రాజెక్ట్స్ గురించి పూర్తి వివరాలు ప్రకటిస్తా. అగ్ర దర్శకులతోనే సినిమాలు చేయాలనే ఆలోచన లేదు. నేను చేయబోయే రెండు ప్రాజెక్ట్స్ కూడా కొత్త దర్శకులతోనే. అలాగే, ఓ సినిమా రీమేక్ హక్కులను కొన్నా.. అది తెలుగులో మంచి విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది. సాయి శ్రీనివాస్ ప్రస్తుతం నాలుగు సినిమాలతో బిజీగా ఉన్నాడు. తను నటించిన 'భైరవం' త్వరలోనే విడుదల అవుతుంది. చిన్నబ్బాయి గణేశ్ చేతిలో రెండు ప్రాజెక్ట్స్ ఉన్నాయి. 'చెన్నకేశవ రెడ్డి' సినిమా రీ రిలీజ్‌కు ఊహించిన దాని కంటే మంచి రెస్పాన్స్ వచ్చింది. త్వరలోనే బాలయ్యతో మళ్లీ సినిమా తీస్తా. 'నా ఆటోగ్రాఫ్ స్వీట్ మెమొరీస్' రవితేజ పుట్టినరోజున రీ రిలీజ్ చేయాలనే ప్లాన్ ఉంది' అని చెప్పారు.



హిందూ-క్రిష్టియన్ సంప్రదాయాల్లో పెళ్లి

ఇప్పుడంతా పెళ్లిళ్ల సీజన్. హీరో నాగచైతన్య, హీరోయిన్ శోభితల వివాహం బుధవారం జరిగింది. అక్కినేని ఇంట్లో మరో హీరో అఖిల్ కూడా పెళ్లి చేసుకుని ఓ ఇంటివాడు కాబోతున్నాడు. అలాగే హీరోయిన్ కీర్తి సురేశ్ కూడా పెళ్లి పీటలు ఎక్కనుంది. బాయ్ ఫ్రెండ్ ఆంటోనీ తట్టిల్‌తో కీర్తి వివాహం ఈ నెల 12న గోవాలో జరుగుతుంది. వీరి పెళ్లి ఇన్విటేషన్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. మరో విశేషమేమిటంటే వీరిద్దరి పెళ్లి హిందూ-క్రిస్టియన్ సంప్రదాయాల ప్రకారం జరుగుతుండడం. ఉదయం గోవాలోని ఓ ఖరీదైన రిసార్ట్‌లో ఆంటోనీ, కీర్తిల పెళ్లి హిందూ సంప్రదాయం ప్రకారం జరుగుతుంది. అదే రోజు సాయంత్రం ఓ చర్చిలో క్రిస్టియన్ సంప్రదాయం ప్రకారం మరోసారి పెళ్లి జరుగుతుంది. కుటుంబ సభ్యులు, సన్నిహిత మిత్రుల సమక్షంలో వీరి వివాహం జరుగనుంది.

ఇరవై ఏళ్ల తర్వాత మళ్లీ...!





వైవిధ్యమైన చిత్రాలను రూపొందించే దర్శకుడు గుణశేఖర్ ప్రస్తుతం 'యుఫోరియా' పేరుతో ఒక యూత్‌ఫుల్ సోషల్ డ్రామాను రూపొందిస్తున్నారు. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న దురాగతాలను ఫోకస్ చేస్తూ గుణశేఖర్ రూపొందిస్తున్న ఈ సినిమా రెండో షెడ్యూల్ ఇటీవలె మొదలైంది. చిత్రానికి సంబంధించిన స్పెషల్ అప్‌డేట్ ఇస్తూ బుధవారం ఓ వీడియో విడుదల చేశారు. ఇందులో నటి భూమిక మేకప్ వేసుకోవడం, షూటింగ్‌లో పాల్గొనడం వంటి విజువల్స్ ఉన్నాయి. ఇరవై ఏళ్ల క్రితం మహేశ్, గుణశేఖర్ కాంబినేషన్‌లో వచ్చిన 'ఒక్కడు' చిత్రంలో భూమిక హీరోయిన్‌గా నటించారు. మళ్లీ ఇన్నేళ్ల తర్వాత ఆమె మళ్లీ గుణశేఖర్ దర్శకత్వంలో నటిస్తున్నారు. భూమిక కోసం ఓ పవర్‌ఫుల్ పాత్రను గుణశేఖర్ సృష్టించారు. ప్రస్తుతం ఆమె పాల్గొనే సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. రాగిణి గుణ సమర్పణలో నీలిమ గుణ 'యుఫోరియా' చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

హిట్ కొట్టడం ఖాయం

డైరెక్టర్ మారుతి



తమిళ్‌లో కవిన్, అపర్ణ దాస్ హీరో హీరోయిన్లుగా తెరకెక్కి ఘనవిజయం సాధించిన సినిమా 'డా..డా..' దీనిని తెలుగులో 'పా..పా..'గా డబ్ చేస్తున్నారు. గణేశ్.కె బాబు దర్శకుడు. తెలుగులో నిర్మాత నీరజ కోన విడుదల చేస్తున్నారు. ఈ నెల 13న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర ట్రైలర్‌ను విడుదల చేసిన డైరెక్టర్ మారుతి మాట్లాడుతూ "ఈ సినిమా బ్లాక్‌బస్టర్ కొట్టడం ఖాయం. తెలుగు ప్రేక్షకులు ఇలాంటి సబ్జెక్ట్‌ను తప్పక ఆదరిస్తారు. చిత్రయూనిట్‌కు ఆల్ ద బెస్ట్" అని చెప్పారు. ఈ సినిమాలో కె.భాగ్యరాజ్, వీటీవి గణేశ్, ప్రదీప్ శక్తి, ఐశ్వర్య భాస్కరన్ కీలక పాత్రలు పోషించారు.

వాస్తవ సంఘటనల ఆధారంగా..



ధర్మ, ఐశ్వర్య శర్మ హీరోహీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'డ్రింకర్ సాయి'. 'బ్రాండ్ ఆఫ్ బ్యాడ్ బాయ్స్' ట్యాగ్‌లైన్. కిరణ్ తిరుమలశెట్టి దర్శకత్వంలో బసవరాజు శ్రీనివాస్, బసవరాజు లహరిధర్, ఇస్మాయిల్ షేక్ నిర్మించారు. వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్ర రిలీజ్ డేట్‌ను మేకర్స్ ప్రకటించారు. ఈ నెల 27న చిత్రం విడుదలవుతోంది. ఇటీవలే విడుదల చేసిన టీజర్, ఫస్ట్ సింగిల్ మంచి బజ్‌ను క్రియేట్ చేస్తున్నాయి. ఈ సినిమాలో పోసాని కృష్ణమురళి, శ్రీకాంత్ అయ్యంగార్ కీలక పాత్రలు పోషించారు.

నటిగా సవాల్ విసిరిన సినిమా

బాలీవుడ్ చిత్రం 'మున్నా మైఖేల్'తో నటిగా అడుగుపెట్టి.. తెలుగులో నటించిన 'మిస్టర్ మజ్ను'.. 'ఇస్మార్ట్ శంకర్'.. 'సవ్యసాచి'.. 'హీరో' తదితర చిత్రాలతో ప్రేక్షకులకు చేరువయ్యారు నిధి అగర్వాల్. ప్రస్తుతం 'హరిహర వీరమల్లు', 'రాజా సాబ్' వంటి భారీ ప్రాజెక్ట్స్‌లో నటిస్తున్నారీ బ్యూటీ. తాజాగా, ఎక్స్ వేదికగా 'ఆస్క్ నిధి' అనే సెషన్‌లో అభిమానులతో ముచ్చటించారు ఆమె. ఈ సందర్భంగా అభిమానులు అడిగిన ప్రశ్నలకు ఆసక్తికరమైన సమాధానాలచ్చారు. ఇందులో భాగంగా ఓ అభిమాని "మీకు తెలుగు వచ్చా" అని ప్రశ్నించారు. ఆమె బదులిస్తూ "ఎందుకు రాదండి. అయినా ఆ సందేహం మీకెందుకొచ్చింది. నేను అందరికీ నమస్కారం అని చెప్పే బ్యాచ్ కాదు" అని అన్నారు. అలాగే, తన నటిస్తున్న సినిమాల గురించి మాట్లాడుతూ "హరిహర వీరమల్లు' సినిమాలో నా పాత్ర పేరు పంచమి. ఈ సినిమా నటిగా నాకు సవాల్ విసిరింది. నటిగా ఎంతో పరిణితి చెందే అవకాశం ఈ సినిమా ఇచ్చింది. పంచమి-వీర మధ్య వచ్చే లవ్‌ట్రాక్ అందరినీ మెప్పిస్తుంది. 'రాజా సాబ్'లో నా పాత్ర మీ అందర్నీ ఆశ్చర్యపరుస్తుంది. త్వరలోనే నేను నటించే ఇంకో సినిమా అప్‌డేట్ ఇస్తా" అని చెప్పారు.



టికెట్లపై కాదు... విస్తృత ప్రయోజనాల కోసం పిల్ వేయండి

▸ పుష్ప-2 టికెట్ రేట్లు పెంపుపై హైకోర్టు



అమరావతి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పుష్ప-2 సినిమా టికెట్ రేట్లు పెంపునకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మెమోను సవాల్ చేస్తూ దాఖలైన పిల్‌పై ధర్మాసనం తీర్పు రిజర్వ్ చేసింది. టికెట్ల రేటు పెంపును పది రోజులకే పరిమితం చేస్తూ గతంలో తాము ఉత్తర్వులు ఇచ్చామని గుర్తు చేసింది. చట్ట నిబంధనలకు లోబడి ధరలు పెంచితే అభ్యంతరం లేదంది. కొత్త సినిమా విడుదలైన ప్రతీసారి టికెట్ ధరల విషయంలో పిల్ వేయడంపై చురకలు అంటించింది. సినిమా టికెట్లపై కాకుండా విస్తృత ప్రజా ప్రయోజనాలు ఇమిడి ఉన్న అంశాలతో వ్యాజ్యాలు వేయాలని సూచించింది. ప్రస్తుత పిల్‌పై తగిన ఉత్తర్వులు జారీ చేస్తామని పేర్కొంటూ తీర్పును రిజర్వ్ చేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. పుష్ప-2 సినిమా టికెట్ల రేట్ల పెంపు, అధిక షోల ప్రదర్శనకు ప్రభుత్వం అనుమతించడాన్ని సవాల్ చేస్తూ నెల్లూరు జిల్లాకు చెందిన ఎస్.వెంకటేశ్వర్లు పిల్ దాఖలు చేశారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. 'సినిమాకు సంబంధించి ప్రీమియర్ షో టికెట్ ధరలు అధికంగా ఉన్నాయి. ప్రభుత్వం గతంలో జారీ చేసిన జీవో 13 ప్రకారం షోలు, సినిమా టికెట్ ధరలు నిర్ణయించేలా హోంశాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశించాలి' అని కోరారు. ధర్మాసనం స్పందిస్తూ.. ప్రీమియర్ షో టికెట్ ధరలు అధికంగా ఉంటే ఆ షోలకు వెళ్లకుండా మానుకోవాలని పిటిషనర్‌కు సూచించింది.

విద్యాసాగర్ బెయిలుపై ముగిసిన వాదనలు

▸ 9న నిర్ణయం వెల్లడిస్తాం: హైకోర్టు

అమరావతి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సినీనటి జెత్వానీ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నమోదైన కేసులో బెయిలు మంజూరు చేయాలని కోరుతూ వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్ వేసిన పిటిషన్‌పై బుధవారం హైకోర్టులో వాదనలు ముగిశాయి. వాదనలు ముగియడంతో ఈ నెల 9న నిర్ణయం వెల్లడిస్తామని ప్రకటించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. అంతకుముందు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపిస్తూ... 'నకిలీ డాక్యుమెంట్ సృష్టించి ఆస్తిని వెంకట నాగేశ్వరరావు అనే వ్యక్తికి విక్రయించేందుకు జెత్వానీ ప్రయత్నించారని విద్యాసాగర్ ఆరోపిస్తున్నారు. జెత్వానీ ఎవరో తమకు తెలియదని, ఆస్తి కొనుగోలుకు ప్రయత్నం చేయలేదని నాగేశ్వరరావు వాంగ్మూలం ఇచ్చారు. పోలీసు ఉన్నతాధికారులతో కలిసి జెత్వానీని కేసులో ఇరికించేందుకు పిటిషనర్ కుట్ర పన్నారు. ఫిర్యాదు లేకుండానే జెత్వానీ, ఆమె కుటుంబ సభ్యుల అరెస్టుకు పోలీసులు ముంబై వెళ్లారు. పిటిషనర్ రాజకీయ పలుకుబడి ఉన్న వ్యక్తి. బెయిలు మంజూరు చేస్తే సాక్షులను ప్రభావితం చేయొచ్చు. పిటిషనర్‌పై దేశవ్యాప్తంగా 17 కేసులున్నాయి. కేసు తీవ్రతను పరిగణలోకి తీసుకొని బెయిలు పిటిషన్‌ను కొట్టివేయండి' అని కోరారు. జెత్వానీ తరఫు న్యాయవాదులు వాసిరెడ్డి ప్రభునాథ్, నర్రా శ్రీనివాసరావు వాదనలు వినిపిస్తూ.. 'ఓ బడా పారిశ్రామికవేత్తపై పెట్టిన రేప్ కేసును ఉపసంహరించుకొనేలా ఒత్తిడి చేసేందుకు జెత్వానీ, ఆమె కుటుంబ సభ్యులను కేసులో ఇరికించారు. ఆమెపై కేసు నమోదు వెనుక అప్పటి ప్రభుత్వంలోని పెద్దల పాత్ర ఉంది. పారిశ్రామికవేత్తపై పెట్టిన కేసులో ఎలక్ట్రానిక్ ఆధారాలను సమర్పించేందుకు ముంబై, బాంద్రా కుర్లా పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన జెత్వానీని, ఆమె తల్లిని ఏపీ పోలీసులు అరెస్టు చేశారు. జెత్వానీ నివాసాన్ని సోదా చేసేందుకు దర్యాప్తు అధికారి సత్యనారాయణకు మేజిస్ట్రేట్ అనుమతిస్తే, దీనికి విరుద్ధంగా కుమార్ అనే అధికారి సోదాలు నిర్వహించారు. కేసు తీవ్రతను పరిగణలోకి తీసుకొని బెయిలు పిటిషన్‌ను కొట్టివేయండి' అని కోరారు.

వర్రా రవీంద్రారెడ్డిపై కేసుల వివరాలు ఇవ్వండి

▸ హోం శాఖ ప్రభుత్వ న్యాయవాదికి హైకోర్టు ఆదేశం

అమరావతి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టిన వ్యవహారంలో అరెస్టు అయ్యి ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న వైసీపీ సానుభూతిపరుడు వర్రా రవీంద్రారెడ్డిపై నమోదైన కేసుల వివరాలను ఇవ్వాలని హోం శాఖ ప్రభుత్వ న్యాయవాదిని హైకోర్టు ఆదేశించింది. విచారణను 2 వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లలో తన భర్త వర్రాపై దాఖలైన కేసుల వివరాలను అందజేసేలా హోం శాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీని ఆదేశించాలని కోరుతూ వర్రా కల్యాణి పిటిషన్ వేశారు. పిటిషనర్ తరఫున న్యాయవాది వీఆర్ రెడ్డి కొవ్వూరి వాదనలు వినిపిస్తూ.. 'అసభ్యకర పోస్టులు పెట్టారనే ఆరోపణలతో వర్రా రవీంద్రారెడ్డిని అరెస్టు చేశారు. రవీంద్రారెడ్డిపై అనేక కేసులున్నాయని కర్నూలు డీఐజీ మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా నమోదైన కేసుల వివరాలను అధికారులు చెప్పడం లేదు. వివరాలను అందజేసేలా ఆదేశాలు ఇవ్వాలి' అని కోరారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) యతీంద్రదేవ్ స్పందిస్తూ.. 'పిటిషన్‌కు విచారణార్హత లేదు. కేసుల వివరాలు కోరుతూ అధికారులకు పిటిషనర్ ఎలాంటి వినతిపత్రం సమర్పించలేదు. అధికారుల నుంచి స్పందన రాకుంటే, వారి నిర్ణయం నిబంధనలకు లోబడి లేకుంటేనే వ్యక్తులు హైకోర్టును ఆశ్రయించగలరు' అని పేర్కొన్నారు.

ధర్మవరం చెరువులో ఆక్రమణలు ఉన్నాయా?

▸ సర్వే చేయకుండా ఎవరు అడ్డుకున్నారు?: హైకోర్టు

అమరావతి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా, ధర్మవరం చెరువులో ఆక్రమణలు తొలగించేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యంపై హైకోర్టు స్పందించింది. చెరువులో ఆక్రమణలు ఏమైనా ఉన్నాయా అనే విషయంపై సర్వే చేశారా? అని రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులను ఆరా తీసింది. చెరువు భూమి విషయంలో సర్వే చేయకుండా ఎవరు అడ్డుకుంటున్నారని వ్యాఖ్యానించింది. ఓ దశలో సర్వేకు ఆదేశాలు ఇచ్చేందుకు ధర్మాసనం సిద్ధమైన నేపథ్యంలో వైసీపీ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి తరఫు న్యాయవాది స్పందిస్తూ.. ఈ దశలో సర్వేకు ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వొదని ప్రాధేయపడ్డారు. గతంలో అధికారులు సర్వే చేశారని, వ్యవహారం గ్రీన్ ట్రైబ్యునల్ ముందు పెండింగ్‌లో ఉందన్నారు. వివరాలు సమర్పించేందుకు సమయం ఇవ్వాలని కోరారు. దీంతో చెరువులో ఆక్రమణల వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆక్రమణల ఆరోపణలతో గ్రీన్ ట్రైబ్యునల్‌లో దాఖలైన కేసు, అధికారులు సమర్పించిన వివరాలను కోర్టు ముందు ఉంచేందుకు కేతిరెడ్డి తరఫు న్యాయవాదిని అనుమతించింది. వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ ముఖ్య కార్యదర్శులు, జిల్లా కలెక్టర్, ధర్మవరం ఆర్డీవో, తహశీల్దార్, ఇరిగేషన్ శాఖ ఎస్ఈ, ఈఈ, ధర్మవరం సబ్‌రిజిస్ట్రార్‌లకు నోటీసులు జారీ చేసింది. అలాగే వ్యక్తిగత హోదాలో కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, సోదరుడి సతీమణి గాలి వసుమతికి నోటీసులు ఇచ్చింది. విచారణను 4 వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటిరవితో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీ సత్యసాయి జిల్లా, ధర్మవరంలో వివిధ సర్వే నంబర్లలో విస్తరించి ఉన్న చెరువులో ఆక్రమణలు తొలగించేందుకు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, ఆక్రమణలు తొలగించేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ అనంతపురం, జుర్జిపేటకు చెందిన కోట్ల అజాష్ బాబు హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు వచ్చింది.

ఇసుక అక్రమ తవ్వకాలపై సుప్రీం సీరియస్



కచ్చితంగా అడ్డుకట్ట వేయాలని స్పష్టీకరణ

నిజానిజాలు, లెక్కలతో రావాలని ఆంధ్ర, తమిళనాడు సహా 5 రాష్ట్రాలకు ఆదేశం

తదుపరి విచారణ జనవరి 27కి వాయిదా

న్యూఢిల్లీ, డిసెంబరు 4: సహజ వనరైన ఇసుకను అడ్డగోలుగా అక్రమంగా తవ్వడం తీవ్రమైన అంశమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇలాంటి కార్యకలాపాలను సమర్థంగా అడ్డుకోవాలని తేల్చిచెప్పింది. ఆయా రాష్ట్రాల్లో అక్రమ తవ్వకాలపై నిజానిజాలు, గణాంకాలు సమర్పించాలని ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పంజాబ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. తదుపరి విచారణను జనవరి 27వ తేదీకి వాయిదావేసింది. ఈ ఐదు రాష్ట్రాల్లో నదులు, బీచ్‌లలో విచ్చలవిడిగా ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని, దీనివల్ల పర్యావరణానికి ఎనలేని హాని జరుగుతోందని ఎం.అళగిరిసామి అనే వ్యక్తి 2018లో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) వేశారు. పర్యావరణ ప్రణాళిక, అనుమతులు లేకుండానే పలు సంస్థలకు అధికారులు తవ్వకాలకు అనుమతులిస్తున్నారని, ఈ వ్యవహారంపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరారు. స్థానిక మాఫియాల ప్రమేయంతో ఇవి నడుస్తున్నాయని.. ఈ రాకెట్ నడిపేందుకు ఆయుధాలు కూడా వాడుతున్నారని పేర్కొన్నారు. అక్రమ తవ్వకాలతో రూ.వేల కోట్ల మేర ఖజానాకు నష్టం వాటిల్లుతోందని తెలిపారు. ఐదు హెక్టార్ల కంటే తక్కువ ఏరియాలో ఇసుక తవ్వకాల లీజులు, రెన్యువల్స్‌ను పర్యావరణ అనుమతి తీసుకున్నాకే మంజూరు చేయాలని సర్వోన్నత న్యాయస్థానం గతంలోనే ఆదేశాలిచ్చిందని గుర్తుచేశారు. అళగిరిసామి తరఫున న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపించారు. అక్రమ తవ్వకాలపై అధికారులు చర్యలు తీసుకోకపోగా.. వాటిని కప్పిపుచ్చుతున్నారని తెలిపారు. మార్గదర్శకాలు లేకపోవడం వల్ల పలు రాష్ట్రాల్లో ఇసుక కుంభకోణాలు జరుగుతున్నాయన్నారు. ఇసుక తవ్వకాలకు పర్యావరణ ప్రభావ అంచనా (ఈఐఏ) అవసరమో కాదో ధర్మాసనం తెలుసుకోగోరింది. ఒకవేళ అవసరమైతే.. అందుకు ఏం చేయాలో నిబంధనావళి ఏమిటని ప్రశ్నించింది. తవ్వకాలకు సంబంధించిన వాస్తవాలు, గణాంకాలతో తదుపరి విచారణ తేదీకల్లా సిద్ధంగా ఉండాలని ఐదు రాష్ట్రాల తరఫు న్యాయవాదులను ఆదేశించింది. అక్రమ తవ్వకాలను అడ్డుకునేందుకు తమిళనాడు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నట్లు ఆ రాష్ట్రం తరఫు సీనియర్ న్యాయవాది అమిత్ ఆనంద్ తివారీ తెలిపారు. జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్‌జీటీ) ఆదేశాలకు వ్యతిరేకంగా తమ వద్ద ఇలాంటి పిటిషన్ దాఖలైందో లేదో పరిశీలించాల్సి ఉందని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

రూప్ మాయలు!

(మొదటి పేజీ తరువాయి)

మొదలయ్యేవి. ఎన్నికలకు సరిగ్గా నెలరోజుల ముందు టీడీపీలో చేరిన ఈ ద్వితీయ శ్రేణి నాయకుడికి ఎందుకింత ప్రాధాన్యం? నెల్లూరు జిల్లాలో పదకొండు మంది టీడీపీ ఎమ్మెల్యేలు, అందులో ఇద్దరు మంత్రులు ఉండగా... నెల్లూరు నగర డిప్యూటీ మేయర్ హవా నడవడమేమిటి? వైసీపీ అధికారంలో ఉండగా అబ్బాయ్ అనిల్‌కుమార్ యాదవ్... ఇప్పుడు ఆయన బాబాయ్ రూప్‌కుమార్ క్వార్ట్జ్ గనుల్లో చక్రం తిప్పుతుండటంపై మంగళవారం 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనం సంచలనం సృష్టించింది. గనుల శాఖతో సంబంధమున్న ఒక రిటైర్డ్ అధికారి అండతోనే రూప్‌కుమార్ ఇంతగా రెచ్చిపోతున్నట్లు తెలిసింది. తన అధీనంలోని గనుల్లో తవ్వకాల పునరుద్ధరణకు ఒక డిప్యూటీ డైరెక్టర్‌ను తప్పించేసి, ఫైలుపై 'షార్ట్ కట్'లో దిగువ స్థాయి అధికారితో సంతకం చేయించినట్లు తెలిసింది.

ఆ నాలుగూ...

రూప్‌కుమార్ యాదవ్ అధీనంలోని నాలుగు క్వారీల్లో వైసీపీ హయాంలో కోట్లాది రూపాయల విలువైన క్వార్ట్జ్ తవ్వకాలు జరిగాయి. చాలా అక్రమాలు చోటు చేసుకున్నాయి. కూటమి సర్కారు వచ్చాక... జిల్లాలో క్వార్ట్జ్, సిలికా గనుల లీజులను పొడిగించాలని నిర్ణయించుకున్న రాష్ట్ర ప్రభుత్వం, అన్ని గనులను తనిఖీ చేసి వాటి పరిధిలో జరిగిన తవ్వకాలు, విక్రయాలు, పర్మిట్లు తదితరాలను క్షుణంగా పరిశీలించాలని భావించింది. ఈ ఏడాది ఆగస్టులో ప్రకాశం, తిరుపతి, కడప, అనంతపురం జిల్లాలకు చెందిన మైనింగ్ ఉద్యోగులు నాలుగు బృందాలుగా విడిపోయి... నెల్లూరు జిల్లా వ్యాప్తంగా క్వార్ట్జ్, సిలికా గనులను పరిశీలించి ప్రభుత్వానికి నివేదికలు పంపారు. అయితే... సైదాపురం మండలంలో రూప్‌కుమార్‌విగా చెప్పుకొంటున్న నాలుగు క్వారీల్లో మాత్రం ఒక్క అధికారీ అడుగు పెట్టలేదు. రిటైర్డ్ అధికారి 'సూచనల' మేరకు... అప్పటి డిప్యూటీ డైరెక్టర్ ఈ మేరకు 'జాగ్రతలు' తీసుకున్నట్లు ఆరోపణలున్నాయి.

'తప్పుడు' సంకేతం

తనిఖీల ప్రక్రియ పూర్తయిన తర్వాత పాత డీడీ బదిలీపై వెళ్లిపోయారు. సెప్టెంబరు 29న కొత్తగా చంద్రశేఖర్ అనే అధికారి ఆ బాధ్యతలు చేపట్టారు. జిల్లావ్యాప్తంగా ఉన్న క్వార్ట్జ్ నిక్షేపాలను సొంతం చేసుకోవాలనే వ్యూహంతో రంగంలోకి దిగిన రూప్‌కుమార్... తొలుత తన అధీనంలో నడుస్తున్న నాలుగు క్వారీలకు అనుమతుల కోసం అమరావతికి ఫైలు పెట్టమని డీడీని కోరినట్లు తెలిసింది. అయితే, నాలుగు క్వారీలను తనిఖీ చేసిన తర్వాతే ఫైలు పంపుతానని చంద్రశేఖర్ తెగేసి చెప్పారు. ఫైలును ఆమోదిస్తూ ఆయన డిజిటల్ సిగ్నేచర్ చేస్తేకానీ పని జరగదు. దీంతో అదను కోసం వేచి చూశారు. గత నెల 26న డీడీ చంద్రశేఖర్ హైకోర్టు పని నిమిత్తం అమరావతికి వెళ్లినప్పుడు... గుట్టు చప్పుడు కాకుండా ఆయన డిజిటల్ సిగ్నేచర్ (థంబ్, డాంగిల్) ఆథరైజేషన్‌ను తీసేశారు. మైనింగ్ రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ ద్వారా అప్పటికప్పుడు ఫైలును అప్‌లోడ్ చేయించారు. మరుసటి రోజు విధుల్లోకి వచ్చిన డీడీ ఇది చూసి విస్తుపోయారు. అసలేం జరిగిందని కార్యాలయంలో ఆరా తీశారు. ఆయన అక్కడే, అదే పదవిలో ఉంటే తమకు ముప్పు అని భావించి... నవంబరు 30వ తేదీన ఆయనను ప్రభుత్వానికి సరెండర్ చేశారు. గనుల శాఖతో సంబంధమున్న రిటైర్డ్ అధికారి సూచనల మేరకు ప్రస్తుతం సర్వీసులో ఉన్న మరో అధికారి ద్వారా ఈ తతంగాన్ని నడిపించారు. అయితే, జిల్లా నుంచి ఫైలు రాగానే ప్రధాన కార్యాలయంలో దానిని ఆమోదించారు. రూప్‌కుమార్‌కు చెందిన నాలుగు గనులను పది రోజుల కిందట పునరుద్ధరించారు. దీని వెనుక భారీగా అక్రమాలు జరిగినట్లు సమాచారం రావడంతో తెల్లవారేసరికి అనుమతులను రద్దు చేశారు.

భారీగా అక్రమాలు...

అన్నీ సక్రమంగా ఉంటే తనిఖీలకు భయపడాల్సిన అవసరమే ఉండదు. కానీ... రూప్ కుమార్ అధీనంలోని నాలుగు గనుల్లో వైసీపీ హయాంలోనే విచ్చలవిడిగా తవ్వకాలు జరిగినట్లు చెబుతున్నారు. తెలంగాణ నుంచి తప్పుడు పర్మిట్లు తెప్పించుకొని ఇక్కడి నుంచి క్వార్ట్జ్ తవ్వి తరలించారని అంటున్నారు. ఇప్పుడు గనుక ఆ నాలుగు క్వారీలను పక్కాగా తనిఖీ చేస్తే అసలు విషయం బయట పడుతుంది. కోట్లాది రూపాయల పెనాల్టీ చెల్లించాల్సి వస్తుంది. అందుకే... రిటైర్డ్ అధికారి అండతో తనిఖీల నుంచి తప్పించుకుని, ఆ తర్వాత మరో అధికారి సంతకంతో ఫైలు పంపినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చివరి నిమిషంలో ఉన్నతాధికారులు మేల్కోవడంతో... ఈ అక్రమాలకు అడ్డుకట్ట పడింది.

కాపు కోటాపై అభ్యంతరం ఏంటి?

▸ సుప్రీంకోర్టులో ఎవరు సవాల్ చేశారు?

▸ వివరాలు కోరిన హైకోర్టు ధర్మాసనం

అమరావతి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా వెనుకబడిన తరగతుల(ఈడబ్ల్యూఎస్)కు విద్య, ఉద్యోగ అవకాశాల్లో 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ చేసిన 103వ రాజ్యాంగ సవరణను సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యాలపై సుప్రీంకోర్టు ఏం చెప్పిందని హైకోర్టు ప్రశ్నించింది. ఈడబ్ల్యూఎస్ కోటాలో కాపులకు 5శాతం కేటాయిస్తూ గత టీడీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాలను సుప్రీంకోర్టులో ఎవరు సవాల్ చేశారని ప్రశ్నించింది. ఆయా వివరాలను ధర్మాసనం ముందు ఉంచాలని పిటిషనర్లకు హైకోర్టు స్పష్టం చేసింది. విచారణను జనవరి 29కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. ఈడబ్ల్యూఎస్ కోటాలో కాపులకు 5% రిజర్వేషన్ కల్పించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ 'కాపు సంక్షేమ సేన' వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ఎంపీ హరిరామజోగయ్య హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. కాపులకు 5శాతం రిజర్వేషన్ కల్పించేలా తీసుకొచ్చిన చట్టాలు అమలుచేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అయితే, ఇదే వ్యవహారంపై మరిన్ని వ్యాజ్యాలు దాఖలయ్యాయి. మరో వైపు కాపులకు 5శాతం రిజర్వేషన్ కల్పించడాన్ని సవాల్ చేస్తూ మరికొన్ని వ్యాజ్యాలు వచ్చాయి. హరిరామజోగయ్య తరఫున న్యాయవాదులు పోలిశెట్టి రాధాకృష్ణ, మరికొందరు పిటిషనర్ల తరఫున న్యాయవాదులు శ్రీధర్, కృష్ణ వాదనలు వినిపించారు. కాపులకు 5శాతం రిజర్వేషన్ కల్పించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యాలను సుప్రీంకోర్టు కొట్టివేసిందని తెలిపారు. కాపు కోటాను సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యాలపై న్యాయవాదులు ఉగ్రనరసింహ, కారుమంచి ఇంద్రనీల్ బాబు వాదనలు వినిపించారు. ఒకే సామాజికవర్గానికి 5శాతం రిజర్వేషన్ కల్పించడానికి వీల్లేదన్నారు. ఈ సందర్భంగా ధర్మాసనం.. ఒకే సామాజికవర్గానికి సగం(5 శాతం) రిజర్వేషన్ కల్పించడం సబబు కాదని పేర్కొంది.

'చదును'లో చక్కబెట్టింది.. 460 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

ఉపాధి నిధులతోనే గత ప్రభుత్వం చేపట్టింది. కేంద్ర ప్రభుత్వం గుర్తించి హెచ్చరించడంతో ఈ పనులను హౌసింగ్ శాఖకు బదలాయించారు. అప్పటికి రూ.1,125 కోట్లు విలువైన చదును పనులు చేసిన వైసీపీ కార్యకర్తలు...ఎంబుక్‌లు ట్యాంపరింగ్ చేసి రూ.1585 కోట్ల మేర పనులు చేసినట్లు రికార్డుల్లో చూపించుకున్నారు. ఇలా పనులు చేయకుండానే సుమారు రూ.460 కోట్లు జేబులో వేసుకున్నారు. ఇందులో రూ. 220 కోట్లు అప్పటి ప్రభుత్వమే చెల్లించింది. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత... మిగతా రూ. 240 కోట్లు ఇప్పించాలంటూ కోర్టుకు వెళ్లారు. ఆ బిల్లులు క్లియర్ చేయాలంటూ కోర్టు... కూటమి ప్రభుత్వాన్ని ఆదేశించింది.

ప్రభుత్వస్థలంలోని మట్టికీ చెల్లింపులు!

జగనన్న కాలనీల పేరిట గత వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన పథకంలో మొదట ఇంటి స్థలాల కోసం భూమిని కొనుగోలు చేయడంలో భారీ దోపిడీకి తెరదీశారు. ఆ తర్వాత ఆ భూమి చదును పేరిట మరింతగా బరితెగించారు. జగనన్న కాలనీల్లో ఇంటి స్థలాల చదును చేసే పనులు వైసీపీ కార్యకర్తలకు అప్పగించారు. ఒక ఎకరం చదును చేయడానికి సుమారు నాలుగు వేల క్యూబిక్ మీటర్ల మట్టి అవసరమవుతోందని అంచనా వేశారు. ఒక క్యూబిక్ మీటర్‌కు రూ.230ల నుంచి రూ.300 చొప్పున.. మొత్తం ఎకరం చదును కు సుమారు రూ.10 లక్షలు అంచనా వేశారు. అలాగే, దేశంలో ఎక్కడా లేని విధంగా కాస్ట్ ఆఫ్ గ్రావెల్ అనే పేరుతో క్యూబిక్ మీటర్‌కు రూ.134.34 ధర నిర్ణయించారు. ఇది నిబంధనలకు విరుద్ధం. ఇక్కడితో ఆగలేదు. మట్టిని తీసుకురావడం, చదును చేయడం తదితర ఇతర కార్యక్రమాలకు వేరుగా రేట్లు రూపొందించారు. మట్టిని రవాణా చేసేందుకు అనుకూలంగా చేయడాన్ని కాస్ట్ ఆఫ్ గ్రావెల్ అనే పదానికి అర్థంగా భాష్యం చెప్పారు. అంటే మట్టిని తవ్వి తీసే ప్రక్రియ అన్నమాట. వాస్తవానికి క్యూబిక్ మీటర్ మట్టి తవ్వి తీసేందుకు ఏ రకంగా రేట్ నిర్ణయించినా రూ.34కు మించదు. అంటే విగిలిన రూ.100లు ఉచితంగా ఇస్తున్నట్లే. ప్రభుత్వ స్థలంలో సేకరించే మట్టికి ఉపాధి నిధుల కింద ఎందుకు చెల్లింపులు చేయాలన్నదే మిలియన్ డాలర్ల ప్రశ్న!

కేంద్రం కన్నెర్ర...

రాష్ట్రవ్యాప్తంగా 20,825 పనులకు సంబంధించి 44 వేల ఎకరాలను చదును చేసి ఇంటి స్థలాలకు అనుకూలంగా మార్చేందుకు రూ.3,206 కోట్లతో 2019-20లో అంచనాలు రూపొందించారు. 2021 మార్చి లోపు సుమారు రూ.1125 కోట్లు విలువ కలిగిన పనులను వైసీపీ నేతలు, కార్యకర్తలు చేపట్టారు. 2021 నవంబర్ నాటికి ఏపీ ఉపాధి హామీ పథకం వెబ్ నిర్వహణ ఎన్ఐసీకి అప్పగించారు. దీంతో అప్పట్లో ఈ పనులన్నింటినీ ఎన్ఐసీ వెబ్‌సైట్‌లోకి అప్‌లోడ్ చేశారు. ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా ఇళ్ల కాలనీల చదును పనులు చేపట్టరాదని, అలా ఎక్కడైనా చేపట్టి ఉంటే సంబంధిత అధికారుల నుంచి సొమ్ము రికవరీ చేసి రాష్ట్ర ఉపాధి హామీ కౌన్సిల్ అకౌంట్‌లో జమచేయాలని ఆదేశించింది. దీంతో చదును కార్యక్రమాన్ని హౌసింగ్ విభాగానికి మార్చాలని 2022 మార్చి 17న గ్రామీణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. వైసీపీ కార్యకర్తలకు చెల్లించాల్సిన బిల్లులను ఇక నుంచి హౌసింగ్ ద్వారా క్లియర్ చేసేందుకు సిద్ధమయ్యారు. అప్పటికే ఉపాధి హామీ పథకం ద్వారా ఇంటి చదును పనులకు రూ.783 కోట్లు చెల్లించారు. ఇక రూ.342 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఆ నిధులను హౌసింగ్ శాఖ ద్వారా చెల్లించాలి. ఈ నిధులను ప్రభుత్వం హౌసింగ్‌శాఖకు మంజూరుచేస్తే, హౌసింగ్ శాఖ ఆయా జిల్లా డ్వామా పీడీల ఆధ్వర్యంలోనే చెల్లింపులు చేయాలని నిర్ణయించారు. అయితే వైసీపీ నేతలు ఎక్కడికక్కడ అప్పటికే చేపట్టిన పనులకు సంబంధించిన ఎంబుక్‌లను ట్యాంపరింగ్ చేసేందుకు ఉపాధి సిబ్బందిని ప్రలోభపెట్టారు.

ట్యాంపరింగ్ ఇలా...

ఒక పంచాయతీలో రూ.10 లక్షల అంచనా విలువ కలిగిన చదును పనులను కేటాయించారు. ఉపాధి హామీ పథకం కింద ఈ పనులు చేస్తున్నట్లు కేంద్రం తెలుసుకుని నిలుపుదల చేయించింది. ఆ పనులను అప్పటి జగన్ ప్రభుత్వం హౌసింగ్ శాఖకు బదలాయించింది. ఇదే అదునుగా ఈ పనులు చేస్తున్న వైసీపీ కార్యకర్తలు రెచ్చిపోయింది. ఆ గ్రామంలో చేసింది రూ.ఆరు లక్షల పనులు. కానీ, పది లక్షల పనులూ పూర్తి చేసేసినట్టు ఎంబుక్‌ల్లో కొలతలు నమోదు చేశారు. అంటే మరో రూ.4 లక్షల మేర పనులు చేసినట్లు అదనంగా రికార్డు చేయించారు. తమ దోపిడీకి సహకరించని ఉపాధి సిబ్బందిని ఉద్యోగాల నుంచి తొలగిస్తామని బెదిరించారు. కొన్ని చోట్ల వారికి భారీగా లంచమిచ్చి రికార్డు చేయించారని తెలిసింది. సమగ్ర దర్యాప్తు జరిపిస్తేనే ఈ దందా లోతుగా తెలుస్తుందని కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు కోరుతున్నారు.

53 కొత్త జూనియర్ కాలేజీలకు గ్రీన్‌సిగ్నల్

అమరావతి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 37 మండలాలు, 2 పట్టణ ప్రాంతాల్లో కొత్త ప్రైవేటు జూనియర్ కాలేజీల ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. నోటిఫికేషన్ జారీకి అనుమతిస్తూ పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. 37 మండలాల్లో 47 కాలేజీలు, 2 పట్టణ ప్రాంతాల్లో 6 కాలేజీల ఏర్పాటుకు అనుకూల పరిస్థితి ఉందని ఇంటర్ విద్యామండలి కార్యదర్శి కృతికా శుక్లా పంపిన ప్రతిపాదనను ఆమోదించారు.

రైస్‌మిల్లుల్లో ఆకస్మిక తనిఖీలు

రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఎండీ మన్‌జీర్ జిలానీ అమూన్ ఆదేశాల మేరకు అధికారులు రైసు మిల్లుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్లు, ఇతర ఉన్నతాధికారులు, లీగల్ మెట్రాలజీ, పోలీసు సిబ్బందితో ఏర్పాటు చేసిన 5 ప్రత్యేక బృందాలు బుధవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు కృష్ణా జిల్లాలోని రైసు మిల్లుల్లో తనిఖీలు నిర్వహించాయి. ధాన్యం తూకాల్లో కోతలు విధిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఖరీఫ్ ముగిసేవరకు ఆకస్మిక తనిఖీలు కొనసాగిస్తామని సివిల్ సప్లయిస్ అధికారులు తెలిపారు.

పెండింగ్ రైల్వే ప్రాజెక్టులు పూర్తి చేయండి: లావు

న్యూఢిల్లీ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఏపీలో పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని కేంద్ర ప్రభుత్వానికి టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణ దేవరాయలు విజ్ఞప్తి చేశారు. పెండింగ్‌లో ఉన్న నడికుడి-శ్రీకాళహస్తి, కడప-బెంగళూరు, రేణిగుంట-గూడూరు, కోటిపల్లి-నర్సాపూర్ లైన్లను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. బుధవారం.. లోక్‌సభలో రైల్వే సవరణ బిల్లు-2024పై జరిగిన చర్చలో ఎంపీ లావు మాట్లాడుతూ బిల్లును స్వాగతించారు. ప్రధాన మెట్రోపాలిటన్ నగరాలను అనుసంధానం చేసే అమరావతి ప్రాజెక్టుకు రూ.2,245 కోట్లతో ఆమోదం తెలిపినందుకు ధన్యవాదాలు తెలిపారు. కొవిడ్ లాక్‌డౌన్‌లో నిలిపివేసిన రైల్వే స్టాపులను పునరుద్ధరించాలన్నారు.

'ఈగల్' అధిపతిగా ఆకే రవికృష్ణ

గంజాయి, మత్తు పదార్థాల నిరోధానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'ఈగల్' విభాగానికి అధిపతిగా ఐజీ ర్యాంకు ఐపీఎస్ అధికారి ఆకే రవికృష్ణను నియమిస్తూ సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న గంజాయి, మత్తు కట్టడికి ఇప్పటికే 459 మంది సిబ్బందిని కేటాయించారు. గంజాయి సాగు నుంచి వినియోగం వరకు.. మత్తు పదార్థాల స్మగ్లింగ్‌పై ఉక్కుపాదం మోపేందుకు ఈగల్ కీలకంగా వ్యవహరించనుంది.

'అరబిందో'పై సీబీఐ విచారణ వేయాలి: సోమిరెడ్డి

నెల్లూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): 'ట్రస్టు పేరుతో సేవ చేయాల్సింది పోయి అరబిందో సంస్థ ఘోర పాపాలు చేసింది. ఒక్క 104 సర్వీసులోనే రూ.175 కోట్లు దోచేస్తే, ఇక 108 సర్వీసులో ఇంకెన్ని వందల కోట్లు దోచేసిందో?. 104, 108 సర్వీసుల నిర్వహణలో జరిగిన అక్రమాలపై సీబీఐ లేదా సీఐడీ విచారణ వేయాలి. అరబిందో సంస్థ యాజమాన్యానికి కఠిన శిక్షలు పడాలి' అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం నెల్లూరులో మాట్లాడారు. గతంలో సత్యం రామలింగరాజు, జీవీకే సంస్థలు 104, 108 సర్వీసులను సమర్థవంతంగా నిర్వహించి రోల్ మోడల్‌గా నిలిస్తే, ఇప్పుడు అరబిందో సంస్థ భ్రష్టు పట్టించిందని మండిపడ్డారు. రెండున్నరేళ్ల కాలంలో 34 లక్షల కేసులకు సంబంధించి 17.80 లక్షల మంది పేషెంట్ల విషయంలో గోల్డెన్ అవర్ పాటించలేదన్నారు. ఈ విషయాన్ని కాగ్ నిర్ధారించిందని చెప్పారు.

రైల్వే జోన్‌కు సీఎం నిరంతర కృషి

▸ లోక్‌సభలో కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్

న్యూఢిల్లీ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యరూపం దాల్చడానికి అవసరమైన అన్ని చర్యలూ చేపడుతున్నట్లు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ లోక్‌సభలో తెలిపారు. రైల్వే జోన్‌పై సీఎం చంద్రబాబు నిరంతరం కృషి చేస్తున్నారని, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు పర్యవేక్షిస్తున్నారని.. మొత్తం మీద రైల్వే జోన్ కార్యక్రమాలు పూర్తి చేయడానికి కేంద్రం కట్టుబడి ఉందన్నారు. దక్షిణ కోస్తా రైల్వే జోన్ అంశంపై బుధవారం లోక్‌సభలో విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్ మాట్లాడడంతో కేంద్ర మంత్రి స్పందించారు. 2019లో విశాఖకేంద్రంగా రైల్వే జోన్ ప్రకటించినా భూసమస్యల కారణంగా ప్రాజెక్టు ఐదేళ్ల పాటు ఆలస్యమయిందని ఎంపీ శ్రీభరత్ అన్నారు. తాజాగా ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రప్రభుత్వం భూమిని అప్పగించడంతో ప్రాజెక్టు మళ్లీ పట్టాలెక్కిందని పేర్కొన్నారు. ఆపరేషనల్ కార్యక్రమాలు చేపట్టాలని ఆయన కేంద్రాన్ని కోరారు.

పూల బారులు.. కొత్త దారులు..





విశాఖపట్నంలో కాన్వెంట్ జంక్షన్ నుంచి షీలానగర్‌కు వెళ్లే మార్గంలో డివైడర్‌పై పూల మొక్కలు రంగుల హరివిల్లును తలపిస్తున్నాయి. పాదలకే పూలు పూయడం వీటి ప్రత్యేకం. ఒక దగ్గర గులాబీ, కనకాంబరం పూలను తలపించేలా మనసు దోచేస్తుండగా.. మరోచోట తెల్లటి పువ్వులు నిర్మలత్వాన్ని చాటుతున్నాయి. తీర్చిదిద్దినట్టు, ప్రత్యేకంగా అమర్చినట్టు ఉన్న ఈ మార్గాన్ని విశాఖపట్నం పోర్టు నిర్వహిస్తోంది.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

'స్టెల్లా'లో మళ్లీ తనిఖీ

- పాల్గొన్న 5 ప్రభుత్వ శాఖల బృందం
- నౌకలో బియ్యం శాంపిల్స్ సేకరణ
- అన్ని హేచస్‌లలో రేషన్ కోసం గాలింపు
- పరీక్షల కోసం ల్యాబ్‌కు శాంపిల్స్
- రకరకాల పేర్లతో బియ్యం పాకెట్లు
- ఉన్నతాధికారులకు సమగ్ర నివేదిక


బుధవారం స్టెల్లా ఎల్ పనామా నౌకలో అధికారుల తనిఖీ



రేషన్.. పరేషాన్

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ పోర్టు నుంచి విదేశాలకు బియ్యం రవాణా చేస్తున్న స్టెల్లా ఎల్ పనామా నౌకలో ఐదు ప్రభుత్వ శాఖల అధికారులు తనిఖీలు చేశారు. బుధవారం ఉదయం 10.30గంటల నుంచి రాత్రి వరకు తనిఖీలు కొనసాగించారు. విదేశాలకు రేషన్ బియ్యం తరలిస్తున్నారన్న అనుమానంతో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఇటీవల కాకినాడ యాంకరేజీ పోర్టులో తనిఖీలు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పోర్టుకు సమీపంలోని సముద్ర జలాల్లో లంగరు వేసి ఉన్న స్టెల్లా నౌకలో అధికారుల బృందం తనిఖీలు చేపట్టింది. భారీ నౌకలో ఐదు హేచస్(గదులు)లో ఉన్న బియ్యాన్ని 500 గ్రాముల చొప్పున శాంపిల్స్ తీసుకున్నారు. వీటిని పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపుతున్నారు. నౌకలో మొత్తం 38వేల టన్నుల బియ్యం ఉండగా, ఒక్కో హేచస్‌లో 8 నుంచి 10 వేల టన్నుల వరకు ఉంది. ఇండియన్ లాంగ్ గ్రెయిన్ పర్ బాయిల్డ్ రైస్, వైట్ లిల్లీ పేరుతో 25కిలోల బియ్యం ప్యాకింగ్‌తో బస్తాలను గుర్తించారు. యూనివర్సల్ రైస్ పేరిట 25 కిలోల బస్తాలు కనిపించాయి. ఇలా అనేక రకాల పేర్లతో ఆకర్షణీయమైన ప్యాకింగ్‌లో బస్తాలను విదేశాలకు తరలిస్తున్నారు. ఈ నౌక గత నెల 12న కాకినాడ సముద్రతీరానికి చేరుకుంది. బియ్యం లోడింగ్ ప్రారంభించి తిరుగు ప్రయాణానికి సిద్ధం కాగా, దానిలో పీడీఎస్ బియ్యం ఉన్నాయన్న సమాచారంతో కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ గత నెల 27న తొలుత తనిఖీ చేశారు. ఇందులో లవన్ కంపెనీకి చెందిన 640 టన్నుల పీడీఎస్ బియ్యం గుర్తించారు. ఆ తర్వాత డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గతనెల 29న తనిఖీల నిమిత్తం కాకినాడ సముద్రంలోకి వెళ్లారు. వాతావరణం అనుకూలించకపోవడంతో తనిఖీలు చేయలేదు. స్టెల్లా నౌకలో బియ్యం లోడుపై సమగ్ర వివరాలు కావాలని ప్రభుత్వం ఆదేశించడంతో తాజాగా తనిఖీలు చేశారు. దాదాపు 30 అడుగుల లోతు వరకు ఉన్న బియ్యం బస్తాల లోడ్‌లో కింది వరకు తనిఖీల బృందం వెళ్లి బస్తాల నుంచి శాంపిల్స్ తీసుకుంది. కింది భాగంలో బస్తాల నుంచి శాంపిల్స్ సేకరించడం చాలా కష్టమైంది. ఒక హేచస్‌లో శ్రీ షిప్పింగ్ లాజిస్టిక్ కాకినాడకు చెందిన బియ్యం శాంపిల్స్ సేకరించారు. దీనికి సంబంధించిన సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నారు. నౌక చీఫ్ ఆఫీసర్ అంత్రోష్ మీడియాతో మాట్లాడుతూ... పీడీఎస్ బియ్యం ఉన్నాయనే కారణంతో లోడింగ్ నిలిచిపోయిందని, అనుమతి ఇచ్చిన తర్వాత నౌక పశ్చిమ ఆఫ్రికాలో బెనిన్ దేశానికి వెళుతుందని తెలిపారు. కాకినాడ తీరం నుంచి ఆ దేశానికి వెళ్లడానికి 26 రోజుల సమయం పడుతుందన్నారు. ఆ దేశంలో కొటోనో అనే పోర్టులో బియ్యం దిగుమతి అవుతుందని చెప్పారు. తనిఖీలు చేసిన బృందంలో రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ, పోలీసు, పోర్టు, కస్టమ్స్ శాఖల నుంచి పదిమంది అధికారులు ఉన్నారు.

సీఐడీ దూకుడు

కాకినాడ పోర్టు కేసులో కేవీ రావు వాంగ్మూలం!

- సాక్షుల విచారణ, ఆధారాల సేకరణపై దృష్టి
- 3వేల కోట్ల ఆస్తి కొట్టేయడానికి కుట్ర.. మోసం.. బెదిరింపులు
- ఏ1 విక్రాంత్ రెడ్డిని అరెస్టు చేసి విచారించే వీలు
- ఆధారాలు లభిస్తే జగన్ పేరూ నిందితుల జాబితాలో!

అమరావతి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఒక ప్రభుత్వమే మాఫియా అవతారం ఎత్తితే ఎలా ఉంటుందో గత వైసీపీ పాలనలో జరిగిన నేరాలు, ఘోరాలు, బెదిరింపు వ్యవహారాలు చాటుతున్నాయి. కాకినాడ పోర్టు వ్యవహారం ఇందుకు పరాకాష్ఠ అని సీఐడీ భావిస్తోంది. దీంతో కాకినాడ కేసులో సీఐడీ అధికారులు దూకుడు పెంచేశారు. రూ. మూడు వేల కోట్ల ఆస్తిని కొల్లగొట్టిన ఈ వ్యవహారంలో బుధవారం బాధితుడు కేవీ రావు వాంగ్మూలాన్ని నమోదుచేసినట్లు సమాచారం. ఈ కేసులో ప్రధాన నిందితుడు వై.విక్రాంత్ రెడ్డి నేరుగా తాడేపల్లి ప్యాలెస్‌కు కేవీ రావును తీసుకెళ్లి బెదిరించినట్లు ఆరోపణలు నమోదయ్యాయి. ఈ మొత్తం ఎపిసోడ్ ఎలా జరిగింది.... ఆ సమయంలో తాడేపల్లి ప్యాలెస్‌లో ఎవరున్నారు...బాధితుడితోపాటు ఇంకెవరైనా సాక్షులు ఉన్నారా.....హైదరాబాద్‌లో విక్రాంత్ రెడ్డి ఇంటికెళ్లినప్పుడు కేవీ రావుతోపాటు ఎవరైనా వెళ్లారా.... తదితర అంశాలపై సమీక్షించిన సీఐడీ అధికారులు....కేవీ రావు వాంగ్మూలం రికార్డు చేసినట్లు తెలిసింది. ఒకటి రెండు రోజుల్లో ప్రధాన నిందితుడిని అరెస్టు చేసే అవకాశాలపై కసరత్తు చేసినట్లు సమాచారం. ఏడేళ్లకు పైగా శిక్షలు పడే సెక్షన్లు ఉన్నందున ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా నేరుగా అరెస్టు చేసి ప్రశ్నించేందుకు మొగ్గు చూపుతున్నట్లు తెలిసింది. మరోవైపు ఈ వ్యవహారంలో ఎవరి పాత్ర ఏంటి.....ఆడిటర్ పీకేఎఫ్ శ్రీధర్ 'సంతానం ఎల్ఎల్‌పీ'తో ఎవరు 900కోట్ల మోసం రిపోర్టు చేయించారు.....సంస్థ చేతులు మారగానే కేవలం తొమ్మిది కోట్లకే ఎలా తగ్గించారు.....అనేదానిపై లోతుగా దర్యాప్తు చేయాలని నిర్ణయించారు. ఎవరి పాత్రపై ఆధారాలు లభించినా వెంటనే అరెస్టు చేయాలని సీఐడీ అధికారులు భావిస్తున్నట్లు తెలిసింది. ఆధారాలు లభిస్తే ఈ కేసులో జగన్ పేరు కచ్చితంగా చేర్చే అవకాశం ఉందని న్యాయ నిపుణులు చెబుతున్నారు. ఈ కేసులో కొందరు అధికారులు, ప్రభుత్వంలోని పెద్దల పాత్రపైనా సాక్ష్యాలు సేకరించే పనిలో సీఐడీ నిమగ్నమై ఉంది. 'రూ.మూడు వేల కోట్ల ఆస్తి కొట్టేయడానికి నేరపూరిత కుట్ర, మోసం, బెదిరింపులకు పాల్పడ్డారు. నిందితులను అరెస్టు చేసి విచారిస్తేనే మరిన్ని ఆధారాలు లభిస్తాయి' అని సీఐడీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

బియ్యం దొంగలకు జగన్ అండ

- 2017లోనే కాకినాడ పోర్టులో తనిఖీలు
- 40 మందిపై సుమోటోగా కేసు
- సర్కారు మారగానే కేసులు క్లోజ్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

కాకినాడ పోర్టు నుంచి అక్రమంగా రేషన్ బియ్యం విదేశాలకు తరలింపు వ్యవహారం చర్చనీయాంశమైంది. వాస్తవానికి... ఇదేమీ కొత్త విషయం కాదు. కొన్నేళ్లుగా సాగిపోతోంది. 2017లోనే అప్పటి టీడీపీ ప్రభుత్వంలో ఆహార కమిషన్ కాకినాడ పోర్టులో తనిఖీలు చేసింది. అక్రమాలను గుర్తించి రేషన్ మాఫియాపై సుమోటోగా కేసు నమోదు చేసింది. అయితే జగన్ ప్రభుత్వం వచ్చాక ఈ కేసును కాకినాడ పోర్టులోనే సమాధి చేసింది. అక్రమాలే జరగలేదని ఆయన నియమించిన ఆహార కమిషన్ నిందితులకు క్లీన్‌చిట్ ఇచ్చింది. ఇందులో ద్వారంపూడి గ్యాంగ్ ఉండటమే కారణం. జగన్ జమానాలో ఆహార కమిషన్‌ను నిర్వీర్యం చేసేశారు. గత ఐదేళ్లూ భారీ ఎత్తున అక్రమ వ్యాపారం సాగిపోయింది.



రేషన్ బియ్యం అక్రమ రవాణా వెనుక పెద్ద కథే ఉంది. గత టీడీపీ ప్రభుత్వం రేషన్ అక్రమ రవాణాను అడ్డుకునేందుకు కఠిన చర్యలు తీసుకుంది. అప్పట్లో చంద్రబాబు ప్రభుత్వం నియమించిన ఆహార కమిషన్ ఛైర్మన్ జేఆర్ పుష్పరాజ్, ఇతర సభ్యులు చాలా వరకు అడ్డుకట్ట వేశారు. అయితే జగన్ ప్రభుత్వం వచ్చాక కథ మళ్లీ మొదటికి రావడమే కాదు నిత్యకృత్యంగా మారిపోయింది. గత ఐదేళ్లూ జగన్ సర్కారు రేషన్ బియ్యం మాఫియాపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. పైగా ప్రభుత్వమే అక్రమార్కులకు వెన్నుదన్నుగా నిలిచి మరింత పెంచిపోషించింది. గత టీడీపీ ప్రభుత్వంలో నమోదు చేసిన కేసును నీరుగార్చింది. దీంతో స్మగ్లర్లు అడ్డూఅదుపూ లేకుండా రెచ్చిపోయారు. కాకినాడ పోర్టు నుంచి విదేశాలకు రేషన్ బియ్యం అక్రమంగా తరలించి కోట్లు కొల్లగొట్టారు.

2017లోనే కట్టడి..

రాష్ట్రంలో క్షేత్రస్థాయి నుంచి వ్యవస్థీకృతమైన రేషన్ మాఫియా ఆగడాలను అరికట్టేందుకు ఏడేళ్ల క్రితమే అప్పటి టీడీపీ ప్రభుత్వం కఠినంగా వ్యవహరించింది. రాష్ట్రంలో జాతీయ ఆహార భద్రతా చట్టం అమలును పర్యవేక్షించడం కోసం కఠిన చర్యలు తీసుకుంది. 2017 ఏప్రిల్ 12న రాష్ట్ర ఆహార కమిషన్ ఛైర్మన్‌గా జేఆర్ పుష్పరాజ్‌ను, నలుగురు సభ్యులను నియమించింది. ఈ కమిషన్ రేషన్ అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించింది. అప్పటికే పీడీఎస్ బియ్యాన్ని అక్రమార్కులు కాకినాడ పోర్టు ద్వారా విదేశాలకు భారీస్థాయిలో ఎగుమతి చేస్తున్నట్లు పత్రికల్లో వరుస కథనాలు వెలువడ్డాయి. ఈ కథనాల ఆధారంగా పుష్పరాజ్, ఇతర సభ్యులు కాకినాడ పోర్టులో తనిఖీలు చేపట్టి అనేక అవకతవకలు జరిగినట్టు గుర్తించారు. ఈ తప్పిదాలకు సంబంధిత అధికారులను బాధ్యులను చేస్తూ అక్రమ రవాణా వ్యవహారంపై సుమోటోగా కేసు నమోదు చేశారు.

జగన్ సర్కారు వచ్చాక..

ఈ కేసు విచారణ కొనసాగుతుండగానే 2019లో జగన్ ప్రభుత్వం ఏర్పడింది. ఆ తర్వాత కూడా ఆహార కమిషన్ ఛైర్మన్‌గా పుష్పరాజ్, నలుగురు సభ్యులు కొనసాగినా... కేసు విచారణ ముందుకు సాగనివ్వకుండా అడ్డంకులు సృష్టించింది. వీరి పదవీకాలం పూర్తయిన తర్వాత రాష్ట్ర ఆహార కమిషన్ ఛైర్మన్‌గా వైసీపీకి చెందిన చిత్తా విజయప్రతాప్‌రెడ్డిని, మరో నలుగురు సభ్యులను నియమించింది. అదే సమయంలో కరోనా రావడంతో ఆ సాకుతో రేషన్ బియ్యం అక్రమ రవాణాపై సుమోటో కేసు విచారణను రెండేళ్లకు పైగా నిలిపివేశారు. ఆ తర్వాత ఈ కేసు విచారణను కొనసాగించినా పథకం ప్రకారం నీరుగార్చారనే విమర్శలున్నాయి. ఈ కేసులో విచారణ సందర్భంగా ప్రతివాదుల నుంచి లిఖిత పూర్వక వాంగ్మూలాలు తీసుకున్నారు. 'పీడీఎస్ బియ్యాన్ని కొందరు అక్రమ వ్యాపారులు కాకినాడ ఓడరేవు ద్వారా ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నారని పత్రికల్లో వచ్చిన కథనాల్లో వాస్తవం లేదు. కార్డుదారులకు బయోమెట్రిక్ ద్వారా పంపిణీ చేస్తున్నందున బియ్యాన్ని దారిమళ్లించే అవకాశమే లేదు. ఫిర్యాదులు వచ్చినప్పుడు దాడులు నిర్వహించి కేసులు బుక్ చేస్తున్నాం. బియ్యం అక్రమ రవాణాపై పర్యవేక్షణ లోపం లేదు. కాబట్టి ఈ కేసును కొట్టివేయవచ్చు' అంటూ ప్రతివాదులుగా ఉన్న జిల్లా కలెక్టర్లు, జేసీలు, డీఎస్‌వోలు అఫిడవిట్లు ఇచ్చారు. రేషన్ బియ్యం అక్రమ వ్యవహారంతో తమకు సంబంధం లేదని, కస్టమ్స్ క్లియరెన్స్‌తోనే పోర్టుల ద్వారా ఎగుమతులకు అనుమతిస్తామని కాకినాడ, కృష్ణపట్నం పోర్టుల అధికారులు కమిషన్ ముందు వివరణలు ఇచ్చారు. ఇక రైసు మిల్లర్లు, వ్యాపారులు న్యాయవాదులను నియమించుకుని తమ వాదనలు వినిపించారు. ఈ కేసుపై గత సెప్టెంబరు 13న రాష్ట్ర ఆహార కమిషన్ తుది విచారణ చేసింది. జాతీయ ఆహార భద్రత చట్టం ప్రకారం ఆహార ధాన్యాలు అందలేదని లబ్ధిదారుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రానందున కేసును కొట్టేస్తున్నట్టు ప్రకటించింది. ప్రతివాదులు భవిష్యత్తులో మరింత జాగ్రత్తగా ఉండాలని, పీడీఎస్ బియ్యం, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించి అక్రమంగా కొనుగోలు చేయకూడదని హెచ్చరించింది. జగన్ సర్కారు నియమించిన ఆహార కమిషన్‌లో ఆయన పార్టీకి చెందినవారే ఉండటంతో ఎలాంటి చర్యలు తీసుకోలేదు. గత ఐదేళ్లూ అక్రమార్కులు యథేచ్ఛగా రేషన్ అక్రమ రవాణా సాగించారు. విదేశాలకు తరలించి వేలకోట్లు దోచుకున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ దందా వెలుగులోకి వచ్చింది.

ద్వారంపూడి కనుసన్నల్లో...

గత టీడీపీ ప్రభుత్వంలో రేషన్ బియ్యం అక్రమ రవాణాలో మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి కుటుంబానికి చెందిన మానస క్వాలిటీ ఎంటర్‌ప్రైజెస్‌తో పాటు శ్రీలలిత ఎంటర్‌ప్రైజెస్ (పెద్దాపురం), శ్రీ సీతారామాంజనేయ సార్టెక్స్(ఉప్పలంక), సరళఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్(కాకినాడ), శ్రీమురళీమోహన్ బాయిల్డ్ అండ్ రైస్‌మిల్(బిక్కవోలు), శ్రీ విజయలక్ష్మి రా అండ్ బాయిల్డ్ రైస్‌మిల్(కరప), శ్రీ వెంకటేశ్వర ఎక్స్‌పోర్ట్స్, శ్రీ చిత్ర అగ్రి ఎక్స్‌పోర్ట్ (కాకినాడ), కేపీఆర్ రైస్‌మిల్స్(కొమరిపాలెం), ఓలం అగ్రో ఇండియా ప్రైవేట్ లిమిటెడ్(కాకినాడ), బిటో ఇంటర్నేషనల్ (తాళ్లరేవు, చొల్లంగి), చంద్రిక మిల్స్(రాయవరం), సమీర ఆగ్రో ఇండస్ట్రీస్ (రాజానగరం), అయ్యప్ప ఎక్స్‌పోర్ట్స్(చొల్లంగి), శ్రీ రామలింగేశ్వర రైస్‌మిల్ (తణుకు), పట్టాభి ఆగ్రో ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ (తణుకు), ఐటీసీ లిమిటెడ్ (కొడవలూరు), మాస్టర్ బిజినెస్ ఎంటర్ ప్రైజెస్(విశాఖపట్నం)పై కేసు నమోదు చేశారు. తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, నెల్లూరు కలెక్టర్లు, జేసీలు, డీఎస్‌వోలు, కాకినాడ, కృష్ణపట్నం పోర్టు అధికారులతో సహా 40మందిని ప్రతివాదులుగా చేర్చారు. వారందరినీ విచారణకు రావాలని ఆహార కమిషన్ నుంచి నోటీసులు జారీ అయ్యాయి.

ఎప్పుడూ చూడలేదు!

- రాజకీయ అధికారాన్ని అడ్డుపెట్టుకుని దుర్మార్గంగా రాయించుకోవడం ఘోరం
- ఇలాంటివి దేశ చరిత్రలోనే లేవు!: సీఎం

అమరావతి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): 'గన్ చూపించి రూ.వేల కోట్ల విలువైన ఆస్తులు రాయించుకోవడం, కొట్టేయడం దేశ చరిత్రలోనే లేదు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఇంత దుర్మార్గంగా ఆస్తులు రాయించుకున్న ఘటన నేనైతే ఎప్పుడూ వినలేదు.. చూడలేదు' అని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. బుధవారమిక్కడ టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియా ప్రతినిధులతో కొద్దిసేపు ముచ్చటించారు. మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి, ఆయన బృందం కలిసి కాకినాడ పోర్టు, కాకినాడ సెజ్ ప్రమోటర్లను బెదిరించి మెజారిటీ వాటాలను రాయించుకోవడంపై పోలీసులకు అందిన ఫిర్యాదు ఈ సందర్భంగా ప్రస్తావనకు వచ్చింది. 'ఈ దుర్మార్గానికి బలైన బాధితులకు న్యాయం చేయడం మా బాధ్యత. ఇటీవల తెచ్చిన భూ ఆక్రమణల నిరోధక చట్టం పరిధిలోకి ఇది వస్తుందా రాదా అన్నది చూడాలి. ముంబైలో మాఫియా ముఠాలు రాయించుకున్న ఆస్తులను స్వాధీనం చేసుకోవడానికి మహారాష్ట్ర ప్రభుత్వం గతంలో ఒక చట్టం తెచ్చిందని అంటున్నారు. దాని వివరాలు కూడా తెలుసుకుంటాం' అని తెలిపారు. భూ సమస్యలపై రాష్ట్రంలో పెద్దఎత్తున వస్తున్న వినతులు, ఫిర్యాదుల్లో ప్రతి ఒక్క దానికీ సంపూర్ణ పరిష్కారం చూపించాలని ప్రయత్నిస్తున్నామని చెప్పారు. అధికారుల్లో కూడా కొన్ని తప్పులు కనిపిస్తున్నాయని.. వచ్చిన ఫిర్యాదును మరో అధికారి వద్దకు తోసివేసి పరిష్కారమైనట్లు రాసేస్తున్నారని ఆక్షేపించారు. ప్రజల నుంచి ఊరకే కాగితాలు తీసుకోవడం కాకుండా వాటి పరిష్కారంపై కొంత మేధోమథనం జరగాల్సి ఉన్నారు. సీఎం ఇంకా ఏం చెప్పారంటే..

> అవినీతి, వసూళ్లు, గూండాయిజం వంటివి గతంలో విన్నాం కానీ ఏకంగా వేల కోట్ల రూపాయల ఆస్తులను పారిశ్రామికవేత్తల నుంచి జబర్దస్తుగా లాక్కుని తమ పేరు మీద రాయించుకోవడం ఘోరమైన చర్య. ఈ రాష్ట్రంలోనే కాదు.. దేశంలోనే ఇలాంటివి జరుగలేదు.
>
> శాఖల మధ్య సరిహద్దులు చెరిపివేసి ఏ సమస్య దేని పరిధిలోకి వస్తుందో అర్థం కాని పరిస్థితి తెచ్చారు. సంబంధం లేకపోయినా చాలా చోట్ల భూములను 22ఏ జాబితాలో చేర్చారు. - సీఎం చంద్రబాబు

రైతుకు నష్టం జరగకుండా..

ధాన్యం కొనుగోలుకు తక్షణ చర్యలు తీసుకుంటున్నాం. రైతులకు నష్టం జరగకుండా సరైన ధర వారికి దక్కడానికి చూస్తున్నాం. ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలి. రైతుకు సరైన ధర రావాలి. ధాన్యం విక్రయించాల్సిన వారు వాట్సా‌ప్‌లో ఒక మెసేజ్ పంపితే వారు ఏ మిల్లుకు పంపాలో సమాధానం పంపిస్తున్నాం. ఎక్కడైనా గోనె సంచుల కొరత ఉంటే దానిని కూడా పరిష్కరిస్తాం. జగన్ హయాంలో కుదిరిన విద్యుత్ ఒప్పందాల వల్ల పడుతున్న భారంపై అన్ని కోణాల్లో పరిశీలిస్తున్నాం. ఏం చేస్తే మంచిదో అధ్యయనం తర్వాత నిర్ణయం తీసుకుంటాం. ఇసుక రవాణాపై ఆంక్షలేమీ లేవు. ఉచిత ఇసుక అని బోర్డు పెట్టుకుని వెళ్తే రవాణా వాహనాల్లో ఎంతయినా తీసుకెళ్లవచ్చు.

అది హోం డిపార్ట్‌మెంట్ పని

ఇంటి నిర్మాణం కోసం రాజధానిలో చంద్రబాబు కుటుంబం ఇటీవల స్థలం కొనుగోలు చేసిన విషయాన్ని విలేకరులు ప్రస్తావించినప్పుడు ఆయన నవ్వేశారు. 'ఇంటి నిర్మాణం వ్యవహారం ఇంట్లో హోం డిపార్ట్‌మెంట్ చూసుకుంటుంది. రాజధాని నిర్మాణం ఒక్కటే నా పని' అని వ్యాఖ్యానించారు.



అమరావతికి మంత్రాలయం పీఠాధిపతి విరాళం

మంత్రాలయం శ్రీగురు రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థ, ఇతర సభ్యులు రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.50లక్షల విరాళాన్ని అందించారు. బుధవారం ఉండవల్లిలోని నివాసంలో సీఎం చంద్రబాబును కలిసి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా చంద్రబాబుకు సుబుధేంద్రతీర్థ ఆశీస్సులు అందించారు. అమరావతికి విరాళం ఇచ్చిన పీఠాధిపతికి సీఎం కృతజ్ఞతలు తెలిపారు.

కుటుంబం యూనిట్‌గా పథకాలు!

పీ-4 ప్రాజెక్టులతో పేదరిక నిర్మూలన

సంపన్నుల సాయమూ తీసుకోవాలి: సీఎం

అమరావతి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఒక్కో కుటుంబాన్ని ఒక్కో యూనిట్‌గా తీసుకుని.. ఆ కుటుంబ సభ్యుల ప్రొఫైల్‌కు తగినట్లు ప్రభుత్వ పథకాలు అందించడంపై సమగ్ర అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. బుధవారమిక్కడ ఉండవల్లిలోని తన నివాసంలో అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. పీపుల్, పబ్లిక్, ప్రైవేట్, పార్ట్‌నర్‌షిప్ (4 'పీ') కింద మరిన్ని ప్రాజెక్టులు ప్రవేశపెడితే పేదరికం లేని రాష్ట్రంగా ఏపీ అవతరిస్తుందని చెప్పారు. పీ-4 ప్రాజెక్టుకు రాజధాని అమరావతి నిర్మాణం ఉత్తమ ఉదాహరణగా పేర్కొన్నారు. రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు అత్యల్పంగా ఉండడం, వృద్ధుల సంఖ్య పెరగడం, యువ జనాభా తగ్గిపోవడంతో.. ఒకరిపై ఆధారపడి జీవించే వారి సంఖ్య పెరగడంపై ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

'ధాన్యం కొనుగోలు ప్రక్రియ క్రమం తప్పకుండా జరగాలి. పౌరసరఫరాల శాఖ, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో పని చేసి, ధాన్యం కొనుగోలు చేసేలా చూడాలి. చిన్న చిన్న సమస్యలను సాకుగా చూపి, రైతులను ఇబ్బందులకు గురిచేస్తే ఊరుకునేది లేదు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే.. కఠిన చర్యలు తీసుకోవడానికి కూడా వెనుకాడం' అని సీఎం స్పష్టం చేశారు.

నెలకు రెండుసార్లు కేబినెట్

- మొదటి, మూడో గురువారాల్లో సమావేశాలు

అమరావతి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కేబినెట్ సమావేశాలను నెలకు రెండుసార్లు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతినెలా మొదటి, మూడో గురువారాల్లో మంత్రివర్గ సమావేశం నిర్వహించాలని షెడ్యూల్ ఖరారు చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ బుధవారం సర్క్యులర్ జారీ చేశారు. గురువారం ప్రభుత్వ సెలవు ప్రకటిస్తే మర్నాడు శుక్రవారం కేబినెట్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. సమావేశాలకు మూడు రోజులకు ముందుగానే ఆయా శాఖలకు సంబంధించిన ప్రతిపాదనలను సాధారణ పరిపాలన శాఖకు పంపించాలని సూచించారు. కాగా, డిసెంబరుకు సంబంధించి రెండో మంత్రివర్గ సమావేశాన్ని ఈ నెల 19న నిర్వహించనున్నట్లు నీరబ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెలలో మొదటి కేబినెట్ భేటీ 3న జరిగిన విషయం తెలిసిందే. 17వ తేదీ సాయంత్రానికి ప్రతిపాదనలు పంపాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులను ఆయన ఆదేశించారు.

ఎకో టూరిజం సెంటర్‌గా కడియం: దుర్గేశ్

అమరావతి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎకో టూరిజం సెంటర్‌గా కడియం నర్సరీ ప్రాంతాల్ని తీర్చిదిద్దాలని పర్యాటక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్ ఆదేశించారు. బుధవారం పర్యాటక శాఖతో పాటు సినిమాటోగ్రఫీపై ఆయన ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకం సాస్కి నిధులతో చేపట్టనున్న అఖండ గోదావరి, గండికోట ప్రాజెక్టుల అమలు, విధివిధానాలపై మంత్రి పలు సూచనలు చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక ఫిల్మ్ పాలసీకి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరారు.

సీఎం ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్‌గా వెంకటేష్

సీఎం చంద్రబాబు కార్యక్రమాల నిర్వహణ కో-ఆర్డినేటర్‌గా రాజానగరం మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ నియమితులయ్యారు.

నాలెడ్జ్ ఎకానమీకి నాబార్డు పూర్తి మద్దతు

- సీఎం చంద్రబాబుతో భేటీలో నాబార్డు ఛైర్మన్ షాజీ కేవీ

అమరావతి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి రంగాలకు రుణ పరిమితిని మరింత పెంచుతామని నాబార్డు ఛైర్మన్ షాజీ కేవీ ముఖ్యమంత్రికి హామీ ఇచ్చారు. నాలెడ్జ్ ఎకానమీ మరింత మెరుగుపర్చేందుకు నాబార్డు పూర్తి మద్దతిస్తుందని ప్రకటించారు. బుధవారం ఉండవల్లిలోని నివాసంలో సీఎం చంద్రబాబుతో ఆయన భేటీ అయ్యారు. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలకు సహకారం, మత్స్యరంగ అభివృద్ధిపై చర్చించారు. ఏపీకి ఆర్ఐడీఎఫ్ కింద అందించే అదనపు కేటాయింపులు, సహకార సంఘాలకు రాయితీలు మరింత అందిస్తామని నాబార్డు ఛైర్మన్ చెప్పారు. నాబార్డు ప్రాంతీయ కార్యాలయాన్ని హైదరాబాద్ నుంచి విజయవాడకు మార్చడంపై సీఎం సంతృప్తి వ్యక్తం చేశారు.

నాబార్డుకు ఐకానిక్ భవనం

వ్యవసాయం, గ్రామీణాభివృద్ధిలో ముఖ్యభూమిక పోషిస్తున్న నాబార్డుకు అమరావతిలో ఐకానిక్ భవనాన్ని నిర్మిస్తామని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. నాబార్డు బ్యాంకింగ్ రంగం ప్రభుత్వానికి సహకరించి, రాష్ట్రాభివృద్ధిలో తనవంతు పాత్ర పోషించాలని ఆయన కోరారు. బుధవారం విజయవాడలోని స్టాలిన్ సెంట్రల్ కాంప్లెక్స్‌లో నాబార్డు ప్రాంతీయ కార్యాలయాన్ని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, నాబార్డు ఛైర్మన్ షాజీ కేవీతో కలిసి ఆయన ప్రారంభించారు. అచ్చెన్న మాట్లాడుతూ 'గత ఐదేళ్లలో రాష్ట్రంలో వ్యవసాయ రంగం పూర్తిగా నిర్వీర్యమైంది. స్వర్ణాంధ్ర-2047 లక్ష్యంతో వ్యవసాయ రంగానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. వ్యవసాయ రంగానికి మళ్లీ పూర్వవైభవం తెస్తాం' అని అన్నారు.

జైళ్లలో డీ అడిక్షన్ సెంటర్లపై నిర్లక్ష్యమా?

- జైళ్ల శాఖ సమీక్షలో హోంమంత్రి అనిత ఆగ్రహం

అమరావతి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని జైళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. గంజాయి, మత్తు బాధితులు విశాఖపట్నం లాంటి జైళ్లలో ఎక్కువగా ఉన్నందున నాలుగు సెంట్రల్ జైళ్లలోనూ డీ అడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. దీనికోసం కేంద్రం ఇచ్చిన నిధులు తీసుకోవడానికి ఎందుకు నిర్లక్ష్యమని అధికారులను ప్రశ్నించారు. సచివాలయంలో బుధవారం జైళ్లు, అగ్నిమాపక శాఖపై అనిత సమీక్ష నిర్వహించారు. 900మంది కెపాసిటీ గల విశాఖపట్నం జైలులో 2వేల మందిని ఉంచడం ఏమిటనీ, అవసరమైతే ఇతర జైళ్లకు తరలించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. అనకాపల్లిలో కొత్తగా జిల్లా జైలు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. గంజాయి, మత్తుకు బానిసైన వారికోసం వైద్య శాఖ పరిధిలో 52 డీ అడిక్షన్ కేంద్రాలు ఉన్నాయని, జైళ్లశాఖ పరిధిలో 4 (విశాఖ, రాజమండ్రి, నెల్లూరు, కడప)సెంట్రల్ జైళ్లలో ఏర్పాటుకు కేంద్రం నిధులిస్తే 3నెలలైనా బ్యాంకు అకౌంట్ తెరవడానికి తీరికలేదా.? అని ప్రశ్నించినట్లు తెలిసింది.


టీడీపీ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

తలశిల వేధింపులతో నా తండ్రి ఆత్మహత్య

- రూ.10 కోట్ల ఆస్తులు లాగేశారు.. సీఎంకు బాధితుడి మొర
- టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఫిర్యాదుల వెల్లువ

అమరావతి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వంలో వైసీపీ నేతల దుర్మార్గాలు, దురాగతాలపై బాధితులు గళం విప్పుతున్నారు. వైసీపీ ఎమ్మెల్సీ తలశిల రఘురాం వేధింపుల కారణంగా తన తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడని గొల్లపూడికి చెందిన కారెంపూడి అభిరామ్ వాపోయారు. బుధవారమిక్కడ టీడీపీ కేంద్ర కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ సందర్భంగా అభిరామ్ తన బాధ వెళ్లగక్కారు. ఎంపీటీసీ ఎన్నికల్లో తన తండ్రి నామినేషన్ వేశారన్న అక్కసుతో తలశిల ఆయనపై అక్రమ కేసులు పెట్టి వేధించి 73 రోజులు జైల్లో పెట్టారని.. నాటి సీఐ రవీంద్ర, ఏసీపీ హనుమంతరావుతో బెదిరించి రూ.10కోట్ల విలువైన తమ ఆస్తులు రాయించుకున్నారని ఫిర్యాదు చేశారు. ఈ వేధింపులతో తన తండ్రి బలవన్మరణానికి పాల్పడ్డారని కన్నీటి పర్యంతమయ్యారు. జగన్ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న శంకరనారాయణ బెదిరించి తమ ఆస్తులను బలవంతంగా లాక్కున్నారని శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మండలం చంద్రగిరికి చెందిన జి.మధు సీఎం వద్ద మొర పెట్టుకున్నారు. ఈ ఘటనపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదుచేస్తే నాటి సీఐ శ్రీహరి, ఎస్ఐ భాషా తిరిగి తమనే బెదిరించారని.. తనను, తన భార్యను నాలుగు రోజులు స్టేషన్లో ఉంచి ఇంట్లోని రూ.38లక్షల నగదు, ఇతర ఆస్తి పత్రాలు తీసుకెళ్లారని వెల్లడించారు. తన 11 ఏళ్ల కుమారుడికి రెండు కిడ్నీలు పాడయ్యాయని, వైద్యానికి రూ.16లక్షలు ఖర్చవుతుందని పల్నాడు జిల్లా కొండూరుకు చెందిన జోనిబోయిన శ్రీలక్ష్మి వాపోయారు. స్పందించిన చంద్రబాబు సీఎంఆర్ఎఫ్ కింద రూ.10 లక్షలు అందేలా చూస్తానని భరోసా ఇచ్చారు. కాగా, టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం అర్జీదారులు పోటెత్తారు. ఏలూరు జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, మాజీ మంత్రి కిడారి శ్రావణ్, ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పోలంరెడ్డి దినేశ్‌రెడ్డి వారి నుంచి వినతులు స్వీకరించారు.

అన్న క్యాంటీన్‌కు రూ.లక్ష విరాళం

అన్నక్యాంటీన్‌కు గొల్లపూడికి చెందిన వృద్ధురాలు యలమంచిలి బేబీ సరోజిని రూ.లక్ష విరాళంగా అందించారు. ఎప్పటి నుంచో పొదుపు చేస్తూ వచ్చిన సొమ్మును అందజేశారు. ఆమెను సీఎం అభినందించారు.

ఆళ్ల చేరికపై పునరాలోచించండి

- సీఎం చంద్రబాబుకు ఏలూరు ఎమ్మెల్యే వినతి

అమరావతి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నానిని పార్టీలో చేర్చుకొనే ప్రయత్నాలపై సీఎం చంద్రబాబు వద్ద ఏలూరు టీడీపీ ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ నిర్ణయంపై పునరాలోచించాలని విన్నవించినట్లు తెలిసింది. బుధవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో సీఎం చంద్రబాబును ఆయన కలిశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ.. "నాని వైసీపీ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఏలూరులో టీడీపీ నేతలు తీవ్రమైన వేధింపులకు గురయ్యారు. కనీసం పాతిక మందిపై అక్రమ కేసులు పెట్టారు. వాళ్లింకా కోర్టుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. ఇరవైకి పైగా ఇళ్లు కూలగొట్టించారు. ఆయనను చేర్చుకోవాలన్న ఆలోచన టీడీపీ క్యాడర్‌కు నచ్చడం లేదు. నాని చేరికతో పార్టీకి కలిగే ప్రయోజనం కూడా లేదు. మీరు మరోసారి ఆలోచిస్తే బాగుంటుంది' అని విన్నవించినట్లు సమాచారం. 'మీరు చెప్పినవన్నీ పరిశీలించిన తర్వాతే నిర్ణయం ఉంటుంది. అదే సమయంలో పార్టీ బలోపేతాన్ని దృష్టిలో ఉంచుకొని నాయకత్వం ఏ నిర్ణయం తీసుకొన్నా మీరు సహకరించండి' అని ఎమ్మెల్యేతో చంద్రబాబు చెప్పినట్లు పార్టీ వర్గాల సమాచారం.

మాఫియా మోడల్!

(మొదటి పేజీ తరువాయి)

'ప్రత్యేక' దృష్టి సారించి... ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులను కైవసం చేసుకున్నారు. రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత బెదిరించి భూములు, ప్రాజెక్టులు లాక్కోవడం విశాఖపట్నం నుంచే మొదలైంది. తొలి ప్రయత్నంగా ఓ ఎన్ఆర్ఐ ఇంటికి కడపకు చెందిన కొందరు వెళ్లి తుపాకీతో బెదిరించారు. రూ.100 కోట్ల విలువైన భూమిని వివాదంలోకి లాగకుండా ఉండాలంటే రూ.10 కోట్లు చెల్లించాలని డిమాండ్ చేశారు. దానికి నిరాకరించడంతో వైసీపీ ప్రభుత్వం ఆ భూమి స్వాధీనానికి చర్యలు తీసుకుంది. వెరసి... ఆ బెదిరింపులకు సర్కారు పెద్దల ప్రత్యక్ష సహకారముందని అప్పుడే స్పష్టమైంది.

850 ఎకరాల మెట్టంతా మింగేశారు..

కాకినాడపై పడి సెజ్, పోర్టులు, లేటరైట్, బియ్యాన్ని విఁగేసిన వైసీపీ పెద్దలు... పెద్దాపురం రామేశం మెట్టలో 850 ఎకరాల్లో విస్తరించిన కొండలను సైతం పిండేసి గుల్ల చేసేశారు. అయిదేళ్లపాటు నిరంతరాయంగా గ్రావెల్ తవ్వకాలు జరిపి రూ.850కోట్లకుపైగా లూటీ చేసేశారు.

బే పార్క్ పూర్తిగా సొంతం



విశాఖ రుషికొండలో ఎకో టూరిజం ప్రాజెక్టు పేరుతో ఇండో అమెరికన్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ ప్రైవేటు లిమిటెడ్ (బే పార్క్) రెండు దశాబ్దాల క్రితం ప్రభుత్వం నుంచి 28 ఎకరాల భూమి లీజుకు తీసుకుంది. రూ.100 కోట్లకు పైగా వెచ్చించి అంతర్జాతీయ ప్రమాణాలతో లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో వెల్‌నెస్ సెంటర్ (ఆరోగ్య కేంద్రం) ఏర్పాటు చేసింది. ఇది మెడికల్ టూరిజం ప్రాజెక్టు. దానిపై వైసీపీ పెద్దల కన్ను పడింది. అంతే... డెవలపర్లను బెదిరించారు. ప్రాజెక్టు కోసం బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలు చెల్లించలేదనే కారణం చూపించి... లీజు రద్దు చేస్తామని లొంగదీసుకున్నారు. ఆ రుణాలు తామే దశల వారీగా చెల్లిస్తామంటూ ఒప్పందం చేసుకొని అసలు యజమానులను గెంటేసి... ఆ ప్రాజెక్టును హస్తగతం చేసుకున్నారు. ఈ విషయంలో ఆర్థికంగా సహకరించిన హెటిరో డ్రగ్స్ కంపెనీకి నక్కపల్లిలో 81 ఎకరాల ప్రభుత్వ భూమిని నామమాత్రపు ధరకు కట్టబెట్టారు.

రామానాయుడు స్టూడియో భూముల్లో వాటాకు ఒత్తిడి



విశాఖ-భీమిలి బీచ్‌రోడ్డులో రామానాయుడు స్టూడియోకు మధురవాడ సర్వే నంబర్లు 387, 393లలో 34.44 ఎకరాలను 2003లో అప్పటి ప్రభుత్వం కేటాయించింది. ఆ భూమిని సినిమా షూటింగ్‌లకే వినియోగించాలి. అందులో కొంతే వారు ఉపయోగించుకున్నారు. మూడొంతులు ఖాళీగా ఉంది. దానిపై వైసీపీ కీలకనేత కన్ను పడింది. ఖాళీగా ఉన్న భూమి వెనక్కి ఎందుకు తీసుకోకూడదంటూ బెదిరింపుల రాయబారం నడిపారు. అక్కడ లేఅవుట్ వేసి, అందులో సగం ప్లాట్లు తమకు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. అందుకు అనుగుణంగా ఆ ప్రాంతాన్ని వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్‌లో మిక్స్‌డ్ జోన్‌గా మార్చేశారు. దాంతో సురేశ్ ప్రొడక్షన్స్ 15.18 ఎకరాల్లో 34 ప్లాట్లతో లేఅవుట్ వేసింది. అందులో సగం ప్లాట్లు బినామీల మీద రిజిస్టర్ చేయాల్సిందిగా వైసీపీ పెద్దలు ఒత్తిడి పెట్టారు. ఈలోగా విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు సుప్రీంకోర్టుకు వెళ్లారు. లేఔట్‌లో విక్రయాలపై కోర్టు 'స్టే' విధించింది.



వంతాడ వాటాలు కొట్టేశారిలా..

కాకినాడ జిల్లా ప్రత్తిపాడులో వంతాడ గ్రామం లేటరైట్‌కు ప్రసిద్ధి. దీనిపై కన్నేసిన గత ప్రభుత్వ పెద్ద తన ప్రధాన అనుచరుడిని రంగంలోకి దించారు. ఇక్కడ కొండల్లో 200 ఎకరాల్లో ఇరవై ఏళ్లపాటు ఆంధ్రా మినరల్స్ అనే కంపెనీ తమ కుటుంబ సభ్యుల పేరిట ఆరు లీజుల వరకు దక్కించుకుంది. ఏడాదికి 20 లక్షల టన్నుల లేటరైట్ తవ్వితీస్తూ సిమెంట్ ఫ్యాక్టరీలకు, ఒడిసాలోని జిందాల్ స్టీల్ కంపెనీకి ఖనిజాన్ని విక్రయిస్తోంది. కాకినాడ పోర్టు నుంచి చైనా, హాంకాంగ్ దేశాలకు తరలించేది. ఈ కంపెనీ జగన్ ప్రభుత్వం రాకముందు ఐదేళ్లలో వందల కోట్ల వ్యాపారం చేసింది. ఒకరకంగా చెప్పాలంటే ఇది బంగారు బాతు! దీనిపై వైసీపీ పెద్దల కన్ను పడింది. 2021లో లీజుదారుడిని 'చర్చల'కు పిలిచారు. అప్పటి 'పెద్ద' మంత్రి తనయుడు, మరికొందరు కలిసి... 'ఎంతోకొంత ఇస్తాం. వంతాడ గనులు మాకు వదిలేయండి' అని హుకుం జారీ చేశారు. దీనికి లీజుదారుడు అంగీకరించలేదు. అంతే...పర్మిట్లు ఆగిపోయాయి. మైనింగ్ ఆగిపోయింది. 'ఆంధ్రా' యజమానికి దిక్కుతోచలేదు. కేంద్ర పర్యావరణ అనుమతులతో తవ్వకాలు జరుపుతున్నందున... తేడా వస్తే ఇరుక్కుపోతానని, మరో డీల్ చెప్పాలని వేడుకున్నాడు. దీంతో... 'లీజు నీది. తవ్వకాలు మాత్రం మావి. లాభాల్లో 89శాతం మాకు. 11 శాతం నీకు' అంటూ బలవంతపు డీల్ కుదిర్చారు. ఇలా పైసా పెట్టుబడి లేకుండా ఏటా రూ.180 కోట్లు పోగేసుకుంటున్నారు.

భారతి సిమెంట్ కోసం...

జగన్ అధికారంలో ఉండగా 2022లో ఉమ్మడి విశాఖ జిల్లా నాతవరం సరిహద్దులో లేటరైట్ గనులనూ కొల్లగొట్టేశారు. అక్కడ తవ్విన వేల మెట్రిక్ టన్నుల లేటరైట్‌ను ఆ జిల్లా మీదుగా కాకుండా సరిహద్దున ఉన్న కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం మీదుగా రహస్యంగా తరలించడానికి స్కెచ్ వేశారు. కత్తిపూడి హైవే మీదుగా మూడో కంటికి తెలియకుండా భారతి సిమెంట్‌కు సరుకు పంపడానికి ప్రణాళిక సిద్ధం చేశారు. అయితే... నాతవరం మండలం బమిడికలొద్ది నుంచి రౌతులపూడిలో లేటరైట్ నిల్వ చేసే ప్రదేశానికి మధ్య రిజర్వు ఫారెస్ట్ ఉంది. పైగా టిప్పర్ల రాకపోకలకు రహదారి లేదు. దీంతో ఏకంగా 12 కిలోమీటర్ల మేర రిజర్వు ఫారెస్టును చీల్చి వందల చెట్లను నరికేసి అనుమతులు లేకుండా ఏకంగా రహదారి నిర్మించేశారు. లేటరైట్‌ను ఈ మార్గం ద్వారా తెచ్చి భారతి సిమెంట్ పేరుతో ఉన్న లారీల్లో దర్జాగా తరలించేశారు.

'రాడిసన్'లో సగం వాటా వేరొకరికి అప్పగింత

విశాఖ-భీమిలి బీచ్‌రోడ్డులో 'కార్తీకవనం' పేరుతో రెండు దశాబ్దాల క్రితం ఓ ప్రైవేటు సంస్థతో బీఓటీ ప్రాజెక్టుకు వీఎంఆర్‌డీఏ ఒప్పందం చేసుకుంది. సాగర్ నగర్ దగ్గర బీచ్‌ను ఆనుకొని పది ఎకరాల స్థలాన్ని 33 ఏళ్ల లీజుకు ఇచ్చింది. అందులో అటవీ శాఖకు చెందిన భూమి కొంత ఉండడంతో నిర్మాణాలకు కేంద్ర అటవీ పర్యావరణ శాఖ అనుమతులు అవసరమయ్యాయి. ఆ తరువాత ఆ కంపెనీలో కొత్త భాగస్వాములు చేరి అనుమతులు తెచ్చుకొని నిర్మాణం పూర్తిచేశారు. అదే 'రాడిసన్ బ్లూ హోటల్'. దానిపై వైసీపీ నేతల కన్నుపడింది. అంతే ఆ హోటల్ ప్రారంభం కాకుండా ఒక పోలీస్ అధికారి తాళాలు వేశారు. దీనిపై ప్రశ్నిస్తే... నిబంధనలకు విరుద్ధంగా పనులు జరుగుతున్నాయని బదులిచ్చారు. పెద్దలతో మాట్లాడుకోవాలని పరోక్షంగా సందేశాలు ఇచ్చారు. వారు చెప్పిన వారికి 50 శాతం వాటా ఇవ్వడానికి అంగీకరించడంతో ఆ హోటల్ ప్రారంభానికి అనుమతి ఇచ్చారు.





సచివాలయం క్యాంటీన్ ఎన్నికల్లో విజేతలు

వెంకట్రామిరెడ్డికి షాక్!

» సచివాలయం క్యాంటీన్ ఎన్నికల్లో పరాభవం

అమరావతి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఏపీ సచివాలయ కోఆపరేటివ్ క్యాంటీన్ ఎన్నికల్లో సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డికి గట్టి షాక్ తగిలింది. ఆయన ప్రత్యక్షంగా, పరోక్షంగా బలపరిచిన అభ్యర్థులు ఘోర పరాజయం పాలయ్యారు. అప్సా మాజీ అధ్యక్షుడు ఉప్పుటూరి మురళీకృష్ణ, మాజీ కార్యదర్శి గోలిమి రామకృష్ణ మద్దతుతో పోటీ చేసిన 11మంది అభ్యర్థుల్లో 10 మంది ఘన విజయం సాధించారు. ఒకరు స్వతంత్రంగా గెలుపొందారు. ఏపీ సచివాలయ కోఆపరేటివ్ క్యాంటీన్ ఎన్నికలు బుధవారం నిర్వహించారు. 11 డైరెక్టర్ పదవుల కోసం 28మంది అభ్యర్థులు పోటీ చేశారు. మొత్తం 1,058 మంది ఓటర్లు ఉండగా 937 మంది ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో గెలిచిన డైరెక్టర్లు క్యాంటీన్ అధ్యక్షుడిని ఎన్నుకోనున్నారు. మురళీకృష్ణ, రామకృష్ణ బలపరిచిన అభ్యర్థులు గెలుపొందడంతో సచివాలయంలో ఉద్యోగులు సంబరాలు జరుపుకున్నారు.

వెంకట్రామిరెడ్డి రాజీనామాకు డిమాండ్

ఎన్నికల ఫలితాలు త్వరలో జరిగే అప్సా ఎన్నికలపై తీవ్ర ప్రభావం చూపుతాయని ఉద్యోగులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. ఎన్నికలకు ముందు వెంకట్రామిరెడ్డి చేసిన క్యాంపు రాజకీయాలు, తాయిలాలు, మందు పార్టీల పేరుతో లాబీయింగ్‌లన్నీ విఫలమయ్యాయి. సచివాలయ ఉద్యోగులందరూ ఆయన్ను ఏకపక్షంగా తిరస్కరించారు. అప్సా అధ్యక్ష పదవికి వెంకట్రామిరెడ్డి తక్షణం రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

గెలుపొందిన అభ్యర్థులు,ఓట్లు వివరాలు: కె. దుర్గా ప్రసాద్‌రావు (562), ఆర్. అయ్యపరెడ్డి (524), షేక్ షర్మిల బేగం (478), నక్కెళ్ల వెంకట్రావు (474), ఎస్. ఆనందరావు (440), బండి పద్మజ (423), ఎస్. శివప్రసాద్ (407), మురళీ కిశోర్ (406), కె. అనిల్ (405), కేవీ రామ్మోహన్ (394), అప్సా మాజీ నేతల మద్దతుతో, చింతల ప్రసన్న కుమార్ (453) స్వతంత్రంగానూ గెలుపొందారు. కాగా, సచివాలయ ఉద్యోగులకు అప్సా మాజీ అధ్యక్ష, కార్యదర్శులు మురళీకృష్ణ, రామకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

కర్నూలులో బెంచ్ ఏర్పాటుకు పకడ్బందీగా కార్యాచరణ

» మంత్రి ఫరూక్ ఆదేశం

అమరావతి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై పకడ్బందీగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ సూచించారు. అమరావతి సచివాలయంలో న్యాయశాఖ కార్యదర్శిగా ప్రతిభాదేవి బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు ఫ్యామిలీ కోర్టు, జిల్లా 4వ అదనపు సెషన్స్ జడ్జిగా పని చేస్తున్న ఆమెను ప్రభుత్వం న్యాయశాఖ కార్యదర్శిగా నియమించింది. బుధవారం ఈ సందర్భంగా ఆమెను మర్యాదపూర్వకంగా కలిసిన మంత్రి అభినందనలు తెలిపారు. అనంతరం హైకోర్టు బెంచ్ ఏర్పాటును వేగవంతం చేయడానికి చేయాల్సిన కసరత్తుపై చర్చించారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుచేస్తే న్యాయ సేవలు సీమ ప్రజలకు చేరువకానున్నాయని పేర్కొన్నారు.

నేడు గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక

ఉమ్మడి తూర్పు-పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీ ఉప ఎన్నిక గురువారం జరగనుంది. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. ఈ నెల 9న ఓట్ల లెక్కింపు జరుగుతుంది. 12తో ఎన్నికల ప్రక్రియ ముగుస్తుంది.

దక్షిణ కోస్తా, సీమలో వర్షాలు

విశాఖపట్నం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతం నుంచి వస్తున్న తేమగాలుల ప్రభావంతో బుధవారం దక్షిణ కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు కురిశాయి. ఉదయం 8 గంటల నుంచి రాత్రి వరకూ నెల్లూరు జిల్లా బోగోలులో 98.75, ఊటుకూరులో 79.5 విఁల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కడప, అన్నమయ్య, ప్రకాశం, తిరుపతి, శ్రీసత్యసాయి, ఏలూరు, బాపట్ల, చిత్తూరు జిల్లాల్లోనూ అనేకచోట్ల వర్షాలు కురిశాయి. గురువారం కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని, తర్వాత రెండు రోజుల్లో వర్షాలు తగ్గి మళ్లీ స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది. కాగా అరేబియా సముద్రంలో ఉన్న తీవ్ర అల్పపీడనం బుధవారానికి అల్పపీడనంగా మారింది. ఇది గురువారానికి పూర్తిగా బలహీనపడుతుందని వాతావరణ శాఖ తెలిపింది.

రాష్ట్రంలో భూ ప్రకంపనలు

» ఆరు జిల్లాల్లో స్వల్పంగా కంపించిన భూమి


» కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు, అల్లూరి, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో కలకలం

» కొన్ని చోట్ల గోడలకు పగుళ్లు

» సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

తెలంగాణలోని ములుగు జిల్లా మేడారం కేంద్రంగా 5.3 తీవ్రతతో ఏర్పడిన భూకంపం ప్రభావం ఆంధ్ర ప్రదేశ్‌లోనూ కనిపించింది. కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు, అల్లూరి సీతారామరాజు, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో పలుచోట్ల బుధవారం ఉదయం 7.20-7.30 గంటల మధ్య కొన్ని సెకన్లపాటు భూమి స్వల్పంగా కంపించింది. దీంతో ప్రజలు భయాందోళనకు గురై ఇళ్ల నుంచి బయటికి పరుగులు తీశారు. మంచాలు, కుర్చీలు కదిలాయని, గోడలు బీటలువారాయని ఆయా ప్రాంతాల ప్రజలు చెబుతున్నారు. భూమి కంపించిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో కొన్ని ఇళ్ల ప్రహరీలకు పగుళ్లువచ్చాయి. కృష్ణా జిల్లా హనుమాన్ జంక్షన్‌లోను భూమి కంపించిన దృశ్యాలు సీసీ ఫుటేజీల్లో కనిపించాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని విలీన మండలాల్లో పలుచోట్ల భూప్రకంపనలు ఏర్పడ్డాయి. కూనవరం మండలంలోని టేకులబోరు గ్రామానికి చెందిన బండారు సాయికుమార్ ఇంటి గోడలు బీటలు వారాయి. చింతూరు, ఎటపాకల్లోను రెండుమూడు సెకన్లపాటు భూమి కంపించింది. ఏలూరు జిల్లావ్యాప్తంగా సుమారు 5 నుంచి 15 సెకన్లపాటు స్వల్పంగా కంపించింది. వంట గదుల్లోని పాత్రలు కిందపడ్డాయి. ఏలూరు నగరంతోపాటు నూజివీడు మండలం మీర్జాపురం, ఆగిరిపల్లి మండల కేంద్రం, కుక్కునూరు, వేలేరుపాడు, కొయ్యలగూడెం, ద్వారకా తిరుమల, జీలుగుమిల్లి, టి.నరసాపురం, బుట్టాయిగూడెం, పోలవరం, కామవరపుకోట, జంగారెడ్డిగూడెం, చాట్రాయి తదితర గ్రామాల్లో భూప్రకంపనలను గుర్తించారు. గోదావరి పరీవాహక ప్రాంతంలోని కుక్కునూరు, వేలేరుపాడుల్లో రెండు విడతలుగా 10 సెకన్లపాటు స్వల్పంగా భూమి కంపించింది. గుంటూరు జిల్లా తెనాలిలోని మారీస్‌పేట, చెంచుపేట, సుల్తానాబాద్, అమరావతి ప్లాట్స్, కొలవరం ప్రాంతాల్లో ప్రకంపనలు వచ్చాయి. పల్నాడు జిల్లా దాచేపల్లిలో 12సెకన్ల పాటు కంపించినట్టు స్థానికులు తెలిపారు. సత్తెనపల్లిలో 3 సెకన్లపాటు స్వల్పంగా కంపించిందని వీఆర్వో అరుణ చెప్పారు. కాగా, రాష్ట్రంలో భూకంప తీవ్రత పెద్దగా లేదని, స్వల్ప ప్రకంపనలు మాత్రమే వచ్చాయని అధికార వర్గాలు ప్రకటించాయి.



అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం మండలం టేకులబోరులో ఇంటిగోడకు పగుళ్లు

విద్యార్థులకు రూ.3,500 కోట్లు బకాయిపెట్టి పోయి!

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రాన్ని వేడెక్కించాలని పిలుపిచ్చారు. జనవరి నాలుగో తేదీలోగా ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోతే ఆందోళన చేద్దామన్నారు. వైసీపీ హయాంలో రైతుల నుంచి నేరుగా ధాన్యం కొన్నామని.. కూటమి ప్రభుత్వం వచ్చాక దళారీలు చేరారని ఆరోపించారు. ఈ అంశంపై ఈ నెల 27న కలెక్టరేట్ల వద్ద ధర్నా చేయాలని ఆదేశించారు. ఆ తర్వాత 15 రోజులకు విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ డిస్కంలు, ఎస్ఈ కార్యాలయాల వద్ద ధర్నా చేయాలన్నారు. వాస్తవానికి ఇప్పుడు పెరిగిన సర్దుబాటు చార్జీల పాపం ఆయనదే. ఆయన సీఎంగా ఉండగానే.. 2022-23 సంవత్సరానికి సంబంధించి రూ.8,648 కోట్ల మేర ప్రజల నుంచి సర్దుబాటు చార్జీలు వసూలు చేసుకుంటామని డిస్కంలు రాష్ట్ర విద్యుత్ నియంత్రణ కమిషన్ (ఏపీఈఆర్‌సీ)ని కోరాయి. అలాగే 2023-24కి సంబంధించి మరో రూ.11,626 కోట్ల వసూలుకు ఇంకో పిటిషన్ వేశాయి. జగన్ అధికారంలో ఉండగా.. వీటిపై నిర్ణయం తీసుకోని కమిషన్ చైర్మన్.. పదవీకాలం పూర్తయ్యేముందు ప్రజాభిప్రాయ సేకరణ పెట్టి రెండు భారీ బాదుళ్లకూ ఆమోదముద్ర వేశారు. తన పాపాన్ని కప్పిపుచ్చుకునేందుకు జగన్ ఈ నెపాన్ని చంద్రబాబు ప్రభుత్వంపై మోపుతూ ఆందోళనకు సిద్ధమయ్యారు. సంక్రాంతి తర్వాత తాను లోక్‌సభా స్థానం కేంద్రంగా జిల్లాల్లో పర్యటిస్తానని పార్టీ నేతలకు ఆయన చెప్పారు. ఆలోపు ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరిగేలా కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే అప్పటికి పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు కమిటీలు వేయాలని సూచించారు.

పెరుగుతున్న భూకంపాల తీవ్రత

» తెలుగు రాష్ట్రాలు సేఫ్ జోన్‌లోనే.. అయినా అప్రమత్తత అవసరం

» గోదావరి పరీవాహక ప్రాంతాల్లో ఫాల్ట్ జోన్లు

» భారీ కట్టడాలు నిర్మించే ముందు అధ్యయనం అవసరం

» విశాఖ సురక్షితమే... భూ భౌతిక శాస్త్ర నిపుణులు

(విశాఖపట్నం - ఆంధ్రజ్యోతి)

భూకంపం అంటే చాలు వెన్నులో వణుకు పుడుతుంది.! తెలంగాణలోని ములుగు జిల్లా మేడారం అడవుల్లో బుధవారం సంభవించిన భూకంపం కూడా తెలుగు రాష్ట్రాలను వణికించింది. దీని ప్రభావంతో పలుచోట్ల ప్రకంపనలు సంభవించాయి. భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 5.3గా నమోదైంది. అయితే భూమికి 40 కి.మీ. లోపల ప్రకంపనలు రావడంతో భారీ ముప్పు తప్పింది. గతంలో మహారాష్ట్రలోని లాతూరులో పది కిలోమీటర్ల లోపల భూకంపం రావడంతో ఆ ప్రాంతం భారీ నష్టాన్ని చవిచూసింది. భూకంపం రిక్టర్ స్కేలుపై 6 వరకూ నమోదైతే ఇబ్బంది (భూమి లోపల దూరాన్ని బట్టి కూడా పరిగణనలోకి తీసుకోవాలి) ఉండదు.. కానీ, అంతకు మించితే తీవ్ర ప్రాణ, ఆస్తి నష్టం సంభవిస్తుంది. దక్షిణాది రాష్ట్రాల్లో చాలావరకూ భూకంపాల తీవ్రత తక్కువగానే ఉంటుంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో గోదావరి పరీవాహక ప్రాంతంతోపాటు ప్రకాశం జిల్లాలో గుండ్లకమ్మ నది, విజయనగరం జిల్లాలో చంపావతి పరీవాహక ప్రాంతాల్లో కొన్నిచోట్ల తప్ప మిగిలిన ప్రాంతం సురక్షితమేనని భూభౌతికశాస్త్ర నిపుణులు విశ్లేషిస్తున్నారు. విశాఖ నగరం కూడా సురక్షితమేనని చెబుతున్నారు. గోదావరి నది పుట్టిన ప్రాంతం అంటే నాసిక్ నుంచి సముద్రంలో కలిసే అంతర్వేది వరకూ కొన్నిచోట్ల ఫాల్ట్ జోన్లు ఉన్నాయి. ఎప్పుడో 55 ఏళ్ల క్రితం అంటే.. 1969లో భద్రాచలంలో సంభవించిన భూకంపం రిక్టర్ స్కేలుపై 5.7గా నమోదైంది. ఆ తర్వాత మళ్లీ ఇన్నేళ్లకు బుధవారం ములుగు ప్రాంతంలో వచ్చిన భూకంపం రిక్టర్ స్కేలుపై 5.3గా నమోదైంది. సాధారణంగా భూకంపాలు ప్రభావితం చేసే ప్రాంతాలను సెస్మిక్ జోన్లుగా విభజించారు. దక్షిణాది రాష్ట్రాలు (సౌత్ ఇండియా షీల్డ్) జోన్ 1, 2లో ఉన్నాయి. జోన్-4, 5లో ఉంటే తీవ్రత ఎక్కువ. అయితే ప్రపంచవ్యాప్తంగా మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో జోన్-1ను పూర్తిగా తొలగించారు. అంటే ఇప్పుడు మనం జోన్-2లో ఉన్నాం. ఇది సురక్షితమే అయినప్పటికీ.. నిర్లక్ష్యం పనికిరాదని భూభౌతిక శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. గోదావరి పరీవాహక ప్రాంతంలో గతంతో పోల్చితే గనులు, బొగ్గు తవ్వకాలు, డ్యామ్‌లు, రిజర్వాయర్లు, భారీ భవంతులు, వంతెనలు భారీగా పెరిగాయని, అందువల్ల ఈ ప్రాంతాల్లో భారీ కట్టడాలు, రిజర్వాయర్లు నిర్మించే ముందు అధ్యయనం చేయాల్సి ఉందని నిపుణులు పేర్కొంటున్నారు.

ఫాల్ట్ జోన్‌లో గోదావరి పరీవాహక ప్రాంతం: కేఎస్ఆర్ మూర్తి



గోదావరి పరీవాహకంలో పలు ప్రాంతాలు ఫాల్ట్ జోన్‌లో ఉన్నాయని జాతీయ సముద్ర విజ్ఞాన అధ్యయన సంస్థ విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ కేఎస్ఆర్ మూర్తి చెప్పారు. 'ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు జోన్-2లో ఉన్నప్పటికీ గోదావరీ పరీవాహక ప్రాంతంతోపాటు భారీ నిర్మాణాలు జరిగే ప్రాంతాలపై అధ్యయనం అవసరం. హిమాలయాల ఒత్తిడి వల్ల దక్షిణ భారతంలో కొన్ని ప్రాంతాలు బలహీనంగానే ఉన్నాయి' అని మూర్తి వెల్లడించారు.

జోన్-2లో విశాఖపట్నం: త్రినాథరావు



విశాఖపట్నం సెస్మిక్ జోన్-2లో ఉందని ఆంధ్రా యూనివర్సిటీ భూభౌతికశాస్త్ర విభాగం అనుబంధ ప్రొఫెసర్ ఆచార్య పెంటకోట త్రినాథ రావు చెప్పారు. 'బుధవారం భూకంపం వచ్చిన ములుగు ప్రాంతం విశాఖపట్నానికి 250 కి.మీ. దూరంలో ఉంది. విశాఖ ప్రాంతంలో ప్రకంపనాలు స్వల్పంగా ఉన్నాయి. విశాఖ జోన్-2లో ఉన్నందున ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు' అని త్రినాథరావు పేర్కొన్నారు.



తిరుమలపై మంచు దుప్పటి

దట్టంగా కురుస్తున్న పొగమంచు తిరుమల గిరులను కప్పేసింది. పచ్చని గిరులపై వెండిమబ్బులు కనువిందు చేయగా.. చిరుగాలులతో వాతావరణం ఆహ్లాదకరంగా మారింది. తిరుపతిలో అలిపిరి వద్ద తీసినదీ చిత్రం.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
గురువారం
5 డిసెంబరు 2024



తెలుగు నేర్పాల్సింది తల్లులే

తెలుగు భాష అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న సంస్థల్లో ప్రపంచ తెలుగు సమాఖ్య ఒకటి. దీనికి గత కొన్నేళ్లుగా ప్రముఖ పారిశ్రామికవేత్త డాక్టర్ వి.ఎల్. ఇందిరాదత్ నేతృత్వం వహిస్తున్నారు. ఒక వైపు ప్రముఖ వాణిజ్య సంస్థ 'కేసీపీ'కి సీఎండీగా బాధ్యతలు నిర్వహిస్తూ- మరో వైపు తెలుగుపై మమకారంతో - ప్రపంచ తెలుగు సమాఖ్యకు సంబంధించిన కార్యక్రమాలను ముందుండి నడిపిస్తున్నారు. ప్రస్తుత తరం వారు తెలుగు నేర్చుకోవాల్సిన అవశ్యకత గురించి, పిల్లలకు తెలుగు నేర్పటంలో తల్లుల పాత్ర గురించి ఆమె 'నవ్య'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూ

"మా నాన్నగారు ముక్యాలరాజా (రాజా వాసిరెడ్డి రామ గోపాలకృష్ణ మహేశ్వర ప్రసాద్) గారికి తెలుగు అంటే చాలా ఇష్టం. ఆయన మాకు తెలుగు చదవటం, రాయటం నేర్పారు. ఆయన కూడా తెలుగులో రాసే వారు. చిన్నతనంలో మమ్మల్ని ఇంట్లోనే చదివించారు. మా తాతగారికి అమ్మాయిలు బయటకు వెళ్లటం ఇష్టం ఉండేది కాదు. నాకు ఏడేళ్లు ఉన్నప్పుడు- అమ్మ, నాన్నగారు- తాతయ్యతో పోట్లాడి నన్ను మద్రాసుకు తీసుకువెళ్లి స్కూల్లో వేశారు. మిగిలిన రాజకుటుంబాలలోని పిల్లల మాదిరిగానే నేను కూడా చెన్నైలో చదువుకున్నా. ఆ సమయంలో కూడా నా సెకండ్ లాంగ్వేజ్ తెలుగే! నా వివాహం అయిన తర్వాత మా కుటుంబాలలో తెలుగే మాట్లాడుకొనేవాళ్లం. ఇక ప్రపంచ తెలుగు సమాఖ్య స్థాపించిన తర్వాత తెలుగు మా జీవితాల్లో ఒక భాగంగా మారిపోయింది. ఇక్కడొక విషయం చెప్పాలి. నేను చదువుకొనే రోజుల్లో ఉపాధ్యాయులకు నిబద్ధత ఎక్కువగా ఉండేది. అప్పుడు ఉండేదంటే- ఇప్పుడు లేదని చెప్పటం నా ఉద్దేశం కాదు. కానీ మా చిన్నతనంలో ఉపాధ్యాయులకు బోధన పట్ల మక్కువ ఎక్కువగా ఉండేది. అవసరమైతే ఒక గంట అదనంగా ఉండి మరీ చదువుచెప్పేవారు. ప్రస్తుతం అలాంటి ఉపాధ్యాయులు తక్కువనే అనిపిస్తుంది.

తెలుగు ఒక వారధి...

ఈమధ్య కాలంలో ఇంగ్లీషులో మాట్లాడటం ఒక హోదా చిహ్నంగా మారిపోయింది. చిన్న గ్రామాల్లో తల్లితండ్రులు కూడా పిల్లలతో 'మమ్మీ, డాడీ' అని పిలిపించుకోవడానికే ఇష్టపడుతున్నారు. ఇలాంటి చర్యల వల్ల దైనందిక జీవనంలో తెలుగు పదాల వినియోగం రోజు రోజుకు తగ్గిపోతోంది. దీనికి కారణం- ఇటు తల్లితండ్రుల్లోను, అటు పిల్లలోను తెలుగు భాష, సంస్కృతుల పట్ల సరైన అవగాహన లేకపోవటమే! సంస్కృతి, సంప్రదాయాలకు భాషకు మధ్య అవినాభావ సంబంధం ఉంది. అవి ఒక తరం నుంచి మరొక తరానికి వారసత్వంగా రావటానికి భాష వారధిగా ఉపయోగపడుతుంది. మన మూలాలను తెలియజెబుతుంది. మన పూర్వీకుల గొప్పతనం తెలుస్తుంది. ఇవన్నీ మన భాషను నేర్చుకోవటం వల్ల కలిగే ప్రయోజనాలు. తరచి చూస్తే ఇలాంటివి ఎన్నో ఉన్నాయి. ఇలా తెలుగు భాష వల్ల వచ్చే ప్రయోజనాలు తెలిస్తే తల్లితండ్రులు, పిల్లలు అందరూ భాషను నేర్చుకుంటారనేది నా ఉద్దేశం. అందుకోసం ప్రపంచ తెలుగు సమాఖ్య తరపున గ్రామీణ ప్రాంతాల్లో కొన్ని పరీక్షలు పెడుతున్నాం. దీనిలో పాల్గొనే వారు ఇంగ్లీషు పదాలు వాడకుండా మాట్లాడాలి. ఇలాంటి ప్రయత్నాల వల్ల మళ్లీ తెలుగు పట్ల మమకారం పెరుగుతుందనేది మా ఉద్దేశం. ఇక్కడ ఇంకో కోణం కూడా ఉంది. చాలా మందికి తెలుగు మాట్లాడటం వచ్చు. కానీ చదవటం, రాయటం రాదు. తెలుగులో ఉన్న తియ్యదనం తెలిస్తే- వీరందరూ కూడా తప్పకుండా చదవటం, రాయటం నేర్చుకుంటారు. సంస్కృతం, ఫ్రెంచ్ మాదిరిగా తల్లితండ్రులు తమ పిల్లలను తెలుగు కూడా నేర్చుకోవాలని ప్రోత్సహించాలి. నా ఉద్దేశంలో తల్లులు ఈ విషయంలో చొరవ తీసుకోవాలి. తమ పిల్లలకు తెలుగు భాషను నేర్పించాలి. "తెలుగు రాకపోయినా ఇంగ్లీషు వస్తే నడిచిపోతుంది కదా! అలాంటప్పుడు తెలుగు ఎందుకు నేర్చుకోవాలి?" అని కొందరు అడుగుతూ ఉంటారు. మన పూర్వీకులు- మనకు వారసత్వంగా గొప్ప సంస్కృతి సంప్రదాయాలు అందించారు. ఉదాహరణకు పండుగలనే తీసుకోండి. ప్రతి పండుగ వెనక ఒక కారణం ఉంటుంది. అది మన జీవనంతోను.. సంస్కృతితోను ముడిపడి ఉంటుంది. ఉదాహరణకు బొమ్మల కొలువులను తీసుకుందాం. తమిళనాడులో దసరాకు బొమ్మల కొలువులు పెడతారు. మన వాళ్లు సంక్రాంతికి పెడతారు. దీని వెనక కొన్ని కారణాలున్నాయి. ఇలాంటివన్నీ తెలుసుకోవాలంటే మూల భాష అంటే తెలుగు రావాలి కదా! అప్పుడే వారు తమ సంస్కృతి గొప్పదనాన్ని తెలుసుకోగలుగుతారు.

ప్రారంభం ఇలా...

1992లో లాంగ్ ఐలాండ్‌లో 'తానా' సభలు జరిగాయి. అప్పుడు కొందరు ముఖ్యులు మాట్లాడుకుంటున్న సమయంలో- 'విదేశాల్లోనే తెలుగు వారు భాష గురించి మాట్లాడకుంటున్నారు. వారే ఒక సంఘంగా ఏర్పడ్డారు. అలాంటప్పుడు మన దేశంలో ఒక సంస్థ ఎందుకు ఉండకూడదు?' అనే చర్చ జరిగింది. ఈ చర్చ నుంచి ఆవిర్భవించినదే- 'ప్రపంచ తెలుగు సమాఖ్య'. దీన్ని అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ప్రారంభించారు. మొదట్లో కోయంబత్తూరుకు చెందిన నాయుడుగారు అధ్యక్షులుగా ఉండేవారు. ఆ తర్వాత డీవీఎస్ రాజుగారు అధ్యక్షుడయ్యారు. ఆ తర్వాత నా భర్త దత్తుగారు పగ్గాలు చేపట్టారు. ఆయన తర్వాత నేను ఆ పదవి స్వీకరించా. అప్పటి నుంచి నేనే అధ్యక్షురాలిగా కొనసాగుతున్నా. తెలుగు భాషాభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేయటంతో పాటుగా ప్రతి రెండేళ్లకు ఒక ఉత్సవం నిర్వహిస్తాం. ఈ ఉత్సవాలలో మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే కార్యక్రమాలు, యువ వాణిజ్యవేత్తల కోసం కొన్ని సెమినార్లు నిర్వహిస్తాం. వీటిలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరూ పాల్గొంటారు. ఇలా ఇప్పటిదాకా వివిధ నగరాలలో 11 ఉత్సవాలు నిర్వహించాం. 12వ ఉత్సవం వచ్చే ఏడాది జనవరి మొదటి వారంలో హైదరాబాద్‌లోని నోవాటెల్‌లో నిర్వహిస్తున్నాం. దీనిలో సుమారు రెండువేల మంది దాకా పాల్గొంటారని భావిస్తున్నాం. ప్రపంచ తెలుగు సమాఖ్య తరపున- తెలుగు భాష వారసత్వాన్ని భవిష్యత్ తరాల వారికి అందించేలా విశాఖపట్నంలో ఒక మ్యూజియాన్ని నిర్మించాం. మాకు ఇప్పటివరకు అన్ని ప్రభుత్వాలు బాగా సహకరించాయి. భవిష్యత్తులో ఇది కొనసాగుతుందని ఆశిస్తున్నాం."

సంగీతం కోసం...

చెన్నైలోని ప్రపంచ తెలుగు సమాఖ్య కార్యాలయంలో మేము తెలుగు నేర్పుతామని ప్రకటిస్తే- సుమారు వందమంది వరకూ వచ్చారు. వారందరూ తమిళం వాళ్లే! చాలామంది 60 ఏళ్ల పైబడినవారే! వీరిలో ఎక్కువ మందికి సంగీతం అంటే మక్కువ. కీర్తనలు తెలుగులో ఉంటాయి కాబట్టి వాటి అర్థం తెలుసుకోవటం కోసం తెలుగు నేర్చుకుంటున్నారు. త్వరలోనే మరో క్లాసు కూడా మొదలుపెడుతున్నాం.



• సివిఎల్ఎన్ ప్రసాద్

కౌన్సెలింగ్

పిల్లలకు దగ్గు మందు ఇవ్వొచ్చా?

డాక్టర్! పిల్లలకు దగ్గు వచ్చినప్పుడల్లా మెడికల్ షాపులో దొరికే దగ్గు మందు తాగిస్తూ ఉంటాం! ఇలా తాగించటం మంచిదేనా? పదే పదే దగ్గు మందు తాగించటం వల్ల పిల్లల ఆరోగ్యం దెబ్బ తింటుందా? అసలు దగ్గుకు ఎలాంటి చికిత్స ఇప్పించాలి?

- ఓ సోదరి, హైదరాబాద్.

పిల్లల దగ్గుకు కారణాన్ని కనిపెట్టి చికిత్స చేయాలి. అలాంటి చికిత్సతో దగ్గు తగ్గుతుంది. పిల్లల్లో దగ్గుకు ఎన్నో కారణాలుంటాయి. ఉబ్బసం, అలర్జీ, సాధారణ దగ్గు... ఇలా ఏ కారణం వల్లైనా దగ్గు మొదలవ్వొచ్చు. అయితే ఎలాంటి దగ్గు కనిపించినా, వెంటనే దగ్గు మందులు కొనేసి వాడేస్తూ ఉంటారు. ఇది సరి కాదు. 'దగ్గు ఎందుకొస్తోంది? అది ఎలాంటి దగ్గు?' అనే విషయాలను అర్థం చేసుకుని మూల కారణానికి చికిత్స చేయాలి. దగ్గుతో పాటు, ముక్కు నుంచి నీరు కారుతూ, పిల్లి కూతలు వినిపిస్తుంటే దాన్ని అలర్జీగా భావించి అలర్జీని తగ్గించే మందులు వాడాల్సి ఉంటుంది. వాటితోపాటు అలర్జీ కారకాలను గుర్తించి వాటికి దూరంగా ఉంచాలి. దగ్గుతో పాటు ఆయాసం ఉంటే, ఉబ్బసంగా భావించి అందుకు తగిన ఇన్‌హేలర్లు వాడాల్సి



ఉంటుంది. సాధారణ దగ్గు, జలుబు అయితే 3 నుంచి 5 రోజుల్లో తగ్గుతుంది. ఆ సమయంలో సరిపడా నీళ్లు తాగిస్తూ, ఆవిరి పడితే సరిపోతుంది. ఉబ్బసం దగ్గును నెబ్యులైజేషన్‌తో తగ్గించవచ్చు. ఒక్కో రకం దగ్గుకు ఒక్కో రకం చికిత్స ఇవ్వాల్సి ఉంటుంది. అయితే మెడికల్ షాపుల్లో దొరికే దగ్గు మందుల్లో కాంబినేషన్ డ్రగ్స్ ఉంటాయి. కొన్నిట్లో అలర్జీ నివారిణులైన యాంటీ హిస్టమిన్లు ఉంటాయి. మరికొన్నిట్లో కోడీన్, హైడ్రాక్సీ కోడీన్ మందులుంటాయి. వీటి వాడకాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ బహిష్కరించింది. సిరప్స్‌లో ఎలాంటి డ్రగ్స్ ఉంటాయో అవగాహన లేకుండా, మెడికల్ షాప్‌కి వెళ్లి ఏదో ఒక దగ్గు మందు కొని వాడేస్తూ ఉంటాం. కానీ అలా ఇష్టారాజ్యంగా వాడటం వల్ల పిల్లలకు మందులు పని చేయకుండాపోయే పరిస్థితి తలెత్తుతుంది. కాబట్టి దగ్గును అణచివేసే సిరప్స్ వాడేయకుండా, వైద్యులను సంప్రదించి, దగ్గు కారణాన్ని కనిపెట్టి, తగిన చికిత్స ఇప్పించాలి.

డాక్టర్ దినేష్ కుమార్ చిర్ల
పీడియాట్రీషియన్ అండ్ నియో నాటాలజిస్ట్,
హైదరాబాద్.

కళ్లు పొడిబారుతున్నాయా?

కళ్లలో నీళ్లు తక్కువగా ఉత్పత్తి కావడం వల్ల అవి కంటిని తేమగా ఉంచేందుకు సరిపోక కళ్లు పొడిబారుతుంటాయి. కళ్లలో నీళ్లు త్వరగా ఆవిరైపోతున్నా కూడా ఈ సమస్య వస్తుంది. దీనివల్ల కళ్లు దురదగా ఉండడం, ఎర్రబడడం, మంట అనిపించడం, వెలుగును చూడలేకపోవడం, ఏదో పడినట్లుగా గుచ్చుతుండడం లాంటి అసౌకర్యాలు కలుగుతాయి. కొన్ని ఇంటి చిట్కాలతో వీటినుంచి ఉపశమనం పొందవచ్చు. అవి...

వేడి గుడ్డతో ఒత్తడం: మెత్తని గుడ్డ లేదా కొంచెం దూదిని తీసుకుని వేడి నీటిలో ముంచి గట్టిగా పిండండి. దీనిని గుండ్రంగా మడిచి మూసిన కంటి రెప్పల మీద ఉంచి చిన్నగా ఒత్తండి. వెంటనే కంటి రెప్పల్లో ఉన్న నూనె గ్రంథులు పూర్తిగా తెరుచుకుంటాయి. కంటిలో సన్నని నూనె పొర పరచుకుంటుంది. దీనివల్ల కంటిలో గరగర, మంట, దురద తగ్గుతాయి.

తేమగా ఉండేలా: కళ్లు పొడిబారకుండా నీళ్లతో నిండి తేమగా ఉండాలంటే ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ ఉన్న ఆహారం తీసుకోవాలి. చేపలు, వాల్‌నట్స్, అవిసె గింజలు, చియా గింజలను ఆహారంలో చేర్చుకోవడం వల్ల కళ్లలో నీళ్లు ఎక్కువగా ఉత్పత్తి అవుతాయి. దాహం అనిపించకపోయినా ప్రతి మూడు గంటలకు ఒకసారి గ్లాసు మంచినీళ్లు తాగాలి. కళ్లలోకి ఎక్కువగా వెలుతురు, దుమ్ము సోకకుండా జాగ్రత్త తీసుకోవాలి.

కలబందతో: కలబంద ఆకు నుంచి గుజ్జును తీసుకుని మంచినీటిలో ముంచి తీయాలి. దీనిని మూసిన కంటి రెప్పల మీద పరచాలి. ఇది కంటిలోపలికి వెళ్లకుండా జాగ్రత్త తీసుకోవాలి. పది నిముషాల తరవాత కళ్లను కడగాలి. ఇలా రోజుకు రెండు సార్లు చేస్తూ ఉంటే కలబందలోని ఔషధ గుణాల వల్ల కళ్లవాపు, దురద తగ్గుతాయి.

20-20-20 నిబంధనతో: ఎక్కువసేపు కంప్యూటర్‌ను చూస్తూ పనిచేయడం వల్ల రెప్పపాటు తగ్గి కళ్లు పొడిబారుతాయి. రెప్పపాటు వల్లనే కన్నీళ్లు వ్యాపించి కన్ను మొత్తం తేమగా ఉంటుంది. అందుకే ఈ 20-20-20 నిబంధనను పాటించాలి.



ఇందులో ప్రతి 20 నిమిషాలకోసారి 20 అడుగుల దూరంలో ఉన్నవాటిని 20 సెకండ్లపాటు చూస్తూ ఉండాలి. ఇలా తరచూ చేస్తూ ఉంటే కంప్యూటర్ స్క్రీన్ వల్ల కలిగే అలసట తగ్గి కన్ను విశ్రాంతి పొందుతుంది. పచ్చని చెట్లను, ఆకాశాన్ని, ఎగిరే పక్షులను, పారే నీటిని చూస్తున్నా కూడా కళ్లకు తేలికపాటి వ్యాయామం చేసినట్లవుతుంది.

కీరాతో: కీరాను సన్నని చక్రాలుగా కోసి కళ్లమీద ఉంచుకోవాలి. కనీసం పావుగంటసేపు కళ్లు మూసుకుని విశ్రాంతి తీసుకోవాలి. కీరాలో ఉన్న నీరు, యాంటీ ఆక్సిడెంట్లు కంటి చుట్టూ ఉన్న చర్మానికి తేమని అందించి కళ్లకు చల్లదనాన్ని కలిగిస్తాయి. కళ్లలో దురద తగ్గుతుంది. చల్లని పాలలో దూదిని ముంచి కళ్లమీద ఉంచుకున్నా కూడా కళ్లు విశ్రాంతి పొందుతాయి.

జ్వరం వస్తే ఇవి తినండి!

చలికాలంలో వాతావరణ మార్పుల వల్ల శరీరం బలహీనంగా మారుతుంది. ఇదే సమయంలో హానికారక వైరస్‌లు, బ్యాక్టీరియాలు శరీరంలోకి చేరుతుంటాయి. ఫలితంగా తరచూ జ్వరం వస్తూ ఉంటుంది. దీని నుంచి ఉపశమనం పొందాలంటే మంచి పోషకాహారం తీసుకోవాలి. జ్వర తీవ్రతను తగ్గించి శరీరానికి శక్తిని అందించే ఆహారం గురించి తెలుసుకుందాం.

అల్లం, వెల్లుల్లి, ఉసిరి, పాలకూర: పాలకూరలో ఎ, సి, ఇ విటమిన్లతోపాటు యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. పాలకూరను తరచూ తినడం వల్ల రక్తంలో తెల్ల రక్త కణాల పనితీరు మెరుగవుతుంది. తెల్ల రక్త కణాలు శరీరంలోని వ్యాధికారక క్రిములతో పోరాడి వాటిని నాశనం చేస్తాయి. ఉసిరిని ఆహారంలో చేర్చుకోవడం వల్ల అందులోని సి విటమిన్ రోగనిరోధక శక్తిని పెంచి ఇన్‌ఫ్లమేషన్ సమస్యలను నివారిస్తుంది. అల్లం, వెల్లుల్లిలో యాంటీ వైరల్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు అధికంగా ఉంటాయి. చలికాలంలో తరచూ అల్లం టీ తాగడం వల్ల శ్వాసకోశ వ్యాధుల కారణంగా వచ్చే జ్వరం తగ్గుతుంది. వెల్లుల్లిలో అల్లిసిన్, సల్ఫర్ సమ్మేళనాలు ఉంటాయి. వెల్లుల్లి చారు, వెల్లుల్లి కారం లాంటివి ఆహారంలో చేర్చుకుంటే జ్వర తీవ్రత, నీరసం తగ్గుతాయి.

పసుపు, తులసి: ఈ రెంటిలో యాంటీ మైక్రోబయల్, యాంటీ ఆక్సిడెంట్ గుణాలు ఉంటాయి. ఇవి శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచి జ్వర తీవ్రతను వెంటనే తగ్గిస్తాయి. ఒక గ్లాసు వేడి పాలలో చిటికెడు పసుపు కలుపుకుని తాగితే మంచి ఫలితం కనిపిస్తుంది. ఒక గ్లాసు నీళ్లలో ఆరు తులసి ఆకులు వేసి అయిదు నిమిషాలు మరిగించాలి. ఈ వేడి నీటిని రోజుకు రెండుసార్లు తాగితే జ్వరం తగ్గుతుంది.

సిట్రస్ పండ్లు: నారింజ, ద్రాక్ష లాంటి సిట్రస్ పండ్లలో సి విటమిన్ ఎక్కువగా ఉంటుంది. వీటిని తినడం వల్ల రక్తంలో తెల్ల రక్త కణాలు ఉత్పత్తి అవుతాయి. ఫలితంగా రక్తం పరిశుభ్రమై జ్వరం వల్ల వచ్చే అలసట, ఒత్తిడి, ఆయాసం తదితర సమస్యలు తగ్గుతాయి.



కొబ్బరి నీళ్లు, జావలు: జ్వరం వచ్చినపుడు శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయి కంటే ఎక్కువగా ఉంటుంది. దీనివల్ల శరీరంలో తేమ శాతం తగ్గుతుంది. ఈ సమయంలో కొబ్బరినీళ్లు తాగడం వల్ల శరీరానికి అవసరమైన గ్లూకోజ్, ఎలక్ట్రొలైట్లు, లవణాలు అందుతాయి. శరీరంలో నీటి శాతం పెరుగుతుంది. సగ్గుబియ్యం, రాగి పిండి, బార్లీ గింజలతో జావ కాచుకొని తాగడం మంచిది. కూరగాయల ముక్కలను నీటిలో ఉడికించి ఆ నీటిని వడకట్టి అందులో కొంచెం ఉప్పు, మిరియాల పొడి కలుపుకుని తాగితే జ్వరం నుంచి ఉపశమనం కలుగుతుంది. నాలుక మీద రుచి తెలియకపోవడం, నోరు చేదుగా అనిపించడం వంటి సమస్యలు పోతాయి.

పోషకాహారం: జ్వరం వచ్చినపుడు విటమిన్లు, ఖనిజ లవణాలు, పీచుపదార్థాలు, ప్రోటీన్లు తదితర పోషకాలు ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. తాజా కూరగాయలు, అన్ని రకాల పండ్లు, గింజలు, పప్పు ధాన్యాలు, బీన్స్ చిక్కుళ్లు తదితరాలను ఆహారంలో చేర్చుకుంటే జ్వరం వల్ల వచ్చే నిస్సత్తువ తగ్గుతుంది. తేనె, పుట్టగొడుగులు, నల్ల మిరియాలు, దాల్చిన చెక్క, వాము, సోంపు తదితరాలను తీసుకోవడం వల్ల శరీరం త్వరగా కోలుకుంటుంది.

విభిన్నం



ఫ్యాషన్ డిజైనర్ కావాలనుకుంది. 'నిఫ్ట్' పరీక్ష రాస్తే అందులో విఫలమైంది. రేడియో జాకీగా ఉద్యోగం మొదలుపెట్టి... హాస్యభరిత వీడియోలతో... కడుపుబ్బ నవ్విస్తూ... కంటెంట్ క్రియేటర్‌గా సరికొత్త ఎత్తులకు చేరింది. 'ఫోర్బ్స్ ఇండియా' మ్యాగజైన్ 'డిజిటల్ స్టార్స్-100' జాబితాలో చోటు దక్కించుకుంది. 'నిఫ్ట్' కల నెరవేరకపోయినా... విభిన్నమైన వస్త్రశ్రేణులను పరిచయం చేసే సంస్థకు అధిపతి అయింది. డిజిటల్ తెరపై తారగా... వ్యాపారవేత్తగా... ఇల్లాలిగా... విభిన్న పాత్రలు పోషిస్తున్న హర్షిత గుప్తా కథ ఇది.

అభిరుచే ఆలంబనగా

"కలలు కంటాం. వాటిని నిజం చేసుకొనేందుకు ప్రయత్నిస్తాం. అవి నెరవేరకపోతే! అప్పుడే జీవితం అర్థమవుతుంది. అనుకున్నవన్నీ జరగవని, ఫలితం ఏదైనా కష్టపడాలని, వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలని... జీవితం ఇలా ఎన్నో పాఠాలు చెబుతుంది. ఇది నేను అనుభవపూర్వకంగా తెలుసుకున్నది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లఖనవూలో వ్యాపార కుటుంబం మాది. నాన్న నీరజ్ గుప్తా వ్యాపారస్తుడు. అమ్మ నీలమ్. ఎందుకో తెలియదు... చిన్నప్పటి నుంచీ నాకు ఫ్యాషన్ రంగంలో స్థిరపడాలనే కోరిక. అందుకే స్థానిక 'లా మార్టినీర్ గర్ల్స్ కాలేజీ'లో పన్నెండో తరగతి పూర్తయ్యాక... 'నిఫ్ట్, ఎఫ్‌డీడీఐ, సింబియోసిస్, పెరల్' తదితర ఫ్యాషన్ సంబంధిత పరీక్షలన్నీ రాశాను. 'నిఫ్ట్'లో కోర్సు చేయాలన్నది నా కల. కానీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేకపోయాను. అది నన్ను తీవ్ర వేదనకు గురి చేసింది. ఇక ఎప్పుడూ ఫ్యాషన్ వైపు వెళ్లలేనేమో అని ఎంతో ఏడ్చాను. నా కలల ప్రపంచమే అంతమైనట్టు అనిపించింది.

బాధ నుంచి బయటికొచ్చి...

అయితే కొద్ది కాలంలోనే బాధ నుంచి బయటకు రాగలిగాను. నోయిడా 'అమిటి విశ్వవిద్యాలయం' నుంచి జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్ డిగ్రీ పూర్తి చేశాను. లఖనవూ 'రెడ్ ఎఫ్ఎం'లో ప్రొడ్యూసర్‌గా ఉద్యోగం వచ్చింది. నెలకు జీతం 24 వేలు. అయితే అక్కడ పని వాతావరణం నాకు నచ్చలేదు. ఆరు నెలల తర్వాత రాజీనామా ఇచ్చి, 'రేడియో మిర్చీ'లో జాకీగా మరో కొత్త పాత్ర ప్రారంభించాను. దాంతోపాటు ప్రముఖ మీడియా సంస్థలకు కంటెంట్ అందిస్తూ వచ్చాను. వృత్తిలో భాగంగా కొన్ని వీడియోలు తీయాలి. ఎంత ప్రయత్నించినా మా బాస్ కోరుకున్న విధంగా వీడియో కంటెంట్ ఇవ్వలేకపోయేదాన్ని. కొన్నాళ్లకు కుదురుకున్నాను. ఇతర విభాగాలపై అవగాహన పెంచుకున్నాను. ఈ క్రమంలోనే కెమెరాతో దోస్తీ కుదిరింది. ఎలాంటి బెరుకూ లేకుండా దాని ముందు నా హావభావాలు చూపించగలిగాను. అదే నా జీవితాన్ని మలుపు తిప్పింది.

సరదా వీడియోలు...

కెమెరా ముందుకు రావడంవల్ల ఒక రకంగా నాకు జ్ఞానోదయం అయిందని చెప్పవచ్చు. అది నాలో కొత్త ఆలోచనలు రేకెత్తించింది. అందులో నుంచి పుట్టిందే ఇన్‌స్టాగ్రామ్ రీల్స్. అయితే కంటెంట్ ఏముండాలి? లక్షల్లో కంటెంట్ క్రియేటర్లు ఉండగా నా రీల్స్ ఆకట్టుకోవాలంటే ఏంచేయాలి? దీని కోసం కొంత పరిశోధన చేశాక ఒక నిర్ణయానికి వచ్చాను. ఎప్పుడూ పని ఒత్తిడిలో ఉండే నేటితరానికి నా వీడియోలు కాస్తంతైనా ఉపశమనం ఇచ్చేవి కావాలనుకున్నాను. అలాంటివే తీసి అప్‌లోడ్ చేస్తే.. అద్భుతమైన స్పందన వచ్చింది. నా రీల్స్ అన్నింట్లో మంచి మిత్రులు, తండ్రీ-కూతుళ్ల మధ్య జరిగే సరదా సంభాషణలే ఉంటాయి. చూసే వారి ముఖంపై చిరునవ్వులు చిందిస్తాయి. ప్రతి రీల్‌కూ లక్షల్లో వ్యూస్, వేలల్లో లైక్స్ వస్తున్నాయి. సామాజిక మాధ్యమాల్లో తెగ చక్కర్లు కొడుతున్నాయి. ప్రస్తుతం ఇన్‌స్టాలో నాకు దాదాపు పదిహేను లక్షలమంది ఫాలోవర్స్ ఉన్నారు. యూట్యూబ్‌లో కూడా ఒక చానల్ ప్రారంభించాను. అక్కడ కూడా మంచి స్పందన లభిస్తోంది.



సంప్రదాయ సోయగం...

ఇన్‌స్టా రీల్స్‌కు మంచి ఆదరణ లభిస్తుండడంతో ఉద్యోగం వదిలేశాను. రీల్స్, బ్రాండ్లకు ప్రచారం ద్వారా చేతినిండా సంపాదిస్తున్నా వెలితిగానే ఉండేది. ఫ్యాషన్ డిజైనర్‌గా ఎదగాలని, వినూత్న వస్త్ర శ్రేణులను తీసుకురావాలని. చిన్నప్పటి ఆ కలను నెరవేర్చుకొనే దిశగా అడుగులు వేశాను. మా లఖనవూలో ప్రసిద్ధి చెందిన సంప్రదాయ చికంకారీ కళను దేశమంతా పరిచయం చేయాలనుకున్నాను. ఇది పర్షియన్ ఎంబ్రయిడరీ కళ. దీనికి ఆధునిక హంగులు అద్ది, సరికొత్త డ్రెస్‌లను తీసుకువచ్చాను. మావారి సహకారం, ప్రోద్బలంతో 'చికంకారీ హర్యాస్' పేరుతో ఈ ఏడాది మేలో ఒక సంస్థ ప్రారంభించాను. సాధారణంగా చికంకారీ అద్దిన వస్త్రాలను శుభకార్యాలకు వేసుకొంటారు. అలాకాకుండా నిత్యజీవితంలో కార్యాలయాలు, కళాశాలలకు వెళ్లే మగువలు కూడా ధరించేలా మా వస్త్రశ్రేణులు రూపొందించాం. వీటికి మంచి ఆదరణ లభిస్తోంది. అన్నిటికీ మించి నా కల నెరవేరింది.

మధురానుభూతి...

ఇన్నేళ్ల నా ఈ ప్రయాణంలో ఎన్నో ఎత్తుపల్లాలు చూశాను. సవాళ్లు ఎదుర్కొన్నాను. కానీ ఎన్నడూ వెనకడుగు వేయలేదు. అదే ఇవాళ నన్ను ఇక్కడి వరకు తీసుకువచ్చింది. ఇంతటి విజయవంతమైన కెరీర్‌ను, సంతోషకరమైన జీవితాన్ని ఇచ్చింది. మనపై మనకు నమ్మకం ఉండాలి. అంకితభావంతో పని చేయాలి. ఫలితం అదే వస్తుందనడానికి నా విజయాలే ఉదాహరణ. 'ఫోర్బ్స్ ఇండియా' మ్యాగజైన్ 'డిజిటల్ స్టార్స్-100' జాబితాలో నాకు ఆరో స్థానం దక్కింది. నిజంగా ఇది నాకు ఎంతో గర్వకారణం. స్వశక్తితో నాకు నేను నిర్మించుకున్న కెరీర్. అందులో రాణించడం కంటే సంతృప్తి ఏముంటుంది!"